# మరణ రహస్యం-2

(సతీ సావిత్రీ దేవి ఉపాఖ్యానము)



మాస్టర్ పార్వతీకుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# మరణ రహస్యం

## (సతీ సావిత్రీదేవి ఉపాఖ్యానము)

*సంకలన కర్త*

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 2017 శ్రీ శరన్నవరాత్రులు

ప్రతులు : 1,000

వెల : **రూ. 100-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002

ఫోన్ : 0891-2701531, 2509154,

website : www.dhanistha.org.

info@dhanistha.org

ISBN : 978-81-89467-74-6

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

విశాఖపట్నం-530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ'' 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము''గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : **మాస్టర్ పార్వతీకుమార్**

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 30 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞానబోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "**డాక్టర్ ఆఫ్ లెటర్స్**" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత

అలరారినప్పడే దానికి సాఫల్యత, సార్ధకత ఉండునని, "మానవ సేవయే *మాధవసేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. మాస్టర్ పార్వతీకుమార్ గారు బాధ్యతగల గృహస్తులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తననుతాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాలరనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్ గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము *పరమధర్మ"* మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

సాధ్వీమణి యగు సావిత్రీదేవి ఉపాఖ్యానము అత్యంత మంగళప్రదము. సర్వ శుభంకరము. ఒక స్త్రీ తన సంకల్పబలముచే మరియు ఆరాధనా బలముచే అమంగళములను పారద్రోలి, సర్వమంగళమును పొందిన విధానము సావిత్రి ఉపాఖ్యానమున యున్నది. ''మహాభారత''మందలి 'వన'పర్వమున వేదవ్యాస మహర్షి ఈ ఉపాఖ్యానమును మార్కండేయ మహర్షి ముఖతః వివరించినాడు. శ్రద్ధతో పఠించు వారికి ఈ ఉపాఖ్యానము స్ఫూర్తిదాయకమైన తరింపు నిచ్చును.

ఒక అబల, సుకుమారి, రాజకుమారి యగు కన్య తన ఆరాధనా బలముచే యమదేవుని మెప్పించి, తన తండ్రికి పుత్ర సంతానమును; తన మామగారికి కంటిచూపును, రాజ్య లాభమును; తన పతికి ప్రాణదానమును దివ్య ప్రసాదముగ పొందినది.

స్త్రీ శక్తి, దీక్షలకు సృష్టి యందు అసాధ్యమేదియు లేదని నిరూపించు కథ ఇది. కృతయుగమందు సావిత్రీదేవి, త్రేతాయుగ మందు సీతాదేవి, ద్వాపరమందు ద్రౌపదీదేవి అనుపమానమగు దీక్షా దక్షతలను ప్రదర్శించిరని మార్కండేయ మహర్షి ప్రశంసించి నాడు. ఈ ముగ్గురు పవిత్ర స్త్రీ మూర్తులయందు కూడ సావిత్రీదేవిని విశేషించి ప్రశంసించినాడు.

సావిత్రీదేవి విషయమున ప్రత్యేకత ఏమనగా, ఆమె ఆరాధనా బలముతో స్వయముగ మరణమును దాటుటయే గాక, తన భర్తను కూడ మరణము నుండి విముక్తి చేసి, మరల ప్రాణములతో కొని వచ్చినది. తనకు ప్రాణభిక్షను కోరిన మార్కండేయుని కథ ఒక ఎత్తు, తన పతి ప్రాణములు కోరిన సావిత్రిదేవి కథ మరియొక ఎత్తు. మార్కండేయ మహర్షి శివుని మెప్పించి, యముని నుండి రక్షింపబడినాడు. సావిత్రీదేవి సరాసరి యమునినే మెప్పించి, ఇతర వరములతోపాటు పతి ప్రాణములు కూడ దక్కించుకొనెను. ఇట్టి కథ నిరుపమానము.

మరణము దాటవలెనను ఆసక్తిగల వారందరికి ఈ ఉపాఖ్యానమున వలసిన సాధనా రహస్యములు గోచరించును. మాస్టర్ పార్వతీకుమార్‌గారు శ్రోతలకు ఉత్కంఠ కలుగు రీతిలో ప్రసంగించగల వర ప్రసాదితులు. ముప్పది సంవత్సరములుగ వారు చేయు ప్రసంగములను భౌగోళికముగ ఎందరో నిత్య నూతన ఉత్సాహముతో వినుచున్నారు. వారు సహజశైలిలో భాషించిన విధముననే ఈ గ్రంథమును కూడ ధనిష్ఠ ప్రచురించుచున్నది.

మాస్టరుగారు 2013 సంవత్సరము గురుపూర్ణిమ సందర్భముగా భాగ్యనగరము నందు నిర్వర్తింపబడిన బృందజీవనములో ప్రసంగించిన 'సావిత్రి ఉపాఖ్యాన' ప్రవచనము ఈ పుస్తక రూపముగా వెలువడినది. ఇతః పూర్వము ''అంబరీషుడు, రుక్మిణీ కళ్యాణము, మరణ రహస్యము (మార్కండేయుడు)''

భాషణా గ్రంథములను ప్రచురించినట్లుగా ఈ గ్రంథమును కూడ తామే ప్రచురింతుమని సోదరులు **శ్రీ జి.వి.యమ్. రామారావుగారు** మాస్టరుగారిని వేడుకొనిరి. వారి కుమారుడు చిరంజీవి **విజయ,** కోడలు చిరంజీవి, సౌభాగ్యవతి **జాహ్నవి** ఈ ప్రవచనమును గ్రంథస్తము చేసిరి. వారి కుటుంబమునకు ఈశ్వరుడు ఆయురారోగ్యములను, వంశాభివృద్ధిని, యోగసాధన యందు పురోగమనము కలిగించవలెనని మాస్టరుగారి ఆశీర్వచనము.

అందరికిని ఈ ఉపాఖ్యానము శుభము కలిగించవలెనని ఆకాంక్ష!


4-8-2017

విశాఖపట్నం

**– ధనిష్ఠ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాతము – దక్షిణాయన ప్రాముఖ్యము | 13 |
| 2. | సావిత్రి | 25 |
| 3. | మార్కండేయుని ఉపదేశము | 38 |
| 4. | అశ్వపతి తపస్సు | 50 |
| 5. | సావిత్రి జననం | 58 |
| 6. | ప్రజ్ఞ – ప్రాణము | 66 |
| 7. | సత్యవంతుడే నా భర్త | 92 |
| 8. | సత్యవంతుని గుణగణములు | 109 |
| 9. | సావిత్రి దృఢ సంకల్పం | 140 |
| 10. | సావిత్రి – సత్యవంతుల వివాహం | 148 |
| 11. | సావిత్రి సంస్కారం | 165 |
| 12. | ఉపవాస దీక్ష | 172 |
| 13. | యముని సాక్షాత్కారం | 183 |
| 14. | యమునితో యానము | 192 |
| 15. | మరణం నుండి జీవనంలోకి... | 237 |
| 16. | మరణ రహస్యం | 245 |



"సావిత్రీం శరణం మమ"

# మరణ రహస్యం

(సతీ సావిత్రీదేవి ఉపాఖ్యానము)

## 1. ఉపోద్ఘాతము

# దక్షిణాయన ప్రాముఖ్యము

ఆషాఢ మాసంలో ప్రవేశించడానికి ముందే మన పెద్దలు, నాలుగు రోజుల వ్రతం ఒకటి ఇచ్చారు. ఆ వ్రత కథే 'సావిత్రి'. జ్యేష్ఠ బహుళ ఏకాదశి నుంచి, జ్యేష్ఠ అమావాస్య వరకు ఈ వ్రతం ఆచరించే సంప్రదాయం ఇప్పటికి ఉత్తరాది ప్రాంతాలలో ఉన్నది. ఆంధ్రులు ఈ వ్రతాన్ని మకర సంక్రాంతి సమయంలో నిర్వర్తిస్తూ ఉంటారు. 'సావిత్రి గౌరి' వ్రతం అని పిలుస్తూ వుంటారు. అంటే, ఆషాఢ మాసంలోకి ప్రవేశిస్తూ ఉంటే మన ఋషులు మనకి ఎన్ని రకాలుగా హెచ్చరికలు చేసి, మనను సంసిద్ధులని చేసి, ఆషాఢంలోకి ప్రవేశింప చెయ్యడానికి కృషి చేశారా అని చూస్తే, వాళ్ళకుండే అపారమైన కరుణ మనకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. **దక్షిణాయన సంక్రమణం అంటే అది సాయంకాల సమయం లాంటిది. ఉత్తరాయణ సంక్రమణం అంటే అది ప్రాతఃకాలం లాంటిది.** ఉత్తరాయణం అంటే వెలుగు (చైతన్యము) పెరిగే ఆరు నెలల సమయం. దక్షిణాయనం అంటే వెలుగు తగ్గుతూ, చీకటి పెరిగే ఆరు నెలల సమయం. ఆశ్లేష నుండి మూలా నక్షత్రం వరకు (ఆషాఢం నుండి, మార్గశీర్షాంతం వరకు) దక్షిణాయన యాత్ర సాగుతుంది. అటుపైన పూర్వాషాఢ నుండి పుష్యమి

వరకు ఉత్తరాయణం సాగుతుంది (అంటే పుష్యమాసం ఆరంభం నుండి జ్యేష్ఠమాసాంతం వరకు). ఆరు నెలలు పెరిగే చైతన్యం, ఆరునెలలు తరిగే చైతన్యంగా సంవత్సరం సాగుతున్నట్లు ఋషులు గమనించి, తదనుగుణమైన ఆరాధనల నిచ్చి, ఎల్లకాలం చైతన్యవంతులుగా ఉండే విధానం అందించారు. సావిత్రి గౌరి వ్రతం ఉత్తరాయణాంతంలో యివ్వటంలో ఉద్దేశ్యం ''వెలుగు తగ్గి, చీకటి పెరిగే సమయం సుమా!'' అని హెచ్చరించటం. వెలుగును జీవనంగాను, చీకటిని మృత్యువుగాను గుర్తించి, చీకటి (మరణం) వచ్చే సమయానికి అప్రమత్తం అవ్వటం సావిత్రిదేవి నిర్వర్తించి చూపింది.

సూర్యాస్తమయం తరువాత పశ్చిమంలో గోచరించే వెలుగును 'సావిత్రి' అని అంటారు. ''సూర్యుడు అస్తమించినా, నీలో వెలుగుగా నేను ఉంటానని, మరల సూర్యుని ఉదయం కొనివస్తానని'', ఆ సాయంత్రం వెలుగు ధైర్యం చెబుతున్నట్లు ఉంటుంది. ఆ వెలుగే సూర్యోదయం ముందు మరల 'అదితి'గా గోచరిస్తుంది. సాయంత్రపు సావిత్రి, ఉదయపు అదితిగా గోచరిస్తుంది. మనం నిద్రించినా, మనలో మెలుకువగా ప్రాణములను నిర్వర్తిస్తూ, మరల మనలను నిద్రనుండి మెలకువ లోనికి కొనితెచ్చే ప్రజ్ఞయే సావిత్రి. దీర్ఘ నిద్రవంటిది మరణం. మరణంలో ప్రవేశించిన సత్యవంతుని మరల మేల్కొల్పిన కథయే సావిత్రి కథ. సావిత్రి నిత్యము మేల్కొనియుండే జీవప్రజ్ఞ. సత్యవంతుడు మేల్కొంటూ, నిద్రిస్తూ అంటే పుడుతూ, మరణిస్తూ

వుండే జీవప్రజ్ఞ. ఎప్పుడూ మెలకువగా ఉండే ప్రజ్ఞ, అప్పుడప్పుడూ నిద్రపోయేవారిని మేల్కొల్పటం జరుగుతుంది.

దక్షిణాయనం ప్రజ్ఞ నిద్ర (మరణం) కల్పించే కాలం. మరపు కలిగించే కాలం. జీవుడు తన నిజస్థితి మరచే కాలం. అలాంటి మరపు నుండి మేల్కొల్పటానికి దక్షిణాయన ప్రారంభానికి మునుపు సావిత్రి నాశ్రయించడం ఋషులిచ్చిన ఉపాయం.

జీవుడు ప్రకృతి పదార్థమందు ప్రవేశం చేసే సమయాన్ని దక్షిణాయనంగా గుర్తించారు ఋషులు. సూర్యుని దక్షిణ ప్రయాణం అది. అదే ప్రతి దినము సాయం సమయం కూడ. సూక్ష్మస్వరూపుడైన జీవుడు క్రమంగా కారణ, సూక్ష్మ, స్థూల శరీరాలను కల్పించుకొని లోకానుభూతి పొందే సమయం. పదార్థమైన ఈ శరీరాలలో ప్రవేశించే జీవుడు తనను తాను మరచి అహంకార స్వరూపుడై గుణములకు, ఇంద్రియములకు, శరీరమునకు లోనయ్యే ప్రమాదము కలిగే సమయం. ఈ దిగివచ్చే మార్గంలో ప్రకృతి పదార్థానికి బలం దొరుకుతుంది. కింది లోకాల్లో పదార్థానికి బలం ఎక్కువ, పై లోకాల్లో ప్రజ్ఞకి బలం ఎక్కువ. అందుచేత, పదార్థంలోకి దిగివస్తున్న జీవుడికి ఇంకా ఎక్కువ పదార్థంలో బంధింపబడకుండా ఉండడానికని ఎన్నో సూచనలు చేశారు ఋషులు. అప్పటి నుంచే చాతుర్మాస్య దీక్ష పెట్టేశారు! దక్షిణాయనము, పుణ్యకాలం అని నాలుగు నెలలబాటు చాతుర్మాస్య దీక్ష. కొంతమందయితే ఆషాఢం రాగానే మొదలు పెడ్తారు, కొంతమంది ఆషాఢ శుద్ధ ఏకాదశి, కొంతమంది పూర్ణిమ,

కొంతమంది కృష్ణ ఏకాదశి నుండి మొదలు పెట్టి కార్తీకం వరకూ కూడ నాలుగు నెలలు ఎక్కువ అప్రమత్తులై ఉంటారు.

ఎక్కువ అప్రమత్తులై ఎందుకు ఉండాలి అంటే, రాబోయేది పదార్థము యొక్క పెరుగుదలకి సంబంధించిన కాలము. డిసెంబరు 22 వరకూ రాత్రి పెరుగుతూ ఉంటుంది, పగలు తగ్గుతూ ఉంటుంది. చీకటి పెరుగుతూ ఉంటుంది, వెలుగు తగ్గుతూ ఉంటుంది. అజ్ఞానము పెరిగే అవకాశం ఈ దక్షిణాయనం ఆరు నెలలలో ఉంది. అజ్ఞానం దేనివల్ల కలుగుతుందంటే, పదార్థం పెరుగుతూ ఉంటే అజ్ఞానం పెరుగుతుంది.

దశరథ మహారాజుకు అలాంటి అపాయమే దక్షిణాయనంలో ఎదురైంది. పదార్థం సాంద్రత శరీరంలో పెరిగితే మేధస్సు తగ్గుతుంది. అలా ఆయన మేధస్సు తగ్గటంవల్ల పొరపాటున ఒక బాలుని జింక అనుకొని బాణ ప్రయోగం చేస్తాడు. శాపానికి గురి అవుతాడు. మనకు పొరపాట్లు, మరపులు కోకొల్లలు. కనుక ఋషులు హెచ్చరికగా సావిత్రి వ్రతము నందించారు.

దక్షిణాయనంలో జీవుడికి పదార్థం స్థూలం అవుతూ వస్తూ ఉంటుంది. మన చుట్టూ ఏర్పడినటువంటి శరీరం యొక్క పదార్థం బరువు అవుతూ ఉంటుంది. గుర్తుపెట్టుకోండి, అసలు ఈ శరీరం వెలుగు శరీరం! వెలుగు శరీరం అయినా పదార్థమే, అది వజ్రపు కాంతి అయినా పదార్థమే, బంగారు కాంతి అయినా పదార్థమే. అంతకన్నా ఎక్కువ బాగా పదార్థముగా ఉండేది రక్తమాంసాదులతో

కూడినది. అంటే, రక్తమాంసాదులతో కూడిన ఈ శరీరాన్ని మనం పాలు అనుకుంటే, దాన్నుంచి తయారుచేసిన వెన్నలాంటిది సూక్ష్మ (బంగారు) శరీరం. ఆ వెన్న నుంచి తయారుచేసిన నెయ్యిలాంటిది కారణ (వజ్ర) శరీరం. అట్లా ఈ శరీరంలోనే ఆ రెండు శరీరాలు తయారు చేసుకోగలిగే అవకాశం ఉన్నది.

నీకో శరీరం ఇస్తే, దాన్ని మూడు శరీరాలు చేసుకోవచ్చు. One becoming three. ఒక శరీరం మనిషికిస్తే, వాడు యోగవిద్య ద్వారా, లేకపోతే భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా మరి రెండు శరీరాలు తయారు చేసుకోవచ్చండి. అంత అవకాశం ఉంది ఈ శరీరంలో. అందుకని అన్నీ సాధించడానికి ఈ శరీరం కావాలంటారు. ఇప్పుడు ఈ దక్షిణాయనంలో ఏం జరుగుతుందంటే పదార్థం యొక్క సాంద్రత పెరుగుతూ ఉంటుంది. సాంద్రత పెరిగితే ఏం జరుగుతుందంటే, జీవుని ప్రకాశానికి అడ్డుగోడ లేర్పడిపోతాయి. అందుచేత, పదార్థం పెరిగితే ఏం జరుగుతుందంటే వెలుగు తగ్గుతుందని చెప్పారు. మాములుగా కూడా దక్షిణాయనంలో భూగోళం ఉత్తర ప్రాంతంలో వెలుగు తగ్గుతుంది, దక్షిణ ప్రాంతంలో వెలుగు పెరుగుతుంది. అందుచేత, మన దక్షిణాయనం వాళ్లకి ఉత్తరాయణం, వాళ్లకి ఉత్తరాయణం మనకి దక్షిణాయనం అనుకోకూడదు.

సూర్యుడు దక్షిణమునకు ఉదయిస్తున్నాడా రోజురోజుకీ, లేక ఉత్తరమునకు కనిపిస్తున్నాడా, అదొక్కటే కొలబద్ద. అందుకని, మొత్తం గోళానికి మకర రేఖ నుంచి కర్కాటక రేఖ వరకూ ఉత్తరంగా ఆరు నెలలు వెళ్లి, కర్కాటక రేఖ నుంచి మకర రేఖ

వరకూ దక్షిణంగా ఆరు నెలలు వస్తున్నట్టుగా మనకి గోచరిస్తుంది. అది భూమి తిరగడం బట్టి. అందుచేత, ఈ దక్షిణంగా సూర్యుడు వెళ్తున్నట్టుగా మనకి గోచరిస్తున్న సమయంలో పదార్థ ప్రవేశం చేస్తాడు. అందుకే మాస్టరుగారు 'Spiritual Astrology'లో రాస్తారు 'Cancer' అనే caption కింద, *"birth of souls into matter is marked by Cancer."* అట్లాగే, చిట్టచివర ఒక sentence ఉంటుంది, *"Cancer is all about the behavioral nature of the man".*

అందుచేత, జీవప్రజ్ఞ పదార్థంలో దిగుతూ ఉంటే ఏం అవుతుంది? వెలుగు తగ్గుతూ ఉంటుంది. మన bulb లు ఉన్నాయి. వాటికి గాజు తొడుగులు ఉన్నాయి కాబట్టి వెలుగు వస్తోంది. మరి గాజు తీసేసి, ఏదో రేకు పెట్టామనుకోండి, కుండ పెట్టామనుకోండి, అసలు వెలుగు రాదు. వెలుగు లోపల ఉంటుంది, bulb వెలుగుతూ ఉంటుంది కానీ, ఏదీ ప్రకాశం? ఆ ప్రకాశం దేనికి పరిమితమైంది? అక్కడ మనం పెట్టిన కుండ లోపల మాత్రమే వెలుగుతూ ఉంటుంది, తప్ప పరిసరాలకు రాదు. ఇప్పుడు పరిసరాలకు కూడా వెలుగు ప్రసరింపజేసేవారు కొంతమంది ఉంటే, తనకు తాను వెలుగు కోల్పోయిన వాళ్ళు కూడా ఉంటారు. ఇంతవరకూ మనకి range కనిపిస్తుంది.

అందుచేత, మన లోపల వెలుగు పెంచుకుని, మన శరీర పదార్థము మనను బంధింపకుండా ఉండడం కోసం మార్గాలు ఇచ్చారండీ.

అదే సావిత్రి కథ. జ్యేష్ఠ కృష్ణ ఏకాదశి నుంచి చతుర్దశి వరకు మూడు రోజులపాటు వ్రతం చేస్తుందావిడ. ఉపవాస దీక్ష పెట్టుకుని ఆరాధన చేస్తుంది. అప్పుడే ఎందుకిచ్చారు? జ్యేష్ఠమాసం చివర్లో అమావాస్య ముందు మూడు రోజుల పాటు 'సావిత్రి వ్రతం' అనేది అనాదిగా ఋషులు, ఋషిపత్నులు నిర్వర్తించుకుంటూ ఉండేవారని భారతంలో చెప్పబడింది. ఏమిటి దాని ఉద్దేశ్యం అంటే, దాని వలన మన వెలుగు తరగకుండా రాబోయే ఐదారు నెలలలో కలిగేటటువంటి పదార్థ బంధనం లేనటువంటి వెలుగు నిలుపుకోవడానికి వ్రతం అది. అదో నిర్దిష్టమైన పద్ధతి.

పదార్థం పెరుగుతూ ఉంటే, ప్రజ్ఞకి ఆటంకం కలగకుండా నాలుగు నెలలు దీక్షగా నిర్వర్తించుకోవడం అనేది ఒకటి, అది 'చాతుర్మాస్య దీక్ష'. చాతుర్మాస్య దీక్ష అంటే, ఒక పూటే తింటారు, రెండు పూటలా తినరు. ఎందుకని? అసలు నిజానికి ఒక పూట తింటే చాలట. మనం భయంకొద్దీ మూడు సార్లు తింటున్నాం. ఇంకా భయం కొద్దీ ఐదుసార్లు తింటున్నాం. శరీరం పలుచగా ఉంచుకోవటం అన్ని రకాలుగా (అంటే ఆరోగ్యపరంగాను, యోగపరంగాను) మంచిది.

పదార్థమును అదుపులో ఉంచుకుంటేనే ప్రజ్ఞ బాగా ప్రకాశిస్తూ ఉంటుంది. అన్నం కనబడితే ఎగబడి పోతున్నామనుకోండి, మన ప్రజ్ఞ ఎక్కువ శరీరంలో ఉందన్న మాట. దేహాత్మ భావన. అంత మాత్రం చేత అన్నాన్ని అశ్రద్ధ చెయ్యకండి. *"అన్నం న నింద్యాత్, తద్*

*వ్రతం*". శ్రద్ధగా పుచ్చుకో, కావలసినంత పుచ్చుకో. అందుచేత, ఈ పెరిగే పదార్థం ... ఎందుకు పెరుగుతుంది పదార్థం ఇప్పటినుంచి అంటే, గ్రీష్మ ఋతువు అయిపోతుంది. గ్రీష్మ ఋతువే ఇంకా ఆషాఢ మాసం, కానీ చూడండి ఎంతలా వర్షాలు పడిపోతున్నాయో. వర్షం పడితే ఏమవుతుంది? అన్నీ మొలకలెత్తుతాయి. పదార్థమే కదా పెరుగుతోంది! ఈ మొలకలెత్తడంలో మనకి రకరకాల భావాలు కూడా మొలకలెత్తుతాయి. Thought is matter గుర్తుపెట్టుకోండి. అంటే, భావము కూడా పదార్థమే. నువ్వు తినే దాన్ని బట్టే నీ ఆలోచనలు. బాగా కారం తింటున్నామనుకోండి, లోపల నుంచి పేగులన్నీ ulcer లు వచ్చి చీటికి మాటికి కోపం వస్తూ ఉంటుంది. వస్తే Nux Vomica వేసేస్తాం మనం. అలా వెయ్యడం కన్నా, వాడసలు అన్నం ఎట్లా తింటున్నాడో చూడాలి. అది మార్పు చేస్తే మాటిమాటికి Nux Vomica మింగక్కర్లేదు కదా! Voracious eating, అంటే ఇక పడ్డాడంటే విస్తరి మీద, అదేదో పెద్ద దండయాత్ర చేస్తూ ఉంటాడు కంచం మీద. ఎందుకని అలా జరుగుతుంది? పదార్థమునందు అంత ఆసక్తి.

అందుచేత, ప్రజ్ఞ పెంచడం ఒక పద్ధతి. పదార్థం తగ్గించండం ఒక పద్ధతి. రెండున్నాయి. యోగంలో ఏమంటారంటే పదార్థం తగ్గించడం జోలికి పోక, ప్రజ్ఞని పెంచు అంటారు. అది ఉపాయం. చీకటి తగ్గించే ప్రయత్నం మానుకో, వెలుగు పెంచే ప్రయత్నం చేయి అంటుంది రాజయోగం. వెలుగు పెంచుకుంటూ వుంటే చీకటి తగ్గిపోతూ ఉంటుంది.

ఒకటి సావిత్రి వ్రతం అన్నాను, ఒకటి చాతుర్మాస్య దీక్ష అన్నాను. ఒకటేమో గురుపూర్ణిమ, గురువుగారిని ఆహ్వానించడం. గురువుగారిని లోపలకి ఎంత దించుకుంటూ ఉంటే, అంత మనలో విచక్షణ పెరుగుతూ ఉంటుంది. అలా పెరుగుతూ ఉండడం వల్ల మనం సవ్యంగా ప్రజ్ఞతో ముడి పడి పదార్థంతో సామ్యం కలిగి ఉండి, జీవించడానికి వీలు పడుతుంది.

ఇలా ఇన్ని రకాలుగా ఈ గురుపూర్ణిమకి ప్రాశస్త్యం ఉన్నది. అందుచేత, మనం వీలున్నంత వరకూ గురువుగారిని నింపుకుందాం లోపల. అటుపైన ప్రజ్ఞ, వెలుగు బాగా పెరగాలంటే ఏం చెయ్యాలి? ప్రజ్ఞ మన లోపల విపరీతంగా వికాసం చెందాలంటే మనం చేస్తున్నది ఒకటి. అది బాగా చెయ్యాలి. *"తత్సవితుర్వరేణ్యం, భర్గో దేవస్య ధీమహి, ధియః యోనః ప్రచోదయాత్."* "సవితృమూర్తి నన్ను వరించి, ఆవరించి, మా బుద్ధులను ప్రచోదనము చేయుట కొరకై మేము భర్గులకు (వెలుగులకు) మూలమైన దైవమును (పరమాత్మను) ధ్యానింతుము గాక!" అని అర్థం. ఎక్కువ వెలుగు కావాలనుకుంటే, సవితృమూర్తిని ఆరాధన చెయ్యాలి. గాయత్రి మంత్రం దేనిని గూర్చి? ఏ వెలుగయితే మొత్తం సృష్టిని వెలిగిస్తోందో అటువంటి వెలుగుల మూలాన్ని ఆరాధన చేస్తున్నాం. భర్గులంటే మన సూర్యుడికి ఆధారమైన సవితృమూర్తులవంటి వాళ్ళు. ఎన్నో నక్షత్ర మండలాలున్నాయి ఆకాశంలో. వీటన్నిటికీ పెద్ద పెద్ద కేంద్రాలు ఉన్నాయి. ఇప్పుడు మనకి సప్తర్షి మండలం ఉంది, కృత్తికా మండలం ఉంది, రకరకాల మండలాలు ఉన్నాయి. వీటన్నిటికీ వెలుగెవరిస్తున్నారు? మన సూర్యుడికి సవితృమూర్తి,

ఆయనకి ఆదిత్యుడు. *"ఆదిత్యః సవితః సూర్యః"* ఆదిత్యులు ఎంతోమంది ఉన్నారు కదా! మరి వీళ్ళందరికీ వెలుగునివ్వడానికి ఎవరో ఒకడు ఉండాలి కదా! లేకపోతే వాళ్లకి వెలుగెట్లా వచ్చింది? అట్లా కనబడకుండా అన్నిటినీ వెలిగించేదుండే దాన్నే మనం *"దేవః అస్య భర్గః"* అన్నాం. ఈ వెలిగేటటువంటి వాటికన్నిటికీ దేవుడెవరో మనకు తెలియదు. అతని నుంచి వెలుగులొస్తున్నాయి. ఆ వెలుగు మనకు ఆదిత్యుడి నుంచి, సవితుడి నుంచి, సూర్యుడి నుంచి మన వరకూ వస్తున్నది.

పరతత్త్వము
↓
ఆదిత్యులు
↓
సవితృమూర్తులు
↓
సూర్యులు
↓
భూమిపై జీవులు

పై విధంగా తత్త్వము అవతరించి మనయందు మనవలె వెలుగుతూ ఉంటుంది. మన కన్నులనుండి ఆ వెలుగే మెరుస్తూ ఉంటుంది. అందుకనే *''చక్షో సూర్యో అజాయత''* అని అంటాము. అంటే కన్నుల నుండి ప్రకాశించేది సూర్యుని వెలుగని అర్థం.

కాబట్టి దాన్ని మనం ఎంత ఆరాధన చేసుకుంటే అంత వెలుగు పెరుగుతుంది. అందుచేత, గాయత్రి కన్నా

మంత్రం లేదని చెప్తుంటారు కదా! అలాంటి గాయత్రి ఉపాసన బాగా చేసుకున్నావనుకో, అంటే, రోజుకి పదిసార్లు చేస్తేనే అలిసిపోకూడదు. ఆదివారం వచ్చిందనుకోండి, ఏం పనుంది? మామూలుగా చేసే పనులుండవు కదా ఆదివారం! మరి ఎక్కువ గాయత్రీ ధ్యానం చేసుకోవచ్చుకదా! అర్జెంటినాలో గాయత్రిని గురించి చెప్తే అక్కడ ఒక బృందం తయారయ్యింది, ఇరవై నాలుగు మంది. వాళ్ళు ప్రతీ ఆదివారం వెయ్యిసార్లు చేస్తారు గాయత్రి! నేనే దణ్ణం పెట్టాను. అదేంటి దణ్ణం పెడుతున్నారంటే, నేనే చెయ్యలేదురా ఎప్పుడూ, మీకు చెప్పాను తప్ప, వెయ్యిసార్లు చెయ్యలేదు అని చెప్పాను. వందసార్లు చేశాను చాలా సార్లు.

అలాంటి మంత్రం రోజూ పదివేల సార్లు చేశాడట ఒకాయన. పైగా మనలాగా కాదు. పనీపాటా లేనివాడు కాదు. దేశానికి రాజు. పదివేల గాయత్రి. దేశానికి రాజై రోజూ పదివేలు గాయత్రి చేసి రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. ఎలా ఉంది? అలాంటి వాడికి పుడుతుంది సావిత్రీదేవి.

అందుచేత, ఈ గురుపూర్ణిమకు సావిత్రి కథ మనం చెప్పుకుందాం. కథ చిన్నదే, అందరికీ తెలిసినదే! కాకపోతే, చెప్పుకోవడంలో మరి కొన్ని విశేషాలు మనకి తెలుస్తాయి, కొంత సాధన తెలుస్తుంది. అసలు ఈ సావిత్రి అలా ఎలా సాధించింది, ఇవన్నీ తెలుసుకోవచ్చు. ఈ ఆషాఢ మాసంలో ప్రవేశించగానే వాళ్ళాయన చచ్చిపోతాడట. చూడండి, ఆషాఢ మాసం కథే!

ఇంక రేపటి నుంచి ఆషాఢ మాసం మొదలు. ఆ ముందు అమావాస్య. ఈ అమావాస్య రోజు ఆయన (సత్యవంతుడు)

చచ్చిపోతాడు. ఆలాంటాయనని పెళ్లి చేసుకుని, ఆయనని బ్రతికించుకున్న కథే ఇది. కాబట్టి, ఇది ఆషాఢ మాసానికి పనికివచ్చే కథ. దక్షిణాయన ప్రారంభానికి ముందు చెప్పుకొనవలసిన కథ. తర్వాత మన యోగానికి కూడా పనికివచ్చే కథ. మన యోగం అనకూడదు. ఎందుకంటే, యోగం ఒక్కటే. ఏ యోగంలోనైనా సరే నువ్వు ధారణ స్థితికెళ్తే మరణాన్ని దాటతావు. దాటడం అంటే ఏమిటి? అది జరుగుతూ ఉంటే చూస్తావు. ఇంట్లోంచి బయటికి వస్తూంటే, ఇంట్లోంచి బయటికి వస్తున్నట్టు చూస్తున్నావా? అంత time ఎక్కడుంది సార్! అంటారు. ఇంట్లోంచి బయటకు వస్తూ ముందు అది పరిక్ష చెయ్యండి. తర్వాత ఒంట్లోంచి బయటకు రావడం సంగతి చూద్దాం. ఇంట్లోంచి బయటకు అడుగులేస్తూ వస్తూ, ఒక్కొక్కటీ, ఒక్కొక్కటీ అలా దాటుకుంటూ gate ఆవలకి వచ్చేస్తావు చూడు, అలాగే **అడుగులు వేసుకుంటూ దేహంలోంచి బయటకు వచ్చే కథ యోగంలో ప్రధానమైన కథ. అమరత్వం సిద్ధిస్తేనే కదా, బ్రహ్మత్వం కూడా సిద్ధించి శాశ్వతుడవుతాడు.**

అందుచేత, ఆ విధంగా కూడా మనకి ఈ సావిత్రోపాఖ్యానం పనికి వస్తుంది. అన్నిటికీ మించి సావిత్రీదేవి యొక్క కృషి, ఆమె పుట్టు పూర్వోత్తరాలు, ఆ కథలో ఉండేటటువంటి మంచి మంచి ఘట్టాలన్నీ చెప్పుకోడానికి ప్రయత్నం చేద్దాం.

# ౨. సావిత్రి

సావిత్రి ఉపాఖ్యానం మహాభారతంలో రెండవ పర్వమైన అరణ్య పర్వమునందు నిక్షిప్తము చెయ్యబడి ఉన్నది. అరణ్యము ఋషుల ఆవాసము అయివుండడం చేత దానిని వనం అని కూడా అంటారని చెప్పుకోవడం జరిగింది. అరణ్యం ఆగమ్యగోచరంగా ఉంటుంది, భయానకంగా ఉంటుంది. ప్రాణభయం చాలా ఎక్కువగా ఉంటుంది. అలాగే ప్రతీ రోజూ జీవితం కూడా చాలా అనిశ్చితిలో జరుగుతూ ఉంటుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. అలా ఉండే ప్రపంచంలో **కాలమెరిగి, దేశమెరిగి, ప్రకృతి ధర్మమెరిగి జీవించేవారు కూడా సృష్టిలో ఉన్నారు. వారెక్కడ ఉంటే అక్కడ అరణ్యం 'వనం' అవుతుంది.** అందుకే అరణ్య పర్వాన్ని 'వన పర్వం' అని కూడ పిలుస్తారు. రామాయణంలోను, భారతంలోను కూడా అరణ్య పర్వ మున్నది. క్రూర జంతువులు, అసురులు, ఋషులను కూడ రెండు ఇతిహాసములలో అరణ్య పర్వములో వివరింపబడ్డారు. ఋషి సంపర్కం వుంటే, అరణ్యం వన మౌతుంది. లేకపోతే అది అరణ్యంగానే వుంటుంది. శ్రీరామునికి, యుధిష్ఠిరునకు అరణ్యవాసం వనవాసంలాగానే సాగింది. **మన జీవితాలు కూడ వనవాసం చేసుకోవచ్చు లేదా అరణ్యవాసంగా చేసుకోవచ్చు. ఏ జీవితంలో నిత్య ప్రార్థన, స్వాధ్యాయము, పరహితము చోటుచేసుకుంటాయో ఆ జీవితం వనవాసంగానే సాగుతుంది.**

అరణ్యంలో అన్నీ ఏ పద్ధతీ లేకుండా ఉంటాయి. చెట్టు, చేమ ఒక తీరు తెన్నూ లేకుండా విస్తరించి ఉంటాయి. అలాగే పురుగు, పుట్ర, క్రూర జంతువులు, సాధు జంతువులు. ఇలా కలగాపులగంగా ఉండే ఒక అరణ్యంలో ఒక జ్ఞాని, లేక ఒక ఋషి వసిస్తున్న ప్రాంతం మనం గమనించినట్టయితే ఆ ప్రాంతంలోకి ప్రవేశించగానే అది మిగతా అరణ్యంలా అనిపించదు. మనసుకు ఒక విధమైనటువంటి ప్రశాంతత, ఒక నిర్భీతి, ఒక నిర్భయము కలుగుతుంది. తెలియని ఆనందం కలుగుతుంది. అక్కడ ఉండే వృక్షములన్నీ కూడా ఫలవంతములై ఉంటాయి. ఫలముల బరువుకు నేలకు వంగి ఉంటాయి కొమ్మలు. అలాగే పుష్ప వృక్షములు కూడా బాగా విరివిగా పూచి ఆ ప్రాంతం అంతా కూడా పూలు జల్లబడి ఉంటాయి. అది ఎవరూ పెంచినటువంటి ఒక వనం కానప్పటికీ విపరీతమైన పుష్ప వికాసం అన్ని చోట్లా నేల మీద పడి రంగు రంగుల ముగ్గులు వేసినట్టుగా ఉంటుంది. అంతేకాక క్రూర మృగాలు, సాధు మృగాలు కూడా భేదం లేకుండా స్నేహంగా ఉంటాయి. అది గొప్ప విషయం. అంటే, క్రూర జంతువులు, సాధు జంతువులు వైరం వదిలి ఉంటాయి. అటుపైన ప్రాంతం అంతా కూడా ఒక చల్లని ఆహ్లాదం కలిగించే వాయువు వీస్తున్నట్టుగా స్పర్శ తెలిసి ఉంటుంది. ఇదీ వనానికి, అరణ్యానికి ఉండే తేడా. అదే అరణ్యంలో ఆ వనం ఉంటుంది. అలా ఒక ప్రదేశం మనకి కనిపిస్తే అక్కడ ఒక ఆశ్రమం ఉన్నది, అక్కడ ఒక మహాత్ముడు తన అనుయాయులతో వసించి ఉన్నాడు అనే ఒక సత్యం గోచరిస్తుంది.

ఒక ఋషి దర్శనం జరిగే ముందు వాతావరణం ఎలా వుంటుంది అనేది భారతమునందు వేదవ్యాసుడు,

రామాయణమునందు వాల్మీకి మహర్షి చక్కగా వర్ణిస్తారు. ఒక ప్రాంతంలో మనం ప్రవేశించినప్పుడు, ఆ ప్రాంతం యొక్క స్వరూప స్వభావాలు తెలియటమనేది అదొక జ్ఞానం. బుద్ధిమంతులు అటువంటి జ్ఞానం కలిగి ఉండాలి. అందుకే **గ్రంథాలు చదువుకునేటప్పుడు కేవలం మనుష్యుల ప్రవర్తనలు మాత్రమే కాక, ప్రకృతి వర్ణనలు కూడా చదువుకోవాలి.** అలాగే ఋతు వర్ణన కూడా ఉంటుంది. ఏ ఏ ఋతువులలో ప్రకృతి ఏ విధంగా స్పందిస్తూ ఉంటుంది అనే విషయాలు కూడ ఉంటాయి. ఉదాహరణకు ఈ భాగ్యనగరంలోకి ప్రవేశించామనుకోండి, ప్రతి నగరానికి దానిదైన ఒక వ్యక్తిత్వం ఉంటుంది. Every city has its own personality. భాగ్యనగరం వెళ్తే దానిదైన ఒక ప్రత్యేకత ఒకటి మనకి గోచరిస్తుంది. ఆయా ప్రదేశాలలో ఉండే వాతావరణంలోంచి పంచభూతముల యొక్క సమన్వయం బట్టి ఆ ప్రదేశం గురించి తెలుసుకోవచ్చు. ఇవన్నీ గమనిస్తూ ఉండడం అనేది జ్ఞానమునందు ఆసక్తి కలిగిన వారికి చాలా ముఖ్యమైన విషయం. ఆ దృష్టితో గ్రంథం చదువుకుంటున్నప్పుడు ప్రకృతి కొంత మనకి అవగాహన అవుతూ ఉంటుంది.

ఆషాఢ మాసంలో తొలకరి అనేది తప్పదు. ఆషాఢ మాసంలో మనం గురుపూజలు చేసుకుంటున్నాం కాబట్టి మనకి అంతరాయం కలగకూడదు, వర్షం పడకూడదు అనుకోకూడదు. ఎందుచేత అంటే, ఆషాఢంలో తొలకరి అనేది సహజం. దానికి మనం సిద్ధపడాలి. వారం పది రోజులుగా వర్షం కురుస్తూ ఇవ్వాళ తెరిపి ఇచ్చినంత మాత్రాన, ఇదేదో మనం గురుపూజలు చేసుకుంటున్నాం కాబట్టి ఇలా తెరిపి ఇచ్చింది అనే భావాలు

మనకి వస్తూ ఉంటాయి. సద్గురువులు ఎప్పుడూ కూడా ప్రకృతి చేసే కార్యక్రమాలకి అనుబంధంగా వారి కార్యక్రమాలు నిర్వర్తించుకుంటారు తప్ప, దాన్ని బంధించి, ప్రతిఘటించి, నిర్జించి– ఇలాంటి పనులు చెయ్యరు. అది చేసేవారు కొంచెం అధర్వ శక్తులతో చేస్తూ ఉంటారు. చుట్టూ ప్రకృతిని బంధించడం ఉండదు సద్గురువుల మార్గంలో. ప్రకృతి అనుసరణీయంగా ఉంటుంది. ప్రకృతి కూడా సద్గురువుయందు చక్కని సహకార బుద్ధి చూపిస్తూ ఉంటుంది. అంతే తప్ప ఈయన తనకు తెలిసిన కాస్తోకూస్తో మంత్రశక్తితో, యోగశక్తితో నిర్జించడం, నిర్జించిన కొద్దీ అది బాగా ప్రతిఘటించి కుండపోతగా వర్షం పడడం, ఇట్లా యుద్ధాలు జరగవు. ఎక్కడయితే నిజమైన యోగం జరుగుతుందో అక్కడ ఒకరితో ఒకరు చక్కగా సహకరించుకుంటూ, చక్కగా సర్దుకుపోతూ ఉంటారు.

మనం చెప్తూ ఉంటాం కదా ప్రార్థనలో, "Master's own adjustments" అంటాం కదా! అంటే మన చుట్టూవున్న వాళ్ళని సహకరించేటట్టు adjust చెయ్యమని కాదు, 'మన చుట్టూ ఉండేవారితో సహకరించేటట్టుగా మన్ని adjust చెయ్యాలి.' అది కావాలి. ఎక్కడయినా adjust అయిపోవాలి. అదే పాదరసం, అదే బుద్ధి. ఎక్కడయినా అరమరికలు లేకుండా మనం సర్దుబాటు చేసుకోగలిగితే, అలాంటి వారికి చక్కని సర్దుబాట్లు లోపల తత్త్వంలో జరుగుతాయి. లోపల ఉండేటటువంటి ప్రకృతిని చక్కగా నిర్వర్తించుకొని, ఒక మృదువైన స్వభావాన్ని ఏర్పాటు చేసుకోవాలి. **పెద్ద అరణ్యంలో ఒక మృదువైన స్వభావం కలిగిన ప్రాంతం ఏర్పడడం ఎంత గొప్ప విషయమో, అలాగే మానవ స్వభావంలో మృదు స్వభావం**

**ఏర్పడడం అంత గొప్పవిషయం.** సులభం కాదు. ఎందుకంటే, ఎప్పుడూ ఏదో ఘర్షణ. ఆ ఘర్షణ కారణంగా పోరాటం, ఇలాంటిది సాగుతూ ఉంటుంది మామూలుగా.

ఇది అరణ్య పర్వం అని చెప్పబడ్డప్పటికీ అది వన పర్వం అని కూడా తెలియాలి. ఎప్పుడు అరణ్యం, ఎప్పుడు వనం? మనం మన కార్యక్రమాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటుంన్నాం అనుకోండి, ఓ హోరాహోరీగా అరణ్యంలో తిరుగుతున్నట్టుగా ఉంటుంది. ఎందుకంటే, ఒకడు ఎత్తులు వేస్తూ ఉంటాడు, ఇంకొకడు పై ఎత్తులు వేస్తూ ఉంటాడు. వీడు దాన్నెలా తప్పించుకోవాలో చూస్తూ ఉంటాడు, వాడు దాన్ని మరింతగా బిగిస్తూ ఉంటాడు. ఇలా జరుగుతూ ఉంటాయి కదా! ఇది అరణ్యం– ఘర్షణ, అనిశ్చితి, భయం, అనుమానం, సందేహం, ద్వేషం.........

అలా కాకుండా ఒకరికొకరు సహకరించుకునే పద్ధతుల్లో మన జీవితాన్ని చక్కగా తీర్చి దిద్దుకున్నామనుకోండి, అదే అరణ్యంలో మన జీవితం ఒక వనం అవుతుంది. ''ఏమిటోనండి అంతా చాలా గందరగోళంగా ఉంది అని, మీ ఇంటికొస్తే చాలా ప్రశాంతంగా ఉంది'' అన్నారనుకోండి, అంటే ఏమిటంటే, మీ జీవన విధానంలో అలాంటి సర్దుబాటు, మీలోను, మీ గృహంలోనూ ఏర్పడి ఉంటుంది. అలా కాకుండా మంచి gated community అని ఎక్కడికో పోయి, ఎక్కడో కట్టుకుని, లోపలికి వెళ్ళిన దగ్గరనుంచి అంతా చికాకుగా ఉందనుకోండి, ఉండొచ్చుగా? ఉండదా? ఇంత gated community అని కట్టుకుంటే, పక్కనే ఉన్న అబ్బాయి, మీ అమ్మాయి ప్రేమలో పడ్డారనుకోండి.

ఇంక gate లేదు, community లేదు. ఇంక అక్కడ నుంచి అన్నీ చిరాకులే కదా! చదువులు మానేసి ప్రేమలో పడ్డ జీవితాలు గందరగోళంగా ఉంటాయి. ఏది ముందు, ఏది తరువాత? చదువు, సంస్కారం ముందుగా నేర్వాలి. పెళ్ళి, ప్రేమ ఆ తరువాత ఏర్పడతాయి. హక్కులకోసం పోట్లాడుకోకుండా సంస్కారంతో సర్దుకుపోతే జీవితం వనవాసంలాగా హాయిగా ఉంటుంది.

**ప్రశాంతంగా ఉండడం అనేది ప్రదేశంబట్టి కాదు కదా,** నీ బట్టి కదా! *“కమనీయంబగు భూమి భాగములేకున్నవే...”* వెతుక్కో నక్కర్లేదురా దూది పరుపులకోసం, ఎక్కడ పడుకుంటే రాదు నిద్ర? అని అడిగాడు శుక మహర్షి. అందుచేత, నేనెందుకు చెప్తున్నానంటే మనసులో సమయానికి తగ్గట్టుగా సర్దుబాటు చేసుకోగలిగితే, ఆ జీవితంలో, ఆ స్వభావంలో చక్కని మృదుత్వం ఏర్పడుతుంది. వెన్నవంటి స్వభావం! అది కదా కావాలి! అలా ఉంటే ఆయన (కృష్ణుడు) తీసుకుంటాడట. నీ స్వభావం వెన్నవంటి స్వభావమైతే నువ్వు దైవానికి ఇష్టుడు అవుతావు, నిన్ను అందుకుని తను వాడుకుంటాడు. అంటే, తింటాడన్న మాట. **వెన్న తిన్నాడు కృష్ణుడు అంటే అర్థమేమిటంటే, మృదు స్వభావం అంటే ఇష్టం అని సంకేతం.** మృదు స్వభావం ఉండే చోట తానూ కూడి ఉంటాడు. రాముడిది మృదు స్వభావం! కృష్ణుడున్నాడు, మృదు స్వభావం. సౌజన్య స్వభావం లేకుండా, నేను యోగం చేస్తానంటే కుదరదు. **యోగానికి కావలసినది మృదు స్వభావం.** దానికి కావలసినది సర్దుకుపోయే బుద్ధి.

ఒక వస్తువు ముట్టుకున్నా, ఒక వస్తువు మనం వాడుకున్నా, మన చేతుల్లో అది నలిగిపోకూడదు. మనుషులే నలిగి

పోతున్నారనుకోండి మన చేతుల్లో. ఇంక అది మృదు స్వభావమెలా అవుతుంది? అందుకనే భారతంలో చెప్తారు, ఇద్దరు అప్సరసల మెళ్ళో పూలదండలు వేసి, ఇద్దరినీ నృత్యం చెయ్యమని చెప్తే, ఒక అప్సరస మెళ్ళో పూలదండ వాడలేదు అని. కాబట్టి ఆమే చక్కని నర్తకి అంటారు. కారణం ఏమిటంటే, లోపల అలజడి ఉంటే, పైన వేసుకున్న పూలమాల త్వరగా వాడిపోతుంది. లోపల ప్రశాంతత ఉంటే, వేసుకున్న పుష్పమాల వాడిపోదు. కొంతమంది దేవుడికి పువ్వులు పెట్టి పూజ చేస్తే, ఆ పువ్వులు తొందరగా వాడిపోవు. కొంతమంది పూజ చెయ్యకముందే వాడిపోతాయి. వీడు పూజ చేస్తాడేమో అన్నట్టుగా ఉంటుంది. ఆ పువ్వు పట్టుకునే విధానంలో, ఆ పువ్వు దగ్గర నుంచి, పండు దగ్గర నుంచి, వస్తువు దగ్గర నుంచి, కొంతమంది చేతికి అంది వచ్చినప్పుడు వారి చేతుల్లో అవి వికసిస్తాయి, వాటియందు కళ పెరుగుతుంది. కొంత కొంతమంది చేతికి కొన్ని కొన్ని వస్తువులు మనం ఇచ్చినప్పుడు, అంటే మనం ఇలాంటిది ఇవ్వకూడదు అన్నట్టుగా తయారయిపోతుంది. అంటే, కొంతమంది చేతిలో వస్తువులు కళావిహీనం అయిపోతాయి. మరి కొంతమంది చేతిలో అవి కళ పెరుగుతాయి. ఎవరి కళ అది? ఒక పరమగురువు ఆశ్రమంలో ఎప్పుడో త్రేతాయుగం నాటి వస్తువులు కూడా ధగధగలాడుతుంటాయటండి హిమాలయాల్లో! రాశారు పుస్తకాల్లో. ఎప్పటిదో ఆ వస్తువు. మన ఇంటిలో వస్తువులు ఎట్లా ఉన్నాయో? మన శ్రద్ధని బట్టే కదా!

అందుచేత ఈ దృష్టి, ఈ కళ అనేది ఉన్నదా, లేకపోతే కళ లేదా? గురుపూజలు నిర్వర్తించుకుంటున్నాం. అది ఎలాగయినా

నిర్వర్తించుకోవచ్చు కదా! ఎలాగయినా నిర్వర్తించుకుంటే నీలో శ్రద్ధ పెరగదు, నీలో కళ పెరగదు. నువ్వు చేసే కార్యక్రమాల్లో కళ ఎంత పెంచితే నీలోపల కూడా కళ అంత పెరుగుతుంది. నీలో కళ పెరిగితే నువ్వు చేసే పనుల్లో కూడ అది ప్రతిబింబిస్తుంది. కళ ఎక్కువ అంటే, ఎక్కువ దీపాలు పెట్టేస్తే కళ రాదు. ఎక్కువ భక్తితో ఉంటే కళ వస్తుంది. కళ శ్రద్ధాభక్తుల బట్టి వుంటుంది.

బాగా దుఃఖపడుతున్న యుధిష్ఠిరుడిని తీసుకుని ధౌమ్యుడు అలా అరణ్యంలో ఉండే వనములకు తీసుకెళ్తాడు, పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తాడు. అరణ్యంలోకి వెళ్ళగానే దుఃఖం వస్తుంది. రెండు రకాల దుఃఖం. ఒకటేమిటంటే, ఉన్నది పోయింది. రెండోది, వచ్చి పడ్డచోట ఏ పూట ఏం మింగేస్తుందో అన్నట్టుగా ఉంటుంది. అట్లా భయభ్రాంతమై జీవించేవాళ్ళు లేరూ? ఉన్నారు. అందుచేత, వాళ్ళకి ఏం చెయ్యాలి? మనసు కుదుటపడడాలి కాబట్టి పుణ్య క్షేత్ర దర్శనం, పుణ్య పురుష దర్శనం. మనసు బాగుండకపొతే ఏం చెయ్యాలంటే, ఒక పుణ్య పురుషుని దగ్గరకు వెళ్ళాలి. లేదా ఒక పుణ్య క్షేత్రానికి వెళ్ళాలి. లేకపోతే, ఒక తీర్థానికి వెళ్ళి స్నానం చెయ్యాలి. ఇలా చేస్తూ ఉంటే, మనసుకు కొంచెం ఉపశమనం కలుగుతూ ఉంటుంది. ఇప్పుడు ధర్మరాజుకి వచ్చిన కష్టం చాలా పెద్దది కదా! ఎవరికీ రాని కష్టం.

రాజసూయం చేసి భూవలయంలో తనంతటి సామ్రాట్టు లేడనిపించుకొన్న యుధిష్ఠిరుడు మాయాజూదంలో సమస్తము కోల్పోయి భార్య, సోదరులతో అరణ్యవాసం చేయవలసి వచ్చింది. అప్పుడతని మనస్సు ఎలా ఉంటుందో ఊహించండి! ఊహించలేం.

మాయ చేసి జూదంలో తనను దాయాదులు ఓడించి అంతా కాజేశారు. అంతేకాక ద్రౌపదీదేవిని ఘోరంగా అవమానించారు. తనను, తన సోదరులను అవమానించి అరణ్యానికి పంపారు. మనస్సు వికలమైవున్న యుధిష్ఠిరునకు పురోహితుడగు ధౌమ్యుడు పుణ్యక్షేత్ర దర్శనములు, పుణ్య పురుష దర్శనములు దొడ్డ యోచనతో ఏర్పాటు చేస్తాడు.

అన్ని రకాల బాధలతో ఆయన అరణ్యంలో ప్రవేశించి నప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామతో అరణ్యానికి రావడం జరుగుతుంది. కుశల ప్రశ్నలు వేస్తాడు. తర్వాత అందరూ కలిసి ఆ పక్కన ఉండేటటువంటి మార్కండేయ మహర్షి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు, మార్కండేయుడు బాగా ఆదరిస్తాడు యుధిష్ఠిరుని. ఆదరించి, ఎంతో కష్టం వచ్చినా ధర్మం తప్పనివాడివి, నిన్ను చూస్తే నాకు చాలా ఆనందంగా ఉంది, రాముడుని చూసినట్టుగా ఉందంటాడు. అంత ధర్మాత్ముడవు నువ్వు. నీకు వచ్చిన కష్టానికి మాబోటి వాళ్ళంతా కూడా చాలా బాధపడ్డాం అని స్వాంతన వచనాలు పలుకుతాడు. ద్రౌపదిని కూడా చాలా మెచ్చుకుంటాడాయన. ఆవిడ వల్లే కదా మళ్ళీ వీళ్ళు దాస్య విముక్తి పొంది ఈ విధంగా బయటపడతారు. మెచ్చుకుంటే, యుధిష్ఠిరుడు ఒక ప్రశ్న వేస్తాడు. ''ద్రౌపది మహా పతివ్రత, అంతే కాదు పవిత్రమూర్తి, అగ్నిగర్భ. ఇలాంటి స్త్రీ ఇంకెవరయినా ఉన్నారా చెప్పండి స్వామీ!'' అని.

అలాంటి ప్రశ్న వేస్తే, మార్కండేయ మహర్షి మొట్టమొదటగా మహా పతివ్రత అయిన సీత కథ చెప్తాడు. ఏ విధంగా సీతాదేవి అత్యంత పవిత్రమూర్తో, ఎలా ఎన్ని కష్టాలు వచ్చినా, నష్టాలు

వచ్చినా, భర్త చేత అనుమానించబడి, అగ్నిహోత్రంలో ప్రవేశించి తన యొక్క సహజ పవిత్రతను ఏ విధంగా నిరూపించుకుందో, ఆ కథంతా చెప్పుకొస్తాడు. ఆమె మహా పతివ్రత అంటాడు. ద్రౌపదీదేవితో సరిపోల్చకుండా మహా పతివ్రతలను ఉటంకిస్తాడు మహర్షి. అది వారి సౌజన్యం. కించపరచటం కోసం ఇంకొకరితో పోల్చరు. ప్రశంసకు పోలుస్తారు. సీత కథతో ఆపక సావిత్రీదేవి కథ కూడ చెప్తాడు. వీళ్ళందరినీ ఒకే category, తరగతిలో పెడతాడు మహాత్ముడు. సావిత్రి, సీత, ద్రౌపది – ఆ విధంగా ముగ్గురి గురించి పొగుడుతాడు మార్కండేయ మహర్షి.

సావిత్రిదేవి లాంటి కథ మనకు కనిపించదు. ఎందుకు కనిపించదంటే, మరణించిన భర్తను యముడితో సామరస్యంగా సంభాషణ చేసి, మరలా కొనితెచ్చుకున్న వ్యక్తి ఆవిడ! అందుచేత, ఆ మాట చెప్పగానే, యుధిష్ఠిరుడు కొంచెం సావిత్రి కథ వివరంగా చెప్పండి అని అడగడం జరుగుతుంది. అలా అడగడం చేత మనకి సావిత్రి ఉపాఖ్యానం చోటు చేసుకుంది. ఈ భారతాది కథల్లో జరిగేదేమిటంటే, ఇంతకుముందు సృష్టిలో జరిగినటువంటి, అత్యంత విలువైనటువంటి కథలన్నిటినీ కూడా సందర్భోచితంగా అందులో ఇముడుస్తారు.

ఎందుచేత? ఆ కథ ప్రాచుర్యంలో లేకపోతే అందులో ఉండే ఆశయములు, ఒక ఉన్నతోన్నతమైన విషయము మరుగున పడిపోతుంది. అలా పడిపోకుండా ఉండడానికి, మనకి రామాయణం, భారతం, భాగవతంలోనూ చెప్పబడ్డది, రామాయణం ఒకటి ఉండగా, నవమ స్కంధం అంతా రాముడి

కథే. అలా ఒకటి, రెండు చోట్ల చేరుస్తూ ఉంటారు. ఎందుచేతంటే, ఒక గ్రంథం కాకపోతే, మరొక గ్రంథంలోంచి అయినా మంచి విషయం మానవుడికి అందితే వాడు బాగుపడతాడని.

**ఒక అత్యంత పవిత్రమూర్తి అయిన స్త్రీ, తన భర్త యొక్క ఆయుర్దాయాన్ని, ఐశ్వర్యాన్ని, అన్నిటినీ చక్కగా పదిలపరచగలదు** అనేటటువంటి కథ సతీసావిత్రి కథ. భర్తకి ఆయుర్దాయం తక్కువైతే, తన యొక్క పవిత్ర భావం చేత, నడవడిక చేత, ఆరాధన చేత, భర్త ఆయుర్దాయం పెంచుకునేటటువంటి కథలన్నీ మనకి పతివ్రతల కథల్లో కనిపిస్తాయి. ఆయుర్దాయం పెంచుకోవడం ఒకటి, అసలు మరణించినవాడిని కొనితేవడం ఒకటి. అలాగే, భర్త యొక్క ఐశ్వర్యం అంతా తిరిగి అతనికి లభించేటటువంటి పరిస్థితి ఒకటి ఉంటుంది. కర్మవశాత్తు ఐశ్వర్యం పోతే, ఐశ్వర్యం అంతా భార్య వల్ల పొందడం. ద్రౌపదీదేవి వల్ల కదా పాండవులు మళ్ళీ బట్టకట్టారు, దాస్య విముక్తి జరిగింది. అలాగే, సావిత్రి వలన మరణించిన సత్యవంతుడు తిరిగి జీవితాన్ని పొందడమేకాక, తన తండ్రి రాజ్యం కూడా దక్కి, సత్యవంతుడి తండ్రి అయిన ద్యుమత్సేనుడుకి పోయిన దృష్టి వస్తుంది. రాజ్యం వస్తుంది. అంతేకాదు, భర్తకి ప్రాణం తిరిగి వస్తుంది. ఇట్లా ఇన్ని ఒక వ్యక్తి వలన ఎలా జరిగినాయి అనే కథ చూస్తే చాలా అద్భుతం. సీతాదేవి కథయినా అంతే. రాముడితో పాటు సీత నడవకపోతే అడవిలో రావణ సంహారం జరిగేది కాదు. రాముడితో అమ్మవారు చెప్తుంది, నేను ముందు నడవడంచేత, నువ్వు వెనుక వస్తే, మొత్తం అరణ్యం అంతా ఒక వనంగా తయారవుతుంది కదా అని, చాలా

రహస్యపూర్వకంగా ఒక మాట మాట్లాడుతుంది. తాను ముందు లంకకు వెళ్ళడం బట్టి కదా తర్వాత రాముడు రావడం జరిగింది!

ఒక స్త్రీ శక్తి ఎంతటిది అనేది ఈ ప్రపంచంలో ఎన్నోచోట్ల ఎన్నో కథలు ఉండొచ్చుగానీ, **భారతదేశంలో ఉన్నటువంటి అవగాహన స్త్రీ గురించి మిగతా దేశాల్లో లేదు. భారతదేశంలో స్త్రీలకు ఈ విషయం తెలిసీ మర్చిపోయారు.** ప్రస్తుత కాలంలో స్త్రీలకు స్త్రీల గురించి తెలియదు. పురుషులకు అసలే తెలియదు. ఏ సమాజంలో స్త్రీ స్థానం పదిలంగా వుంటుందో ఆ సమాజమే సుఖ శాంతులతో వర్ధిల్లుతుంది. ఇది ముమ్మాటికీ సత్యం. ఒక స్త్రీ సత్ప్రవర్తన చేత, ఆస్తిక్య బుద్ధి చేత, వ్యసనపరుడైన ఒక పురుషుడిని చక్కగా తీర్చుదిద్దుకుని, అతడికి కూడా కైవల్యాన్ని కలిగించిన కథలు మనకున్నాయి. అంటే, స్త్రీ శక్తి అసామాన్యం, అనుపమానం అయినది. సృష్టికి ఆధారమే స్త్రీ.

అలాంటి స్త్రీ కథ ఒకటి మనకి వివరింపబడింది భారతంలో. కథ మీ అందరికీ తెలుసు. ఈ కథ ఆధారంగా కొన్ని విషయాలు అవగాహన చేసుకుంటూ, ఏ విధంగా సావిత్రీదేవి ఈ మరణ దేవతని దర్శించింది? మరణ దేవతని దర్శించడమే ఒక పెద్ద విషయం. అటుపైన సంభాషించింది. ఆపైన మెప్పించింది. నచికేతుడు వెళ్ళాడు, యముడితో సంభాషించాడు, యముడిని మెప్పించాడు, మరణ విద్యని భూమికి పట్టుకొచ్చాడు. మరణించకుండా దేహం నుంచి తాను చక్కగా ఇంట్లోంచి బయటకు వచ్చినట్టుగా అంత కులాసాగా బయటకు ఎట్లా రావడం అనే విధాన్నాన్ని తెలుసుకుని మనందరికి ఇచ్చినటువంటి కథ నచికేత విద్య అంటారు.

అలాగే, సావిత్రిదేవి కూడా ఆ విధంగా నిర్వర్తించుకుంది. అలాగే మార్కండేయ మహర్షి నిర్వర్తించుకున్నాడు. ఈ ఘట్టం ప్రధాన ఘట్టం... కాని, ఆ ఘట్టం వరకూ రాకముందు అలాంటి పరిస్థితి సావిత్రిదేవికి ఎలా కలిగింది అని తెలియడానికి మనం సద్గురువుల యొక్క సమాశ్రయణం చెంది, చక్కగా అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం చేద్దాం.

మార్కండేయుడు, నచికేతుడు, సావిత్రీదేవి ఉపాఖ్యానాలు మనం పరిశీలిస్తే సావిత్రీదేవిలో ఒక విశేషం కనిపిస్తుంది. మార్కండేయ మహర్షి వున్న దేహంలోనే (భౌతిక దేహం) అనుగ్రహమును పొంది, మరణం దాటినవాడు. నచికేతుడు తండ్రి తపశ్శక్తి వలన యమలోకం చేరి, యమునితో సంభాషించి మరణ రహస్యం తెలుసుకొన్నాడు. సావిత్రీదేవి మాత్రం స్వచ్ఛందంగా శరీరంలో నుండి సూక్ష్మ శరీరంలో ప్రవేశించి యముని అనుసరించింది. ఇది ప్రత్యేకత!

# ౩. మార్కండేయుని ఉపదేశము

"ధర్మరాజా! సావిత్రి అను రాజకుమారి చారిత్రము కూడా ఇటువంటిదే. ఇది నీకు ఉపదేశించగలను" అన్నాడు. ఇది చూడండి తమాషా! "నీకు చెప్తాను" అనొచ్చుగా! చెప్పడం వేరు, ఉపదేశించడం వేరు. చెప్పడం చెప్పేవాడు మనసులోంచి చెప్తాడు. వినేవాడు మనసుతో వింటాడు. కాని మనసు చంచలం అవ్వటంచేత చెప్పటంలోను, వినటంలోను లోటుపాట్లు వుంటాయి. మనసు అస్థిరం, చంచలం. మరపు దానికి సహజం. చెప్పేవాడు మరువవచ్చు, వినేవాడు మరువవచ్చు. ఎందుకంటే, మనసు చంచలమైనది కాబట్టి. చెప్పేవాడు చంచలమైన ప్రజ్ఞతో చెప్పి, వినేవాడూ చంచలమైన ప్రజ్ఞతో విన్నాడనుకోండి, కథ అయిపోగానే మర్చిపోతాం. దాన్నే మనం పురాణ కాలక్షేపం అంటాం. ఎప్పటినుంచో ఎన్నో చోట్ల ఎన్నో పురాణాలు విన్నప్పటికీ, అది పురాణం వినటం తప్ప, అది ఉపదేశం అయినట్టు కాదు. ఉపదేశం అంటే ఏమవుతుందంటే, బాగా దగ్గరగా నీలో ప్రవేశించి, నీకు ప్రచోదనం కలిగించి, బ్రతికితే ఇట్లా బ్రతకాలి, లేకపోతే ఎందుకు వ్యర్థం అనిపించాలి. అలా ఉంటుంది ఉపదేశం. **ప్రసంగం వేరు, ప్రవచనం వేరు** అని కదా చెప్తుంటాం! ప్రసంగం అధిక ప్రసంగం కూడా కావచ్చు, తెలుసా! అందుచేత, ప్రవచనం అంటే చెప్పబడుతున్న విషయంలోకి నిన్ను ప్రవేశపెట్టి, నిన్ను అలా తీసుకుపోతాడు. అలాంటి వాళ్ళు సూతుడు, శుకుడు, మైత్రేయుడు లాంటి మహర్షులు అంతా కూడా.

అందుచేత, ఇక్కడ చూడండి, "నీకు అది ఉపదేశించగలను" అని మార్కండేయుడు అన్నాడు. సావిత్రి కథ ఉపదేశించగలను అంటే? నీక్కూడా అది పనికివస్తుంది ముందు ముందు. నిజానికి ఎవరికి పనికి వచ్చింది ఈ ఉపదేశం? పాండవులందరికీ పనికి రాలేదు. ఒక్క ధర్మరాజుకే పనికొచ్చింది. చూడండి, ఒక వాక్యం మనకి సద్గురువు యొక్క స్మరణ చేసి తెలుసుకోవడం మొదలు పెడ్తే, చిన్న వాక్యంలోంచి ఎన్నో విషయాలు తెలుస్తూ ఉంటాయి.

ధర్మరాజు ఒక్కడే మహాప్రస్థానంలో, అందరూ పడిపోతున్నా, ఉత్తరదిశగా నడిచి వెళ్తాడు కదా! నడిచి వెళ్తుంటే, మొదట నుంచీ వీళ్ళ ఆరుగురుతో పాటు, అంటే పంచ పాండవులు, ద్రౌపదీదేవితో పాటు ఒక కుక్క, అది కూడా పెంపుడు కుక్క కాదు, ఊర కుక్క, అది కూడా వెంటవచ్చింది! వెంట వస్తే, దార్లో ఒక్కొక్కడూ, ఒక్కొక్కడూ వారి వారి ప్రజ్ఞల ననుసరించి దేహం విడవడం జరుగుతుంది. ధర్మరాజు నడుస్తూ ఉంటే, అతనితో పాటు చివరివరకూ ఈ కుక్క నడిచి వెళ్తూ ఉంటుంది. ఇలా వెళ్తూ ఉంటే, ఇంద్రుడు సంతోషించి దేహంతో సహా స్వర్గంలోకి రావొచ్చని ఆహ్వానం పంపిస్తూ, సొంత రథాన్ని పంపించడం జరుగుతుంది, మాతలి అనే రథ సారథిని ఇచ్చి. ''ఇంద్రుడు నీ కోసం పంపించాడు రథం, మీరు సరాసరి దేహంతో స్వర్గానికి రావొచ్చు, మీరు నిర్వర్తించిన ధర్మం అలాంటిది'' అని తెలిపినప్పుడు, ధర్మరాజు ఆ కుక్కని కూడా రథం ఎక్కించడానికి సౌంజ్ఞ చేస్తాడు. చేస్తే మాతలి ఒప్పుకోడు. ఎందుచేత అంటే, స్వర్గంలో కుక్కలకి తావు లేదు అంటాడు. నీ కోసం ఇంద్ర రథంగాని ఈ కుక్క కోసం కాదు అని చెప్పినప్పుడు, సమభావం కలిగినవాడు, సమధర్మం అవలంబించేవాడు, సమవర్తి

అయిన ధర్మరాజు, ఇది నాతోబాటే ఇంత దూరం వచ్చింది, నా తమ్ముళ్ళు రాలేక పోయారు, నా భార్య రాలేకపోయింది, ఇది వచ్చింది. దీన్ని ఇక్కడ ఏ రక్షణా లేకుండా వదిలేసి రాలేను. ఇది వస్తేనే నేను రథం ఎక్కుతాను, లేదా నువ్వు తిరిగి వెళ్ళొచ్చు, నేను ఈ కుక్కతో ఇక్కడే ఉంటాను అని చెప్తాడు. అప్పుడు ఆ కుక్క యమధర్మరాజుగా దర్శనం ఇస్తుంది. దర్శనం ఇచ్చి నీ సమబుద్ధి నాకు అమితానందం కలిగించింది అంటాడు.

అంటే ధర్మరాజుకు ఇప్పుడు మార్కండేయుడి ద్వారా పడ్డ బీజం అక్కడ ఫలించిందన్నమాట. యముడిని మెప్పించడం సావిత్రిదేవి ఎలా చేసిందో అలాగే ధర్మరాజుకు జరిగిన ఉపదేశం అతనిని మరణాన్ని దాటించి, స్వర్గానికి కొనివెళ్ళింది. ధర్మ నిర్వహణ వలన, అదీ విశిష్టమైన ధర్మములు నిర్వర్తించడం వలన సావిత్రిదేవి యముడిని మెప్పించింది. ధర్మరాజు కూడా మార్కండేయుడి చేత ఉపదేశం పొందడం చేత అతనియందు ధర్మబుద్ధి మరింత స్థిరపడి ఉండాలి. అందుకని, ఇక్కడ పదం కూడా ఎట్లా ఉందో చూడండి, "ఆ సావిత్రి కథ నీకు ఉపదేశించ గలను" అని. అన్నిచోట్లా అలా వాడరు. అంటే, మార్కండేయుడు కేవలం వినిపించడం కాదు చేసింది, ఉపదేశించాడు. **హృదయం నుండి సరాసరి హృదయం చేరేది ఉపదేశం. జ్ఞానులొక్కరే ఉపదేశించగలరు. ప్రవచించగలరు. ఇతరులు ప్రసంగిస్తారు, చెప్తారు. బల్లగుద్దికూడ చెప్తారు. హావభావాలు ప్రదర్శిస్తారు. ఉద్రేకపడతారు. జ్ఞానులు అలా కాదు. క్లుప్తంగా, సెలయేరులా మెల్లగ హృదయం నుండి హృదయానికి ప్రవహిస్తారు.** *"ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః"* అనేది గీతావాక్యం. జ్ఞానులు తత్త్వదర్శనులు. బ్రహ్మమును నెరిగినవారు.

బ్రహ్మరూపులు. భాషణమునందు ఆసక్తి కలవారు కాదు. శ్రోతనుబట్టి భాషిస్తారు. సహజముగా మౌనులు. ఉపదేశం వారే చేయగలరు.

"అశ్వపతి మద్ర దేశాధీశ్వరుడు" అన్నాడు. భారతం మానవజాతి ఉన్నంత కాలం ఉంటుంది. రామాయణం కూడా అలాగే ఉంటుంది. మిగతా పుస్తకాలు ఉంటాయో లేదో నేను చెప్పలేను గానీ, భారతం, భాగవతం, రామాయణం, భారతంలో ఉండే భగవద్గీత, ఇవన్నీ శాశ్వత గ్రంథాలు. అందుచేత, ఇందులో వాడినటువంటి కథల్లో ప్రతి దానికీ లోతైన అర్థాలు ఉంటాయి. మద్ర దేశం అంటే ఏమిటి? బుద్ధిగా సంస్కృతం dictionary తీసుకుని అందులో ఈ పదానికి ఏం అర్థం ఉందో చూసుకోవాలి. etymological key అని ఒకటి ఉంటుంది, అంటే నిరుక్త శాస్త్రం అని అంటారు. నిరుక్తం దగ్గర పెట్టుకోవాలి, జ్యోతిష్యం దగ్గర పెట్టుకోవాలి. ఇలాంటి వాటి ఆధారంతో మనం చదువుకుంటే బాగా అర్థం అవుతాయి. ఎందుకంటే, **గ్రంథాలన్నీ కూడా వేదాంగాలనే తాళం చెవులతో తాళాలు వెయ్యబడి ఉంటాయి.** స్థూలంగా చదువుకున్నా ఫలం ఉంటుంది. బాగా సూక్ష్మాతి సూక్ష్మంగా చదువుకున్నకొద్దీ అందులోంచి విపరీతంగా రసానుభూతి కలుగుతుంది. బాగా నములుతున్నకొద్దీ చెఱకుగడలోంచి ఎలా రసం వస్తుందో అలా నమలాలట ఈ గ్రంథాలు. భారతం అంటే చెఱకుగడతో సమానం. ఎందుకంటే, నములుతున్న కొద్దీ తీపి.

**మద్రము :**

"మద్రము" అనే పదానికి అర్థం ఏమిటయ్యా అంటే

అనందమట. అది ఏ ఆనందం? ఇంద్రియ ఆనందం కాదట. హృదయానందం. ఇప్పుడు శరీరానికి ఒక ఆనందం ఉంది. అది కొంచెం వేడిగా ఉంటే చల్లగా గాలి తగిలితే ఆనందం. చల్లగా ఉంటే కొంచెం వేడిగా గాలి తగిలితే ఆనందం. చెమట పోస్తే విసన కర్రతో విసిరితే... ఇట్లా ఉంటుంది శరీరం. అలాగే ఇంద్రియాలకు కొన్ని ఆనందాలు ఉంటాయి. మనసుకి కొన్ని ఆనందాలు ఉంటాయి. బుద్ధికి కొన్ని ఆనందాలు ఉంటాయి. అంటే, కొంత మందికి మంచి మంచి విజ్ఞానపరమైన గ్రంథాలు చదువుకుంటే ఆనందంగా ఉంటుంది. అలా అందరికీ ఉండకపోవచ్చు కదా!

హృదయానందం అనేది ఒక స్థితి. హృదయమే దేశంగా ఎవరయితే జీవిస్తూ ఉంటారో వాళ్ళందరినీ మద్రపతులంటారు. అందుచేత, పుస్తకం కేవలం తెలుగొచ్చని చదువుకోలేం. ఇలాంటి పదాలు మనకొచ్చినప్పుడు, ప్రతీ పదానికి నానార్థములు ఉంటాయి. అంటే, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు రకాల అర్థాలు ఒక పదానికి ఉంటాయి సంస్కృతంలో. దాంట్లో ఇక్కడ ఏది ప్రస్తుతం అనేది మనం చక్కగా అర్థం చేసుకుంటూ చదువుకోవాలి. అలా చదువుకోడానికి మనకి అవకాశం కల్పించారు Master EKగారు. వారి పుస్తకాల నిండా ఎంతో నిరుక్తాన్ని వివరించి ఇచ్చారు. జ్యోతిష్యాన్ని ఏ విధంగా అన్వయించుకోవాలి, నిరుక్తాన్ని ఏ విధంగా అన్వయించుకోవాలి అనే విషయాలు అనేకం తెలియపరిచారు. ఎందుచేత? మహాత్ములు కనుక. మామూలుగా నవలలు రాయడం, పుస్తకాలు రాసేయడం కాదు. అందుచేత, మాస్టరుగారు గ్రంథాలు తీస్తేనే మనకి నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు ఒకడు కాదని తెలుస్తుంది. మామూలుగా నారాయణుడు

అన్నా, విష్ణువు అన్నా, వాసుదేవుడు అన్నా ఒకటే అనుకుంటాం కదా! ఒకటి కాదు అని తెలుస్తుంది. ఒక్కొక్క సన్నివేశంలో ఒక్కొక్క వ్యూహం, దైవం యొక్క వ్యూహాన్ని వివరిస్తూ ఉంటుంది గ్రంథం. సహస్ర నామాలు మనం చదువుతాం కదా, అమ్మవారు గాని, అయ్యవారు గాని, ఒక్కొక్క నామం ఒక్కొక్క వ్యూహాన్ని తెలియపరుస్తుంది, తత్త్వం యొక్క ఒక్కొక్క వ్యూహం. అందుచేత, అలా తెలుసుకున్నాం అనుకోండి, సందర్భోచితంగా మనకి చక్కని అవగాహన అవుతుంది. అవగాహన వలన వికాసం కలుగుతుంది.

అందుచేత, మూలంలో 'ఉపదేశిస్తాను' అని రాస్తే, నేను నీకు 'చెప్తాను' అని రాశాం అనుకోండి... పోయింది. అందుకనే, అనువదించే వాళ్లకు కూడా తదనుగుణమైన పదజాలం వాడబడే శక్తి ఉండాలి. అనువాదం అంటే ఏదో మనకు భాష తెలుసు కాబట్టి అక్కడ దానికి తగిన పదం వెయ్యక, ఏదో పదం వెయ్యడం కాదు.

**అశ్వము :**

''మద్రపతి అశ్వపతి మద్ర దేశాధీశ్వరుడు.'' మద్ర దేశమునకు ఆయన ఈశ్వరుడు, అంటే హృదయమునందే ఎప్పుడూ వసిస్తూ ఉంటాడు. అవసరం బట్టి ఇంద్రియాల్లోకి, మనసులోకి దిగి వచ్చి బాహ్య ప్రపంచంలో పనులు చేసుకుంటూ, ఇతర సమయంలో హృదయంలో రమిస్తూ ఉంటాడు. అతని పేరేంటి? అశ్వపతి! అశ్వము అంటే? రకరకాల అర్థాలు ఉంటాయి. అశ్వము అంటే ప్రాణము అని ఒక అర్థం ఉంది. అశ్వము అంటే కిరణమని మరొక అర్థం. అశ్వమంటే ప్రస్తుతము (భూతము, భవిష్యత్తు కానిది) అని ఇంకో అర్థము. అశ్వమంటే ఇంద్రియమని

కూడ అర్థము ఉన్నది. అశ్వపతి అంటే ప్రాణమునందు స్వామిత్వం కలిగినవాడు. ప్రాణములయందు స్వామిత్వం కలవాడు హృదయమందే ఉంటాడు. ఎందుచేత అంటే, ప్రాణములకు కేంద్రం హృదయం. ప్రజ్ఞకు కేంద్రం ఆజ్ఞ. జీవ చైతన్యానికి మూలస్థానం ఆజ్ఞా చక్రం, ఆజ్ఞా పద్మము. అలాగే, ఆ ప్రజ్ఞ నుంచి ఏర్పడినట్టిదే ప్రాణం. ఆ ప్రాణానికి పెద్ద పీఠం ఎక్కడ ఉంది అంటే, హృదయమునందు ఉంది. అందుచేత, అశ్వపతి అంటే ఇతడు ప్రాణములయందు స్వామిత్వం కలిగినవాడు అని ఒక అర్థం. అంతేకాదు, హృదయమునందే ఎప్పుడూ వుండేవాడు అనేది రెండో అర్థం. మాములుగా సాధారణ అర్థం ఏమిటంటే మద్ర దేశం ఒకటుంది.

మద్ర దేశం అంటే ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ దగ్గర ఉండే దేశం. గాంధారమునకు అనుబంధంగా ఉండే దేశం మద్ర దేశం. మాద్రి అనే రాజకుమారి కూడా అక్కడినుంచే వస్తుంది. పాండురాజుని వివాహం చేసుకుంటుంది. మద్రము అంటే చైతన్యము. కాబట్టి, మద్ర దేశంలో ఎప్పుడయితే చైతన్యం ఆనందంతో కూడి ఉంటుందో, అప్పుడు దానికి ఎవడయితే అధిపతి అయి ఉంటాడో, అలాంటి వాడు మద్రాధీశుడు అవుతాడు. అలాగే, అతడు అశ్వపతి కూడాను. తన ప్రాణములయందు తాను స్వామిత్వం కలిగి ఉన్నాడు.

ప్రాణముల యందు స్వామిత్వం కలిగి ఉన్నవాడు శరీరంలో ప్రవేశించనూ గలడు, శరీరం నుంచి బయటకు కూడా రాగలడండీ. ఎందుకంటే, మనకి ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము అనే ఐదు ప్రాణములు ఉన్నాయి. ఈ ఐదు ప్రాణాల

గురించి చాలాసార్లు వివరించాను. ప్రాణములు మనల్ని నడిపిస్తూ ఉంటాయి. కాని ప్రాణములు జీవ చైతన్యంలోంచే పుట్టుకొచ్చాయి. అదే ప్రాణములకు మనం ఆధిపత్యం వహించవచ్చు. ఎవడు యోగీశ్వరుడు అంటే, తన ప్రాణములు తన అధీనమునందు ఉండి, తను ఎంత కాలం కావాలంటే అంత కాలం కార్యక్రమాలు నిర్వర్తించి అటుపైన స్వచ్ఛందంగా దేహాన్ని త్యజించగలిగే వాడు యోగి. భీష్మునికి స్వచ్ఛంద మరణం ఒక వరంగా ఇస్తాడు తండ్రి.

అశ్వపతి తాను స్వయంగా తన పంచ ప్రాణములయందు తాను స్వామిత్వం కలిగి ఉంటాడు. పంచ ప్రాణములయందు స్వామిత్వం కలిగి ఉండడానికి ఒక మార్గం ఉన్నది. దానినే 'ప్రాణాయామము' అంటారు. అంటే, ప్రాణము, అపానము. ఈ రెండిటిని చక్కగా సమన్వయించుకో గలిగితే జీవుడు హృదయమునందు స్పందనాత్మక ప్రజ్ఞగా తన్ను తాను అనుభూతి చెందుతూ ఉండొచ్చు. ఆ స్పందనమును మనం బాగా అనుసరిస్తూ ఉంటే, అది సూక్ష్మ స్పందనంలోకి తీసుకువెళ్తుంది. ఆ సూక్ష్మ స్పందనం ఉదాన వాయువు అనే ఒక ప్రాణాన్ని పట్టుకుని ఊర్ధ్వగతి చెంది ఆజ్ఞకి చేరుస్తుంది. అలా ఆ ఆజ్ఞకి చేరిస్తే, మరి వ్యానం అని మొత్తం మన శరీరం బయటా, లోపలా వ్యాప్తి చెందిన ఒక ప్రాణం మనకు పరిచయము కలుగుతుంది. అది ఆధారంగా జీవుడు దేహంలోకి ప్రవేశించగలడు, దేహంలోంచి బయటకు తనకు తానుగా వెలికి రాగలుతాడు.

**పురంజనము :**

'పురంజనోపాఖ్యానము' అనేది భాగవతంలో ఉన్నది.

అక్కడ మనకి ఈ పంచ ప్రాణముల గురించి బాగా వివరిస్తారు. అందులో, ఈ పంచ ప్రాణములను ఐదు తలల పాముగా చెప్తారు. ఈ ఐదు తలల పాము నుంచి లోపలికొచ్చిన వాడు బయటకి ఎలా వెళ్ళాలో తెలియకుండా లోపలకొచ్చేస్తే ఈ దేహంలో ఇరుక్కు పోతాడు. అందుచేత, లోపలికి ప్రవేశించేటప్పుడు బయటకెళ్ళే దారి తెలియకుండా ప్రవేశించకూడదు. జీవితంలో ఏ పని లోకయినా వెళ్ళడం మాత్రమే తెలుసు, తిరిగి రావడం తెలియదు అంటే కష్టం. అభిమన్యుడి కథ అయిపోతుంది. లోపలికి వెళ్ళడమే తెలుసు, బయటకు రావడం తెలియదు. శరీరంలోకి వెళ్ళడం తెలుసు, బయటకు రావడం తెలియదు కదా! దేంట్లోకయినా లోపలికి చాలా వీరోచితంగా మనం ప్రవేశించగలం, కానీ దేనినుంచి బయట పడలేము. చూడండి, అది ఎంత దురదృష్టమైన కథో. Way in తెలిసినప్పుడు, Way out కూడా తెలియాలి. If you do not know how to exit, do not enter into it. ఉద్యోగంలోకి ప్రవేశిస్తున్నామనుకోండి, ఎప్పుడు ఇందులోంచి బయటకు వస్తాడో తెలిసి ఉండాలి. ఎందుకోసం అది? దేహ పోషణ, కుటుంబ పోషణం, ఇంతే! వృత్తిలోకి ప్రవేశించాం అనుకోండి, చచ్చిపోయే వరకూ వృత్తిలో ఉండమని ఎక్కడా లేదు కదా! ఎందుకంటే, నువ్వు పుట్టినప్పుడే రాలేదు కదా నీకు వృత్తి! సగం దూరంలో నీకు వృత్తి వచ్చింది. నీ జీవన యాత్ర సరిగ్గా సాగడానికి ఒక వృత్తో, ఒక ఉద్యోగమో, ఒక వ్యాపారమో. దాని నుంచి బయటపడడానికి నీకు వీలు ఉంచుకున్నావా, లేకుండా అలా మాలోకంలాగా లోపలకి వెళ్ళిపోతున్నావా? అట్లా ప్రాణం పట్టుకుని దేహంలో ప్రవేశించిన వాడికి ప్రాణముల ఆధారంగా మళ్ళీ దేహంలోంచి బయటపడడం కూడా తెలిసి ఉండాలి కదా! నిష్క్రమణము తెలియని విద్య విద్యే

కాదు. ఏ విద్యకయినా ఉపసంహరించే శక్తి కూడా ఉండాలి. లేకపోతే వాడు వీరుడు కాదు.

**ఆదర్శం :**

ఈ ప్రాణముల లోనికి మన ప్రవేశం అయిపోయింది. పంచ ప్రాణములు మనని నడిపిస్తూ ఉంటాయి. ఆ పంచ ప్రాణములనుంచి నువ్వు విడిపడి పంచ ప్రాణములను పగ్గాలు పట్టుకునే స్థితి కూడా మానవునకు ఉన్నది. అలా ఎవరికయితే ఉంటుందో వాడిని అశ్వపతి అంటారండి. అశ్వపతి అంటే అర్థం ప్రాణములయందు స్వామిత్వం సాధించిన వాడు. ప్రాణములయందు స్వామిత్వం ఉన్నది అంటే దేహం అలా వదిలేయగలడండి. ఎప్పుడూ హృదయము నందు ఆనందంగా ఉన్నాడు, బావుంది. ప్రాణములు వదిలెయ్యగలడం తెలుసు కాబట్టి వదిలేస్తామా? ప్రాణములు వదిలెయ్యగలడం తెలుసు కాబట్టి వదిలేయ కూడదు. వదిలేయాల్సిన సమయం వచ్చినప్పుడు అది మన్ని పట్టుకోకుండా ఉండడానికి ఆ విద్య తెలియాలి తప్ప, ఇలా దేహం వదిలేసి వెళ్లిపోనక్కర్లేదు. ఎందుచేత, ప్రతీ వాడికి జీవన ప్రయోజనం ఒకటి ఉన్నది. జీవన ప్రయోజనం నెరవేరకుండా దేహాన్ని విసర్జించడం దేనికండీ? జీవన ప్రయోజనం నెరవేరాలి కదా! ఇప్పుడు నువ్వు ఏమి నిర్వర్తించేశావని వెళ్లిపోదా మనుకుంటున్నావు అని అడగాలి వెళ్ళిపోతా, వెళ్ళిపోతా అనేవాడిని.

మాటిమాటికి కొంతమంది, అసలు వెళ్ళరులెండి, కానీ వెళ్ళిపోతానంటూ ఉంటారు. ఏదీ వెళ్ళడానికి చేత అవ్వద్దూ? చేతకాదు కదా! అందుకనే, గురువుగారు ఒక రహస్యం చెప్పారు

నాకు. ఏమిటంటే, పెద్దవాళ్ళు, పెద్ద వయసు ఉన్నప్పుడు, వెళ్ళిపోతారేమో అని వాళ్ళకి తెలుస్తూ ఉంటుంది కదా, ఇక మనం వెళ్లిపోతామని, అనిపిస్తూ ఉంటుంది కదా! ఎందుకంటే, చుట్టుపక్కల అందరినీ చూస్తూ ఉంటారు కదా! అందుచేత, మనం కూడా వెళ్ళిపోతాం అని తెలుస్తూ ఉంటుంది వయసు వచ్చే కొద్దీ. అప్పుడు పెద్దవాళ్ళు, ఏ గురువుగారి లాంటివాళ్ళో కనబడితే, మరి ఇంక నాకు ఎంత కాలం ఉందంటారు అని అడుగుతారు. అలా అడిగినప్పుడల్లా, ఇంకా చాలా కాలం ఉందని చెప్పాలట! చెప్తే వాళ్ళు సంతోషిస్తారట. ఎప్పుడూ "ఇంక కొంత కాలమే" అని చెప్పకు అని చెప్పారు. కొంత కాలమే అని చెప్తే వాళ్ళు ఇప్పుడే చచ్చిపోవచ్చు. అందుచేత, ఎంత కాలం అని అడిగితే, ఇంకా చాలా కాలం ఉంది, బాగా స్మరణ చేసుకోండి, అని చెప్తారు పెద్దలు. ఎందుచేత? ఏదో ఎంతవరకూ వీలు ఉంటే అంతవరకూ పండి, అటుపైన వచ్చిన మరణాన్ని అంగీకరించాలి తప్ప, పండకుండా మరణం వస్తే ఏమిటి ఉపయోగం? మళ్ళీ మొదలుపెట్టాలి కదా! పండి, అక్కడ చెట్టు నుంచి రాలినట్టు రాలడం ఒక పద్ధతి. పండకుండా, నేపోతా, నేపోతా, నేపోతా అంటే, పోనూ లేదు, ఒకటి. పోయినా సుఖం లేదు. వెళ్ళిపోవడంలో గొప్పదనం లేదు. ఏం చేశావని వెళ్ళిపోతావ్? ఆ ఏం చెయ్యలేదు కాబట్టే వెళ్ళిపోతున్నాం అన్నావనుకోండి, ఏం చెయ్యలేదంటే, ఏదో ఒకటి చెయ్యడానికి ప్రయత్నం చెయ్యి. ఇచ్చాడుగా ప్రాణం దేవుడు. అది వెళ్ళిపోయేటప్పుడు నువ్వు ఉంటానన్నా అది ఉండదు. చాలా పనులున్నాయి, కొన్నాళ్ళు ఉంచవయ్యా అంటే ఉంచుతుందా ప్రాణం? ఉంచదు. ఆ time కి వెళ్ళిపోతుంది. కాలుడు వచ్చేస్తాడు. అందుచేత, ఉన్నప్పుడు ఏం చెయ్యాలి?

ఇప్పుడు అశ్వపతికి ఏం జరిగింది? ఆయన హృదయంలో ఉండగలడు. ఆనందంగా ఉండగలడు. ప్రాణాలను అనాయాసంగా వదిలెయ్యగలడు. అంటే, దేహాన్ని వదిలెయ్యగలడు. మరి అలాంటి వాడు ఎందుకు వెళ్ళిపోలేదు అంటే, వెళ్లి పోయే ముందు... నువ్వు వెళ్ళిపోతే ఇక్కడ తేడా పడకూడదు కదా! నువ్వు ఏదయినా సీటు ఖాళీ చేసేముందు, ఆ సీటులో ఇంకొకరిని కూర్చోపెట్టి వెళ్ళిపోవడం అనేది ఉద్యోగాల్లో కూడా చూస్తున్నాం కదా! Transfer Order వచ్చింది, reliever వస్తే గానీ నువ్వు వెళ్ళడానికి లేదు కదా! ప్రతి వాడికి ఒక reliever రావాలి, అన్ని విషయాలకి ఒక reliever రావాలి. నువ్వు చేసే కార్యక్రమము మరొక చేసేవాడు తయారయినప్పుడు నువ్వు అక్కడి నుంచి తప్పుకోవచ్చు. కుటుంబ పరంగాను, వృత్తి పరంగాను, సామాజిక పరంగాను నీకు వారసుడు ఏర్పడినప్పుడు నీవు స్వచ్ఛందంగా దేహం త్యజిస్తే అది పూర్ణజీవితం. నీవు నిష్క్రమించడం వలన జరుగుతున్న కార్యములకు అంతరాయం రాకూడదు. అవి యథాతథంగా సాగిపోవాలి.

అశ్వపతి కుమారులను పొంది, తన కుమారులను రాజ్యాభిషిక్తులను చేసి, రాజ్యం సుస్థిరం చేసి, మనుమలను పొంది అటుపై తృప్తిగా దేహం వదిలాడు. అది ఆదర్శం.

# 4. అశ్వపతి తపస్సు

అశ్వపతికి సంతానం లేదు. సంతానం లేకపోతే రాజ్యం ఎవరికి అప్పచెపుతాడు? ఆ రాజ్యం సంక్షోభంలోకి వెళ్ళిపోకుండా ఉండాలంటే యోగ్యుడైన వాడు ఒకడు రావాలి కదా! అందుచేత, ఆయన ఏం చేశాడంటే, తన హృదయం చేరినప్పటికీ, తనకి ఈ దేహ విసర్జన అనేది చాలా అనాయాసం అనే విద్యగా తనకి తెలిసినప్పటికీ కూడా, తన రాజ్యానికి ఉత్తరాధికారి ఒకడు కావాలి అని భావించి ప్రార్థన మొదలుపెట్టాడండి. "అతడు సంతాన కాంక్షతో, ప్రగాఢ భక్తితో, పది పై ఎనిమిది సంవత్సరాలు..." ఎందుకిలా రాస్తారో తెలుసా? పద్దెనిమిది సంవత్సరాలు అని రాయచ్చు కదండి? ఊరికే పద్దెనిమిది అని రాస్తే సరిపోదూ? పద్దెనిమిది అంటే ఏమిటి? పదునెనిమిది అంటే పది, ఎనిమిది. పది పై ఎనిమిది. సంస్కృతంలో అలా ఉంటుంది. అష్టాదశ. అష్టాదశ అంటే దశ పైన ఎనిమిది అని అర్థం. అందుకని పద్దెనిమిది.

**గాయత్రి :**

''పద్దెనిమిది సంవత్సరాలు సావిత్రిదేవి గురించి ఘోర తపస్సు ఆచరించాడటండి.'' తపస్సు ఆచరించడం ఎలా చేశాడో తెలుసా? ప్రతి రోజూ పది వేల మార్లు గాయత్రి జపం చేశాడట. రాజ్యానికి రాజై ఉండి, పది వేల మార్లు గాయత్రి చెయ్యాలంటే ఎంత సమయం ఉండాలండీ? అది కూడా పద్దెనిమిది సంవత్సరాల పాటు

ఎక్కడా అంతరాయం లేకుండా, రోజుకి పదివేల సార్లు గాయత్రి ఆరాధన చెయ్యడాన్ని తపస్సు అని చెప్పారు ఇక్కడ. ''ఆ విధంగా తపస్సు ఆయన ఆచరిస్తే, పద్దెనిమిదేళ్ళకి సావిత్రిదేవి ప్రత్యక్షం అయ్యింది.'' సావిత్రిదేవి అంటే? మన సూర్య మండలాలన్నిటికీ ఏది కేంద్రమో, ఆ కేంద్రాన్ని సవితృ మండలం అంటారు. ఆ సవితృ మండలం యొక్క మూర్తీభవించిన రూపం ఒకటి ఏర్పడితే దాన్ని 'సావిత్రి' అంటారు. మన సూర్య మండలాలు పన్నెండు సూర్య మండలాలు కలిపితే ఒక కేంద్రం దానికి ఉంది. అంటే, పన్నెండు సూర్య మండలాలకి ఒక కేంద్రం చొప్పున, అలాంటి పన్నెండు కేంద్రాలకి ఒక భర్గోదేవ మండలం ఒకటి ఉంటుందని మన గ్రంథాలు చెప్తూ ఉంటాయి. అంటే, ఒక ఆదిత్యలోకంలో ఒక సూర్యుడి నుంచి పన్నెండు సవితృమూర్తులు, ఒక్కొక్క సవితృమూర్తి నుంచి పన్నెండు సూర్యమూర్తుల మండలాలు వస్తూ ఉంటాయని మన గ్రంథాలు చెప్తూ ఉంటాయి. అందుకనే, పన్నెండు పన్నెండ్లు, దాన్నే మనం గ్రోస్ (gross) అంటూ ఉంటాం, పన్నెండు పన్నెండ్లని. Twleve times twelve.

అందుచేత, మన సూర్యుడికి మూలమైన స్థానం సవితృమూర్తి. దాన్ని ఆరాధన చెయ్యడానికే మనకి గాయత్రి. ఆ వెలుగు మన్ని ఆవరించడం కోసం గాయత్రి చేస్తాం. ఏ వెలుగయితే మన సూర్యుడి ద్వారా మన దగ్గరకు వస్తుందో, ఆ వెలుగు మనను బాగా ఆలింగనం చేసుకోవాలటండీ. *''తత్స వితుర్వరేణ్యం''* అంటే మనను వరించి, మనను బాగా ఆవరించాలి. మనం ఊరికే దాన్ని కావలించుకోవాలని అనుకోకూడదు, మాడి పోతాం! తాను మనకి అనుగుణంగా దిగి వచ్చి, మన్ని స్పృశించి, మనకి కావలసిన

రసాయన చర్య అంతా కూడా బాగా నిర్వర్తించి, చక్కని వెలుగుతో మనం ప్రకాశించేటట్లుగా ఆమె నిర్వర్తించాలని కోరుకుంటూ ఉంటాం గాయత్రి మంత్రం ద్వారా. అది కూడా ఎవరిని కోరతాం? ఆమెకి మూలమైన భర్గోదేవుడిని కోరతాం. *"భర్గః అస్య దేవః"*. *'భర్గోదేవస్య'* అంటే *'దేవః అస్య భర్గః'* అని అర్థం. అంటే భర్గుల దేవుడని అర్థం. అంటే వెలుగుమూర్తులకు దేవుడు. అతడు అవ్యక్తుడు. అవ్యక్తము నుండి వ్యక్తమైయ్యేది అదితి అను వెలుగు. అందుండి ఆదిత్యులు ఏర్పడతారు. అందుండి సవితృమూర్తులు ఏర్పడతారు. వారి నుండి సూర్యమూర్తులు ఏర్పడతారు. వారి నుండి గ్రహగోళాదులు. వాటిపై జీవరాశులు. కనుక జీవులకు మూలం అవ్యక్తం. అలాంటి అవ్యక్త తత్త్వాన్ని ఆరాధించడం గాయత్రి ఆరాధనగా అందించారు ఋషులు. భర్గులు అంటే మొత్తం సృష్టిలో ప్రజ్వలంగా వెలిగిపోతున్నటువంటి ఆదిత్యులు ఉన్నారే, Cosmic Sun అంటారు english లో. ఆ Cosmic Sun, లేదా ఆదిత్యుడు, ఆయన్ని ఆరాధన చేస్తున్నాం. ఆ సవితృమూర్తి నన్ను ఆలింగనం చేసుకోవాలని. ఆలింగనం చేసుకోవడం దేనికంటే, నీ యొక్క ప్రకాశం ఉందే, జీవుని యొక్క ప్రకాశమే బుద్ధి. ప్రతి జీవుడికి ఒక ప్రకాశం ఉంది. దాన్ని పెంచుకోవచ్చు. ప్రకాశం పెరగడానికి జీవుడి యొక్క బలం పెరిగితే ప్రకాశం పెరుగుతుంది.

అలా మనకి వెలుగు పెరిగిందనుకోండి, దర్శనం బావుంటుంది. అంతకుముందు కనబడనివి, ఇప్పుడు కనిపిస్తూ ఉంటాయి. ఇదివరకు తెలియనివి ఇప్పుడు తెలుస్తూ ఉంటాయి. కనబడడం అంటే అదే అర్థం. **తెలియడమే కనబడడం.** అది పెంచడం కోసం ఆ సవితృమూర్తి నన్ను ఆలింగనం

చేసుకోడానికి, నేను ఈ వెలుగులన్నిటికీ ఎవరు దేవుడో, ఆ దేవుడిని ధ్యానం చేస్తున్నాను, "ధీమహి" అని చెప్తోంది గాయత్రి మంత్రం. అర్థం తెలియకుండా మంత్రం అలా రాట్నం వడికినట్టు చేసుకునేవాళ్ళు చాలామంది ఉంటారు కదా! నిన్ను పరిపూర్ణ వెలుగుగా తీర్చిదిద్దగలినటువంటి మంత్రాలు ఎన్నో ఉన్నాయి. **నీకు దక్కిన మంత్రమే నిన్ను కడతేర్చే మంత్రం అని భావించాలి.** అలా భావన ఎందుకుండదంటే, మనసులో ఉంటాం. మనసు చంచలమైనది కాబట్టి, ఈ మంత్రంతో పని కాదేమో, ఇంకో మంత్రం పుచ్చుకుందాం అనిపిస్తుంది. ఈ గురువుగారితో పని కాదేమో, ఇంకో గురువుగారి దగ్గరకు వెళ్దాం అనిపిస్తుంది. నీకు ఎంత చంచల బుద్ధి ఉంటే, నీకు అలాంటి గురువు దొరుకుతాడు. నీ బట్టే నీ గురువు! శిష్యుడు సదాచార సంపన్నుడయితే సద్గురువే దొరుకుతాడు అని వాక్యం ఉంది. శిష్యుడికి రకరకాల వ్యామోహాలు ఉన్నాయనుకోండి, అలాంటి వ్యామోహాలకు భూతద్దం వేస్తే ఎట్లా ఉంటుందో అలాంటి గురువు దొరుకుతాడు. అందుకే, *"వంచతే పరివంచతే స్తాయూనాం పతయే నమః"* అని మనం నమకంలో చదువుకుంటాం. మోసగించే వాడికెలాంటి గురువు దొరకుతాడంటే, అంత కన్నా వందరెట్లు మోసం చేసేవాడు గురువుగా దొరుకుతాడు. దొంగిలించే వాడికి దొంగిలించే వాడు, మోసగించే వాడికి మోసగించే వాడు, అబద్ధాలు చెప్పేవాడికి అబద్ధాలు చెప్పేవాడు, ఇలాంటి గురువులు దొరుకుతూ ఉంటారు. ఇట్లా ధనంకోసం పరిగెట్టేవాడికి ధనం... అట్లా ప్రతీది అంతే! సత్యం కోసం. సదాచారం అంటే సత్యం గురించి జీవితంలో ఆచరణ కార్యక్రమంగా పెట్టుకున్న వాడికి సత్యమెరిగిన గురువు దొరుకుతాడు.

**త్రిసూర్యులు :**

గాయత్రి ఆరాధన మనకి త్రికాల సంధ్యలయందు చేసుకోమని చెప్పారు. ఎందుచేత, ఇందులో మనం భర్గోదేవుడిని, సవితృమూర్తిని, సూర్యమూర్తిని, అందరిని ఆరాధన చెయ్యడం కోసం. Triple Sun అంటారు. ఆ Triple Sun నే పాశ్చాత్య దేశాల్లో Solomon అంటారు. Solomon లో Om ఉంది, మధ్య భాగం ఓం. ఓం అనేది Cosmic Sun. Sol అనేది Central Sun. On అనేది మనమెరిగిన సూర్యుడు. మనం కూడా *"ఆదిత్యః సవితః సూర్యః"* అని చెప్పుకుంటాం. *"ఆదిత్యః సవితః సూర్యః"* అనే నామం బాగా చేసుకుంటే ఆ మధ్య స్విట్జర్లాండ్లో ఒకావిడకి కన్నులు కనబడనివి కనబడడం మొదలు పెట్టాయండీ, ఆవిడ ఆశ్చర్యంగా నాకు mail ఇచ్చింది. నాకు కన్నులు కనబడడం లేదు, మంత్రం ఏమన్నా చెప్తావా అంటే, ఇంకేం చెప్తాం, సూర్యుడివే చెప్పాలి. అందుకని, *"ఆదిత్యః సవితః సూర్యః"* అనే అష్టాక్షరి. (అంటే గాయత్రి ఛందస్సు) యిచ్చాను. గాయత్రిలో ఎనిమిది అక్షరముల ఛందస్సు ఉంది. అందుచేత ఇస్తే, ఆమె మూడు నెలలపాటు చేస్తే, చూపు వచ్చింది. ఎందుచేత? ఆమెకి అచంచల విశ్వాసం ఉండడం చేత. అదే ఒక భారతీయుడికి ఇస్తే, ఉండదు, రాదు. ఎందుకంటే, మనకి ఈ మంత్రం చేస్తుంటే, ఇంకో మంత్రం ఎట్లా ఉంటుందంటాడు. ఈ లోపల నాబోటి వాడొచ్చి అశ్వినీ దేవతలు చెయ్యమంటాడు. అనేసరికి, ఈ సూర్యుడెళ్ళి పోయాడు. ఇట్లా ఒకదాట్లోంచి ఇంకోదాంట్లోకి jumping activity ఉంటుంది. ఇట్లా గెంతులు వేసే వాడికి ఏమీ జరగదు, ఎక్కడా జరగదు.

ఎందుకని చెప్తున్నానంటే, గాయత్రి మంత్రం కన్నా మించిన మంత్రం లేదు. గాయత్రి కన్నా దేవత లేదు. గాయత్రి మంత్రం కన్నా మంత్రం లేదని మనకి శ్లోకం ఉంది. నీయందు వెలుగు బాగా ప్రకాశం చెందడానికి ఋషులు సాధించి ఇచ్చిన మంత్రం కదా! అది దేనిని చెప్తోంది? వెలుగులకు మూలాన్ని చెప్తోంది. దాని నుంచి దిగివచ్చిన వెలుగుని చెప్తోంది. అది నీలోనికి దిగి రావాలట. అది దిగి రావడం ఎలా? దిగి రావాలంటే, నిన్ను కావలించుకున్నట్టుగా దిగి రావాలట. అది చూడండి! అంటే, దిగి వచ్చినా ఉంటుందో ఉండదో, అందుకని కావలించుకుంటే ఇంక మరి ఉండిపోతుంది. అంటే, అంత వాత్సల్యంతో, అంత ప్రేమతో, ఆ వెలుగు నిన్ను ఆవేశించి, ఆవరించి, స్థిరంగా ఉండిపోయేటట్లుగా చేసే ప్రార్థన గాయత్రి మంత్రం.

Master EKగారి ప్రచోదనానికి మూలకారణం గాయత్రీ మంత్రమే కదా! అందుచేత, ఆ మంత్రాన్ని మనకి కూడా ఉభయ సంధ్యలయందు చేసుకోమని చెప్పారు. అంతే కాదు, స్త్రీ పురుష భేదం లేకుండా, జాతి భేదం లేకుండా. సూర్యుడు అందరికీ సంబంధించిన వాడు కాబట్టి, అందరూ చేసుకోవచ్చని పరమ గురువులు ఎప్పటినుంచో చెప్తున్నారు. సూర్యుడు మన సూర్యుడా? అందరికీ సూర్యుడే! అతడి ప్రజ్ఞయే మనయందు పని చేస్తున్నది. నిజానికి అతడి యొక్క అంశలమే మనం. అతడు రూపాయి బిళ్ళ అయితే మనం పైసా బిళ్ళ అంతే! అదే వెలుగు ఇక్కడ ఉన్నది. ఆయనకి ఏ విధంగా మిగతా గ్రహములన్నీ ఒక కుటుంబంగా ఉన్నాయో, నీలో కూడా ఆ గ్రహ శక్తులన్నీ కూడా ఉన్నాయి. రాహు కేతువులతో కలిపి నవ గ్రహాలు, అన్ని శక్తులూ – శరీరం, భూమి.

నీలో ఉండే శక్తి కుజుడు. నీలో ఉండే విచక్షణ బుధుడు. నీలో ఆలోచించి చక్కగా అది ప్రతిబింబించేటట్టుగా భావన చెయ్యడం చంద్రుడు. నీకున్న బుద్ధి వికాసం బృహస్పతి. నీకుండే సుఖపడే యోగ్యత శుక్రుడు. స్థిరపడే లక్షణం శని. ఇట్లా అన్నీ ఉన్నాయి మనలో. మనమే సూర్యుళ్ళం. అందుకనే, *"అసావాదిత్యో బ్రహ్మ"* అన్నారు. ఆ కనబడే సూర్యుడే నేను. వాడే నేను అనే భావన. అలా అయిపోతామేంటి? ఎప్పుడయిపోతావు? అది నీయందు సత్యమై నిలిచినప్పుడు అవుతావు.

అందుచేత, ఆ విధంగా అశ్వపతి పద్ధెనిమిది సంవత్సరాలు ధ్యానం చేశాడు. ఉపనయనం అయ్యి మూడు రోజులు, నాలుగు రోజులు గాయత్రి చేస్తే, అప్పటికే తండ్రి మొదలుపెట్టేస్తాడు ప్రచారం, మా అబ్బాయి రోజూ గాయత్రి చేస్తున్నాడు అని. పదహారు రోజుల పండగ అయిన తర్వాత కనబడు అని చెప్పాలి. ఏం చేస్తున్నాడు మీ అబ్బాయి? రెండు పూట్లా చేస్తున్నాడా? చెయ్యట్లేదండీ! ఎందుకంటే, పొద్దున్నే లేవడండీ, మధ్యాహ్నం school అండి, సాయంత్రం ఆడుకోవాలి కదండీ అంటాడు. ఇంకేముందండి! అందుచేత, మనం అంత సులభంగా గాయత్రి చేద్దామంటే చెయ్యలేం. మంత్రం అందరికీ ఇచ్చి ఉండవచ్చు, అది వేరే సంగతి. ఇప్పుడు అందరికీ ఇవ్వలేదా? ఎంతమంది ఆర్ద్రతతో దాన్ని చేస్తున్నారు అన్న దాన్ని బట్టి కదా ఏ ఒక్కటయినా ఫలించటం జరుగుతుంది.

ఇక్కడ చూడండి ఎలాంటి ఉదాహరణ ఉందో? అంటే, తన ప్రాణములు సైతము తన అధీనములో ఉన్న, తను సహజంగా

ఆనంద లోకంలో ఉండే ఒక జీవుడు, తన జీవన ప్రయోజనం నెరవేరడం కోసం గాయత్రి ఆరాధన చేశాడు. కాబట్టి, గాయత్రి ఆరాధన దేనికోసం? నీ జీవన ప్రయోజనం సిద్ధించడానికి అన్ని విధాలా ఉపయోగ పడుతుంది. అది చెయ్యడం చేత ఆ సవిత్రృమూర్తే రూపు కట్టుకుని వచ్చేశాడు. అమ్మవారిగా రూపు కట్టుకుని వచ్చాడు. అయ్యవారిగా కూడా రూపు కట్టుకుని రావొచ్చు. ఒకో సందర్భంలో ఒకో రకంగా ఉంటుంది కదా! సత్రాజిత్తు ఆరాధన చేస్తుంటే ఎలా వచ్చాడు? పురుష రూపంలో వచ్చాడు. వచ్చి ఒక మణి ఇచ్చి వెళ్ళిపోయాడు కదా! ఎందుకని? సత్రాజిత్తుకి కావలసినది అది. ఆ మణి ప్రతి రోజూ ఎనిమిది మణుగుల బంగారం యిస్తుందట. అంటే, వీడికి బంగారం మీద ఎంత వ్యామోహం ఉందో చూడండి. ఇప్పుడు ఒక దేవుడో, దేవతో వచ్చి నీకు ఏదయినా ఇచ్చారంటే, నీకు మనసులో ఏది ఉందో చూసి అదే ఇస్తారు కదా! దాని వల్ల ఎన్ని కష్టాలు వచ్చాయి సత్రాజిత్తుకి? ఎనిమిది మణుగుల బంగారం రోజూ వస్తే, ఏం చేసుకుంటావు? దాన్ని కాజేద్దామని ఎప్పుడూ ఎవరో ఒకళ్ళు ఎదురు చూస్తూనే ఉంటారు. ప్రాణ భయం ఉంటుంది.

అశ్వపతి ప్రార్థన అలాంటిది కాదు. జీవన ప్రయోజనం సిద్ధించాలని ప్రార్థన చేశాడు. అందువల్ల సమస్త పరిష్కారములు లభించాయి. **ప్రార్థన ఎప్పుడును జీవన సంసిద్ధికొరకు చేయాలి. అంతేకాని చిల్లర కోరికలకు కాదు.**

# 5. సావిత్రి జననం

అశ్వపతి ప్రార్థన చేశాడు దేనికోసం? సంతానం కోసం. సంతానం ఉంటేనే కదా కొనసాగుతుంది వంశం. *"ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః"* అన్నారు. అందుకనే, సంతాన ప్రాప్తికోసం ప్రార్థన చేస్తే అమ్మవారు వచ్చిందండి... అమ్మవారు వచ్చి... "ఆ నరేంద్రుడు ఆ దేవి అనుగ్రహ దృష్టికి ఎంతో ఆనందించాడు". అంటే, ఆవిడ కనబడగానే ఆవిడ దృష్టి తనయందు అనుగ్రహించడానికి సంసిద్ధంగా ఉన్నట్టుగా భావించాడు. భావించి, అప్పుడు ఆవిడ కూడా, నీకు ఏమి కావలెనో కోరుకోవలసినది అని అనుగ్రహించింది. "అత్యంత వినమ్రుడై, తనయుడు నొక్కని ప్రసాదింప వలసినదని అభ్యర్థించినాడు." చెప్తుంటాం కదా *"అపుత్రః గతిర్ నాస్తి"* అని, పుట్టి మనని ఏడిపించేవాడు కాకుండా, మనకి ఊర్ధ్వ లోకాలకెళ్ళడానికి ఎవడో ఒకడు ఉంటే చాలని! ఎంతసేపూ మన గోలే కదా! కాదు. నిజానికి ప్రతి వ్యక్తికి కూడా దేహం పొందినందుకు, దేహం కలిగించవలసిన బాధ్యత ఒకటి ఉన్నది. పితృదేవతలకి ఋణం ఉన్నది. దాన్ని నిర్వర్తించడానికే సంతానం. లేకపోతే, ఆ ఋణం అలా ఉండిపోతుంది. అంతేకాదు, ఆయన రాజు. ఈయన వెళ్ళిపోతే రాజ్యంలో సంక్షోభం కలగకూడదు. మనం వెళ్ళిపోవడం వల్ల ఎవరికీ ఇబ్బంది కలగకూడదు. అందుకనే, *"అకాల మృత్యు హరణం సర్వ వ్యాధి నివారణం"* అని కోరుకుంటూ ఉంటాం.

అందుచేత ఈయన ఏమన్నాడంటే, ఒకడు... ఒక్క కొడుకుని ఇమ్మన్నాడండి. సమంజసమే కదా! అడిగితే, ఆ లోకైకమాత, "కన్నియ నీకు ఉదయించగలదు" అంది. అది చూడండి! నేనొకటి అడిగితే నువ్వొకటి ఇచ్చావేమిటి అని, CVVగారిలాగా. నువ్వు అడిగేది నువ్వు అడుగుతుండగా ఆయనేదో అడగనివి ఇచ్చేస్తుంటాడు, training. అట్లాగే, ఈయనకి కూడా సావిత్రిదేవి చెప్పింది, "నీకు ఒక్క కూతురు పుడుతుంది" అని.

కూతురు పుడుతుంటే ఎట్లా? కొడుకు పుట్టాలని కదా అడిగింది! కూతురు పుట్టడమేంటి? "ఆమె వలన తర్వాత నీకు అన్నీ కలుగుతాయి. ఆమె వలన నీకు సమస్తమూ సిద్ధిస్తాయి." అందుచేత, మనవాళ్ళు ఆచారవంతుల కుటుంబంలో మొదటి సంతానం కన్య కావాలనుకుంటారు. ఎందుకంటే, ఆడపిల్ల ముందు పుడితే ఇంటికి శుభం అని. ఎందుకని? ఆడపిల్లని కని, పెంచి, వివాహం చెయ్యడం అనేది ఒక యజ్ఞార్థమైన కర్మ. ఎందుచేత? గుణవంతురాలిగా తీర్చిదిద్ది, చక్కని విద్యాబుద్ధులన్నీ నేర్పి, రకరకాలైన ఆభరణాలన్నీ కూడా ఏర్పాటు చేసి, ఇవన్నీ ఇంకొకరికి అప్పచెప్పడం కదా అది! అది యజ్ఞమే కదా! నీకోసం కాదు కదా! నీ ఇంట్లో ఒక కన్య పెరుగుతుందంటే, ఆ కన్య "ఆడ పిల్లే" కదా! అంటే, అక్కడ పిల్ల ఇక్కడ పెరుగుతోంది. తెలుగులో మంచి పేరే పెట్టారు స్త్రీ అన్నదానికి, కన్య అన్నదానికి "ఆడ పిల్ల" అని. ఈడ పిల్ల కాదని తెలియాలి కదా!

మన సంప్రదాయంలో ఏం చెప్తారంటే, ముందు స్త్రీ సంతానం, తర్వాత పురుష సంతానం కలిగితే అది అదృష్టం అని

చెప్తారు. ముందు లక్ష్మి ఇంటికి వస్తే, తర్వాత అన్నీ... లక్ష్మి అంటే డబ్బు అనే అనుకోకండి. వైభవం, సంపద అని అర్థం.

అలాంటి కన్య నీకు ఒకటి కలుగుతుంది. "జగన్మాతా! నీ కృప వల్ల నా కోరిక నెరవేర వలదా?" అన్నాడు. మరి నా మాటేంటి అన్నాడు. నేనొకటడిగాను, నువ్వొకటిస్తానన్నావు. నేను అడిగింది వేరు, నువ్వు ఇస్తానన్నది వేరు, మరి నా మాటేంటి అన్నాడు. అంటే, "అతడు అప్పుడు లోపలి అభిప్రాయం వెల్లడించాడు. లోకమాత ఆ అభ్యర్ధన విని, అశ్వపతిపై కృపాదృష్టి ప్రసరింపజేసి, మద్రేశ్వరా! నేను ఇంతకు మునుపే నీ హృదయాభిలాష చతుర్ముఖునికి ఎరిగించినాను." అంటే, ఈయన తపస్సు చేస్తుంటే, ఇలా వీడు కొడుకు కోసం తపస్సు చేస్తున్నాడని బ్రహ్మదేవుడిని అడిగిందట. అంటే, ఆయన ఏం రాసి పెట్టాడో? అడిగితే, "ఆ మహనీయుడు నీకు ఒక కన్యకామణిని మాత్రమే ప్రసాదించాడు". అంటే, నీకు program లో ఉంది ఒక కన్య అని. నువ్వు తపస్సు చేశావు, బావుంది. కానీ, ఇప్పటికి నీకు కన్య రాసిపెట్టి ఉన్నది. అది ముందు అంగీకరించు. ఆ తర్వాత నా ప్రసాదంగా ఆమె ద్వారా నీకు చాలా జరుగుతాయి. అయితే, "ఆ పుత్రిక ప్రభావం వల్ల నీకు అనతి కాలంలోనే తనయ శతము లభించగలదు." ఆ పుత్రిక ప్రభావం వల్ల నీకు వందమంది పుత్రులు కలుగుతారు. నువ్వడిగింది ఒకడిని, నేను ఇచ్చేది నీకు సమస్తమునూ సిద్ధింపచేస్తుంది. అంతేకాదు, నువ్వు అడిగిన విషయం కన్నా వంద రెట్లు. బావుంది కదా! ఎందుచేతంటే, నిజానికి ఆ సావిత్రిదేవే ఈయనకి పుడుతుంది సావిత్రిగా. అందుకనే, పుట్టిన శిశువు కూడా సావిత్రే. ఎందుచేత? తాను ఆయనయందు అంత అనుగ్రహం

చెందియున్నది. ఉండడం చేత, అమ్మవారే తనకి పుత్రికగా రూపు కట్టుకుంటుంది. ఎందుకు రూపు కట్టుకుంటుందంటే, మరొక ఘట్టం జరుగవలసి ఉన్నది కాబట్టి, దాని కనుగుణంగా ఇక్కడ ఈ విధంగా ఆవిడ... నీకు ముందు కన్య ఉదయిస్తుంది, ఆ తర్వాత ఆమె కారణంగా నీకు వందమంది తనయులు కూడా ఏర్పడుతారు. అందుచేత, నీ హృదయం తెలిసినదాన్నే, తెలియనిదాన్ని కాదు. కాకపోతే, ఇప్పటికే బ్రహ్మరాత ఒకటి ఉన్నది. అది ఆధారంగా నీకు అద్భుతమైనటువంటి కన్యకామణి జన్మిస్తుందనే విషయాన్ని సావిత్రిదేవి ఆవిష్కరిస్తుంది.

అలా చెప్పి, ఆమె అంతర్హితురాలయ్యింది. "మరి కొంత కాలం గడిచిన పిమ్మట, అశ్వపతి ధర్మపత్ని అయిన మాళవియందు సావిత్రిదేవి కృపాదృష్టి వల్ల 'సావిత్రి' అన్న తనూజ ప్రాదుర్భవించినది". పుట్టినావిడ కూడా సావిత్రే. మాళవి అనే కన్య ద్వారా, అంటే చాలా మార్ధవమైనది ఆవిడ. అందుచేత, మాళవి అని పేరు పెట్టారు. అంటే, ఒక తీగ లాంటి స్వభావంగా, మృదువుగా ఉండే స్వభావం కలిగిన ఒక స్త్రీ ద్వారా అశ్వపతి ఈ దైవాంశ సంభూత అయిన ఒక కన్యకను, ఒక స్త్రీ శిశువును కనటం జరిగినది. "ఆ కన్యాతిలకం క్రమక్రమంగా పెరిగి పెద్దదయి, సోయగంలో సిద్ధ, సాధ్య, యక్ష, అమర కుమారిక లందరిలోనూ మిక్కిలి మిన్న అయినది". చూడండి, పుట్టిన ఆడపిల్ల, అంటే అన్ని లోకాల్లోనూ ఆవిడ కీర్తింపబడేంత ఉత్తమోత్తమమైన ప్రతిభతో ఆవిడ పెరుగుతూ వచ్చిందండి. అంటే, ఇలాంటి కన్య మానవలోకంలో కాదు, సిద్ధలోకంలో సిద్ధుల మధ్య లేదు, సాధ్యుల మధ్య లేదు, యక్షుల మధ్య లేదు, అమర లోకంలో లేదు. అంటే,

ఎలాంటి కన్య అయి ఉండాలి? సాక్షాత్తు శుద్ధ చైతన్యం రూపు కట్టుకొచ్చి ఉండాలి, అంతే! నవమ ప్రకృతి, అంటే మూల ప్రకృతే రూపు కట్టుకొస్తే అలా ఉంటుంది. అలాంటి పద్ధతుల్లో ఆమె వికాసం చెందుతూ, పెరుగుతూ ఉన్నది.

"నా తనూజకి అన్ని విధాలా అనురూపుడయిన వరుడు ఎచ్చట లభింపగలడో కదా?" ఇప్పుడిదొకటి చూడాలి. గుణపరంగా అనురూపం అయినటువంటి సంబంధం చూసుకోవాలి. అందుకనే కదా, సీతమ్మవారు చిన్నతనంలోనే శివ ధనుస్సుని అట్లా (ఏదో కిందకి బంతి వెళ్లిందని) ఎడం చేత్తో ఎత్తేసి, కింద నుంచి బంతి తీసుకుంటే చూసి జనకుడికి గుండెలు బరువెక్కిపోతాయి. ఆ శివ ధనుస్సుని ఎవరూ ఎత్తలేరు. ఒక్క మనిషి ఎత్తే పరిస్థితి లేదు. అలాంటిది, చిన్న పిల్ల ఎడం చేత్తో ఎత్తేసింది. ఎంత ప్రతిభ కలిగి ఉండాలి? నేనేత్తుతానని వచ్చినవాళ్ళంతా ఎత్తలేకపోయారు. ఎవరు ఎత్తగలరు? శివానుగ్రహం ఉంటేనే ఎత్తగలరు. రావణుడికి శివానుగ్రహం లేదా? ఉంది, కాని శివ సంకల్పం లేదు. అందుకని, శివ సంకల్పం ఎలా ఉన్నదో, ఆ విధంగానే ఈమెకు వరుడు లభిస్తాడు అన్న ఉద్దేశంతో మహాయోగి అయిన జనకుడు ఈ శివ ధనుస్సుని ఎవరయితే ఎక్కుపెడతారో, వారికే నా కుమార్తెనిచ్చి పెళ్లి చేస్తానని అంటాడు. అది ఏ లోకంలో వాళ్లయినా కావచ్చు. ఆ శివ ధనుస్సు తానుగా చేత్తో పట్టుకుని ఎత్తి దానికి అల్లెతాడు వెయ్యాలి. అలా అల్లెతాడు వేసే వాడు ఉంటే అలాంటి వాడికి ఇవ్వడం అంటే అర్థం ఏమిటంటే, అంత శివానుగ్రహం ఉన్న పురుషుని కోసం ప్రయత్నం అన్న మాట.

అందుచేత, మన పిల్లకి ఎలాంటి గుణములు ఉన్నాయో, దానికి అనురూపంగా ఉన్న గుణములు గలవాడిని మనం తెచ్చుకుని ఇచ్చామనుకోండి, ఇస్తే ఆ దాంపత్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగిపోతుంది. ఈ రోజుల్లో అరుదులెండి. ఎందుకంటే, అసలు చూసే విధానమే వేరు. ఒకరికొకరు నచ్చడం అంటే, అసలు ఏం నచ్చిందో తెలీదు ఎవడికినీ. అసలు ఏం చూడాలో తెలియదు. మామూలుగా మన వాళ్ళు పెళ్లి కుదుర్చుకున్న తర్వాత నేను అడుగుతూ ఉంటాను సరదాగా, ఏమిటి what are the parameters అని. వారి కుటుంబములు, వారి సంస్కారములు, వారి ఇంట్లో ఉండే ఆచార వ్యవహారాలు, ఆ పిల్ల గుణసంపద ఎవ్వరికీ అక్కర్లేదు.

అందుచేత, ఈ తండ్రిని చూడండి, పిల్ల పెరుగుతూ ఉంటే, ఇంట్లో ఆడపిల్ల, తండ్రి మనస్సులో ఆలోచనలు పెరుగుతూ ఉంటాయి. వాడు నిజంగా తండ్రి అయితే. కాకపోతే చేసేదేమీ లేదు. వాడేదో గాడిదయ్యాడనుకోండి అది వేరే సంగతి. అంటే, పిల్ల పెరుగుతూ ఉంటే తండ్రి గుబులు పెరుగుతూ ఉంటుంది లోపల. ఎందుకని? తగిన వరుడిని తీసుకు రావాలి. పిల్ల ఎలా పెరుగుతోందో? అది కూడా చూసుకుంటూ ఉండాలి తల్లిదండ్రులు. ఏదో ఒక రోజున, "తల్లీ! నీ పెళ్ళని అనుకుంటుంన్నాం" అంటే, "నువ్వు అనుకోవటం ఏమిటి? నేను ఎప్పుడో నిర్ణయం చేసుకున్నా కదా" అని చెప్పకూడదు కదా! ఆ పరిస్థితి రాకూడదు కదా! ఎప్పుడొస్తుంది? నువ్వు అనుసరిస్తూ ఉండాలి పెరుగుతున్న పిల్లల్ని. అనుసరించడం అంటే spying కాదు. ఆ అమ్మాయి భావాలు ఎలా ఉన్నాయి? దినచర్య ఎలా ఉంది? ఎలాంటి విషయాలయందు

ఆసక్తి కలిగి ఉన్నది? ఇటువంటివన్నీ తండ్రి గమనిస్తూ ఉండాలి, తల్లి గమనిస్తూ ఉండాలి.

ఇప్పుడు ఈయనకి భయం పుట్టిందంటే, పుట్టదండీ? అశ్వపతి "నా తనూజకి అన్ని విధాలా అనురూపమైన వరుడు ఎచ్చట లభించగలడో కదా" అనుకున్నాడు. చాలా కష్టం. Highly qualified. అంటే, మన understanding కాదు qualified. గుణపరంగా, సౌందర్యపరంగా మూర్తీభవించిన స్త్రీ మూర్తిగా ఏర్పడుతున్న ఒక కన్యను, ఏ లోకంలోనూ తనతో సమానమైనటువంటి కన్య లేదట. అలాంటి కన్యకు వరుడంటే ఎలా ఉండాలి? తపస్సు చేసి తాను పొందినటువంటి కుమార్తే కదా! అమ్మవారే స్వయంగా ఆశీర్వదించి ఇచ్చిన కన్య కదా, అందుకని ఎలాంటి భర్తని తీసుకురావాలో తెలియక, ఆయనేం చెప్పాడో తెలుసా? ఎప్పుడూ, ఎక్కడా ఇలా ఎవరూ చెప్పింది లేదు తెలుసా! నువ్వే ఎన్నుకో తల్లీ! అని చెప్పాడు. అంటే, మన పిల్ల మనకన్నా తెలివిగలదనుకోండి, అదే మంచిది కదా! తండ్రి కన్నా మించిన చైతన్యవంతురాలైన కూతురు ఉందనుకోండి, మనకంత తెలివితేటలు లేవనుకోండి. మన తెలివితేటలు మనకి తెలుస్తాయి కదా! ఎందుకంటే, ఆవిడ కన్నా ఒక ఇరవై, ముప్ఫై ఏళ్ళు ahead కదా మనం జీవితంలో. మనకేమాత్రం తెలివితేటలున్నాయో మనకి తెలుస్తాయి. **మన పిల్లకి అంతకన్నా తెలివితేటలు ఉన్నాయనుకోండి, Your choice is my choice అని చెప్పగలిగే తండ్రి ఉంటాడా? ఉండొచ్చంటుంది భారతం.**

"ఆ సమయంలో సాళ్వపతి ద్యుమత్సేనుడి కుమారుడు సత్యవంతుడు అత్యంత రూపశాలి అని, మహనీయ గుణవంతుడని

ఆకర్షించిన సావిత్రి అతని యెడల ఎంతో మక్కువ కలిగి ఉన్నది. కానీ వల్లమాలిన సిగ్గు వల్ల ఆమె ఆ విషయం జననీజనకులకు ఎరిగించలేదు." ఆవిడ సత్యవంతుడి గురించి విని ఉన్నది. ఆ గుణగణములకు ఆకర్షించబడినది. రూపసంపద ఇంకా అవన్నీ ఏమీ తెలియవు మనకి. అందుచేత, బావుంది, ఈ రాజకుమారుడు బావున్నాడు. ఎలాంటి రాజకుమారుడు? రాజ్యం లేదు, అడవుల్లో ఉంటున్నాడు. రోజూ వెళ్లి చెట్లు కొట్టి, కట్టెలు తయారుచేసి, ఇంటికి అగ్నిహోత్రానికి సమిధలు ఏరుకొచ్చి, పుల్లలు వంటకి... ఇవన్నీ రోజూ పోగేసుకురావడానికి అడవిలోకి వెళ్లి వచ్చే ఒక క్షత్రియ కుమారుడన్నమాట. అలాంటి వాడియందు తాను ఆకర్షితురాలై ఉన్నది!

**గుణ సంపదకు ఆకర్షితులవటం సంస్కారులకే సాధ్యం. కేవలం ధనం, పదవి, ప్రతిష్ఠలకు ఆకర్షితులవటం దుఃఖ కారణం. గుణ సంపద చెదరనిది. అది సహజ సంపద. ఇతర సంపదలు వచ్చి పోయేవి.** సత్యవంతుడు సద్గుణములందు రాజు. రాజ్యం లేకపోయినా రాజే! అట్టి దర్శనం సావిత్రి వంటి వారికే సాధ్యం.

# ౬. ప్రజ్ఞ - ప్రాణము

పరమ పవిత్రమైనటువంటి సతీ సావిత్రి ఉపాఖ్యానాన్ని మనం వివరించు కుంటున్నాము. అశ్వపతి అనే మహారాజుకి గాయత్రి తపః ఫలితంగా సావిత్రీ మాతయే 'సావిత్రి' అనే కన్యగా అశ్వపతికి జన్మించిందని తెలుసుకోవడం జరిగింది. అశ్వపతి అతడి ప్రాణములకు అధిపతి అని, పంచ ప్రాణములు తన అధీనంలో ఉంచుకోగలిగినటువంటి ప్రజ్ఞావంతుడని, అతనుండే రాజ్యం మద్ర రాజ్యం, మద్ర దేశం, మద్ర దేశమంటే ఆనందానికి నిలయమని, మద్ర అంటే ఆనందమని తెలుసుకోవడం జరిగింది. హృదయమునందు చేరి పంచ ప్రాణములను చక్కగా తన అధీనమునందు ఉంచుకున్న వ్యక్తిని 'అశ్వపతి' అని పిలుస్తారు. ప్రాణమునందు... హృదయమునందు ప్రాణములు కర్కాటక రాశికి సంబంధించినది. కర్కాటక రాశిలో, లేక ఆషాఢ మాస ప్రజ్ఞ సంవత్సర పురుషుడు హృదయమునందు వసించే సమయం. అందుచేత, ప్రాణముల యొక్క తీరు తెన్నులన్నీ కూడా ఆషాఢ మాసానికి సంబంధించే ఉంటాయి.

**రెండు ప్రాణములు సూక్ష్మంగాను, ఊర్ధ్వంగాను ఉంటే, రెండు ప్రాణములు బహిర్గతంగాను, ప్రస్ఫుటంగానూ వ్యక్తమై** ప్రాణ వ్యాపారములను నిర్వర్తిస్తున్నట్టుగా గోచరిస్తూ ఉంటే, లోపల ఉన్నటువంటి రెండు సూక్ష్మ ప్రాణములకు, బయట మనకు గోచరిస్తున్న రెండు ప్రాణములకు అనుసంధానంగా ఒక

ప్రాణం ఉంటుంది. ఇలా ఐదు ప్రాణములు ఉన్నాయి మనకి. మనందరికీ బాగా తెలిసినటువంటిది ఉచ్ఛ్వాస, నిశ్వాస. దీని వలన దేహ సంబంధం ఏర్పడి ఉంటుంది. దేహ సంబంధానికి పంచ ప్రాణాలు ముఖ్యమే. అందులో మనకి తెలిసినవి రెండు. ఎందుకంటే, పీల్చి వదులుతున్నప్పుడు సామాన్యంగా అందరికీ తెలుస్తూ ఉంటుంది. గుర్తు చేస్తే నిజమే కదా అనిపిస్తుంది. గుర్తు చెయ్యకపోతే అది మనలో పని చేస్తున్నట్టుగా కూడా మనం అంత గుర్తించం. మనలో అనునిత్యం పని చేస్తూ, మనలను ఈ విధంగా నిలబెట్టి, ఈ శరీరమందు జీవుడిగా మనం నిర్వర్తించుకో వలసిన కార్యములను నిర్వర్తించుకుంటూ పరిణతి చెందడానికి ప్రాణముల యొక్క అవసరం చాలా ఉన్నది. ఆ ప్రాణ స్పందనమే లేకపోతే కార్యక్రమమే లేదు జీవుడికి. అందులో రెండు ప్రాణములు మనకి తెలిసినవి – ఉచ్ఛ్వాస, నిశ్వాస. ఈ రెండు ప్రాణములు చక్కగా మనం సమన్వయించుకోగలిగితే, లోపల ఉన్న రెండు ప్రాణములతో అనుసంధానం చేసే ఒక ప్రాణమున్నది. దానిని సమాన ప్రాణం అంటారు.

అపాన వాయువు శరీరంలో కింది భాగాన్నంతా కూడా పరిపాలిస్తూ ఉంటే (ఉదర వితానానికి కింది భాగం అంతా అపాన వాయువు పరిపాలిస్తూ ఉంటుంది), ప్రాణ వాయువు ముక్కు రంధ్రాల నుంచి, ఈ భ్రూమధ్యం వరకూ వెళ్లి, అక్కడనుంచి శ్వాస నాళం ద్వారా లోపలికి వెళ్లి, ఊపిరితిత్తులంతా కూడా ప్రాణాలను నింపుతూ ఉంటుంది. ప్రాణ వాయువు ప్రాణాన్ని నింపుతూ ఉంటే, ఆ ప్రాణాన్ని బాగా ఆకళింపు చేసుకుని, దేహంలో ఉండే అపానము మలినమైన విషయములన్నిటినీ కూడా బయటకి

నెట్టేస్తూ ఉంటుంది. ఇట్లా ప్రాణాలను పొందుతూ... అంటే, మంచి నీరు ఇంట్లోకి తెచ్చుకుంటూ, మురికి నీరు వదిలేసినట్టుగా. మంచి నీరు ఇంట్లోకి రాకపోయినా ఇబ్బందే, మురికి నీరు ఇంట్లోంచి వెళ్ళకపోయినా ఇబ్బందే కదా! అంటే, మనకి మంచినీటి సరఫరా ఏ విధంగా సవ్యంగా ఇంట్లోకి రావడానికి ఎంత కృషి చేస్తామో, ఇంట్లో మురికి నీరు బయటకు వెళ్ళపోడానికి అంత ప్రయత్నమూ చెయ్యాలి. ఆ రెండూ సరిసమానంగా ఉంటేనే ఆ ఇంట్లో ఆరోగ్యం ఉండే అవకాశం ఉంది.

అందుచేత, అనంతమైన ప్రాణమునుండి మనలోకి ప్రాణం అలా ఆవాహనం చేసుకుంటూ ఉంటాము. ఆ ప్రాణం మనలోకి ప్రాణ వాయువు, అంటే ఆక్సిజన్ అంటూ ఉంటాము కదా, అది బాగా నింపుతుంది ఊపిరితిత్తుల నిండా. మనం ఒక్క పావలా వంతు మాత్రమే మనకున్న శక్తిలో ఈ ప్రాణాన్ని అందుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటామట. మన ఊపిరితిత్తులు పీల్చ గలిగినటువంటి గాలిలో మనం పావలాయే వాడుతూ ఉంటాం, ముప్పావలా వాడం. బాగా వాడితే, ముప్పావలా కూడా, ఇన్ని రోగాలు వచ్చే అవకాశం ఉండదు. బాగా పని చేయించడం లేదు దాన్ని. బాగా పని చేయించాలి. ఎంత బాగా గాలి పీలిస్తే, అంత బాగా లోపలి నుంచి గాలి వదలబడుతుంది. పీల్చడం బట్టి వదలడం ఉంటుంది. పీల్చడమే బాగుండకపొతే వదలడమూ బాగుండదు. కాబట్టి, లోపల ఈ అగ్నికార్యంవల్ల, అంటే మనసుతో చేసే పనంతా అగ్నికార్యమే. ప్రాణకార్యం కూడా అగ్నికార్యమే. లోపలికి మనం ఆహారం తీసుకుంటున్నా అది అగ్నికార్యమే. ఇంత అగ్నికార్యము జరుగుతున్నప్పుడు లోపల మలినాలు ఏర్పడుతూ

ఉంటాయి. అంటే, వంట వండితే గిన్నెకి ఎలా మసి తప్పదో, అలాగే ప్రతి నిత్యం మనం శ్వాస పీల్చడం వలన, మనం చేసే ఆలోచనల వలన, మనం తీసుకునే ఆహారం వలన, మనలో పుట్టించే వేడి వలన శరీరంలో మలినాలు పుడుతూ ఉంటాయి. ప్రతిసారీ వంట చేసేటప్పుడు పాత్ర ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో, అలాగే ప్రతి నిత్యం ఈ కార్యక్రమం చేసేటప్పుడు మనలో ఉండే మలినాలన్నీ కూడా తీసేసుకుంటూ ఉండాలి. మలినాలను పారద్రోలడానికి అపాన వాయువు చాలా ముఖ్యం. లేకపోతే, అక్కడనుంచే అన్ని జబ్బులూ పుట్టుకొస్తాయి.

అది ఒకటి ఉండగా, అపాన వాయువే శరీరంతో బంధం వేసి వుంచుతుంది. బొడ్డుకి కొంచెం కింది భాగంలో అపాన వాయువు జీవుడిని పట్టి ఉంచడానికి అక్కడ ముడి ఒకటి ఉంటుంది. సినిమాలు చూస్తూ ఉంటారు మీరందరూ, మనకన్నా తూర్పు దేశాల్లో, ఈ martial arts నేర్పేవారు, బొడ్డు కింద ఏ ప్రాంతంలో కొడితే జీవుడు వెళ్ళిపోతాడో దేహంలోంచి, తెలిసిన విద్యలు ఉన్నాయి. అలా అంటే చాలు అక్కడ, వెళ్ళిపోతుంది జీవి. ఎక్కడ ప్రాణం ముడి ఉందో ఆ ముడి విడిపోతుంది. యోగంలో ఒక యోగి అక్కడ దూముడి వేసుకుని ఉంటాడు. అది గొప్ప విషయం. అక్కడ దూముడి వేసుకుని, వచ్చిన పని అయిపోయిందనుకుంటే, దూముడి ఇలా తీసేస్తే వచ్చేసినట్టు, శరీరానికి తనకి సంబంధం పోతుంది. అంటే, **అపాన వాయువుని శరీరానికి అప్పచెప్పేసి, తాను ఉదాన వాయువు ఆధారంగా ఊర్ధ్వగతి చెంది బయటకొచ్చేస్తాడు.** ఇట్లా మనకి, అపాన వాయువువల్ల శరీరంతో సంబంధం ఉంటుంది.

ఈ శరీరాన్ని నిలబెట్టడానికి ప్రాణ వాయువు ద్వారా చాలా ప్రాణాన్ని అందుకుంటాం. ప్రాణాన్ని రకరకాలుగా అందుకుంటూ ఉంటాం. ఉదయము, సాయంత్రమూ కొంత సమయం పాటు భూమి మీదకి సూర్యరశ్మి బంగారు కాంతితో ప్రసరిస్తూ ఉంటుంది. ఆ సూర్యరశ్మి ద్వారా, గాలి ద్వారా ప్రాణాన్ని అందుకోవచ్చు. స్వచ్ఛమైన పారుతున్నటువంటి నీరు ద్వారా... ప్రాణం ఎందులో ఎక్కువ ఉంటుందంటే, ప్రవహించే నీటియందు ఉంటుంది. ప్రవహించే నీటియందున్న ప్రాణం మన టాంకుల్లోకి వచ్చేసరికి తగ్గిపోతుంది. అక్కడినుంచి మన బిందెల్లోకి వచ్చేసరికి మరింత తగ్గిపోతుంది. అక్కడ నుంచి మన గ్లాసు కొచ్చేసరికి మరింత తగ్గిపోతుంది. ప్రవహించే నీటికి, పోగుచేసుకునే నీటికి అంత తేడా వుంటుంది. బావిలో నీరు కూడా ప్రవహించే నీరే. ఎందుచేతంటే, ఏ పూటకాపూట మీరు నీరు వాడేస్తూ ఉంటే మళ్ళీ ఊట నీరు వస్తూ ఉంటుంది అందులోకి. అవన్నీ పూర్వకాలం మనకి వున్న సౌకర్యాలు. అవన్నీ ఇప్పుడు అసౌకర్యాలు చేసుకోవడం వల్ల... ఏవో రకరకాలుగా మనం ఇప్పుడు కొత్తగా నీటిలో కొంత ఆక్సిజన్ చొప్పించి ఇచ్చేటట్టుగా ఒకటి తయారుచేస్తున్నారు. ఏవో రకరకాల బాధలు.

ఏది ఏమయినప్పటికీ, నీటిలో ప్రాణం ఉంది. గాలి, నీరు, సూర్యరశ్మి. సూర్యరశ్మి ఉదయం 7:30 గంటల వరకూ, అంటే సూర్యోదయానికి గంటన్నర తర్వాత, సూర్యాస్తమయానికి గంటన్నర ముందు, ఆ సమయంలో ప్రాణం చాలా ఉంటుంది. మనబోటి దేశాల్లో సూర్యుడు చాలా ఎక్కువ ప్రాణాన్ని ఇస్తాడు. అంటే tropics అంటాం. కర్కాటక రేఖ, మకర రేఖ, భూమధ్య

రేఖ, ఆ ప్రాంతంలో, అంటే భూమధ్య రేఖకి పైన, క్రిందుగా ఉండే ప్రాంతాలని tropical countries అంటారు. అంటే, అక్కడ సమశీతోష్ణ స్థితి ఉంటుంది. చిన్నప్పుడు చదువుకున్నాం సమశీతోష్ణ స్థితి అని. అంటే ఏమిటంటే, మరీ భయంకరంగా చలి ఉండదు, మరీ భయంకరంగా ఎండ ఉండదు. అన్నీ సమంగా ఉంటాయి. ఎండ, వాన, గాలి, వర్షం, అన్నీ సమంగా ఉంటాయి. ఆరు ఋతువులు ఉంటాయి. ఈ ఆరు ఋతువులూ ఎక్కడ స్పష్టంగా ఉంటాయో అక్కడ ప్రాణం చాలా ఏర్పడి ఉంటుందని చెప్పి మన గ్రంథాలు చెప్తూ ఉంటాయి. అందుకనే, ఆరు ఋతువు లుండేటటువంటి ప్రాంతం ఏమయినా ఉంటే, అది ప్రాణశక్తితో కూడి ఉంటుంది. అందుచేతనే అక్కడ పంటలెక్కువ. ఇప్పుడు మన దేశంలో పండినంత వైవిధ్యంగా కూరగాయలు గాని, ఫలములు గానీ ఇతర దేశాల్లో పండవు. భూమి చుట్టూ ఈ belt ఉంటుందే, ఏది కర్కాటక రేఖ నుంచి మకర రేఖ వరకూ, ఆ belt లోనే ఇవన్నీ పండుతాయి. మిగతా వాళ్ళందరూ ఇక్కడ నుంచి తెచ్చుకోవలసిందే. ఎంత ధనవంతుడయినా ఈ ప్రాంతాల నుంచి పళ్ళు, కూరలు, పప్పులు, దినుసులు అన్నీ తెచ్చుకోవాలి. ఐరోపా ఖండం వారు ఇలాంటి ప్రాంతాల నుంచి తెచ్చుకుని తింటూ ఉంటారు. ఎందుకని ఇది చెప్తున్నానంటే, సమశీతోష్ణ స్థితి ఉన్న చోట సూర్యకాంతి ప్రభావం చక్కని ప్రాణశక్తి కలిగిస్తుంది. మిగతా వారు ప్రాణంకోసం ఎక్కువ ప్రయత్నం చెయ్యాలి.

కాబట్టి, ఇలాంటి అనంతమైన ప్రాణం మన గోళం చుట్టూ ఏర్పడి, మనకి ప్రాణ వాయువు ద్వారా అందుతూ ఉంటే, దాన్నందుకుని అపాన వాయువు ద్వారా మనలో ప్రతి నిత్యం

ఏర్పడుతున్న మలినాలను పారద్రోలుతూ ఉండాలి. దానికి బాగా గాలి పీల్చాలి. ఇలా బాగా గాలి పీల్చి, వదిలి, గాలి పీల్చి, వదిలి, గాలి పీల్చి, వదిలి అనే ప్రక్రియ మనసుతో, అంటే మనస్సులో ఉంటుంది మన ప్రజ్ఞ మానవుడికి. బుద్ధి కక్ష్యలోనూ ఉండొచ్చు, తాను–నేను అనే కక్ష్యలోనూ ఉండొచ్చు. లేదూ, మనసు కన్నా ఇంకా దిగువ ప్రాంతాల్లో ఉండే ఇంద్రియ కక్ష్యలోనూ ఉండొచ్చు. మరీ దిగజారిపోతే భౌతిక కక్ష్యలో ఉండొచ్చు. ఇవన్నీ జీవ ప్రజ్ఞ ఉండగలిగిన స్థానములు, లేక కోశములు, లేక లోకములు. కేవలం భౌతికమే, ఇంక ఇంతకన్నా ఏమీ తెలియదు! ఇది మొదటిది. రెండవది, ఇంద్రియములు, కోరికలు, అదొక కక్ష్య. మూడవది, మనో భావములు. నాలుగవది, అవీ భావములే గానీ వెలుగు భావములు, దివ్యమైనటువంటి భావములు – బుద్ధి కక్ష్య. ఐదవది, ఆనంద కక్ష్య. తనకు తానుగా ఆనందించడం, ఆత్మయందు రమిస్తూ ఉండడం. అటుపైన ఆరవది, తానుగా ఉండడం. ఏడవది, దేవుడితో కూడి ఉండడం. వీటన్నిటిలోనూ దేవుడితో కూడి ఉండొచ్చు. దైవము అంటే అంతటా వ్యాపించినటువంటి తత్త్వము. ఆ తత్త్వంతో ముడి పడి, ఈ ఆరు కోశములలో ఏ కోశములోనైనా ఉండొచ్చు.

ఆ అన్ని కోశాల్లో ప్రయాణం చెయ్యాలంటే, ఈ ప్రాణము–అపానము ఒక్కదానితో పని జరగదు. అందుచేత, ప్రాణము, అపానము అనే వాయువులకు సమత్వం కల్పిస్తే, సమాన వాయువు అని చెప్పి హృదయమునందు అది స్పందనంగా ఉంటుంది. ఆ స్పందన వాయువుని మనం మనసుతో అక్కడికి వెళ్లి, దాన్ని ఈ విధంగా గాలి పీలుస్తుంటే మనో ప్రజ్ఞ గాలి అందుకుని లోపలికి

ఏ విధంగా వెళ్తుందో, మళ్ళీ నిశ్వాస ద్వారా ఏ విధంగా బయటకు వస్తూ ఉంటుందో తెలుస్తుంది మనసు శ్వాస మీద ఉంచితే. మనసు శ్వాస మీద ఉంచకపోతే, శ్వాస జరుగుతూ ఉంటుంది గాని నీకు సంబంధం ఉండదు, శరీరం పని చేస్తూ ఉంటుంది. నీవే ఒక భాగం ప్రాణంగాను, ఒక భాగం ప్రజ్ఞగాను ఏర్పడి ఉన్నావు. ఒక భాగం ప్రాణంగాను, ఒక భాగం ప్రజ్ఞగాను ఉన్నాడు జీవుడు. అందుకనే, జీవుడిని స్పందనాత్మకుడు అంటారు. స్పందనాత్మక చైతన్యము అంటారు. అందుచేత, నువ్వు రెండు భాగాలుగా ఉంటే, ఏ భాగానికి ఆ భాగంగా నీ యొక్క పరిపూర్ణ స్వరూపం, సమగ్ర రూపం నీకు తెలియదు. అందుచేత, **లోపల ఉండే ప్రాణాలని, బయట ఉండే ప్రాణాలని, రెండిటిని కలిపేది సమాన ప్రాణం. అది హృదయమునందు ఉంటుంది.** హృదయ మందుండే ఆ ప్రాణం చేరుకుంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసలు మనసు పెట్టి బాగా చేస్తూ ఉంటే, మనం స్పందనం అనే ప్రజ్ఞయందు కాసేపు ఉండడానికి వీలు పడుతుంది.

అలా ఉంటే, ఆ స్పందనమునందు ఉండే సమయం పెరుగుతూ ఉంటే, అక్కడనుంచి ఉదాన వాయువని ఒకటి లోపల పని చేస్తుంది. అది ఊర్ధ్వముఖంగా నీ ప్రజ్ఞని తీసుకెళ్లగలదు. అంటే, విమానం ఎక్కినట్టన్నమాట. విమానం ఎక్కినట్టు హృదయం నుంచి పై లోకాల్లోకి, పై ప్రజ్ఞలోకి తీసుకెళ్తుంది. ఉదాన వాయువు ఆధారంగానే... మనం దగ్గాలంటే శరీరంలో ఉదాన వాయువు బావుండాలి. తుమ్ము వచ్చిందంటే ఉదాన వాయువు వల్లే తుమ్ముతావు. అది ఉదాన వాయవు. **ఆ ఉదాన వాయువు, ఈ సమాన వాయువు దగ్గరకు చేరిన ప్రజ్ఞను ఊర్ధ్వముఖం పట్టిస్తుంది.**

పట్టిస్తే, అది ఎంతవరకూ తీసుకెళ్తుందంటే, నీలో ఉండే ఆకాశాన్ని దాటించి, ఆపైన ఉండే వెలుగులో నిన్ను స్థిరపరుస్తుంది. అంటే, పంచ భూతములతో చెయ్యబడిన ప్రపంచాన్ని దాటించి, అవతల ఉండే లోకంలోకి నిన్ను తీసుకెళ్తుంది. అక్కడ మనకి మొత్తం వ్యాప్తి చెందినటువంటి వాయువొకటి ఉన్నది. దాన్ని వ్యాన వాయువు అంటారు. వ్యానము అంటే పరిపూర్ణంగా వ్యాప్తి చెందినది అని అర్థం. మన శరీరంలో అణువణువులోనూ వ్యాప్తి చెంది ఉంటుంది, మన బయటంతా వ్యాప్తి చెంది ఉంటుంది. అందుచేత, ఆ ప్రాణంతో నీకు అనుబంధాన్ని కలిగిస్తుంది. ఇవన్నీ కర్కాటక రాశికి సంబంధించిన ప్రజ్ఞలు.

ప్రాణము కర్కాటక రాశి సంబంధం. అందుచేత, జీవుడు సంవత్సర పురుషుడు, కర్కాటక రాశి చేరేటప్పటికి ప్రాణం ఆధారంగా దేహ ప్రవేశం చేస్తాడు, గృహప్రవేశం చేసినట్టుగా. ఎప్పుడు జీవుడు దేహం తీసుకుంటున్నా, ఆ కార్యక్రమం అంతా కూడా కర్కాటక రాశి కార్యక్రమం. అందుచేత, వెలుగు స్వయం ప్రకాశకుడైన ఆత్మ, ప్రపంచంలో ఉండే ఈ ఐదు భూతములతో చెయ్యబడినది. అంటే, ఆకాశంలోకి దిగితే దాని కాంతి అంతకుముందు కాంతి కన్నా తగ్గుతుంది. వాయువులోకి, అగ్నిలోకి, జలంలోకి, పృథ్విలోకి, ఇలా దిగుతున్న కొద్దీ, ఒక్కొక్క పొరలోకి జీవాత్మ దిగివస్తుంటే, దాని కాంతి అంత అంతగా తగ్గిపోతూ ఉంటుంది. అంటే, ఇక్కడ మనకో bulb ఉందనుకోండి, దాని మీద ఒక ఉల్లిపొర వేసి, అలా ఐదు పొరలు వేసి, ఆరో పొరగా నీ మనసొకటి ఏర్పరిచి, ఇన్ని పొరలు వేసి దాన్ని కప్పేస్తే, అక్కడ అసలు ఉందని కూడా తెలియదు కదా! ఆ bulb వెలుగుతున్నా

తెలియదు. ఎందుకని? దాని చుట్టూ అన్ని పొరలు ఏర్పరిచాము. ఎలా ఉంటుందంటే పనస తొనల్లే ఉంటుంది. లోపల అది మృదువుగాను, కాంతివంతంగానూ ఉంటుంది. బయట చూడండి ఎలా ఉంటుంది పనసకాయ? ముట్టుకుంటే గుచ్చుకునేటట్టుగా ఉంటుంది.

అట్లా మనకి ఇన్ని పొరలు ఏర్పడిపోయిన తర్వాత, లోపల ఉండే జీవుని యొక్క ప్రకాశం తగ్గిపోతూ ఉంటుంది. అందుచేత, జీవుడు దేహాన్ని ధారణ చేసినప్పుడు అతనికేం జరుగుతుందంటే, ఈ పదార్థము ఆవరించడం చేత కొంత వెలుగు కోల్పోతూ ఉంటాడు. కాబట్టి ఏం చెప్పారంటే, నువ్వు ఈ పొరల్లోకి దిగి వచ్చినప్పుడు, ఈ పొరలే నేను అనిపిస్తూ ఉంటుంది. ఇప్పుడు పొద్దున్నే లేచి ప్రతి వాళ్ళం స్నానం చేసి అద్దం దగ్గర నిలబడి రకరకాలుగా మనను మనం అలంకారం చేసుకుంటూ ఉంటాం కదా! అప్పుడు ఈ శరీరమే నేను అనుకుంటాం కదా! మన శరీరమే ఒక వస్త్రం కదా! ఇంకా లోపలికెళ్తే, ఇంకా చాలా వస్త్రాలు ఉన్నాయి. భావాలు కూడా వస్త్రాలే. ఇన్ని వస్త్రాలు వెనకుండే జీవుడినెలా చూడగలుగుతావు నువ్వు? **అద్దంలో చూసుకున్నప్పుడు నీ కనులు నువ్వు చూసుకుంటే, ఆ కన్నుల్లో కాంతి నేను అని తెలుస్తుంది. కనులు చూసుకోవాలి ముందు.** కనులు చూసి నేను, అతడు నేను. ఏది నేను? కన్నులు కాదు. **కన్నుల్లోంచి ప్రసరిస్తున్నటువంటి కాంతి నేను. ఆ నేను చుట్టూ చాలా పొరలేర్పడ్డాయి.** అందుచేత, ఈ పొరలన్నీ, ఈ పంచ కోశాల్ని సవ్యంగా నిర్వర్తించడానికి పంచ ప్రాణాలేర్పరిచారు. ఈ పంచ ప్రాణాల కారణంగా పంచ ఇంద్రియాలు, పంచ

కోశములు, పంచ కర్మేంద్రియములు, పంచ భూతములు చక్కగా నిర్వర్తింపబడతాయి.

ఈ వ్యూహంలోకి జీవుడు దిగి వచ్చే సందర్భం కర్కాటక రాశి, ఆషాఢ మాసం. అందులోకి వస్తే మన స్వస్వరూపం మనం కోల్పోతాము. అంటే, మనని మర్చిపోతాము. మర్చిపోతామేమో అన్న భయంచేత ఏం చేశారంటే, సృష్టికర్త మర్చిపోకుండా ఉండడానికి అక్కడ ఒక ప్రక్రియ పెట్టాడు. ఏమిటంటే, హృదయంలోనేగా స్పందన? స్పందన, సో హం, సో హం, సో హం, సో హం అని వినిపిస్తూ ఉంటుంది. సోహం అంటే అర్థం "అతడే నేను" అని. అంటే, ఏ తత్త్వమయితే ప్రపంచం అంతా వ్యాప్తి చెంది ఉందో, అదే నేనుగా ఇందులో ఉన్నానని తెలిసి ఉండాలి. ఇది నే ననుకోకూడదు. **అలలో ప్రవేశించిన సముద్రం అలగా గోచరిస్తున్నప్పటికీ సముద్రమే కదా!** అలాగే, ఈ శరీరంలోకి ప్రవేశించిన మనం, మనం ఇది కాదు, మనం అదే. ఏదీ? అంతటా వ్యాపించిన విశ్వవ్యాప్తమైన ప్రజ్ఞ యొక్క అంశగా ఇందులోకి ప్రవేశించాము.

అలాగ, నీలో నేను అనేటువంటి ఆత్మగా ఉన్నదే, అది కేవలం నేను కాదు. అదే నేను. అదే ఇదిగా ఉంది. అది చెప్పడానికే "సోహం" అని ఇచ్చారు. అదే హృదయంలో అలా... సోహం అంటే అర్థం ఏంటి? సహ, అహం కదా! సహ అహం అంటే? 'సహ' అంటే అది, 'అహం' అంటే నేను. అదే నేను, అదే నేను, అదే నేను, అదే నేను, అదే నేను... అది ఎప్పుడూ అహర్నిశలూ చెప్తూనే ఉంటుందండి. అందుకని కర్కాటక రాశి చాలా గొప్పది. ఆ ప్రజ్ఞ,

"ఒరేయ్! నువ్వు వేరే ఉన్నావనుకోబోక, అదే నువ్వుగా ఉన్నావు. వేరుగా లేవు" అనే ఉపదేశం నీకు ఆషాఢ మాసం ఇస్తుంది. దాన్ని గుర్తు చెయ్యడానికే గురువు. ఈ బల్బులో వెలిగేదయినా, ఆ బల్బులో వెలిగేదయినా, అదేగా విద్యుత్తు! మీరు చూస్తున్నా, నేను చూస్తున్నా, చూచేవాడు ఒకడే ఇన్ని రూపాల్లోంచి చూస్తున్నాడు. ఇది మర్చిపోవడం అనేది సహజంగా జరుగుతుంది ఈ మాసంలో, అది దాని గొప్పదనం. **మరపు సహజం, గుర్తు చేసుకోవడం సాధన,** అంతే! మీలో అయినా, నాలో అయినా, పలికే పలుకు ఒకటే వాణి. అది వాడి వాణి. మీలో అయినా, నాలో అయినా ఉన్నది ఒకే వెలుగు. అది శబ్దరూపం దాలుస్తూ ఉంటుంది, వెలుగురూపం దాలుస్తూ ఉంటుంది, రకరకాల రూపాలు ఏర్పాటు చేస్తూ ఉంటుంది. ఇవన్నీ దాన్నుంచే తయారు అయినాయి. ఈ తయారయిన వాటిల్లో ఏకత్వం చూపించేవాడు గురువు.

అందుచేత, ఈ వేరుగా భావిస్తే ఒక భయం, ఒక అపాయం ఉన్నది ఆషాఢ మాసంలో. ఎందుచేత అంటే, జీవుడు కోశ ప్రవేశం చేస్తున్నాడు, లేక గృహ ప్రవేశం చేస్తున్నాడు. ఒక పొరలోకి దిగుతున్నాడు. అతడు అపరిమితుడు. ఒక పొరలోకి దిగితే పరిమితం అవుతుంది కదా! ఒక బూర తెచ్చి ఊదేం అనుకోండి, అంతకు ముందు బయట ఉండే గాలే కదా ఇప్పుడు బూరలోకి వచ్చింది! ముడివేశావు. లోపల గాలి, బయట గాలి అయ్యిందా? So, లోపలి గాలికి వేరే అస్తిత్వం ఉన్నట్టుగా కనిపిస్తుంది. లోపలి గాలి ఎట్లా ఉంటుంది బయట గాలి లేకుండా? దీనికి, దానికి ఉండేటటువంటి అనుసంధానం ఎక్కడుంది? ముడిలో ఉంది. ఆ ముడియే హృదయ గ్రంథి. **హృదయంలో వున్న ముడిని**

**విప్పటానికి మనస్సులోని ప్రజ్ఞ హృదయం చేరాలి. దానికి ''సోహం'' అనే మంత్రాన్ని సంధించాలి. హృదయంలో ఉంది రహస్యమంతా!** పీల్చేగాలితో 'సో' శబ్దాన్ని, వదిలే గాలితో 'హం' శబ్దాన్ని సంధించి వినాలి. అది జరుగుతున్న శబ్దం. నీవేమీ చేయనక్కరలేదు. దానిని గమనిస్తూ ప్రజ్ఞ అనుసంధానం చెందాలి. అటుపైన క్రమంగా మనలోని ప్రజ్ఞ శ్వాస కాధరమైన స్పందనను దర్శిస్తుంది. అంటే గమనిస్తుంది. అపుడు ప్రజ్ఞ స్పందనతో ముడిపడి హృదయ ద్వారం దగ్గర స్థిరపడుతుంది. స్పందనం విచ్చుకోలు ముడుచుకోలుగా, నిరంతరం సాగుతూ వుండగా, ప్రజ్ఞ కుతూహలంగా గమనిస్తూ, స్పందనలు నిర్వహిస్తున్న తెలివిని గమనించే ప్రయత్నంలో, ఒక శుభ సమయంలో, స్పందన విచ్చుకోలు నుండి మరింత లోపలికి ప్రవేశిస్తుంది. అపుడు ముడి విడి హృదయంలోపలి సూక్ష్మస్పందనంతో సమాగమ మౌతుంది. నీ హృదయంలో ఉన్నటువంటి ఆ అనుసంధానం నీకు గుర్తు చెయ్యడమే గురుపూర్ణిమ. అదే గురుపూజ. గురువుగారు చేయవలసిన పని అది. నన్ను చూడు, నా అందం చూడు అని ఊరికే హడావిడి చేసేవాడు గురువు కాదు. ప్రతివాడికి వాడిలో మూల స్థానం వాడికి గుర్తుచేసి, అక్కడ పడి కాపలా కాయి అని చెప్తారు. అక్కడ ఉండి నువ్వు సమస్తాన్ని దర్శించడానికి ప్రయత్నం చెయ్యమని చెప్తాడు సద్గురువు. అలా దర్శనం చేస్తున్నావనుకో అప్పుడు నువ్వు క్రమంగా 'అశ్వపతి' అవుతావు.

కథ చదువుకుంటే మనకేముంది మూడు ముక్కల్లో అయిపోతుంది. అశ్వపతి అంటే సామాన్యమైన విషయం కాదు. అశ్వపతి అవ్వాలి. ఆ తర్వాత జీవన ప్రయోజనం. నేనెవరో

తెలుసుకోవడం ఒకటి, నేనేం చెయ్యాలో తెలుసుకోవడం మరొకటి. Who am I? Where am I? What am I to do? నేనెవరిని? అతడే నేనుగా వచ్చాను. సరే ఎందుకొచ్చావు? తెలియాలా? ఏవో కొన్ని అనుభవాలు అయినాయి, ఇంకా కొన్ని అనుభవాలు కావాలి. కొన్ని తెలుసుకున్నావు, కొన్ని ఇంకా తెలుసుకోలేదు. ఎవడెప్పుడు ఏం ప్రయత్నం చేస్తున్నా, ఇంకా పొందవలసిన అనుభవం పొందడం కోసమే ఆ పనులు చేస్తుంటారు. ఆ అనుభవం తీరిన తర్వాత ఆ పని చెయ్యమంటే చెయ్యడు వాడింక. ఆ అనుభవం కలిగేవరకే ఆ పని. జీవుడికి రకరకాల అనుభవములు సృష్టిలో కలుగచెయ్యడానికే ఈ సృష్టి అంతా. అతడిని పరిపూర్ణుడిని చేసి, అటుపైన అతడి యొక్క అపరిమితత్వం అతనికి తెలియచేసి, ఆనంద స్వరూపుడుగా అతడు ఎప్పుడూ శాశ్వతుడై ఉండేంతవరకూ కూడా సాధన జరుగుతూనే ఉంటుంది. అందులో భాగంగా మనం అతడే నేనుగా దిగి వచ్చాము.

ప్రతి ఒక్కళ్ళం కూడా. అక్కడనుంచే దిగి వస్తాం. నిద్రలోంచి వచ్చేటప్పుడు కూడా అక్కడనుంచే వస్తాం. దిగి వచ్చిన వాళ్ళం మర్చిపోకూడదు, అదే నేను అని. అందుకనే, మనకి చూడండి పాట ఉంది "అదే నేను, అదే నువ్వు" అని కదా! అంటే, నేనొక్కడినే అది అంటే కాదు కదా, మీరందరూ కూడా అదే. తెలిసినవాడు, నేనే దైవాంశ సంభూతుడిని అనుకోడు, అందరూ దైవాంశ సంభూతులే. అందరూ అదే వెలుగు యొక్క రూపములే. ఆ రూపములు ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకంగా దాన్ని pack చేసుకుంటారు. By package we are different,

by content we are essentially one. ఈ package differences లో రకరకాల package లు. అందుకనే దిగి వచ్చినప్పుడు, ఇంత తెలిసినవాడికి కూడా "నేను" అనిపిస్తుంది. నా భావములు, నా సిద్ధాంతములు, నా అభిప్రాయములు, ఇలా నా, నా, నా, నా... నా నా లాగా వచ్చేస్తుంది. నానావిధమైనటువంటి భావములలో చిక్కుకుపోతారు. ఎందుచేత చిక్కుకుపోతారు? అందరం ఒకే చోట నుంచి వచ్చాము అని తెలియక. అందరం ఒకే చోట నుంచి వచ్చాము. ఎవరెవరి అనుభూతి వారు పొందడానికి వచ్చారు. అందరూ వారి వారి వైవిధ్యమైనటువంటి అనుభూతుల కోసం ప్రయత్నం చేస్తూ ఉంటారు. నీ ప్రయత్నం నువ్వు చేస్తున్నావు, వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేస్తున్నారు. అందరూ అదే ప్రయత్నం చేస్తున్నారు తెలుసా?

అది కృష్ణుడు ఒక్కడే చెప్పాడండి. ధనం వెంటపడ్డవాళ్ళు, పదవుల వెంటపడ్డవాళ్ళు, స్త్రీల వెంటపడ్డవాళ్ళు నా గురించే వెతుక్కుంటున్నారు. ఎవడు, ఎక్కడ, ఏ జీవుడు దేని గురించి వెతుక్కుంటున్నా, అన్నం గురించి వెతుక్కుంటున్నా... రకరకాలుగా జీవుడు ఆనందం కోసం అన్వేషణ చేస్తున్నాడు కదా! ఈ ఆనందం నువ్వు పొందుతూ ఉంటే, క్రమక్రమంగా పరిణతి చెందుతూ, చిట్టచివరికి వీటన్నిటికీ మూలమైన నన్ను కోరుకుంటాడు. అంతవరకూ జరుగుతున్నది నాదే కార్యక్రమం అంటాడు ఆయన. కృష్ణుడొక్కడే ఆ మాట చెప్తాడు. ఎంత గొప్ప గురువండి? జగద్గురువు అతడే!

''మీరు అలా డబ్బు సంపాదించుకుంటూ అందులో

మునిగిపోయారు, హిహిహి'' అనకూడదు. ఎందుకంటే, వాడికదది అవసరం. ''ఎందుకయ్యా ఇలా పదవులు పట్టుకుని వేలాడుతూ ఉంటావు'' అని మనం అంటే కుదరదు. వాడికందులో మోజు ఉండటం వల్ల దాని ద్వారా పనులు జరుగుతూ ఉంటాయి. అట్లా ఒక్కొక్కరికి ఏదో ఒక్కొక్క మోజు ఉంటుంది. మోజు ఎందువల్ల ఏర్పడింది? అది తీరక. తీరితే అది ఇంక ఉండదు. ఇప్పుడు ధనం మీద వ్యామోహం పోయినవాడికి నువ్వు ఎంత ఆశ చూపించినా వద్దమ్మా అంటాడు. అలాగే పదవుల మీద ఆశ చూపిస్తే, వద్దమ్మా అంటాడు. అంటే, వద్దమ్మా రెండు రకాలుగా ఉంటుంది. అందకపోవడం వల్ల వద్దనడం ఒకటి. అందని ద్రాక్ష పళ్ళు పులుపని అన్నారు కదా! ధనం అందకపోవడం వల్ల, ధనం మీద అదో రకమైన వైరాగ్యం మొహం పెట్టుకోవడం వల్ల వీడది దాటినట్టు కాదు. దొరికితే మళ్ళీ పడిపోతాడు కదా! అందుచేత, అందుబాటులో ఉన్నా, వాటియందు నీకు సహజంగా ఆకర్షణ లేక. వీటన్నిటికి మూలమైన వాటి మీద ఆకర్షణ ఉండే వాళ్ళు కొంత మంది ఉంటారు సృష్టిలో. వాళ్ళు examples. అంటే ఏమిటి examples? ఏదో ఒక రోజు వాడిలా అవుతావు నువ్వు అని అంతే. ఎందుకంటే, నీకు ఈ మోజులు తీరిపోతాయి. పెళ్లి వరకూ తహతహ అండి, పెళ్ళయిన తర్వాత ఇంకేం ఉంది? ఎన్నాళ్ళుంటుంది? పెళ్ళికాక ముందు, ఎప్పుడు పెళ్లవుతుందా అని చూస్తూ ఉంటారు స్త్రీలు, పురుషులు. పెళ్ళయిన తర్వాత ఏముంది? అంతేగా! (నవ్వులు)

ఎక్కడికక్కడ నీకు దేనియందు ఇంకా పూర్ణభావం రాలేదో దాన్ని గురించినటువంటి ప్రయత్నం జరుగుతూ ఉంటుంది.

అందుకని, ఎన్నెన్ని రకాలుగా ఎంతమంది జీవులు ప్రయత్నం చేస్తున్నా, జంతువుల దగ్గరనుంచి, అందరూ నన్నే, నా గురించే, నా కోసమే ప్రయత్నం చేస్తున్నారు. వాటన్నిటి రూపాల్లో చిట్టచివరకు నన్నే చేరుతారు అని చెప్తాడండి శ్రీకృష్ణుడు. మరి త్రైలోక్య గురువంటే ఆయనే. ఎవడిని నిందించడు. వాడికది అవసరం, వాడది చేస్తున్నాడు. వీడికిది అవసరం, వీడిది చేస్తున్నాడు. ఎవడు చేస్తున్నది వాడికి చాలా highest గా అనిపిస్తూ ఉంటుంది కదా! ఇట్లా ప్రవచనాలు చెప్పుకుంటూ తిరుగుతూ ఉంటే, అదే best అనుకోవచ్చుగా? ఏది, ప్రతీదీ అలవాటే కదా! అలా నేర్చుకుంటూ వస్తాడు. కాకపోతే ఈ ఆషాఢ మాసం వచ్చిన తర్వాత, "ఒరేయ్! గుర్తు పెట్టుకో, అదే నువ్వు, ఊరికే మునిగిపోకు ఇందులో" అని, "దేనికోసం వచ్చావో అది నిర్వర్తించుకో."

అశ్వపతి ప్రాణములయందు స్వామిత్వం సంపాదించిన వాడు, ఆనందంగా ఉంటున్నాడండి. ఇంక అంతకన్నా ఏం కావాలండి, మామూలుగా? అలా కాదే! వచ్చిన పనొకటి ఉంటుంది. వచ్చిన పనేంటి? తాను రాజు, రాజ్యానికి ఉత్తరాధికారి కావాలి కదా! అందుచేత, ప్రతి దానికి... నీ కుటుంబంలో నీ తర్వాత ఎవడు? ఒకడు ఉండాలి ఆ సంస్కారాలు అందించడానికి. దేనికైనా నీ తర్వాత ఇంకొకడు అనేది ఒకటి ఉంటుంది. అది వ్యవస్థ. అట్లా అనుస్యూతంగా సృష్టి నడవాలంటే, నీ తర్వాత ఒకడు తయారవ్వాలి.

అందుచేత, అశ్వపతికి అదొకటి లోటు ఉండటం చేత, ఆయన అద్భుతంగా గాయత్రి ఆరాధన చేశాడు. మనం కూడా

బాగా చెయ్యాలండి గాయత్రి ఆరాధన. ఎందుచేత అంటే, ఆ ఆరాధనలో నీకు పైన ఉన్నటువంటి మూడు లోకముల నుండి, అంటే *“ఆదిత్యః సవితః సూర్యః”* అని చెప్పాను కదా. ఈ మూడు లోకాల నుండి వచ్చే కాంతి నీ హృదయం నిండా నింపుకోవాలి. అందుకని గాయత్రి మంత్రం బాగా గానం చేస్తుంటే, ఈ వెలుగుల కన్నిటికీ మూలమైనటువంటి దేవుడు, ఆయనికి పేరు లేదు. ఆయన నుంచి సవితృమూర్తి ద్వారా వెలుగు నన్ను బాగా ఆవరించి, నా బుద్ధిని ప్రచోదనం చెయ్యాలి అని దాని అవగాహన. అందుకని, నీ హృదయం చేరి, అక్కడ కూర్చుని, అలాగ అపరిమితమైనటువంటి వెలుగు నీలో అట్లా సహస్రారం నుంచి ప్రవేశిస్తున్నట్టు, shower bath with light, అది సూర్యకాంతి. అది ఇక్కడ ముందు క్రమంగా బంగారు కాంతిగా వస్తూ, ఆ పైన తెల్లటి కాంతిగా దిగి వస్తున్నట్టుగా, నీ హృదయంలో అంతా నిండిపోయి, ఇంకా అది పొంగి, పొరలి అన్ని అంగాల్లోకి పూర్తిగా ప్రవేశించినట్టుగాను, అంతా నిండిపోతున్నట్టుగా, చుట్టు పక్కల పారుతున్నట్లుగా... అట్లా చెయ్యాలి. ఇలా రోజూ చెయ్యండి. స్నానం చేస్తే అంతకుముందు కన్నా కొంచెం ఎట్లా better గా ఉంటామో, ఇలా గానం చేస్తే గాయత్రి వెలుగు బాగా దిగుతుంది. ఎంత వెలుగు దిగితే అంత మాలిన్యం పోతుంది కదా! అంత చీకటి పోతుంది.

అందుచేత, గాయత్రిని ఈయన ఎంత చేశాడు? రోజుకి పది వేల సార్లుటండీ! తపస్సుగా చేస్తే లోపల అంత సేపు పట్టదు పది వేల సార్లు చెయ్యడానికి. మేము హనుమాన్ చాలీసా చదువుతూ ఉంటాము వారానికి ఒకసారి. గంటాముప్పావు పడుతుంది బయటకి చదివితే. లోపల చదివితే ఇరవై నిముషాల్లో అయిపోతుంది

పదకొండు సార్లు. లోపల ఈ నాలుకలు తిప్పడాలు ఉండవు కదా! నాలుక కన్నా మనసుకి వేగం ఎక్కువ. అందుకని, అక్షరాలు చాలా త్వరితగతిన పఠనం చేసేస్తుంది మనసు. అందుచేత, మనో వేగం చాలా ఎక్కువ కదా! దేహం కన్నా ఇంద్రియాల వేగం వంద రెట్లు ఎక్కువట. ఇంద్రియాల కన్నా మనసుకు వంద రెట్లు ఎక్కువ. కాబట్టి వెయ్యి రెట్లు ఎక్కువ. అందుచేత, ఆయన రోజుకి పది వేల సార్లు చేశాట్టండి.

ఒకాయన ఆదోనిలో ఇరవై సంవత్సరాల క్రితం ఇలాగే సహస్ర గాయత్రి చేస్తూ, ముప్పైయేళ్ల పాటు జీవిస్తూ ఉంటే, వారికి గాయత్రి ధ్యానంలో CVVగారు కనిపించారట. ఆయన కిదొకటి... ఎవరు బాగా గాయత్రి చేస్తుంటే, వెళ్లి వాళ్ళ దగ్గర పని పెడతారు ఆయన! మాస్టరుగారు కూడా గాయత్రి గానము, ధ్యానము, జపము, వీటిల్లో తన్మయత్వం చెందుతూ ఉంటే కదా Master CVVగారు కనిపించారు. అంటే, ఉత్తమోత్తమమైన చైతన్యం నీయందు అవతరిస్తున్న సందర్భంలో దర్శనం ఇచ్చే ఒక మహత్తరమైన గురువుగా భావన చేసుకోవాలి Master CVVగారిని. CVVగారి గురించి చెప్తూ మాస్టర్ EKగారిలా అన్నారు, "అది ఎంత తేజస్సంటే నేను చెప్పలేనోయ్!" అన్నారు. "ఇంత అంత అని నేను చెప్పలేను ఆ తేజస్సు, ఆయన కాలి బొటనవేలి గోరు వెలుగు చాలు మన భూమికి!" అన్నారాయన. అంటే, అతిశయోక్తేమో అనుకున్నాను నేను. "అట్లా అనుకోబోక, కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకో!" అని చెప్పరాయన. అంతటి వెలుగు. ఎందుకంటే, మాస్టరుగారు మిగతా గురువుల గురించి, దేవుళ్ళ గురించి చాలా అద్భుతంగా విన్యాసాలు చేస్తూ

ఉపన్యాసాలు ఇచ్చేవారేమో గాని, Master CVVగారి గురించి చెప్పాలంటే చాలా బుద్ధిమంతులు అయిపోయే వారాయన. చాలా అప్రమత్తతతో, జాగరూకత వహించి, హెచ్చరికగా చెప్పేవారు. ఏమిటిలా అయిపోయేవారని అనిపించేది. "మరి విషయం పెద్దది కదోయ్!" అనేవారు.

అందుచేత, మనం... గాయత్రి మనకు మాస్టరుగారు ఇచ్చారు కదా! ఎన్నో మంత్రాలు ఉన్నాయి, కాని గాయత్రి మంత్రం అద్భుతం. దాన్ని ఆరాధన చేస్తూ ఒక్కటే పెట్టుకోండి – శిరస్సు నుండి హృదయం వరకూ అలా జలపాతం, వెలుగు జలపాతం, అలా దిగుతున్నట్టు, హృదయంలో పడ్డ తర్వాత అది నిండి, పొంగి, ఇంక శరీరం అంతా వ్యాప్తి చెందుతున్నట్టు. మనం ఎంత చేస్తున్నాం? సరిగ్గా పదిసార్లు కూడా గాయత్రి చెయ్యం. మనకి ఇచ్చినవన్నీ కూడా అత్యంత విలువైన విషయాలిచ్చారు. అవి అత్యంత విలువైనవని తెలియక, వాటినేవో ఆషామాషీగా వాడేసుకుంటాము.

శుచి అయిన మనసుతో గాయత్రి గానం చేస్తుంటే అద్భుతమైన ఆనందం లభిస్తుంది. అలా చేశాడాయన. పద్ధెనిమిది సంవత్సరాల పాటు చేస్తే, ఆయనకి మొత్తం కాంతిరూపం వచ్చేస్తుంది. అలాంటి కాంతిరూపం తనకేర్పడిపోయింది. తన కాంతిరూపం పూర్తిగా ఆ సవితృ కాంతి, అంటే తెల్లటి వెలుగన్నమాట. అది ఏర్పడితే, మొత్తం సృష్టిలో ఏ వెలుగయితే ఇదంతా నిర్వర్తిస్తోందో, అదే స్త్రీమూర్తిగా కనబడ్డది. అదే పురుషమూర్తిగా కూడా కనబడవచ్చు. అందుకనే, మనకి గాయత్రి మంత్రానికి ముందు రెండు శ్లోకాలు ఇచ్చారు మాస్టరుగారు. ఒకటి

*"ముక్తావిద్రుమ హేమ నీల ధవళచ్ఛాయైర్ముఖై స్త్రీ క్షణై,*
*ర్యుక్తా మిందునిబద్ధ రత్నమకుటాం తత్త్వార్థ వర్ణాత్మికాం,*
*గాయత్రీం వరదాభయాంకుశకశా శ్శుభ్రం కపాలం గదాం,*
*శంఖం చక్ర మథారవిందయుగళాం హస్తైర్వహంతీం భజే."*

అని. అది అమ్మవారి రూపంతో చాలా చక్కగా వివరంతో వర్ణింపబడి ఉన్నది. అలాగే, ఇంకోటి ఇచ్చారు. అంటే, స్త్రీ రూపమా, పురుష రూపమా? మనకదో బాధ ఉంది. అది రెండూనూ. వెలుగు, స్త్రీ అంటారా, పురుషుడంటారా? రూపానికి అతీతమైన తత్త్వం రూపంలోకి దిగివచ్చినప్పుడు నీకు ఏరూపం ఇష్టం అయితే ఆ రూపంలో ధ్యానం చేసుకోవచ్చు. కానీ, అది తత్త్వం అని గుర్తు ఉండాలి. అందుకనే, దాని తరువాత ఇంకోటి ఇచ్చేశారు.

*"ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ*
*నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః,*
*కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ*
*హారీ హిరణ్మయ వపుర్ధృత శంఖ చక్రః".*

రెండూ రెండే! నీకెలా కావాలంటే అలా చేసుకో. కానీ, నువ్వు గుర్తుపెట్టుకో వలసినది ఒక్కటే, రెండిటిలోనూ వెలుగు వర్ణనే ఉంటుంది.

అందుచేత, దేన్ని ఆరాధన చేస్తున్నావు? వెలుగుని ఆరాధన చేస్తున్నావు. అలా వెలుగుని బాగా ఆరాధన చేస్తుంటే, ఎంత నువ్వు సత్తుబొచ్చు అయినా దానికి కూడా వెలుగు వచ్చేస్తుంది. ఎంత వెలుగు ఆస్వాదింపబడితే, పాత్ర అంత కాంతివంతమైపోతూ

ఉంటుంది. ఆ విధంగా అశ్వపతి యొక్క దేహం నుంచి కాంతి శరీరం తయారవుతూ వచ్చేసిందండి, బంగారు కాంతి శరీరం వచ్చేసింది, వజ్ర కాంతి శరీరం వచ్చేసింది. ఎంతగా ఆ దేహముల యొక్క కాంతి ఏర్పడిందంటే, ఆ వెలుగుకే ముచ్చట వేసి అమ్మవారి రూపంలో వచ్చేసింది. ఎందుకని? ఈయన చేసిన ఆరాధన సావిత్రిదేవి ఆరాధన. అంటే, స్త్రీమూర్తిగా పరతత్వాన్ని ఆరాధన చేస్తే అలాగే వస్తుంది. స్త్రీమూర్తి గానే కనిపిస్తుంది. ధ్రువుడు పురుషమూర్తిగా ఆరాధన చేస్తే విష్ణురూపంగా కనిపించాడు. అదే తత్త్వం! నువ్వు చేసే ఆరాధన బట్టి ఆ రూపంలో దర్శనం ఇస్తాడు. పోతనామాత్యుడు శివారాధాన చేస్తే రాముడు రూపంలో దర్శనం ఇచ్చాడు. అందుచేత, రూపం ఏదయినా, అది it is a messenger of light. అది గుర్తు పెట్టుకోవాలి కదా! వచ్చింది వెలుగు. అది ఏ రూపంలో అయినా రావొచ్చు. వస్తే, "తల్లీ! ఉత్తరాధికారి మరి ఒకడు ఉండాలి కదా, అందుకని నాకొక తనయుడిని ప్రసాదించు" అంటాడు. అంటే, ఆమె చెప్పింది, "తనయుడు కాదు, తనూజ" అంది అని చెప్పి ఒక మాట వేశారు. అంటే, "తనూజ" అన్నారు. తనూజ అంటే తనువు నుంచి పుట్టింది అని, శరీరం నుంచి పుట్టిందని. **ఆ అశ్వపతి అనే మహారాజు యొక్క కాంతి శరీరం నుంచి అదే కాంతితో ఆ సావిత్రిదేవే ఈయనకి కుమార్తెగా పుట్టుకొచ్చింది. అంటే, ఆమెయందు సహజంగానే వెలుగు శరీరం ఉంది. ఇదీ రహస్యం. కాంతి శరీరంతో కూడ పుట్టింది కాబట్టే యముని చూడగలిగింది. యమునితో భాషించ గలిగింది. యముని అనుసరించ గలిగింది.** యముని మెప్పించి పుట్టినింటిని, మెట్టినింటిని ఉద్ధరించింది.

పుట్టీ పుట్టంగానే మనకి మామూలుగా రక్తమాంసాదులతో కూడిన శరీరంతో పుడతాం. రక్తమాంసాదులతో పుట్టిన ఈ శరీరం నుంచి క్రమంగా ఆ శరీరాలు తయారు చేసుకోవాలి. అందుకూ మానవ శరీరం. మాటిమాటికి తెచ్చుకుంటూ ఉంటాం, మానవ శరీరం దుర్లభం అని. మాటిమాటికి అనుకుంటే ఏం లాభం? దుర్లభమే. అంటే, అంత సులభంగా దొరకదు. కానీ, **మానవ శరీరం దొరికితేనే నువ్వు ఈ వెలుగు శరీరాలు నిర్మాణం చేసుకోగలవు. మిగతా శరీరాల్లో ఆ నిర్మాణం జరగదు.** అందుకని, ఎంతటి వాళ్ళయినా మానవులుగా పుట్టాలి. పుట్టి, ఆ వెలుగు శరీరాలు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే, ఆ జీవికి సార్ధకత. అంతవరకూ పుడుతూ, చస్తూ, పుడుతూ, చస్తూ ఉంటావు. ఏ రోజయితే ఈ విద్యలో చేరి, ఏదీ ఈ విద్యంటే యోగవిద్య. ఈ జ్ఞానం కలిగి, దీనికోసం అనే ప్రయత్నం మొదలు పెడతావో, అప్పుడు క్రమంగా నువ్వు, అందులో ఏదో ఒక జన్మలో ఉత్తీర్ణుడవుతావు. అలాంటి శరీరం కలిగిన తండ్రి నుండి పుట్టుకొచ్చినది సావిత్రి. **ఆమె సహజంగా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు కలిగి ఉన్నటువంటి జీవి.**

ఈ మధ్య కాలంలో మనం చూసుకుంటే, Madam Blavatsky ఆ విధంగానే పుట్టుకతోనే వెలుగు శరీరంతో పుట్టిన మనిషి ఆవిడ. చిన్నతనంలోనే సూక్ష్మమైన శరీరాలతో, గుంపులు గుంపులుగా అలా తేలి వెళ్తున్న మనుషులు కనిపిస్తూ ఉండేవారు, అలా దేవతలు కనిపిస్తూ ఉండేవారు ఆవిడకి. ఆవిడకి కూడా మాటిమాటికి గాలిలో తేలిపోతున్న అనుభవం ఉంటూ ఉండేది. ఓ చిత్రపటాన్ని గోడకి కొట్టాలని నిచ్చెన లాంటిది వేసుకుని మేకు ఏర్పాటు చేస్తుంటే, కింద నున్న నిచ్చెన పడిపోతే, ఆవిడ అలా

గాలిలో తేలుతూ మేకు కొడుతుంది. అది ఎలా సాధ్యం అంటే, పుట్టుకతో సిద్ధురాలు ఆవిడ. అలా ఈ సావిత్రిదేవి పుట్టుకతో సిద్ధురాలు. ఎందుకని? అంత తపస్సు చేసిన తండ్రి నుంచి దిగి వచ్చింది. అందుకనే, "నీకు తనూజను ప్రసాదిస్తున్నాను". మనకుండే లక్షణాలే మన పిల్లలకి కూడా వస్తాయి దాదాపు. వాళ్ళ కర్మ వాళ్ళు తెచ్చుకోగా, మనవి కూడా వాళ్ళకి అంటుతాయి.

ఈ అశ్వపతికి అలాంటి కన్య పుట్టింది. అలా సహజంగానే పుట్టుకతోనే ఈ సిద్ధి కలిగింది కాబట్టే ఉత్తరోత్తరా ఆమెకు యమ దర్శనం సాధ్యం అయ్యింది. అందరికీ యమ దర్శనం సాధ్యం కాదు. అలాంటిది ఆమె పెరిగి పెద్దదయింది. అసలే పుట్టుకతోనే అంత సిద్ధి ఉన్న జీవి పుట్టుకు వచ్చినప్పుడు అన్ని విద్యలూ అద్భుతంగా అబ్బుతాయి. వచ్చి చేరతాయి విద్యలన్నీ. నీలో ఉండే సద్గుణాలను బట్టి విద్యలొచ్చి చేరతాయండి. మన **గుణములయందు కొంత నాణ్యత తగ్గితే విద్యలు వెళ్లిపోతాయి. గుణములు పెంచుకుంటే విద్యలొస్తాయండి**. సద్గుణములు ఎన్ని చేరుతుంటే, అన్ని మంచి విద్యలు వచ్చేస్తాయి. సద్గుణములు పోగొట్టుకుంటున్నా మనుకోండి, ఈ విద్యలన్నీ మనకి చెప్పకుండా వెళ్ళిపోతాయి. దివ్యమైనటువంటి కార్యాలకి ఎన్నో దివ్యాస్త్రాలు చేరి, కార్యం అయిన తర్వాత దివ్యాస్త్రాలన్నీ కూడా మాయమై పోయాయి కదా అర్జునుడికి. ఎందుచేత చేరినాయి? దివ్యమైన గుణాలు ఉండడం చేత. ఎందుకు వెళ్ళిపోయాయి? యుద్ధం మనమే గెలిచాము అనుకోవడం చేత. తర్వాత పనికి రాలేదు.

దివ్యాస్త్రాలన్నీ చేరినాయి రాముడి దగ్గర, విశ్వామిత్రుడు

ఇట్లా చెప్పగానే మంత్రాలు, యాభై అస్త్రాలకి సంబంధించినవి. అవన్నీ బాగా ధ్యానం చేసి, తపస్సు చేసి, ఆ మంత్ర దేవతలన్నిటిని మామూలుగా మనం సిద్ధి కలిగించుకోవాలి. అలాంటిది, రాముడి దగ్గరుండే కళ్యాణ గుణాలకి అస్త్రాలన్నీ లోబడి పోయాయండి. లోబడి పోతే, ఆయన అన్నాడు, నాకెందుకు లోబడి మీరుంటారు, హాయిగా స్వతంత్రంగా జీవించండి, నాకెప్పుడయినా అవసరం వచ్చినప్పుడు మీరే మీ అంతటగా రండి అని చెప్పాడు. ఎంత స్వేచ్ఛ ఇచ్చాడు! అంటే, గుణవంతుడంటే రాముడే! ఇంక అంతకంటే ఎవరుంటారు? మానవుల్లో గుణవంతుడంటే రాముడే! తాను స్వేచ్ఛగా ఉన్నాడు రాముడు, వాటికీ స్వేచ్ఛ ఇచ్చాడు. మనం స్వేచ్ఛగా ఉందాం అనుకున్న వాళ్ళు, ఇతరులకు ఆ స్వేచ్ఛ కావలసి ఉంటుందన్నది గుర్తు ఉండొద్దా? నాకేనా స్వేచ్ఛ? నేను స్వేచ్ఛగా ఉంటాను, మా అమ్మాయికి స్వేచ్ఛ ఇవ్వకూడదంటే ఎట్లా? మా అబ్బాయికి స్వేచ్ఛ ఇవ్వను! అదేంటంటే, వాళ్లకి తెలియదు అంటారు. నీకు తెలుసా? నీకూ తెలియదు. అందరం తెలియని వాళ్ళమే. మనం చెయ్యవలసినవి మనం చేస్తే, వాళ్ళు చెయ్యాల్సినవి వాళ్ళు చేస్తూ ఉంటారు కదా! సలహా వరకూ ఇస్తూ ఉండొచ్చు ఎవరికయినా, భార్యకయినా, పుత్రులకి అయినా. ఎవరయినా, ప్రతీవాడు బుడుగు చెప్పినట్టు, "నా అంతటి వాడిని నేను" అన్నట్టుగా ఉంటాడు ఈ రోజుల్లో. కాబట్టి, అడిగితే మంచి మాట చెప్పడమే. అడగకపోతే, అది కూడా వద్దు. ఎవరయినా అంతే.

అందుచేత, ఇన్ని గుణాలతో ఆమె చాలా అద్భుతంగా తయారయ్యి... ఆమెకు సాటి అయిన రాకుమారి మొత్తం ఏ

లోకంలోనూ లేదండి. భూలోకమే కాదు, యక్షలోకంలో లేదు, కిన్నెరలోకంలో లేదు, దేవలోకంలో లేదు, ఎక్కడా లేదు. ఇలా లేకపోతే, తండ్రికి భయం వేసింది, ఈమెకి భర్తని ఎలా తెస్తాం అని. ఇన్ని గుణములు ఉన్నటువంటి కన్యను, సరిసమానమైన గుణములు ఉన్నవాడికి ఇవ్వాలి కదా! అంటే, గుణమే ప్రధానం వివాహానికి. మిగతావి కాదు. ఆ గుణ పొంతన లేకపోతే విడిపోతారు, లేకపోతే ఏదో ఏడుస్తూ బ్రతుకుతుంటారు. వివాహం సంబంధం అవ్వాలి తప్ప, బంధం కాకూడదు! అందుచేత, వివాహం చేసుకున్నప్పుడే ఆ తెలివి ఉండాలి. తర్వాతొస్తే ఆ తెలివి కష్టం కదా!

అందుచేత, ఈయన భయపడిపోయాడు తండ్రిగా, ఎవరా, ఎవరా అని. ఈ కథే ఇవ్వాళ ప్రజ్ఞా పరంగా ప్రాణముల గురించి చెప్పడానికి చెప్పాను మళ్ళీ.

# 7. సత్యవంతుడే నా భర్త

అశ్వపతి సామాన్యుడు కాదు. అతడు చేసిన తపస్సు సామాన్యమైనది కాదు. అలాంటి తపస్సు అతను చేసినటువంటి సందర్భంలో... ఈ పెళ్లి కొడుకుల కోసం తల్లిదండ్రులు ప్రయత్నం చేస్తుంటే, చెప్పదు కానీ, ఇంట్లో ఉండే ఆడపిల్ల అన్నీ వింటూ ఉంటుంది. గుర్తు పెట్టుకోండి. మగ పిల్లవాడికి, ఆడపిల్లకి ఒక తేడా ఉంది. మగపిల్లవాడు చాలా vocal గా ఉంటాడు. ఆడపిల్ల అంత vocal గా ఉండదు. అన్నీ వింటూ ఉంటుంది, అన్నీ గమనిస్తూ ఉంటుంది. మగపిల్లవాడి కన్నా లోతుగా ఆలోచిస్తుంది ఆడపిల్ల. తనకు అన్నీ నచ్చితే ఏదయినా సంబంధం చెప్పినప్పుడు... అన్నీ వింటూ ఉంటుంది, అమ్మా నాన్నా మాట్లాడుకోవడం. అన్నీ నచ్చితే, ఏం చెప్తుందో తెలుసా? "మీ ఇష్టం నాన్నా!" అంటుంది, ఏదో చాలా బుద్ధిమంతురాలిలాగా! అంతే. వీడు బుర్ర ఉంటే అర్థం చేసుకోవాలి. లేకపోతే ఏమంటుందో తెలుసా? "నాకు ఇప్పుడు పెళ్లి ఎందుకు నాన్నా?" అంటుంది. అంటే ఏమిటి? ఈ సంబంధం ఇష్టం లేదని! మాటల్లో చాలా సంస్కారంగా మాట్లాడుతూ ఉంటారు తెలిసినవాళ్లు. ఇప్పుడే పెళ్ళేంటి అంటే, వాడికి గుండె పగిలిపోతూ ఉంటుంది!

ఒకాయనకి... ముగ్గురు ఆడపిల్లలు. పాపం ఆయనకి భయం, వాళ్ళ పెళ్ళిళ్ళు ఎట్లా అవుతాయా అని. సరే మొదటి పిల్లకి సంబంధం వెతుకుతూ, ఏదో మంచి సంబంధం వస్తే,

"ఏమే పిల్లవాడు ఇలా చదువుకున్నాడు", ఆ అమ్మాయి డాక్టరు, "ఏం చెయ్యమంటావు?" అంటే, చెల్లిలికి చూడండి సంబంధాలు అని చెప్పింది. ఈయనా డాక్టరే. అదేంటి? పెద్ద పిల్లకి సంబంధం చూస్తుంటే, చెల్లిలికి పెళ్లి సంబంధం చూడండి నాన్నా అంటే, ఆయన ఆలోచించాడు, ఏమిటి ఇట్లా చెప్పింది అని. మనలో మన మాట ఉన్నదున్నట్టు చెప్పు, నువ్వు ఎవరినయినా ప్రేమించావా అని అడిగేశాడాయన. లేకపోతే చెల్లిలికి చూడమనడం ఏమిటి? అంటే, అవునని చెప్పింది. చూడండి ఎలా ఉందో? మరెందుకు, కానిచ్చేశాడు ఆయన! ధీరుడు. పిల్లకి నచ్చిన పిల్లవాడు. ఇంక మనకి బాధ లేదు కదా! పిల్లకి నచ్చని పిల్లవాడిని నువ్వు తెచ్చి కట్టావో, వాడితో పాటు నిన్ను కూడా వేయించేస్తుంది కదా!

అందుచేత, ఈ అమ్మాయి (సావిత్రి) ఇంటికి సంబంధాలు వస్తుంటే వింటోందండి అన్నీ. అలా వింటూ, వింటూ, అన్నీ కాదు... ఇవన్నీ చూడండి మరి భారతంలో ఉన్నాయంటే నమ్మ బుద్ధేస్తుందా? ఇవన్నీ కూడా, they are valid at all times. రామాయణం, భారతం... they are eternally valid scriptures, eternally. అవేవో పాతవనుకోబోకండి, అవి శాశ్వత కథలు.

అందుచేత, వింటూ వింటూ ఆవిడేం చేసిందంటే, లోపల ఈ విన్న వాళ్ళలో సత్యవంతుడి గురించి విన్నదావిడ. ద్యుమత్సేన రాజు యొక్క కుమారుడాయన. ద్యుమత్సేను డంటే? 'ద్యౌః' అంటే వెలుగు. అందుచేత, వెలుగు సేనలు కలవాడని అర్థం. మనలో కూడా బాగా వెలుగంటూ పెరిగితే, లోపలుండే

దేవతలందరూ మనకి సహకరిస్తూ ఉంటారు, తెలుసా! మనం చక్కగా సద్గుణములను, అంటే ధర్మపరంగా జీవిస్తూ ఉంటే, దేవతల సహకారం విపరీతంగా ఉంటుంది. దేవతా సమూహం నీకు సహకరించడానికి ఎప్పుడూ అప్రమత్తులై ఉంటారు, లోపల, బయటా కూడా. అదే ధర్మరాజు కథ. అదే రాముడి కథ. రాముడు తనకు తాను దేవుడని తెలియదు. తెలిస్తే, కథ కాదది. నిజంగా తెలీదు. నరుడే! నేను ఫలానా వారి అబ్బాయిని, నా పేరు ఇదని, ఇదే నా address అని చెప్తాడు ఎన్నిసార్లు అడిగినా. ఋషులు నువ్వు మహాత్ముడివి, నువ్వు విష్ణుమూర్తివి, ఇలా దిగి వచ్చావంటే, అదేం నాకు తెలియదు, నాకు తెలిసిందొక్కటే, నేను దశరథుడి కుమారుడిని, నా పేరు రాముడు అంటాడు, అంతే! చాలా సార్లు చెప్తాడు ఆ మాట. కానీ, ఆయన చూపించిన ధర్మ నిరతికి ఎంతమంది దేవతలు వచ్చి ఎన్ని రకాలుగా సాయం చేశారో. అలాగే, ధర్మరాజుకి ఎంతోమంది మహాత్ములు, దేవతలు వచ్చి సహకారం చేశారు. ఎందుకిలా సహకారం చేశారు? నీ ధర్మ నిరతిని బట్టి చేస్తారు.

అట్లా కొంతమందికి దేవతలు సైన్యములుగా వచ్చి సహాయం చేస్తూ ఉంటారు. ద్యుమత్సేనుడంటే ఆయనలో ఉండేటటువంటి దేవతా సమూహం. మనందరిలో దేవతలు ఉన్నారు, అసురులూ ఉన్నారు. మనం ధర్మపరంగా జీవిస్తూ ఉంటే దేవతల సహకారం లభిస్తూ ఉంటుంది. అధర్మపరంగా జీవిస్తూ ఉంటే రాక్షసులు మనలను లోబరుచుకుంటారు. గుర్తుపెట్టుకోండి. రాక్షస గుణమే లోబరుచుకోవడం. ఇప్పుడు ఎవరినయినా లోబరుచుకుందాం అనే బుద్ధి మనకుందనుకోండి, అది మనలో రాక్షసత్వం.

లోబరుచుకోవడం ఎందుకు? స్నేహంగా ఉండొచ్చు, ప్రీతిగా ఉండొచ్చు, లోబరుచుకోనక్కర్లేదు. ఆ లోబరుచుకునే బుద్ధి రాక్షస బుద్ధి. వీణ్ణి వశం చేసుకుందాం అనుకున్నాం అనుకోండి, అప్పుడు నీలో రాక్షసులు పని చెయ్యడం మొదలు పెట్టి, నువ్వు క్రమంగా రాక్షసుడివి అయిపోతావు. మనుషులే రాక్షస ప్రవృత్తితోనైనా ఉండొచ్చు, దైవీ ప్రవృత్తితోనైనా ఉండొచ్చు.

ద్యుమత్సేనుడు చాలా ధర్మపరుడై, దేవతా సమూహముల సహకారంతో జీవిస్తూ, మూడవ కన్ను కూడా కలిగి ఉండేవాడు. అంటే, అంత దృష్టి. ఆ సమయంలో సత్యవంతుడు పుడతాడు. ఆ తర్వాత ఈ ద్యుమత్సేనుడు తనలో ఉండే అహంకారం కారణంగా శత్రుత్వాన్ని కలిగించుకుంటాడు తన రాజ్యంలో. కొంతమంది తీరి కూర్చుని శత్రువులను పెంచుకుంటూ ఉంటారు. కొంతమంది ఉన్న శత్రువులను కూడా క్రమంగా మిత్రులను చేసుకుంటారు. శత్రువులు పెరగడం పెద్ద విషయం కాదు. అలా జీవితంలో ముందుకు వెళ్ళినకొద్దీ పెరుగుతూనే ఉంటారు వాళ్ళు. ఎందుకంటే, నచ్చినవాళ్ళు... ముందు నచ్చినవాళ్ళే కదా తర్వాత నచ్చనివాళ్ళు అవుతారు. ఎవరికయినా ఇద్దరి మధ్య పరిచయము లేదనుకోండి, వాడు శత్రువూ కాదు, మిత్రుడూ కాదు. ఎప్పుడయినా, ఎవడయినా శత్రువు అయ్యాడంటే, అంతకు ముందు వాడు మిత్రుడు అయ్యి ఉండాలి. అప్పుడే శత్రువు అవుతాడు. లేకపోతే శత్రువు కాలేదు. ఊరికే ఉట్టి పుణ్యానికి ఎందుకు శత్రువు అవుతాడు? మిత్రుడే, బాగా పూసుకోవడం వల్ల, కొంత రాపిడి వల్ల వేడి పుట్టి, దాంట్లోంచి కొన్ని వైవిధ్యమైనటువంటి భావాలు పుట్టి, అంతకుముందు

friends, ఇప్పుడు ఒకడి పీక ఇంకోడు నొక్కెయ్యడానికి ready గా ఉంటారు.

ఎందుకిలా జరిగింది? అంతకు ముందు నీతో హాయిగా ఉండేవాళ్ళు నీకు శత్రువులు ఎందుకయిపోయారు? తన రాజ్యంలోంచే తనకి శత్రువులు పుట్టుకొచ్చి, తనకి జాగ్రత్తగా దారి చూపిస్తారు అరణ్యానికి. తమరింక నెమ్మదిగా వెళ్ళవచ్చు వానప్రస్థానానికి అన్నట్టుగా పంపించేస్తారండి ఈ ద్యుమత్సేనుడిని. దేనివల్ల? నీవు చాలా మంచి పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎక్కువ అప్రమత్తతతో లేకపోతే, నీ మాటలోని అశ్రద్ధ వల్ల, చేతలో అశ్రద్ధ వల్ల, నీ చుట్టూ ఉండే వాళ్ళలోనే ఒకడికి నీ మీద ద్వేషం పుట్టవచ్చు. అందుకనే, ఎక్కువచోట్ల అంతరంగికుడే వ్యతిరేకి అయిపోతాడు. వాడో, వీడో వ్యతిరేకి అయితే అంత ఇబ్బంది ఉండదు. అంతరంగికుడే వ్యతిరేకుడు అయిపోయాడనుకో ఇబ్బంది ఎక్కువ. అలా అయిపోవడం చేత, ఈ ద్యుమత్సేనుడికి అరణ్యవాసం ఏర్పడుతుంది. చూడండి ఎలా అయిపోయాడో, అన్నీ తెలిసినవాడు పాపం, అంత మంచివాడు అరణ్యానికి వెళ్ళిపోయాడు. ఎందుచేత? శత్రువులను పుట్టించాడు.

ఈ శత్రువులను పుట్టించుకునే విద్యలో మానవుడు చాలా గొప్పవాడు. ఉట్టి పుణ్యానికే ప్రతివాడిని శత్రువు చేసుకుంటూ ఉంటాడు. మరి చాలామంది శత్రువులు పెరుగుతున్నారుట అంటే, మనలో ఏదో లోపం ఉందని అర్థం చేసుకోవాలి. మాట తేడాయో, చేత తేడాయో, కొంత మదమో, ఏదో ఉంటుంది. ఏం లేకపోతే అలా ఎందుకు పెరుగుతూ ఉంటారు? మొన్నటి వరకూ మనతో

బాగున్నవాడు, ఇవాళ ఎందుకు బాగోలేడు? తేడా మనలో ఉంటే మనం సర్దుకోవాలి. వాడిలో ఉంటే మనం wait చెయ్యాలి. రెండు రకాలు. చాలా నిష్కర్షగా నిన్ను నువ్వు పరిశీలించుకుంటే, నీలో తేడా లేదనిపించినప్పుడు, వాడితో నువ్వు ఆప్యాయంగా ఉంటూనే ఉండాలి. అప్పుడు వాడిలో తేడా ఉంటే అది కూడా సర్దుకుంటుంది. ప్రతికూల పరిస్థితులను అనుకూల పరిస్థితులుగా చేసుకునేవాడు ఉత్తముడు. అనుకూల పరిస్థితులను ప్రతికూల పరిస్థితులుగా చేసుకునే వాళ్ళని ఏం అంటాం? అజ్ఞానం చేత తెలియనివాళ్ళే కదా!

అందుచేత, అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు తీరి కూర్చుని పాడు చేసుకోవడం జరిగిందాయనకి. అలా జరగడం చేత ఆయన అడవికి వెళ్ళిపోయాడండి. Compulsory గా retire చేసి పంపించేశారు. పంపించేస్తే, అరణ్యంలో ఉన్నాడు. ఏం చేస్తాడు, ఆరాధన చేసుకుంటూ ఉన్నాడు. కొడుకున్నాడు. చూడండి! **అశ్వపతికి రాజ్యం వున్నది. కొడుకు లేడు. ద్యుమత్సేనుడికి కొడుకు వున్నాడు. రాజ్యం లేదు. ఒక రాజుకు కొడుకు కావాలి. ఇంకొక రాజుకి రాజ్యం కావాలి. దైవం అంటే యిదే! ఒకరికి కావలసినది ఇంకొకరి దగ్గర వుంటుంది!** ఆ కొడుకేం చెయ్యాలండి? మామూలుగా సాదాసీదా రాజుగారి కొడుకయితే, ఏదో విప్లవం సృష్టించాలి, రకరకాలుగా బాధలు పెడుతూ ఏదో విధంగా రాజ్యం సంపాదించుకోవాలి కదా? అలా లేడండి సత్యవంతుడు. అదీ సత్యవంతుడంటే! చాలా ఆశ్చర్యం. తన తండ్రి రాజ్యం నుంచి ఆయన అనుయాయులే తండ్రిని, తనని, తన తల్లిని అరణ్యానికి పంపిచేస్తే, అరణ్యంలో తండ్రికి, తల్లికి సేవ చేసుకుంటూ,

తండ్రిగారు చేసే ఆరాధనకి సమిధలు, తల్లిగారు చేసే వంటకి కట్టె పుల్లలు రోజూ ఏరుకొస్తుండే వాడండి!

అట్లా ఉంటారా ఎవరయినా? అదీ ధీరత్వం. ధీరుడే అలా ఉండగలడు. అందరూ అలా ఉండలేరు. ఏమిటా ధీరత్వం? **మనది కానిది మన దగ్గరకు రాదు, మనదైనది మన దగ్గర నుంచి పోదు. అంతే! గుర్తుపెట్టుకోండి. ధీరుడు అలా ఉంటాడు.** ప్రతీ దానికి అలా ఆశ పడి పరిగెత్తడు. ఎందుచేత అంటే, నీదయితే నీ దగ్గరకు వస్తుంది, నీది కాకపోతే నువ్వు ఎంత ప్రయత్నం చేసినా నీకు అది దక్కదు. మన వాళ్ళు సామెత చెప్తూ ఉంటారు, వంటి నిండా నూనె పూసుకుని పుట్టెడు నువ్వుల్లో పొర్లినా, అంటే నువ్వే అంటుతుంది తప్ప మొత్తం అంతా అంటదు వంటికి కదా! ఒక ఇద్దరు అలా పూసుకుని, ఓ బస్తాడు నువ్వులు కొనుక్కుని, వాటిలో అటూ ఇటూ బాగా పొర్లారండి. ఒకడికి అంటినంత ఇంకొకడికి అంటవు నువ్వులు. ఎందుకీ సామెత చెప్పానో తెలుసా? నీవు ఇదివరకూ చేసినటువంటి పుణ్య ఫలమే నీకు ఇప్పుడు వస్తుంది. దాన్ని ఎవ్వరూ దొంగిలించలేరు. అలాగే, నువ్వు ఇదివరకూ చేసిన పిచ్చి పనులు, అవి నువ్వు ఎన్నిరకాల రక్షాకవచాలు కట్టుకున్నా, తాయెత్తులు కట్టుకున్నా వచ్చేస్తుంది. అంతే! అది సృష్టి ధర్మం. బాగా వంటి నిండా తాయెత్తులు కట్టుకున్న వాళ్ళు కనిపిస్తూ ఉంటారు. వాళ్ళు చొక్కా విప్పితే ఎన్నో తాయెత్తులు ఉంటాయి, మళ్ళీ ఉంగరాలు. ఎందుకండీ అంటే, ప్రతీ వాడు ఏదో ఒకటి చెప్తాడు కదా! భయం ఉండేవాడికి ప్రతీ వాడూ ఒకటి చెప్తాడు. నువ్వు ఎన్ని తాయెత్తులు కట్టుకుని, రోజూ రక్షాకవచం చదువుకున్నా, నీకు రావలసిన ఆపద నీకు వచ్చేస్తుంది. అది అయినా అంతే, ఇది అయినా

అంతే! అది తెలిసిన వాడికి భయం ఏమిటండీ? రాజ్యం అనేది మనకి యోగంలో ఉంటే అదే వస్తుంది. ధీరుడే అలా ఉండగలడు. అందరూ అలా ఉండలేరు. ఉండగలరా?

అలా అరణ్యంలో పడి ఉండి, మాటిమాటికి అదే నెమరు వేసుకుంటూ ఉండడు సత్యవంతుడు. మా నాన్నకి అన్యాయం జరిగిందని ఎవరికి చెప్పుకుంటాడు అరణ్యంలో? భావనలో కూడా ఉండదండి. అది మరి ఎవరూ చెప్పరు సత్యవంతుడి గురించి. అతని పేరే సత్యవంతుడు కదా! అది మనదయితే మన దగ్గిరికి నడిచి వస్తుంది, అది మనది కాకపోతే మనం ఎంత దాని వెంటబడ్డా మనకి దక్కదు కదా! అందుకని, **అదృష్టవంతుడు అరణ్యంలో కూర్చున్నా అదృష్టం వచ్చి వరించేస్తుందండి. దురదృష్టవంతుడు కోశాగారంలో ఉన్నా వాడికో రూపాయి దక్కదు. మరి ఈ ధర్మం భారతమే చెప్తుంది.** ఇలాంటి ధర్మాలు మిగతా గ్రంథాల్లో ఎక్కడ దొరుకుతాయి? దొరకవు.

ఏమిటో తాపత్రయ పడతావు. వాటి గురించి, వీటి గురించి తాపత్రయ పడక, **నీకు అందివచ్చిన కర్తవ్యాలను నిర్వర్తిస్తూ ఉండు అనేది భారతీయుడికి నేర్పిన ధర్మం. తల్లితండ్రుల యెడల, సోదరుల యెడల, భార్య యెడల, పుత్రుల యెడల, నీపై ఆధారపడిన వారి యెడల నీ కర్తవ్యాలు ఉన్నాయి. అవి నిర్వర్తిస్తూ నువ్వు తల వంచుకుని పనిచేసుకుంటూ ఉంటే నీకు రావలసినవన్నీ నీకు వచ్చేస్తాయి – మంచీ, చెడూ. రెండూ అనుభవించెయ్యి, అయిపోతుంది! అది మార్గం.**

అది తెలిసినటువంటి ధీమంతుడు సత్యవంతుడు.

అందుచేత, ఆయన రోజూ పొద్దున్నే ఆరాధన చేసుకుని, తల్లితండ్రుల దగ్గర అనుమతి తీసుకుని అడవికి వెళ్తాడు. అడవికి వెళ్లి ఏం చేస్తాడు? అప్పటికప్పుడు కొట్టిన కొమ్మల ద్వారా మనం వంట చేసుకోలేం కదా! అందుకని వంటకి, తండ్రి చేసుకునే హోమాది కార్యక్రమాలకి ఎండు పుల్లలు ఎరుకొచ్చేవాడు. అలాగే, ముందు కాలానికి పనికి వచ్చేట్లుగా కొన్ని కట్టెలు కొడతాడు చెట్టు నుంచి. కొమ్మలు కొట్టి store చేస్తే, కొన్నాళ్ళకి ఎండుతాయి. కొట్టిన చోటే ఎండకు వదిలేస్తాడు. ఎండినవి ఇంటికి పట్టుకొని వస్తాడు. ఇంట్లో స్టోర్ చేసుకోడు. అది కలిధర్మం. **దాచుకోడు కనుక అతడి శ్రమను ఎవరూ దొంగలించరు.** ఇదీ ఆయన కార్యక్రమం. పొద్దున్న, సాయంత్రం దైవారాధన, తల్లితండ్రులకి సహాయంగా ఉండడం. వారికి అన్ని విధాలుగా తానే ఆధారం. అలా ఉంటుంది.

ఈ తండ్రిగారికేం జరిగిందంటే, కళ్ళు కూడా పోతాయి. అది చూడండి! అంటే, కన్ను పోయిందంటే అర్థం ఏమిటి? వెలుగు పోయిందని అర్థం. అంతకుముందు దేవతలు బాగా ఆవరించి ఉన్నప్పుడు, మనకి మూడవ కన్ను కూడా తెరుచుకుని ఉండేది. ఇప్పుడు మనలో సద్గుణాలన్నీ ఒక్కసారి అట్లా ఏదో కర్పూర హారతి కాలిపోయినట్టుగా, కరిగి పోయినట్టుగా కరిగి పోయింది. ఇప్పుడు కనబడదు కూడా! అంటే, కన్నులున్నంత మాత్రాన కనబడనక్కర్లేదు! కళ్ళు పోయాయంటే అవగాహన పోయిందని అర్థం. కళ్ళు పోయాయిట, రాజ్యం పోయిందట. ఆయన ఎవరట? ద్యుమత్సేనుడు ఈ విధంగా పోగొట్టుకున్నాడు. అతని కుమారుడు అవన్నీ పోకముందు పుట్టినవాడు. అతడు ధీమంతుడు, స్థిరమతి, సద్గుణవంతుడు.

అందుచేత, వీరందరి గురించి, రాజుల గురించి వచ్చినవాళ్ళు చెప్తూ ఉంటారు కాబట్టి, ఈ అశ్వపతి గృహానికి విచ్చేసేటటువంటి అతిథులు, మిత్రులు, ఋషి పుంగవులు వస్తూ ఉంటారు కదా! వాళ్ళు ఆ రాజకుమారులు, ఈ రాజకుమారులు ఇట్లా ఇట్లా అని చెప్తూ, సత్యవంతుడి గురించి కూడా చెప్తారు. చెప్తే, సావిత్రీదేవికి సత్యవంతుడు నచ్చుతాడు.

ఉద్యోగం పోయింది, అమెరికా నుంచి వచ్చేశాడు, అమ్మా నాన్నా dependents అంటే పిల్లనిస్తారా ఎవరయినా? పిల్లవాడికి ఉద్యోగం లేదండి, ఉన్న ఉద్యోగం పోయింది. పోనీ independent ఆ? కాదు! అమ్మా, నాన్నా ఎప్పుడూ ఆ అబ్బాయితోనే ఉంటారా అని అడుగుతూ ఉంటారు. అదేంటండీ? పెళ్లి సంబంధానికి వెళ్ళేటప్పుడు ఈ పిల్ల తల్లీతండ్రి, ఆ అబ్బాయి వాళ్ళ అమ్మా, నాన్నా వాళ్ళతోనే ఉంటాట్టండి... ఏం ఉండకూడదా? ఏం వాళ్ళకే కదా పుట్టాడు! వాళ్ళే కదా పెంచారు. వాళ్ళుండకూడ దనుకోవడం అంతకన్నా దుర్మార్గం ఇంకేం లేదు ఈ ప్రపంచంలో. అందరి భావం అదే కదా! ప్రతీ తల్లీ తన కూతురికి అవతల అత్తగారు ఉండకూడదని అనుకుంటుందండి. అదేంటండి? అట్లా ఎట్లా? అత్తగారే కాదు, మామగారు కూడా ఎప్పుడూ ఇంట్లోనే ఉంటారట. ఎట్లా అండీ అలాంటిది? ఉండాలి. ఉంటే నీకు సేవకి అవకాశం ఎక్కువ. దానివల్ల పుణ్యం చాలా సంపాదించుకోవచ్చు. అది తెలియదు ఎవరికీ ఈ రోజుల్లో. **ఒళ్ళు దాచుకోవడం అనే ప్రజ్ఞలో పాండిత్యం సంపాదిస్తున్నారు తప్ప, పెద్ద వాళ్ళకి సేవ చేసుకోవడం వల్ల తరగని ధనం ఏర్పడుతుంది అనే జ్ఞానం తగ్గిపోయింది ప్రపంచంలో.**

నీ ఇంట్లో తల్లి ఉంటే అది అదృష్టం, తల్లితండ్రులు ఇద్దరూ ఉంటే అది ఇంకా అదృష్టం. వాళ్ళకి నువ్వు ఎంత చేసుకుంటే, వాళ్ళెలాంటి వాళ్ళయినా కానీయండి, మన కనవసరం, అంత పుణ్యం నీకు. అలా కాకుండా, వాళ్ళని తిట్టి పోస్తూ, శాపనార్థాలు పెడుతూ, వాళ్ళకేదో ఇంతా అంతా చేసీ చెయ్యనట్టుగా చేసి పడేస్తున్నావనుకోండి, చాలా దురదృష్టవంతుడివి నువ్వు. ఇచ్చిన అవకాశాన్ని పాడు చేసుకుంటున్నావని అర్థం. ఎంత మనం ఇతరులకి, పైగా మనని పెంచి పెద్ద చేసిన వారికి చేస్తే, అంత మనకి ఆశీర్వచనం అనేది భారతీయ జ్ఞానం. అది సత్యం. అది ఎంత ఎగ్గొట్టి మనం దాచుకుందాం అనుకుంటామో అంత దురదృష్టం. ఏం సందేహం లేదు. ఇంక అంతకన్నా దురదృష్టవంతులు ఎవరూ ఉండరు. అందుకని పిల్లవాడు ఉండాలట, వాడి తల్లితండ్రులు ఉండకూడదట, అది ఇప్పుడు మన కార్యక్రమం.

ఇక్కడ ఈ అబ్బాయికి అసలు రాజ్యం లేదు, అడవిలో ఉన్నారు, తనో రాజకుమారి. మామగారికి కళ్ళు కనబడవు, ఏ సంపదా లేదు. అంటే, మన సంపదంతా తీసుకెళ్ళి అక్కడా... అది కూడా అనుకోదావిడ. కాని, అతనంటే తాను ఇష్టపడిందండి, ఇష్టపడి మనసులో పెట్టుకుంది. అంతవరకూ మనం చదువుకోవడం జరిగింది. అంటే, కథ ముందు చదివేస్తాం, తరవాత నెమ్మదిగా వెనకనుంచి అందులో మనకి పనికొచ్చే విషయాలన్నీ చక్కగా వివరించుకోవాలి. లేకపోతే ఉపయోగం ఏం ఉంది మనకి?

"ద్యుమత్సేనుడి కుమారుడు సత్యవంతుడు అత్యంత రూపశాలి అని, మహనీయ గుణవంతుడని ఆకర్ణించిన సావిత్రి,

అతని యెడల ఎంతో మక్కువ కలిగినది. కానీ, వల్లమాలిన సిగ్గు వల్ల, అమె ఈ విషయం జననీజనకులకు ఎరిగించలేదు. అటు పిమ్మట నారద మునీంద్రుడు ఒకనాడు మద్రపతి సన్నిధికి విచ్చేసి, సగౌరవ పూజలందుకుని, ఇష్టాగోష్ఠి ప్రారంభించాడు. అదే సమయంలో సావిత్రి మన్మథ సామ్రాజ్య లక్ష్మివలే మంద మంద గమనంతో నెచ్చెలులతో కలిసి అచ్చటికి వచ్చి, అల్లంత దూరంలో నిలిచి, జనకునికెంతో అణుకువతో నమస్కరించినది. అశ్వపతి ఆమెనెంతో వాత్సల్యంతో ఒడిలో కూర్చుండబెట్టుకుని, చల్లని పలుకులతో లాలించినాడు. దేవర్షివర్యుడంత, మద్రేశ్వరా! ఈ కన్య కింత పర్యంతము తగిన వరునికీయ లేదేమి? అని ప్రశ్నించాడు. అశ్వపతి దానికి ఏ విధముగాను ప్రత్యుత్తర మీయక, తనూజ వైపు చూచి, తల్లీ! నీకు అర్హుడైన వరుడెవరో నీవే అన్వేషించి, వరించ వలసినది. అన్ని విధాలా నాకిదే అభిమతము."

ఎంత సంస్కారం అండి అది? మనకంటూ ఎవరూ తట్టలేదు. తనకి ఎవరి యందయినా మక్కువ ఉంటే వాళ్ళకే ఇచ్చి పెళ్లి చేస్తానన్నాడు. Aquarian age, aquarian age అంతా independent అయిపోతున్నారు అని గొడవ చేసేస్తున్నాం కదా! అసలు **స్వతంత్రత అనేది సంస్కారవంతుడు ఇతరులకి ఇచ్చేది.** తన మీద తనకి నమ్మకం ఉండాలి. తన మీద తనకి నమ్మకం ఉంటే, పిల్లల మీద కూడా తనకా నమ్మకం ఉంటుంది. అలా ఉండాలి. అలా లేకపోతే, నీవు స్వతంత్రుడివి కాదు, నీవు ఎవరికీ స్వతంత్రాన్ని ఇవ్వవు. అవిశ్వాసమే కారణం దీనికంతా. నీ మీద నీకు నమ్మకం ఉంటే, నీ పిల్లలెలా ఉంటారో నీకు తెలిసి ఉంటుంది.

మా చిన్నతనంలో మేము చదువుకునే రోజులలో, మా తల్లితండ్రులకి మేము ఏడుగురు పిల్లలం, ఆరుగురు మగ పిల్లలం. మేమంతా ఏదో అల్లరి చేస్తున్నట్టుగా కనిపిస్తుండేది మా అమ్మగారికి ఎప్పుడూను. "ఏమిటో వీళ్ళు అల్లరి చిల్లరిగా ఉంటారు, మీరు పట్టించుకోవట్లేదు" అన్నారు మా అమ్మగారు. అంటే, మా నాన్నగారు అన్నారు, "వాళ్ళు నా పిల్లలు, నేను వెధవనయితే, వాళ్ళూ వెధవలవుతారు" అని చెప్పారు. Simple. నేను వెధవనయితే, వాళ్ళూ వెధవలవుతారు. నా బట్టే వాళ్ళూ అని చెప్పారండి. విన్న కొడుకులకు ఎట్లా ఉంటుందండీ? అంటే, ఆయన కొడుకుగా మనకెంత బాధ్యత ఉంది అనేది తెలుస్తుంది కదా! ఎన్నడూ ఇది చదువుకోండి, అది చదువుకోండి, ఇట్లా చదువుకోండి, అట్లా చదువుకోండి, ఇలా చెయ్యండి, అలా చెయ్యకండి అని ఎప్పుడూ చెప్పినవాడు కాదాయన. అలాంటి స్వతంత్రత ఇచ్చిన తండ్రి దగ్గర పెరగడం చేత, నేను కూడా నా జీవితంలో అందరికీ స్వతంత్రమే యిచ్చాను నా చుట్టూ ఉండే వాళ్ళకి. ఎవరి మీద మనం అంక్షలు పెట్టం, ఎవరయినా కావచ్చు. నేను వారికి స్వతంత్రత ఇస్తాను.

ఇవి ఎక్కడి నుంచి వస్తాయి? నీ మీద నీకు విశ్వాసం ఉంటే. నీలో భయం ఉండడం చేత ఎదుటి వాళ్ళని పట్టుకుని కూర్చుంటావు. ఎందుకూ పట్టుకోవడం? నీవాడయితే నీతో ఉంటాడు. నీవాడు కాదు, నువ్వు ఎంత పట్టుకున్నా, నీ వాడు కాదు కదా! మనవాడు అనుకునేవాడు ఎవడూ? మనతో భావాల్తో అనుగుణమైన భావాలు, అనురూపమైన భావాలు కలిగినవారు మనవారు. అనురూపమైన భావాలు లేనివారిని మన వాళ్ళు అని ఊరికే పట్టుకుంటే కలిగేది ఘర్షణే తప్ప, ఏం ఉందండి ఆనందం?

మనం చెప్పిన మాట వాళ్ళు వినరు, మనకేదో వాళ్లకి చెప్దామని అనుకుంటాం. వాడు వినడుగా? ఎందుకూ చెప్పడం? వినే వాడికే చెప్పుకో! ఇప్పుడు ఇలాంటి సభలు జరిగినప్పుడు, ప్రతివాడికీ వాడికి ఇష్టమైన వాళ్ళు వింటే బావుంటుం దనిపిస్తుంది. ఇష్టమైన వాడికి నీకు అనిపించినట్టుగా వాడికి అనిపించాలి. ఇప్పుడు మనమంతా ఇక్కడ చేరి, పొద్దున్న పూట, ఇట్లా ఆదివారం కాలాన్ని వినియోగిస్తున్నాం కదా! ఎందుకిలా చేస్తున్నాం? మనందరికీ ఒకే విధమైనటువంటి భావము ఉండడం చేత. అలా కాదనుకోండి, ఎందుకొస్తారు మీరు? మీరు రాలేదనుకోండి, ఎందుకు రాలేదని అడిగితే ఏమిటి ఉపయోగం? మీకు ఇష్టం లేకపోతే రారు, ఇష్టమైతే వస్తారు. **జీవ స్వాతంత్ర్యం అనేది సంస్కారములలో అత్యుత్తమమైన సంస్కారం.** కేవలం జీవ ప్రేమ ఉన్నచోట అది సాధ్యం.

అందుచేత, తండ్రి పిల్లకి చెప్తున్నాడు, నువ్వే నిర్ణయం చేసుకో తల్లీ వరుడిని అని. అలాంటి కథొకటి ఉందని తెలుసా మనకి భారతంలో? అలా చెప్పాడండి. నన్నిడిగితే అలా చెప్పడం పెద్ద విషయం ఈ రోజుల్లో! తల్లితండ్రులు నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి, తనకు ఇష్టమైన పిల్లవాడిని ఇచ్చి పెళ్లి చేస్తే, పిల్ల సుఖపడుతుందనే జ్ఞానం ఉండాలి, ఒకటి. రెండోది, మనసిచ్చేసిన తర్వాత ఇంకొకళ్ళకి నువ్వు ఇచ్చి చేస్తే సుఖపడుతుందా? సుఖపడదు. భారత స్త్రీ ఒక్కసారి మనసిచ్చేస్తే ఇంక అంతేనండి! గుర్తుపెట్టుకోండి. ఇతర స్త్రీలకి భారత స్త్రీలకి చాలా తేడా ఉంది. వీడొకడు కాకపోతే ఇంకోడు అన్నట్టుగా ఉండదు. ఒకడే! అట్లా ఉంటేనే భారత స్త్రీ. లేకపోతే కాదు. వస్తువులను మార్చినట్టు మనుషులను మార్చుకోరు భారతీయులు చాలా కుసంస్కారం

ఉంటే తప్పు. ఒకచోట మనసిచ్చి, ఇంకోచోట కాపురం ఎట్లా చేస్తుందండి, చెయ్యలేదు కదా! అప్పుడా కాపురం బావుంటుందా? బావుండదు కదా! అందుచేత, ఈయన ఇక్కడ అశ్వపతిగారికి అసలు కూతురిని చూస్తుంటే విపరీతమైనటువంటి వాత్సల్యమే కాదు, గౌరవం కూడా. ఎందుకంటే, అట్లా అమ్మవారే దిగి వచ్చినట్టుగా కనిపిస్తూ ఉంటుంది ఇంట్లో. ఇప్పుడు ఈ అమ్మవారి లాంటి అమ్మాయికి నేనెక్కడ తేగలను, తనే తెచ్చుకుంటుంది అన్న భావంతో చెప్పాడండి.

"మద్ర తనూజ ఆ పలుకులు ఆలకించి, కొంత సేపు ఎంతో లజ్జించి..." ముందు కొంచెం తటపటాయించింది చెప్పడానికి. "తండ్రీ! సాళ్వపతి భూనాథుడు, ద్యుమత్సేనుడి తనయుడు సత్యవంతుని యెడల నాకెంతో కూరిమి కలిగినది." ఇలా మాట్లాడడానికి, పక్కన నారద మహర్షి ఉన్నాడు కదా, లోపల ఎంత ధైర్యం ఉండాలండి? అలా చెప్పిందావిడ, "అతనికి నన్నిచ్చి వివాహం జరిపించ వలసినది. శాత్రవులు ఏకీభవించి తన రాజ్యము యావత్తు అపహరించినందువల్ల, సాళ్వపతి ఇప్పుడు సకుటుంబపరంగా కాననంలో నివసిస్తూ ఉన్నాడు." అది కూడా చెప్పేసింది. కాకపోతే, "దైవయోగం వల్ల ఆ మహనీయునికి అంధత్వం కూడా సంప్రాప్తించినది. ఏది ఏమయినా ఇంక సత్యవంతుడే నా భర్త."

ఎంత clarity ఉందండి? అంటే, అలాగే ఫలానా రాజుగారి అబ్బాయి అనుకుంటావేమో, అడవిలో ఉన్నాడాయన. రాజ్యం పోయింది. కళ్ళు కూడా పోయినాయి దైవ వశం వల్ల. అయినప్పటికీ, ఆయన కొడుకు సత్యవంతుడిని నేను భర్తగా

మనసులో అంగీకరించేశాను అన్నది. రామాయణంలో అమ్మవారు రాముడిని చూసినప్పుడు కూడా అలాగే చేస్తుంది. ముందే రాముడి గురించి వింటారు. ఆడపిల్లలు అన్నీ వింటూ ఉంటారండి, ఇంట్లో వాళ్ళ గురించి, వీళ్ళ గురించి మాట్లాడుకుంటే. విని చెప్తారు మనమడిగితే. మనం అడగం కదా! మనం decide చేసేస్తాం. మన దగ్గర ఉన్న పెద్ద disease ఏమిటంటే, we decide for others, we don't let others decide for us కదా! నీకు నువ్వు నిర్ణయం చేసుకునే వాడికి, పక్కవాడికి నువ్వు నిర్ణయం చెయ్యడమేమిటి? అడిగితే చెప్పాలి.

తండ్రిగా బాధ్యత కాబట్టి చేస్తే, చాలా జాగ్రత్తగా సరి అయిన వరుడిని తెచ్చి అందించాలి. నువ్వు తెచ్చింది నచ్చలేదనుకో కూతురికి, కష్టం. నువ్వు నచ్చని సంబంధం తెచ్చి చేస్తే ఆ కాపురం సరిగ్గా నెరవేరుతుందా? నెరవేరదు. అందుచేత, ఈవిడిలా చెప్పేసిందండి. అడిగాడుగా మరి. నువ్వే తెచ్చుకోమంటే, తెచ్చేసుకుంది. రాముడే నా భర్త అనుకుందండి అమ్మవారు. అలాగే, రుక్మిణిదేవి కృష్ణుడి గురించి విని, ఈ జన్మకి నాకు కృష్ణుడే భర్త అని నిర్ణయం చేసేసుకుంది. నిర్ణయం చేసేసుకుని ఏం చేసింది? ఒక love letter కూడా రాసేసింది. ఆ రోజుల్లో love letter ఏమిటండి? ఇప్పుడు love letter రాస్తే, అమ్మో, అమ్మో, ఆ పిల్ల చాలా బరి తెగించేసిందంటాము కదా! తప్పు కదా! అదేంటి, ద్వాపర యుగంలోనే love letters ఉన్నాయి. **గుర్తుపెట్టుకోండి, భారత సమాజం ఎప్పుడూ ఆధునికమే!** ఓ step ముందే ఉన్నాం అండి, వెనకాల లేం కదా! మరి అవి ఆలోచించం కదా మనం! అంటే, ఆయన కృష్ణుడు, దేవుడు... అలా కాదు. మామూలుగా మనిషిలాగ

చూడండి. ఒక రాజకన్య, ఎవరో ఒకాయనకి, ఒక బ్రాహ్మణుడికి love letter ఇచ్చి పంపించింది కదా! తన మనసులో ఆయనే భర్త అని నిర్ణయం చేసుకుంది. ఇంక ఎవరయినా కుదరదు ఆవిడకి. కృష్ణుడు కూడ అదే నిర్ణయం చేసుకున్నాడట. అందుకని, ఈ బ్రాహ్మణుడు వస్తే, ముసిముసి నవ్వులు నవ్వుతూ, నేనూ ఆ పని మీదే ఉన్నాను అన్నాడు. వచ్చేశాడు, అయిపోయింది కదా! అందుచేత, ఇక్కడ ఇలా చెప్పేసింది. మొహమాట పడకుండా, ఉన్న విషయం ఉన్నట్టుగా చెప్పేసిందండి. తండ్రి అడిగాడు కదా!

# 8. సత్యవంతుని గుణగణములు

“మద్రేశ్వరుడు అంతట నారద మహర్షి వైపు అవలోకించి, మునినాథా! ముల్లోకాల్లోనూ నీవు ఎరుగని వారెవ్వరూ లేరు, నా తనూజ వరించిన ఆ రాజకుమారు డెట్టివాడో తెలియజేయ వలసినది అని ప్రార్థించాడు”. మొట్టమొదటి సారిగా విన్నాడు సత్యవంతుడి గురించి. వింటే, పక్కనే ఉన్నాడు నారద మహర్షి! అసలు ఆ కుర్రవాడు ఎలాంటి వాడో కొంచెం నాకు చెప్తారా, మీకు తెలియందేం ఉండదు కదా! అన్ని చోట్లా తిరుగుతూ ఉంటారు. అందుకని, పది చోట్లా తిరిగే వాడి దగ్గర సమాచారం ఎక్కువ ఉంటుంది కదా! ఎక్కడా తిరగని వాడి దగ్గర మనం ఇలాంటి విషయాలు అడగకూడదు. తిరిగే వాళ్ళని అడగాలి. “ఆ ఊరు వెళ్తుంటావు కదా, ఫలానా వాళ్ళు నీకు తెలుసా”, అంటే చెప్తాడు కదా!

అప్పుడాయన చెప్పాడు. “అశ్వపతీ! సాళ్వపతి కుమారునికి ‘చిత్రాశ్వు’డని వేరొక నామధేయం ఉన్నది”. అతడి పేరు సత్యవంతుడు కాదు. సత్యవంతుడు అనేది అతని ప్రవర్తన వల్ల అతనికేర్పడిన బిరుదు. సత్యవంతుడనే తెలుసు మనకి. చిత్రాశ్వుడు అంటే చిత్రమైన అశ్వము, అంటే ప్రాణము కలవాడు అని. పుట్టుకతోనే అతనికి ఆ పేరు పెట్టారండి. అశ్వమంటే ప్రాణమని చెప్పాను కదా! అశ్వానికి చాలా రకాల అర్థాలు ఉన్నాయి.

అశ్వమంటే సూర్య కిరణములు, అశ్వమంటే ఇంద్రియములు, అశ్వమంటే ప్రాణము. ఇతడు చిత్రాశ్వుడండి. ఎందుకు చిత్రాశ్వుడు అంటే, ఇతడు ప్రాణాలు పోయినట్టే పోయి, తిరిగి వస్తాయి. జాతకంలో అట్లా ఉంది.

మొన్నామధ్య మీరు చూశారో లేదో... కాస్త అప్పుడప్పుడూ ప్రపంచ వార్తలు కూడా వింటూ ఉండాలి. అమెరికాలో, న్యూజెర్సీ ప్రాంతంలో ఒక అమ్మాయి చచ్చిపోయిందని declare చేసేశారు. Declare చేసిన రెండో రోజు... కళ్ళు, కిడ్నీలు, ఇలాంటివి ఆవిడ ఏవో కొన్ని అంగాలు దానం చేసింది. ఆ అంగాలు ఆ దేహంలోంచి తీసి, తర్వాత పూడ్చడానికి పంపిస్తారు ఆ దేశాల్లో. మనమయితే కాల్చుకుంటూ ఉంటాం. వాళ్ళు పూడ్చుకుంటారు. అందుకని, అన్నీ ready చేసి బల్లమీద పడుకోబెడితే, ఆ అంగాలు తీద్దామని, ఆవిడ లేచి కూర్చుందిట. కాస్తోకూస్తో గుండె బలం లేకపోతే, డాక్టరుకి ముందు heart attack రావాలి కదా! మొన్నే, వారం కూడా కాలేదు. రెండో రోజు లేచి కూర్చుంది. అంటే ఏమిటి? పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. ఎట్లా వచ్చినాయో? వాళ్ళకే ఆశ్చర్యం. అన్నీ సరిగ్గా చూశామా, చచ్చిపోయిందని declaration correct గా ఉందా అని. అంటే, చావకుండానే, చచ్చిపోయిందన్నామా? ఇవన్నీ enquiry వచ్చేసినాయండి ముందు. మరి అదలా ఉండగా, తిరిగి వచ్చింది చూడండి, చిత్రాశ్వమే అది. వెళ్ళిపోయిన ప్రాణం తిరిగి రావడం అనేది చిత్రమే కదండి!

చిత్రంగా తిరిగి వచ్చేటటువంటి ప్రాణం కలిగినటు వంటిది ఉన్నది జాతకంలో. అందుచేత, చిత్రాశ్వుడు అని పేరు పెట్టేశారు.

అసలు పేరు అదట. అంటే, తెలిసి పేర్లు పెట్టుకోవడం ఒకటుంది. మనకి ఇష్టమైన పేరు పెట్టుకోకూడదు. పేరు పెట్టాలంటే జాతక చక్రం పరిశీలించి, పెద్దవారిని అడిగి పేరు పెట్టుకోవాలి. మనం బ్రహ్మాండమైన పేరు పెట్టామనుకోండి, వాడు దానికి పరిపూర్ణంగా వ్యతిరేకంగా ఉన్నాడనుకోండి. అంటే, ఆ పేరుకి విలువేం ఉందండి?

అందుచేత, ఇక్కడ తెలిసి పేరు పెట్టారు. చిత్రాశ్వుడు అనే పేరుందాయనకి. "సదా సత్యమే వక్కాణిస్తున్నందువల్ల అతనికి 'సత్యవంతు'డన్న సుప్రసిద్ధ నామధేయ మేర్పడినది". ఎప్పుడూ సత్యమే మాట్లాడతాడట. *"తనుహృద్భాషల సత్యమున్"* అన్నారు. అంటే తనువు, భావము, భాష / ప్రవర్తన, మూడూ ఒకే రకంగా ఉన్నాయి. ఇంకో రకంగా ఉండవు.

"తేజోరాశిలో భాస్కరునితోనూ, బుద్ధిలో బృహస్పతితోనూ, శౌర్యములో వాసవునితోనూ (అంటే ఇంద్రుడితో), ఓరిమిలో పుడమితోనూ, కాంతిలో జాబిలితోనూ, సౌందర్యములో అశ్వినీ దేవతలతోనూ అవలీలగా సరితూగ గలడా రాజకుమారుడు" అని చెప్పాడండి. ఎంతటి వాడండి? అద్భుతంగా లేదూ! ఎవరు చెప్పారు? ఊరికే అబద్ధాలు ఆడుతూ, పక్కవాడిని పొగిడేవాడు కాదు నారదుడు కదా! ఒక దేవర్షే అలా చెప్పాడంటే, అవునో కాదో మనం ఆలోచించక్కర్లేదు కదా! అంటే, మనం ఎవరినైనా అడిగినప్పుడు కూడా వాడెలాంటి వాడో తెలిసి అడగాలి కదా! ప్రతి వాడినీ అడగకూడదు కదా!

నారద మహర్షిని అడిగితే ఎన్ని గుణాలు చెప్పాడు.

సత్యవంతుడికి ఇన్ని గుణాలు ఉన్నాయని మనకి తెలుసా? తెలియదు. పేరుకి చిత్రాశ్వుడు, మాట్లాడేదెప్పుడూ సత్యము. తేజస్సు సూర్యుని తేజస్సు. అంటే, తేజస్సు ముఖంలో ఉంటుందండి. బుద్ధిలో బృహస్పతికి ఉన్నంత జ్ఞానం ఉన్నది. అందుకనే, కదలక మెదలక వనంలో ఉన్నాడు, అరణ్యంలో, రాజ్యం గురించి తాపత్రయ పడకుండా. శౌర్యములో దేవేంద్రుడే. అంత శౌర్యము ఉండి, తన రాజ్యం తను సంపాదించుకోవాలని ఎందుకనుకోలేదో? అది ఎంత గొప్ప విషయం. ఓర్పు, భూమికున్నంత ఓర్పు ఉందట ఆయనకి. కాంతి అంటే సూర్యుని తేజస్సు, చంద్రుని కాంతి ముఖంలో. సౌందర్యము అశ్వినీ దేవతల సౌందర్యమట. మనకి తెలియదుగా. మీకు తెలుసా? అశ్వినీ దేవతలు ఎట్లా ఉంటారో మనకి తెలుసా? అంటే, నారదుడే చెప్పగలడు అశ్వినీ దేవతల సౌందర్యము అంటే, మనమేం చెప్పగలము! అలాంటి సౌందర్యవంతు డాయన. వాళ్ళందరితోనూ అవలీలగా తులతూగ గలడా రాజకుమారుడు అని చెప్పాడండి. ఇంకా చెప్పాడు.

ఇప్పుడు భారతంలో ఇట్లా రాయకపోతే సావిత్రి భర్త ఎవరు అంటే సత్యవంతుడని చెప్తాం. కానీ, జన్మతః అతనికి ఇవ్వబడిన వ్యవహార నామం చిత్రాశ్వుడు. చిత్రాశ్వుడని తెలిస్తే మనకి, కొంత ఊహించవచ్చు ఎందుకిలా పేరు పెట్టారు అని. ఎప్పుడయినా పెద్దలు నామకరణం చేసినప్పుడు జాతక కుండలిని తయారుచేసి, అందులో ఉండే గుణ సమ్మేళనం చూసి, అతని జీవన ప్రయోజనానికి సంబంధించి ఉపయోగపడేటట్లుగా నామకరణం చెయ్యడం అనే విధానం ఒకటి మనకి మన సంప్రదాయంలో ఉంది, ఋషి సంప్రదాయంలో. అందుచేత, మీకు అన్ని పేర్ల

నుంచి దాని లోపల ఉండే అర్థం చెప్తూ వస్తున్నాను. అశ్వపతి అంటే ఏమిటి, సత్యవంతుడికి తండ్రి అయిన ద్యుమత్సేనుడు అంటే ఏమిటి, అతడికి కళ్ళు పోవడం అంటే ఏమిటి, రాజ్యం పోవడం అంటే ఏమిటి, ఇలాంటి వన్నీ మనం తెలుసుకుంటూ వస్తున్నాం. దీన్ని 'నిరుక్తం' అనే ఒక తాళం చెవి అంటారు. ఈ తాళం చెవి ఉంటే గ్రంథం చదువుకునేటప్పుడు దాన్ని చక్కగా మనం అన్వయించుకుని లోపలి అర్థం మనం తెలుసుకోవచ్చు. అలా కాకపోతే, పైపైన ఏదో కథ కొంత తెలిసినట్టుగా ఉంటుంది. లో విషయాలు తెలియాలంటే, గ్రంథస్తమైన విషయములు, భారత, భాగవతాది గ్రంథములు గాని, రామాయణం గాని తెలియాలంటే, కొంత జ్యోతిష్యం పరిచయం ఉండాలి, కొంత పదముల యొక్క పుట్టుకలోకి వెళ్ళి, వాటి లోపల ఉండే అర్థములు తెలుసుకోవడం అనేది ఉండాలి. అలా పెద్ద గ్రంథములలో ఉండే ఒక అమరికను గుర్తించి, అందలి లోపలి అర్థం తెలుసుకోవడం అనే విధానం ఒకటి ఉండాలి. అలా లేకపోతే ఏం అర్థం కాదు. దాన్ని నిరుక్తము అంటారు. అదొక తాళం చెవి.

జ్ఞానం సంపాదించుకోవడానికి జ్యోతిష్యము. అంటే, జాతకాల కోసం కాదు జ్యోతిష్యం, జీవుని యొక్క స్వభావం తెలియడానికి. ఆ స్వభావాన్ని ఏ విధంగా వృద్ధి చేసుకోవచ్చు? ఉన్న స్థితి నుంచి వృద్ధి అవ్వడానికే ప్రయత్నం చేస్తూ ఉంటాం కాబట్టి, వృద్ధి చేసుకోవడానికి ఏ ఏ గ్రహముల యొక్క ఆనుకూల్యత సంపాదించవచ్చు. గ్రహానుకూలత సంపాదించడం అంటే పూజలు, పునస్కారాలు చెయ్యడం కాదు. తదనుగుణమైన ప్రవర్తనని తమ జీవితంలోకి చొప్పించాలి. ఊరికే అప్పటికప్పుడు ఏదో మాట చెప్పి

తప్పించుకునే ఒక బుద్ధి ఉందనుకోండి మనకి. ఇప్పుడు ఏదయినా చెయ్యవలసిన పని ఉన్నప్పుడు, మనం చెయ్యలేనప్పుడు దాన్ని సూటిగా ఒప్పుకునే బుద్ధి కొంతమందికి ఉంటుంది. కొంతమంది దాన్ని ఏదో కప్పి పుచ్చి మాట్లాడటం అనేది ఒకటి ఉంది కదా! *'ఎప్పటికయ్యేది ప్రస్తుత మప్పటికా మాటలాడి, అన్యుల మనముల్ నొప్పింపక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడు'*... ధన్యుడు కాదు. లోకరీతిలో తప్పించుకు తిరుగుతాడు అంతే! తప్పించుకు తిరిగే వాడి వల్ల ఏ పనులు అవ్వవు. దాని వల్ల వాడికీ వృద్ధి ఉండదు, వాడి చుట్టూ ఉండే వాళ్ళకీ వృద్ధి ఉండదు కదా! ఇలా ఉందనుకోండి, ఉంటే ఏం చూడాలంటే, ఇతడికి బుధుడు, వాక్కుకి బుధుడు, బుధ గ్రహం, అది ఎలా ఉంది? అది బాగోలేదు. అది బాగోలేకపోవడం చేతే ఏదో పాదరసంలా మాట్లాడేసి, తప్పించుకు తిరుగుతూ ఉంటాడు. అలా తిరుగుతున్నా డనుకోండి, అప్పుడు వీడికేం చెయ్యాలి మనం?

ఏం చెయ్యాలంటే, బుధుడికి పూజలు చెయ్యండి అంటారు. ఇట్లా కాదు చెయ్యాలిసింది. ఒకటే చెప్పాలి, నువ్వు కొన్నాళ్ళపాటు మౌనం వహించు, అవసరం అయిన మాటే మాట్లాడు, అవసరం లేని మాట మాట్లాడక. నువ్వు బాగుపడాలంటే ఇదొక్కటే మార్గం అని హితం కోరి చెప్పాలి. **కోరకపోతే ఎవరికీ చెప్పకూడదు. కోరని వారికి ఎప్పుడూ హితం చెప్పకూడదు.** కోరితే చెప్పవలసినదేమిటంటే, నీవు కొన్నాళ్ళు మౌనం పాటించు, అత్యవసరం అయితే తప్ప మాట్లాడవద్దు అని. ఒక పిసినారి డబ్బులు ఖర్చు పెట్టాలంటే ఎంత బాధ పడుతూ ఖర్చు పెడతాడో, అలాగే నీవు మాట మాట్లాడం అంత పిసినారితనంతో మాట్లాడమని చెప్పాలి వాడికి. పైథాగొరస్

మహర్షి దగ్గరికి ఎవరయినా శిష్యరికానికి వస్తే మొదట మూడేళ్ళు మౌనం ఇచ్చేసేవాడు. ఎందుచేత అంటే, మౌనం వల్లే మనిషి మహత్కార్యాలు చెయ్యగలడు. అలా రాళ్లు వేసిన డబ్బాలాగా వాగుతూ ఉంటే అతని ప్రజ్ఞ అంతా ఖర్చు అయిపోతుంది తప్ప, ఆ ప్రజ్ఞను సరైన మార్గంలో ప్రవహింపచేసి, చక్కగా జీవితాన్ని పండించుకో గలిగిన శక్తి ఉండదు. ఎందుచేత అంటే, మాట నుండి ప్రాణం వెళ్తూ ఉంటుంది, మాట నుండి ప్రజ్ఞ ప్రవహిస్తూ ఉంటుంది. ప్రాణము, ప్రజ్ఞా ఊరికే అడ్డుగోలుగా ఖర్చు పెడితే, ఎంత ధనవంతుడయినా నిరుపేద అయిపోతాడు.

ఇలా చూశామనుకోండి మనము వాడి స్వభావంలో... కొంతమంది స్వభావంలో కొన్ని కొన్ని ప్రత్యేకంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటాయి, సద్గుణాలు గాని, లేక కొన్ని లోటుపాట్లు గాని. వాటిని చక్కగా సరిదిద్దడానికి మార్గాలు ఉంటాయి. అలా మనకి జ్యోతిష్యం వల్ల ఉపయోగం ఉంది. స్వభావంలో చక్కని మార్పు కొనితెచ్చుకుంటే, మానవ స్వభావం క్రమంగా దైవీ స్వభావంగా మారే అవకాశం ఉంది. లేదా, అదే మానవ స్వభావం పశు స్వభావంగా మారే అవకాశం ఉంది. మనకి రెండు దార్లు ఉన్నాయి. ఒకటి, ఇప్పటికన్నా ఇంకా పాడయిపోవడం, ఏదీ స్వభావంలో. లేదా, పశు ప్రవృత్తిలోకి వెళ్లిపోవడం. మరొకటి, దైవీ ప్రవృత్తిలోకి వెళ్ళిపోవడం. లేదా, ఉత్తమ మానవ ప్రవృత్తిలోకి వెళ్ళడం. దీనికి మన యొక్క ప్రయత్నమే ప్రధానంగా ఉంటుంది. దానికి దారి చూపించే వాడు సద్గురువు. అందుచేత, ఈ శాస్త్రం తెలిసి ఇలాంటి గ్రంథాలు చదువుకుంటే అవగాహన చాలా

ఎక్కువ వస్తుంది. గ్రంథంలో మనకి జ్యోతిష్యం కూడా వస్తుంది ఈ ఉపాఖ్యానంలో. అది వచ్చినప్పుడు చెప్పుకుందాం.

అందుచేత, ఇతడు చిత్రాశ్వుడు. చిత్రాశ్వుడంటే, ఇది ఎవరికి వర్తిస్తుందంటే, దాదాపు చచ్చిపోయి, బ్రతికిన వాళ్ళందరికీ పనికొస్తుంది ఈ పేరు. Near death experiences అని hospitals లో research చేసి బాగా పరిశీలిస్తున్నారు. అంటే, దాదాపు చచ్చిపోతాడు రోగి, కాని కొన్ని గంటల తర్వాత బ్రతికొస్తాడు. బ్రతికొచ్చినప్పుడు, నీకు అప్పుడేం అనిపించింది ఆ సమయంలో అంటే, ప్రతి వాళ్ళూ కొన్ని కొన్ని అనుభూతులు చెప్తారు. ఈ మధ్యే అటువంటి సినిమా ఒకటి తీశారు హాలీవుడ్లో. సునామీ వచ్చి ఒకావిడ French journalist నీళ్ళలో మునిగిపోయి, తనతోపాటు ఉండేవాళ్ళూ కొంతమంది మునిగిపోయి, అందరూ చనిపోవడం, వేరే లోకాల్లోకి వాళ్ళు ప్రవేశించినట్టు, ఇటువంటి అనుభూతులు వస్తాయి. తర్వాత ఎవరో వచ్చి పొట్ట బాగా నొక్కి నీరు బయటకి తీస్తే మళ్ళీ ప్రాణం వస్తుంది. ఆవిడ చెప్తుంది, ఏమనంటే, **మరణించడం అంటే మనం లేకపోవడం కాదు అని.** అది మనబోటి వాళ్ళకి, భారతీయులికి ఎప్పటినుంచో తెలుసు. ఇప్పుడు కూడా ఈ near death experiences ఉన్నవాళ్ళ దగ్గర నుంచి చాలా విషయాలు తెలుస్తూ ఉంటాయి. ఇట్లా వీళ్ళందరినీ చిత్రాశ్వులు అని చెప్పవచ్చు. ఎందుకంటే, చిత్రంగా వెళ్ళిపోయిన ప్రాణం మళ్ళీ తిరిగి వస్తుందన్నమాట. ఇది అతని అసలు పేరు. అతడి జీవ లక్షణంలో ఒకసారి ప్రాణములు పోయి తిరిగి వస్తాయి.

మనకి కూడా జాతకాలు చూసి పెద్దలు చెప్తూ ఉంటారు,

ఫలానా సంవత్సరంలో ఈ పిల్లవాడికి గండం ఉంది అంటారు కదా! ఈ గండం తప్పించుకునే మార్గం ఏంటి అంటే ఏదో చెప్తారు కదా! అట్లా గండాలు తప్పించుకుని బయట పడిపోతూ ఉంటారు. గండం వచ్చినప్పుడు కొన్ని గంటల పాటు, కొన్ని రోజుల పాటు దాదాపు మరణించి, మళ్ళీ బ్రతికిన వాళ్ళు ఉన్నారు. అలాంటి వాళ్ళందరిని చిత్రాశ్వులు అంటారు. ఈ అశ్వమేధ యాగం కూడా అలాంటిదే. అశ్వం ఎత్తుకుపోయారంటే ప్రాణాలు పోయాయని అర్థం, పోయిన ప్రాణాలు పట్టుకొచ్చారని అర్థం. అలా కథలు ఉన్నాయి మనకి. పృథు చక్రవర్తి కథలో అలాంటి సన్నివేశం వుంటుంది. అశ్వాన్ని ఇంద్రుడు ఎత్తుకుపోవటం, మరల పృథువు అశ్వాన్ని కొనిరావడం అనే సందర్భం వివరిస్తారు భాగవతంలో.

అందుచేత, ఇక్కడ ఈ సత్యవంతుడి అసలు పేరు మనం ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలి చిత్రాశ్వుడు అని. అదే యోగ మార్గంలో ఈ ప్రాణములను పట్టుకుని, శరీరం నుంచి మనం భౌతిక ప్రాణములు భౌతిక దేహానికి అప్పచెప్పేసి, సూక్ష్మ ప్రాణాలను పట్టుకుని జీవుడు ఊర్ధ్వ లోకాలకి వెళ్ళే మార్గములన్నీ కూడా యోగవిద్యలో ఇచ్చారు. దాన్నే ప్రాణాయామము తర్వాత ప్రత్యాహారము, ధారణ, ధ్యాన స్థితులు అని చెప్తారు. ధారణ స్థితిలో శరీరాన్ని మనం ధరించి ఉన్నాం తప్ప, శరీరం మనను ధరించి లేదు అని తెలుస్తుంది. మనం శరీరంలో బందీకృతులై ఉన్నాం, ఇలాంటివన్నీ తెలియడానికి పెద్ద విజ్ఞానం అక్కర్లేదు. శరీరం మన నుంచే ఏర్పడింది. మనము పెట్టుబడిగా శరీరం ఏర్పడింది. మన నుంచి ఏర్పడిన దాని మీద మనకి స్వామిత్వం ఉన్నదా, బానిసత్వం ఉన్నదా అనేది లెక్క. స్వామిత్వం ఉన్నదనుకోండి, దాన్ని అలా

వదిలేసి, అలా, అలా, అలా సూక్ష్మ లోకాల్లో విహరించి, మళ్ళీ కావాలనుకుంటే దాంట్లో ప్రవేశించవచ్చు. అదీ యోగవిద్య. అందుచేత, మొత్తం కథంతా ప్రాణము, ప్రజ్ఞ, వీటికి సంబంధించిన కథలు ఉంటాయి గ్రంథాల్లో. మనిషికి ఆత్మ తత్త్వం, జీవాత్మ అంటూ ఉంటాం. ప్రతి జీవుడు కూడా ప్రాణము, ప్రజ్ఞ యొక్క జమిలి రూపంగా ఉంటాడు, స్పందనాత్మక చైతన్యంగా.

ఇతడు చిత్రాశ్వుడని చెప్పబడినప్పుడే అర్థమయిపోయి ఉండాలి అశ్వపతికి. నారదుడు మొట్టమొదటగా ఏం చెప్పాడంటే, ఏది అశుభం అని చెప్పి అందరూ అనుకుంటున్నారో ఇతని విషయంలో అది శుభం అని చెప్పాడు. ఎందుచేత అంటే, సత్యవంతుడు ఇప్పటి నుంచి ఒక సంవత్సరంలో మరణిస్తాడని కథ ఉంటుంది. ఈ సంభాషణ మొదలు పెట్టినప్పటినుంచి ఒక సంవత్సరం లోపల మరణం, అది కూడా చెప్తాడు నారదుడు. కాకపోతే, అతడు చిత్రాశ్వుడు. అంటే అతని ప్రాణములు అంత సులభంగా హరింపబడవు అని తెలుస్తుందన్నమాట. అలాంటివాడు సత్యవంతుడు, ఒకటి. రెండోది, చాలా తేజస్సు కలవాడు.

వెలుగుని ఆరాధన బాగా చేస్తుంటే తేజస్సు వస్తుంది. అందుకనే, మనకి ఈ సూర్యోదయం సమయంలోనూ, సూర్యాస్తమయ సమయంలోనూ, పూర్ణిమా సందర్భాల్లోనూ, వెలుగు ఆరాధన, దైనందినంగా చేసుకునే దానికన్నా చాలా ఎక్కువగా చేసుకోమని చెప్తారు. ఎందుచేత అంటే, ఏ వెలుగయితే నువ్వు సూర్యుడిలోనూ, చంద్రుడిలోనూ చూస్తావో, ఆ వెలుగే నీయందు నీవలే ఉంది. అందుకని, దానితో నువ్వు అనుసంధానం

చెందడం వల్ల, నీలో తెలివి అనే ప్రజ్ఞ పెరుగుతుంది, ప్రాణము యొక్క శక్తి పెరుగుతుంది. తదనుగుణంగా నువ్వు పటిష్ఠంగా, స్థిరంగా నిలబడి, నీవు నిర్వర్తించవలసిన కార్యములు నిరాటంకంగా నిర్వర్తించుకుంటూ ఉండవచ్చు. అందుచేత, ప్రజ్ఞను మనం ఆహారం పుచ్చుకున్నట్టుగా, ప్రజ్ఞను బలపరుచుకోవడం, ప్రాణాలను బలపరుచుకోవడం అనేది రోజూ ప్రార్థనలో భాగంగా ఎవరయితే చేస్తూ ఉంటారో అలాంటి వారందరికీ కూడా తేజస్సు పెరుగుతుంది. పొద్దునే నిద్రపోయేవాళ్ళకి పెరగదు. ఉన్నదే ఉంటుంది. అది కూడా క్రమంగా ముందు చెప్పినట్టుగా హరింపబడుతూ, చిట్టచివరికి మతిభ్రమణం, మతిమరపు, ఇటువంటివి అన్నీ వచ్చేస్తాయి.

సూర్యోదయం అవ్వడానికి ముందు గంటన్నరసేపు, సూర్యోదయం తర్వాత గంటన్నరసేపు, ఈ మూడు గంటల కాలము అమృత గడియలని చెప్తారు. దేనికి అమృతం అంటే, నీ ప్రజ్ఞకి అమృతత్వాన్ని ఇస్తాయి అవి. ప్రజ్ఞకి అమృతత్వాన్ని కలిగించే సందర్భం అది. సాయంకాలం సూర్య అస్తమయానికి ముందు గంటన్నర సేపు శరీరానికి కావలసిన బలం అంతా కూడా వ్యాయామం ద్వారా గాని, క్రీడల ద్వారా గాని అందుకోవచ్చని మన సంప్రదాయం చెప్తుంది. ఉదయం పూట క్రీడలు కాదు, ఆరాధన. సాయంత్రం పూట క్రీడలు. అప్పుడు సూర్యుడి వెలుగులో... నాలుగున్నర నుంచి ఆరు గంటలనుకోండి. ఆరు గంటలకు సూర్యోదయం, ఆరు గంటలకు సూర్యాస్తమయం అవుతోందని మనం భావించినట్టయితే, దానికి గంటన్నర ముందు, గంటన్నర తర్వాత, ఉదయం మూడు గంటల సేపు నీ ప్రాణములను,

నీ ప్రజ్ఞను నువ్వు చాలా బలపరుచుకోవచ్చు. ఆ సమయంలో నిద్రపోతే అతడి ప్రజ్ఞ అంతగా వికాసం చెందేటటువంటి అవకాశం లేదు. ఎందుకంటే, మొత్తం భూగోళానికే వికాసం కలిగించేటట్లుగా సూర్యుడి ఉదయం గోచరిస్తుంది. ప్రాంతీయమైన సూర్యోదయం అది. కాబట్టి ఆ ప్రాంతంలో ఉండే వారంతా కూడా అప్పుడు సూర్యుడు అందించే కిరణముల ద్వారా పొందగలిగిన ప్రాణము, ప్రజ్ఞ చాలా అమితంగా ఉంటుంది. అలాగే, సాయంత్రం సమయంలో కూడా ఆ విధంగా ఉంటుంది.

అందుచేత, ఉభయ సంధ్యలయందు కూడా ఈ వెలుగు ఆరాధన ఎవరయితే చేసుకుంటారో వారిలో తేజస్సు పెరుగుతూ వస్తూ ఉంటుంది. అది నిస్సందేహం. ప్రయత్నం చేసి ఆ విధంగా తెలుసుకుంటున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. దానికి వ్యతిరేకంగా ప్రస్తుతం అధునాతన కాలంలో నిద్రపోతూ ఉంటాం పొద్దున్నపూట. అందులో ఆదివారం వస్తే ఎక్కువ నిద్రపోతాం కదా! ఆదివారం కదా! పడుకోవాలి అనుకోకూడదు. ఆదివారం కదా, రోజూ కన్నా ముందు లేవాలి. ఎందుకని? ఆదివారం ఆదిత్యుని యొక్క ప్రజ్ఞ మనయందు ఎక్కువగా ప్రసరించే అవకాశం ఉన్నది. ఆదిత్య ప్రజ్ఞ ఎక్కువగా మన వరకూ ప్రసరిస్తుందంటే, ఆ సమయంలో ఎక్కువగా నిద్రపోతే ఎట్లా? ఎక్కువ మేల్కొని ఉండాలి. తూర్పు దేశాల్లో ఉండేటటువంటి మేధోబలం ఎక్కడినుంచి వచ్చిందంటే వారికి... (ఇప్పుడు నిస్సందేహంగా అన్ని దేశాల్లో భారతీయుని ప్రజ్ఞా పాటవాలను అంగీకరిస్తూ ఉన్నారు. The Indian brain is considered to be of extraordinary abilities and capabilities.) ఎందుకిలా ఉందంటే, మన పూర్వీకులు

అలా తెల్లవారుజామున మూడు గంటలకి లేచి చేసిన సాధనకి సంబంధించిన మేధోసంపత్తి అంతా మన మేధస్సులో కాస్తో, కూస్తో నిలబడి ఉండడం చేత.

ఈ రోజుల్లో ఒక scientist కావాలనుకున్నా, ఒక software engineer అయినా, computers అయినా, అది విద్యారంగం అయినా, అది వైద్యరంగం అయినా, వైజ్ఞానికరంగం అయినా, ఏ రంగంలో అయినా సరే, భారతీయులు చాలా చక్కగా అపూర్వమైన విజయాలు సాధిస్తూ వస్తున్నారు. మీకు ఏ research లో చూసుకున్నా భారతీయులు ముందడుగులో ఉన్నారు. ఈ software వీటి గురించి తెలుసుకుంటే, hardware కనిపెట్టింది ఇజ్రాయిల్ వాళ్ళు అయితే, software దాన్ని ఉపయోగించినది Asians. అందులో మిక్కిలిగా, విశ్వసనీయంగా ఈ కార్యక్రమాలు నిర్వర్తించేవాళ్ళు భారతీయులని వాళ్ళకి విశ్వాసం. అందుకనే, మీరు యునైటెడ్ స్టేట్స్ వెళ్తే, అక్కడ ఒక భారతీయుడు, ఒక చైనీస్ ఉంటే, ఎవరిని కోరుకుంటారు మీరు అని అడిగితే, భారతీయుడినే కోరుకుంటాం అంటారు. Reliability అలాంటిది. ఎందుకివన్నీ ఉన్నాయంటే, ఇంకా మనలో మన పూర్వీకుల సెగ ఉండడం చేత. ఇప్పుడు మనం ఇలా నిద్రపోతున్నాం అనుకోండి పొద్దున్న పూట, వాళ్ళకి ఈ ధీశక్తి తగ్గిపోతూ వస్తుంది.

ఇక్కడ సత్యవంతుడు తేజోరాశి అన్నారు. ఆయన తేజోరాశిలో భాస్కరునివలె మెరుస్తూ ఉంటాడండి. కొంతమందికి వారి ఫాలభాగం చాలా కాంతివంతంగా ఉంటుంది. మామూలుగా కనిపించే దాని కన్నా ఫొటోలు తీస్తే ఎక్కువ కాంతివంతంగా

ఉంటారు. ఇదేంటండి, ఫొటోలో బావున్నారు మామూలుగాకన్నా అని అంటారు. ఎందుకిలా కనిపిస్తుందంటే, it can capture auras relating to your face. అందుచేత, కాంతివంతంగా పౌడర్లు పూసుకుంటేను, cosmetic treatments చేయించుకుంటేను వచ్చేది నిలబడదు కదా! ఇలా వచ్చే వాళ్ళకి చాలా శాశ్వతంగా ముఖం వెలుగుతూ ఉంటుంది. అంతేకాదు, స్ఫూర్తి ఉంటుంది, ప్రస్తుతంలో జీవించడం ఉంటుంది. ఏదయినా అప్రమత్తత అనేది చాలా అద్భుతంగా పనిచేస్తూ ఉంటుంది. దానితోపాటు బుద్ధి వికాసం కలుగుతుంది. మన బుద్ధి రోజురోజుకి వికాసం చెందాలంటే... ఇప్పుడు మనకి పదేళ్ళ క్రితం ఎంత తెలుసో, ఇప్పుడూ అంతే తెలుసంటే కుదరదు కదా! ఈ రోజు ఏం నేర్చుకున్నావు కొత్త విషయం? ఈ రోజు నీ ప్రజ్ఞ వికాసం చెందడానికి కొత్తగా ఏమయినా నీకు తెలిసిందా? మామూలుగా routine life లో తెలుసుకోవడం అనేది మర్చిపోతాడు మనిషి, ఎందుకంటే ఆ routine నిర్వర్తించడమే అంతా అయిపోతుంది. సరే తెలుసుకోవలసినది ఎంత ఉంది అంటే, అనంతంగా ఉంది. అనంతమైనటువంటిది జ్ఞానం. *"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ"* అన్నారు. అనంతమైన జ్ఞానం పొందడానికి వలసిన పరికరం మనయందు ఉన్నప్పుడు మనం దాన్ని వినియోగించుకోవడం లేదు కదా! వినియోగించుకోకపోతే ఏమీ తెలియదు.

ఎవరయినా మీ ఊరు ఏమిటంటే, ఆ ఊరు పేరు చెప్తే, ఈ పేరు ఎందుకొచ్చింది అని అడుగుతూ ఉంటాను నేను. ఏమో తెలియదండి అంటారు. ఏమో తెలియదేంటి? అక్కడే పెరుగుతున్నావు కదా, తెలుసుకోవద్దా? ఇప్పుడు హైదరాబాద్

అన్నారు. ఎందుకొచ్చిందా పేరు? ఎవరో ఒకాయన పరిపాలించాడు ఆ పేరుతో, హైదర్ ఖానో, హైదరాలీ ఖానో. ఆయన పేరు పెట్టేశారు. ఆయన రాకముందు ఏముంది పేరు? భాగ్యనగరం. ఆ పేరెందుకు వచ్చింది, భాగ్యనగరం అని? భాగ్యలక్ష్మి అనే అమ్మవారు ఇక్కడ మొట్టమొదట ఈ గ్రామంలో వెలిసి ఉండేది. అందుకని దీన్ని భాగ్యనగరం అన్నారు. మూసీనది, ఏమిటి మూసీనది? మూసి అని పేరు ఎందుకు వస్తుంది? అది మూసీనది కాదు, ముచికుంద నది. ముచికుంద నది, మూసీనది అయిపోయింది. ముస్లింలు మన దేశంలో ప్రవేశించి, పరిపాలించిన సమయంలో. అట్లా మార్పు చెందింది. వెతుక్కుంటూ నువ్వు వెళ్తే, నీకు ఎంతో తెలుస్తుంది. నీ పేరు ఎందుకొచ్చిందలా అని కూడా ఆలోచించాలి. నీకు ఈ పేరు నీ తల్లితండ్రులు పెట్టారంటే, తదనుగుణమైన గుణములు నీవు సంపాదించుకుని సార్ధక నామధేయుడివి కావాలి. అంతేనా? పేరయితే పెడతారు, మరి ఆ పేరుకి తగట్టుగా నువ్వు జీవించాలి. అంటే పేరులో అంత ఉంది.

ఇలా నేర్చుకోవడం అనేది ఒకటుందండి. ఈ నేర్చుకోవాలనే ఉత్సాహం ఉంటుందే, అంటే పనికిమాలిన విషయాలు గూర్చి కాదు. అది కాదు కావలసినది. అది నీకు పనికొస్తుందా? అది నీకు వికాసాన్ని ఇస్తుందా? నీ ప్రజ్ఞకు వికాసం కలిగించేది నీకు ఈ రోజు కొత్తగా ఏమైనా తెలిసిందా? తెలియకపోతే ఆ రోజు వృథా అయిపోయిందని అనుకుంటారు ఆర్యులు. ఏదో ఒకటి. నువ్వు గ్రంథం తీసి చదివితే నీకు అంతకు ముందు తెలియని విషయాలు తెలుస్తూ ఉంటాయి. అందుకనే, *“స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం” అనే ఆశంసనం ఒకటి ఇచ్చారు. చదువుకో!*

*రోజూ చదువు. "చదువని వాడజ్ఞుండగు".* చదువుకోపోతే అజ్ఞానం వచ్చేస్తుంది. ఈ రోజుల్లో మంచి వృత్తుల్లో ఉన్నవారు రోజూ చదువుకోపోతే వెనకబడిపోతారు. అందుచేత స్వాధ్యాయం. నిత్యమూ ఏదో ఒకటి తెలుసుకో. దివ్యమైన విషయాలు తెలుసుకుంటే మెదడుకి వికాసం ఎక్కువగా కలుగుతుంది. Newspaper లో కూడా అప్పుడప్పుడు మంచి మంచి విషయాలు మనకి వికాసం కలిగించేవి గోచరిస్తాయి. కాని సద్గ్రంథాల్లో అవే ఎక్కువగా ఉంటాయి. Newspaper లో అక్కడక్కడా ఉంటాయి.

అందుచేత, రోజూ నీకు వికాసం కలిగించేటట్టుగా నువ్వు ఏం చేస్తున్నావు? దానికి మన పెద్దలు ఏం చెప్పారంటే నిత్యమూ స్వాధ్యాయము చెయ్యమని చెప్పారు. ఏదో ఒక గ్రంథం పావుగంట సేపయినా నువ్వు పారాయణ చెయ్యి. శ్రద్ధగా చదువుకోవడాన్ని పారాయణం అంటారు. చదువుకుని, దాన్ని ఆకళింపు చేసుకున్నావనుకో, నీకు ఒక కొత్త విషయం ఆచరణాత్మకమైనది గాని, లేకపోతే సృష్టిని గురించినది గాని ఒకటి తెలుస్తుంది. ఇలా తెలుస్తూ ఉంటే నీ బుద్ధి ప్రచోదనం అవుతూ ఉంటుంది, బుద్ధి వికాసం కలుగుతూ ఉంటుంది. ఇలాంటి జిజ్ఞాస మనసుయందు ప్రతివారికి ఉందండి. ఏం జిజ్ఞాస? తెలుసుకోవాలన్న జిజ్ఞాస.

కుతూహలం ఉందా? ఒక ఉత్సుకత ఉందా? అది దివ్యగుణం. అలాంటి దివ్యగుణం మనలో ఉంటే, దాన్ని మనం దేని మీద అన్వయిస్తాము అనే దాన్ని బట్టి మనకి తెలియడం అనేదుంటుంది. దాన్ని ఈ విధమైన దివ్యమైన విషయముల మీద మరల్చి వికాసం పొందడానికి సృష్టిలో ఉండేటటువంటి

principle ని మన వారు గ్రంథాల్లో నారదుడు అంటారు. నీ బుద్ధి వికాసానికి నువ్వు చేసే ప్రయత్నంలో నీకు తోడ్పాటు కావిస్తుంది నీకుండే ఉత్సుకత. ఇప్పుడు మీరెందుకు ఇట్లా గురుపూజలకు వస్తున్నారు? ఇప్పుడు ప్రతి ఏడాది ఇట్లా ఏర్పాట్లు చేసుకుంటున్నాం కదా, అలాగే చాలా ఊళ్ళల్లో చేస్తూ ఉంటారు కదా! అన్ని చోట్లకి వచ్చి ఎందుకు వింటారు? తెలుసుకుందామనే కదా! తెలుసుకుందామనేది లేకపోతే వికాసం రాదు కదా! తెలుసుకున్నది ఆచరిస్తే ఇంకా వికాసం వస్తుంది. ఇలాంటి వికాసాన్ని కలిగించే ప్రధానమైన గురువు నారదుడు.

"నారద" అన్న పదం ఉందండి మనకి. ఏం అర్థమైంది "నారద" అంటే? "నర". దేవుడి పేరు కూడా నారాయణుడు అన్నారు. "ర" అంటే నశించేది. "నర" అంటే నశింపనిది. "నరుడు". మనమంతా నరులం కదా! అంటే, నశింపని వారము. నశింపని తత్త్వాన్ని "నర" అంటారు. ఆ నశింపని తత్త్వాన్ని మనకి పరిచయం చేసి, మనం అదే అని తెలియ చెప్పడానికి కావలసిన విజ్ఞానం అంతా కూడా, "దా" అంటే ఇచ్చేవాడు అని అర్థం, నారదుడు. నీవు శాశ్వతుడవు, నీవు ఎప్పుడూ ఉన్నావు, దేహాలు మారుస్తూ ఉన్నావు, అయినా నీ నశింపని స్థితి నీయొక్క శాశ్వత స్థితి అని నీకు తెలియడానికి కావలసిన జ్ఞానం అంతా కూడా నీకు అందించడానికి, ఈ కనబడకుండా ఉండే చోటులో సంచరిస్తూ ఉంటాడట అన్ని లోకాల్లోనూ. అది ఒక principle. అది ఇలా మనలో ఈ ప్రాంతంలో వెళ్తూ ఉందనుకోండి, మనకేదో తెలుసుకుందా మనిపిస్తుంది. అంతవరకూ మనసులో తెలుసుకుందాం అనిపించని వాడికి కూడా తెలుసుకుందాం

అనిపిస్తుంది. అలాంటి వాడతను. మనలో ఈ విధంగా తెలియపరచడం అనే ప్రజ్ఞ సృష్టిలో ఉన్నదాన్ని మన ఋషులు 'నారదుడు' అని పేరు పెట్టారు. కాబట్టి ఆయనకి తెలియని విషయం లేదు. ఆయన బుద్ధులకు బృహస్పతి.

ఈ సత్యవంతుడు కూడా, ప్రతినిత్యం ఏదో ఒకటి అధ్యయనం చేసి తెలుసుకునే తత్త్వం కలిగినవాడు. అది అతని యొక్క మరియొక గుణం. అటుపైన క్షత్రియ కుమారుడు అయివుండడం చేత చాలా పరాక్రమవంతుడు. ముఖ్యమైన గుణం సత్యవంతుడిలో. అంటే, ఇప్పుడు చరిత్ర తీసుకుంటే ఎంతోమంది పరాక్రమవంతులు ఉన్నారు. కానీ సత్యవంతుడి యొక్క గొప్పదనం ఏమిటంటే, తన తండ్రి రాజ్యాన్ని అధర్మ మార్గంలో అతని దగ్గర ఉండే అనుయాయులే కబళించి, తన తండ్రిని, తల్లిని, తనను, ముగ్గురినీ అరణ్యానికి పంపించేస్తే, మహా పరాక్రమవంతు డైనప్పటికీ కూడా, రాజ్యం గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా ఉన్నాడండి. అదెలా సాధ్యం? కళ్ళ ముందే మన ఆస్తి అంతా దోచేశారనుకోండి. మనలో చాలా పరాక్రమం ఉంది, జయించగలవు. జయించగలిగి ఉండి, ఆ పోనిద్దూ అని ఉన్నాడంటే ఏమిటండి? అదే నిజమైన పరాక్రమం అని చెప్తుంది మన శాస్త్రం.

**మౌనం చేత పరాక్రమించవచ్చు. మౌనము చేత, అకర్మ చేత పరాక్రమించవచ్చు.** సూర్యుడు అస్తమించని సామ్రాజ్యం బ్రిటిష్ వారిది అని చెప్పుకుంటూ ఉండేవారు. ఇప్పుడు అస్తమించేసి బాగా చీకటులు కూడా వచ్చేసినాయి. అదలా ఉండగా, అలాంటి సామ్రాజ్యాన్ని ఎవరు ఎదిరించగలరు? ఒక్క మనిషి

ఎదిరించాడు. దేని చేత? సత్యము చేత, మౌనము చేత. అంటే, మహాత్మాగాంధీ ఎంత వీరుడై ఉండాలి? అంటే, నువ్వు, నేను ఇవాళ నుంచి hunger strike అంటే ఎవ్వడూ పట్టించుకోడు కదా! మహాత్మాగాంధి ఏ రోజయినా సత్యాగ్రహము అని చేస్తే, ఆ రోజు బ్రిటిష్ పరిపాలకులలో ఒక రకమైన సంచలనం లోపల పుట్టుకొచ్చేది. దేనివల్ల సంచలనం? సత్యము వలన. అంటే, సత్యము చేత, తాను అక్కడే ఉండి, వారియందు వ్యాప్తి చెంది, వారికి కలత కలిగించేంత పరాక్రమము మహాత్మా గాంధిలో ఉన్నది. ఆ పరాక్రమము ఎక్కడి నుంచి వచ్చిందాయనకి? ఆయన అనుసరించిన సత్యములోంచి వచ్చినది. ఆయన రాశాడు కదా సత్యముతో నేను చేసిన ప్రయోగాలు అని! తప్పకుండా చదువుకోవాలి మనం. ఎందుచేతంటే, దానికున్న బలం దేనికీ లేదు.

ఆక్రమించడం అంటే భౌతికంగా ఆక్రమించడం కాదు. నీకు నచ్చని విషయం నీ పరిసరాల్లో జరుగుతూ ఉంటే, నువ్వు మౌనం వహిస్తే, నీ చుట్టూ ఉండే వాళ్ళు క్రమంగా సర్దుకుంటారు. ఆయన కేదో మనం ఇబ్బంది కలిగించినట్టున్నాం అని. అలాగే కార్యాలయంలో కూడా మనం కొంచెం మౌనంగా ఉంటే, ఏదో తేడా పడ్డది జరుగుతున్న పనుల్లో, అందుకనే ఇలా మౌనంగా ఉన్నాడు అని అనిపించాలి అవతలి వాళ్ళకి. ఎప్పుడనిపిస్తుందో తెలుసా? నువ్వు సత్యవంతుడివైతే అనిపిస్తుంది. లేకపోతే అనిపించదు. లేకపోతే పట్టించుకోరు. నీకు ఇంకా tension పెరిగిపోతూ ఉంటుంది తప్ప! అందుచేత, **సత్యము వలన పరమును ఆక్రమించుట.** అలాంటి ప్రయత్నాలు చేస్తే, నీలో సత్యము ఉందా

లేదా తెలుస్తుంది. ఎందుకంటే, మనం ఇలా మౌనంగా ఉంటే, చుట్టుపక్కల ఎవరికీ అలజడి కలగలేదనుకోండి, అంటే మనలో సత్యము లేదని తెలుస్తుంది. అలజడి కలుగుతోందనుకోండి, దాని ప్రకంపనలు ఎంతవరకూ ఉన్నాయి అనేది తెలుస్తుంది.

మనకి విష్ణు సహస్ర నామాలలో ఒక నామం వస్తుంది, రాముడి గురించి చెప్తూ, సత్యపరాక్రముడంటారు. సత్యపరాక్రముడంటే, రాముడు అరణ్యంలో ఉన్నప్పటికీ, రాముని పేరు చెప్తే రావణుడు భయపడుతూ ఉండేవాడు. ఏం చెయ్యలేదు యింకా! అలాగే, కృష్ణుడు రేపల్లెలో ఉండి ఆడుకుంటూ ఉంటే, అక్కడ మధురలో కంసుడు భయపడుతూ ఉండేవాడు. ఎందుచేత? కంసుడియందు అధర్మమున్నది, కృష్ణుడికి అది తెలుసు, తెలిసి ఊరుకున్నాడు. ఎందుకు ఊరుకున్నాడని భయం. తెలిసి ఊరుకుంటే భయం కదండి! అందుకని, **ఎదుటివారు తప్పులు చేస్తే, మాటిమాటికి మనం సరిదిద్దడం మొదలు పెడితే, వాడు విసిగిపోతాడు. తప్పులు చేస్తున్న వారియందు మనం మౌనం వహించా మనుకోండి, క్రమంగా వాడు సర్దుకుని వచ్చేస్తాడు.** మనం అన్నట్టుగా కూడా ఉండదు. అందుకని, మహాత్మాగాంధి లాంటి వాడు ఎక్కడో సత్యాగ్రహం అంటే, అలా అలా లండన్ వెళ్ళిపోయి, ఆ West Minister లో ప్రకంపనలు వచ్చి, మహారాణి సీటుకి కూడ ఇబ్బంది కలిగించేంత ఒక అలజడి పుట్టేది. అది సత్యాగ్రహం. సత్యము యొక్క పరాక్రమము అలా ఉంటుంది.

అందుచేత, ఈయన పరాక్రమవంతుడై ఉండి, రాజ్యం గురించి అసలేమాత్రం బాధపడడం లేదు. మాములుగా మనకి

ఏమనిపిస్తుంది? అంత పరాక్రమవంతుడైతే అట్లా అరణ్యంలో ఎందుకు పడివున్నాడనిపిస్తుంది.

> *"ధనము వీధిపడిన దైవవశమున నుండు,*
> *పోవు మూల నున్ననైన,*
> *అడవి రక్షలేని యబలుండు వర్థిల్లు,*
> *రక్షితుండు మందిరమున జచ్చు."*

అని ఒక పద్యం ఉంది మనకి భాగవతంలో. బాగా security పెట్టుకున్నకొద్దీ terrorism పెరిగిపోతూ ఉంటుంది కదా! ఎందుకని? అమెరికా వెళ్తుంటే, మనం లోపలికెళ్తుంటే, తడవకూడనివన్నీ కూడా తడిమేస్తారు కదా! అన్నీ విప్పి చూస్తుంటారు కదా! భయం! ఎందుకు భయం? Sense of security. నువ్వు ఎంత sense of security పెంచుకుని, దాని గురించి అంత కలవరపడుతూ, అందరినీ కలవరపెడుతూ, ఒక bad will సంపాదించుకుంటున్నావే... కానీ నీ ప్రవర్తన వల్ల ఎప్పుడూ నీకు రక్షణ ఉన్నది.

అడవిలో ఎవరు రక్షిస్తున్నారండి వాళ్ళని? అక్కడ మనుషులు బ్రతకట్లేదూ? మనం వెళ్తే దోమ కుట్టి చచ్చిపోతాం. ఎందుకంటే, అడవిలోకి వెళ్ళినప్పుడు దోమ కుడుతుందేమో... దోమ కుడుతుందేమో అని జపం చెయ్యడంచేత, అది చక్కగా ఆవాహనం చెయ్యబడుతుంది. అది మనని వచ్చి కుడుతుంది. అక్కడ అడవిలో వాడిని కుట్టదే! మీరే చూడండి. మాములుగా దోమల గురించి భయపడే వాళ్లనే దోమలు ఎక్కువగా కుడతాయి. ఎందుకో తెలుసా? వాళ్ళలో దోమ ధ్యానం ఉంటుంది.

దోముంటుందేమో, దోముంటుందేమో అని మీరు hotel గదిలోకి వెళ్ళారనుకోండి, దోమే ఉంటుంది, కుట్టనే కుడుతుంది. చెప్పానా దోమలుంటాయి hotel లో అంటాడు. పక్క వాడిని కుట్టవు. నీ యొక్క మనసు చేత నువ్వు ఆ విధమైన field ఏర్పాటు చేస్తావు. చేసి, దానిని ఆకర్షిస్తావు. రోగం వస్తుందేమో, రోగం వస్తుందేమో, రోగం వస్తుందేమో అనుకుంటే రోగం వస్తుంది. కోరి రోగాలు తెచ్చుకునే వాళ్ళు ఉంటారు. ఎందుచేత? నువ్వు అటువంటి భావన చేస్తే, *"యద్భావం తద్భవతి"*, అలాగే జరుగుతుంది. అందుచేత, అన్ని రకాలుగా రక్ష కల్పించుకున్నా జరుగవలసినవి జరుగుతూనే ఉన్నాయి కదా! ఎన్ని కాపలాలు పెట్టుకుంటే మాత్రం నిలిచిందా ప్రాణం? ప్రాణం పోయే సమయం వచ్చినప్పుడు నువ్వు రకరకాల కాపలాలు పెట్టుకున్నా, ఒంటి స్తంభం మేడలోకి వెళ్ళిపోయి, అన్నీ మూసుకున్నా అది వచ్చేస్తుంది కదా!

ధనానికి ఎన్ని రకాల ఉపాయాలు వేసి నువ్వు పకట్బందీ చేసినా, అది *"కరి మింగిన వెలగపండు క్రియన్"* అని చెప్పారు. *"సిరి తావొచ్చిన వచ్చున్, నారికేళ సలిలము భంగిన్".* ఎట్లా వచ్చాయి కొబ్బరికాయలోకి నీళ్ళు? నువ్వు పోశావా? అందులోకి నీళ్ళు రావడమేమిటి? ఇంకే పండులోకి అన్ని నీళ్ళు రావు. దాని కొక్కదానికే నీళ్ళు వస్తాయి. అంతే కాదు, బాగా రుచిగా ఉంటాయి. తాగితే నీకు కాస్త శక్తిని కూడా ఇస్తాయి కదా! అలాంటి నీళ్ళు అందులో ఎట్లా చేరినాయి? అట్లా వస్తుంది సిరి వస్తే! అంటే, మన తెలివితేటల వల్ల మనకి ధనం వచ్చిందనుకోబోకండి. నువ్వు చేసిన సత్కార్యాల వల్ల నీ దగ్గర క్రమంగా ధనం చేరుతుంది. అలాగే, చేరింది ఎప్పుడు పోతుందో తెలియదు. *"సిరి తాపోయిన పోవును,*

*కరి మింగిన వెలగపండు క్రియన్"* అన్నాడు. ఏనుగుకి ఎప్పుడయినా వెలగపండు పెట్టి చూడండి. మనం వెలగపండే తినడం మానేశాం. అసలు ఏనుగులు మన చుట్టుపక్కల ఉండవు కదా! ఏ దక్షిణాది గుడికెళ్తేనో, ఓ ఏనుగు కనిపిస్తుంది. అప్పుడు చూపించాలి పిల్లలకి ఏనుగిలా ఉంటుందని. అందుచేత, ఏనుగుకి వెలగపండు పెడితే, అది దాన్ని పగలకొట్టదు. అట్లాగే మింగేస్తుంది పండు పండుగానే! మళ్ళీ అలాగే, as it is గా వచ్చేస్తుంది బయటకి. కానీ, లోపల వెలగ గుజ్జు ఉండదు! అట్లా పోతుందట ధనం. అంటే, అంతా ఉన్నట్టుగానే ఉంటుందట గానీ, పోతుందటండి క్షణంలో. అందుచేత, నువ్వా రక్షించేది దేన్నయినా? **నీ ప్రవర్తన నిన్ను రక్షిస్తుంది తప్ప మరొకటి రక్షించదు.** ఎవరినయినా రక్షించేది వారి ప్రవర్తనే. ప్రవర్తన బాగుండక, మన కోసం మనం ఎన్ని రక్షణలు కల్పించుకున్నా వచ్చే అపాయం వస్తుంది. ఏం సందేహం లేదు. అందుచేత, ఏమిటి రక్షిస్తుంది నిన్ను అంటే **నీ ప్రవర్తనలోని ధర్మము నిన్ను రక్షిస్తుంది. నీ ప్రవర్తనలోని అధర్మము నువ్వు ఎక్కడ దాక్కున్నా వచ్చి శిక్షిస్తుంది. అది కాలం రూపంలో వస్తుంది.**

అందుచేత, ఇతడు సత్యపరాక్రముడు. చాలా పరాక్రమ వంతుడు. అంటే, పరాక్రమవంతుడు కాబట్టే కదలకుండా తన రాజ్యం తనకొచ్చే మార్గం చూసుకున్నాడండి. తెలివైనవాడు కదా! ఎందుకని? బుద్ధిలో బృహస్పతి. మహాత్ముడు, గాంధీగారు ఈ బ్రిటిష్ వారితో మనమేం పోరాడుతాం అనుకున్నాడు! వారి దగ్గరున్న తుపాకుల్లో మనకొకటీ లేదు, వారికున్న సైన్యం మనకి లేదు. మన వాళ్ళే ఆ సైన్యంలో చేరిపోయారు, డబ్బుల కోసం. మన వాళ్ళే మన వాళ్ళని కాల్చేస్తారు నిర్దాక్షిణ్యంగా. ఏమిటిరా అంటే

ఉద్యోగధర్మం అంటాడు. అసలు ఈ సమయంలో మనం ఎట్లా గెలుచుకొస్తాం స్వాతంత్ర్యము? అని. అది చాలా అనితర సాధ్యమైన పద్ధతుల్లో కదా మహాత్మా గాంధి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టాడు. ఇవాల్టికీ, ఎప్పటికీ అది ఒక record. శాంతియుతంగా, సమరం లేకుండా, స్వాతంత్ర్యాన్ని తెచ్చుకున్న ఏకైక దేశం భారతదేశం.

ఏమిటా సమరం? ఈయన మౌనం వహిస్తాడు, ఉపవాసాలు చేస్తాడు. చేస్తే, ఆ ఉపవాసాల ప్రకంపనలు అలా వెళ్లిపోతూ ఉంటాయి. వాళ్ళు ఈయన్ని పిలుస్తారు, మాట్లాడుతారు. ఈయన్ని West Minister పిలిస్తే, మోకాళ్ళ పైకి పంచ, పైన కండువా వేసుకుని, అంత చలిలోనూ అలాగే వెళ్ళిపోయేవాడు. Dress code ఉంటుంది మాకు లోపలికి రావడానికి అంటే, నా dress code ఇదే అని చెప్తాడు. నీ dress code నువ్వు అనుసరించు, నా dress code నేను అనుసరిస్తానని. ఎంత ధీరత్వం కావాలండి? అంతకుముందు సూటు, బూటు, హేట్ వేసినవాడే ఈయన సౌత్ ఆఫ్రికాలో ఉన్నప్పుడు. ఆ ఫొటోలు ఉంటాయి. అప్పుడు అదోలా ఉంటాడు చూడడానికి. ఈ ఉద్యమం మొదలుపెట్టిన తరువాత తనలో మార్పు ఎంతగా వచ్చింది? ఈ మహాత్మా, అప్పుడు గాంధియే, ఇప్పుడు మహాత్మాగాంధి అయ్యాడు. అలా స్వాతంత్ర్యం తెచ్చిపెట్టలేదా? అలా శాంతియుతంగా తనకు రావలసినది, తాను సంపాదించు కోవడంలో ఉండే పరాక్రమము, ఊరికే కత్తులు, కటార్లు పట్టుకుని పోట్లాటకు వెళ్లి తెచ్చుకునే దాంట్లో లేదు. నిజమైన పరాక్రమము అది. **సత్యము చేత పరము కూడా ఆక్రమిస్తారు. పరము అంటే దైవము అని అర్థం. సత్యము చేత**

**పరమును ఆక్రమించడం.** అలాంటి వాడు సత్యవంతుడు. అది ఒక దివ్యగుణం.

ఓరిమిలో పుడమి లాంటి వాడు. అంటే, ఎంత ఓర్పు ఉందంటే, మనకి బొత్తిగా లేనిదే ఆయనకున్నది. ఓర్పు అనేది మనిషికి చాలా బలం. Ten commandments లో first commandment Tolerence. నిబంధనలు బాగుపడడానికి. వీటిల్లో మొట్టమొదటిది పాశ్చాత్యులు పెట్టుకున్నది Tolerence. అది లేదు వాళ్ళకి. ఏది ముందు రాసుకుంటారో అది ఉండదు కదా! మనకీ అంతే! భారతం ఏమి చెప్తోంది? మొట్టమొదటి ధర్మం, ఎవడయితే నేర్చుకోదలచి, బాగుపడదామని అనుకుంటే, ఓర్పు, క్షమ ఉండాలి. ఇప్పుడు ధర్మరాజు ఏమిటండి? ధర్మరాజు అంటే ఎంత క్షమ, ఎంత ఓర్పు? ఇప్పుడు పద్యాలు ఉన్నాయి కదా! చెయ్యరాని పనులన్నీ కూడా నీ మీద చేసినా కోపం రాదు కదా, నువ్వు ఎంతటి ధర్మరాజో అంటాడు కృష్ణుడు. *"తాటం కట్టిరి, నీట తోసితిరి, విష ద్రావంబు తావించిరి, కాంతకున్ చెయ్యరాని ఎంత పని చేసిరి"*. ఇన్ని చేసినా ఆయనకు కోపం రాలేదు. ఓర్పు పోలేదుట, భరించాడట. ఏదో ఒక రోజు భరించడం కాదు, నన్ను భరించినట్టు మీరు! (నవ్వులు సభంతా!)

ఐదో సంవత్సరంలో వచ్చాడండి అడవుల నుంచి రాజ్యంలోకి తమ్ముళ్ళని తీసుకుని. అక్కడ నుంచి తొంభైయేళ్ళు వచ్చేవరకూ, అంటే ఎనభై ఐదు ఏళ్ళు. అంటే, ఒక సహస్ర చంద్ర దర్శనం అయిపోయింది. ఎనభై నాలుగేళ్ళకి అవుతుంది అది. అన్నేళ్ళు వాళ్ళు చేస్తున్నన్ని అపకారాలు వాళ్ళు చేస్తూనే ఉన్నారు,

ఈయన భరిస్తూనే ఉన్నాడు. తమ్ముళ్ళకి ఓర్పు పోయింది, భార్యకి ఓర్పు పోయింది, ఊళ్ళో వాళ్ళకి ఓర్పు పోయింది. కృష్ణుడికి కూడా ఓర్పు పోయింది. వనవాసంలో ఉన్న పాండవులను చూసినప్పుడు కృష్ణుడు చాలా రౌద్రాకారం దాల్చి నేను ఇప్పుడే వాళ్ళందరినీ సంహరించేస్తాను అంటాడు. అంటే, అప్పుడు అర్జునుడు కొంచెం ఉపశమింపచేస్తాడు, మేమేదో కొన్ని ప్రతిజ్ఞలు పొరపాటున చేశాం. ఈ క్షత్రియులకి నోటి తొందర ఎక్కువ, ఏవో మాట్లాడేస్తారు ముందు, అది నిలబెట్టుకోడానికి నానా బాధలు పడాలి కదా! భీముడేమో తొడలు పగలు కొడతాను ఒకడికి అన్నాడు, ఇంకొకడి గుండెలు చీల్చి రక్తం తాగుతానన్నాడు. మరి అవన్నీ నెరవేరాలంటే నువ్వు చంపేస్తే ఎట్లా అన్నాడు. అందుకని కృష్ణుడు ఆగుతాడు, అంత కోపం వస్తుంది. కానీ, ధర్మరాజుకి రాదు. అందుచేతనే చెప్తారు చిట్టచివరలో, అతనికి కోపం వస్తే ఈ కర్ణుడులాంటి వాళ్ళు పది వేల మంది అయినా ఎందుకూ కాదురా అని!

ఓర్పు ఈ రోజుల్లో అసలు లేదండి. ఏదో ఒకడి దగ్గరికి appointment కి వెళ్తాం. ఆయన ఫలానా time అని చెప్తాడు. ఆ time అయిన దగ్గర నుంచి, ఇలా చూసుకుంటూ, పెంచుకుంటూ ఉంటాం. ఏమిటి? Impatience, అసహనం పెరుగుతూ ఉంటుంది. అలా waiting లో చాలా లోపల అలజడి వచ్చేస్తుంది కదా! ఏంచేస్తావు మూడు నిమిషాలు తేడా పడితే? లేదా పది నిమిషాలు తేడా పడింది. అసలు రోజు తేడా పడ్డా, నువ్వు చేసేంత మహత్కార్యాలు ఏం ఉన్నాయి గనక? ఓ పావు గంట ఏదయినా flight ఆలస్యం అయినా, ఓ అర గంట train ఆలస్యం అయినా, ఏది ఆలస్యం అయినా, మనలో కలిగే అసహనం ఉందే అది మనకి

test, మనకెంత ఓర్పు ఉన్నది అని. నువ్వు అనుకున్న సమయానికి నువ్వు అనుకున్న పని కాకపోతే నీలో అసహనం పెరుగుతూ ఉంటే నువ్వు బలహీనుడివి అని అర్థం. ఎంత వేచి ఉండగలిగితే అంత నేర్పు. వేచి ఉండలేకపోవడం నేర్పు కాదు. అది అపజయాలకి కారణం అవుతుంది. అందుచేత ఓర్పు నేర్పు అని చెప్తారు.

కొంతమంది చాలా ఓర్పుతో ఉంటారు. ఈ రోజుల్లో అలాంటి వాళ్ళని చాలా తక్కువగా చూస్తూ ఉంటాం. ఎందుకంటే, క్షణంలో irritate అయిపోతారు. కాస్త మనం అనుకున్నట్టుగా లేకపోతే లోపలి నుంచి impatience, intolerance, irritation, ఇవన్నీ కలిపి ఒక కోపమైనటువంటి ముఖము, ఇలాంటివన్నీ వచ్చేస్తుంటాయి. సత్యవంతునికి అవన్నీ ఏం లేవుట. ఓర్పుతో ఉంటాడు. మనం ఈ గుణాలు సంపాదించుకోవద్దూ? అందుకనే, ఓర్పు లేనివాడికి ఏం జరుగుతుందంటే ఎక్కడికి వెళ్ళినా waiting ఉంటుంది. నువ్వే చూసుకో. ఇప్పుడు కొంతమంది ఏ ఆఫీసుకో వెళ్ళగానే, ఆ లోపల ఉన్న ఆఫీసర్ వెంటనే పిలుస్తాడు. కొంతమంది వెళ్తే, మూడు గంటలయినా, పిలవడానికి వీలుపడదు. అంటే ప్రకృతి నీకు ఓర్పు నేర్పుతోందని అర్థం. కొంతమంది స్టేషనుకి వెళ్తే train time కి వస్తుంది. కొంతమందికి రాదు. కొంతమంది ప్రయాణం చేస్తుంటే ఎప్పుడూ late గానే వస్తుంది బండి. మనవాళ్ళు ఉన్నారు, నాకు చెప్తుంటారు, నేను ఎక్కాను కదా గురువుగారు అందుకనే late గా వచ్చిందంటాడు! అంటే, వాడెక్కితే కచ్చితంగా late అవుతుందన్న మాట. ఎందుకవుతుందంటే అర్థం అతనిలో శని ప్రభావం చాలా బలహీనంగా ఉంది అని అర్థం. అంటే, అతనికి ఓర్పు లేదు అని

అర్థం. ఓర్పు లేనివాడు త్వరపడి కష్టాలు తెచ్చుకుంటూ ఉంటాడు. ఓర్పు ఉన్నవాళ్ళు నిదానంగా ఉండి, భరించడం నేర్చుకోవడం వల్ల అన్నీ కలిసి వస్తాయి. నెమ్మది మీద అన్నీ కలిసి వస్తాయండి, తొందరపాటు వల్ల ఉన్నవి కూడా పాడయిపోతాయి.

అందుచేత, ఈయనకి ఓర్పు అట. వృద్ధులైన తల్లితండ్రులని చూడడానికి చాలా ఓర్పు కావాలి. ఈయనకి తల్లితండ్రులు ఉన్నారు. అందులో తండ్రికి కన్నులు లేవు. అలాంటి వాళ్ళకి చెయ్యడం అంటే అంత సులభం కాదు కదా! ఇంట్లో ముసలావిడ ఉందిట అంటే నానా రకాలుగా విసుక్కుంటూ ఉంటారు అందరూ కదా! కాస్తోకూస్తో డబ్బు ఉంటే, వాళ్ళనీ వీళ్ళనీ, పని మనుషులని పెట్టేస్తారు. వాళ్ళెవరూ? నీ తల్లితండ్రులే, నిన్ను పెంచి, పోషించి, పెద్దవాడిని చేసినవారు కదా! వాళ్ళకి చెయ్యడానికి నీకు... ఒకటి, ఓర్పు లేదు కదా! అందుకని ఏమి చేస్తున్నాం? Old age home కట్టేసి అందులోకి తోలేస్తున్నాం. అది fashion కదా ఇప్పుడు! ఎందుకు old age home? పూర్వకాలం ఏవి old age homes? ఎందుకు వస్తున్నాయి old age homes? It is a mark of our intolerance towards senior citizens who have been responsible for our upbringing and for our growth. మనం కనుక ఆలోచించుకుంటే, మనకేమాత్రం కృతజ్ఞతాభావం ఉంటే, మనని కని, పెంచి, పెద్దచేసిన వారి యెడల attitude ఎలా ఉంది? ఇట్లా చెయ్యి పట్టుకుని నడిపించడానికి కూడా కొంతమందికి ఓర్పు ఉండదు. అలాంటిది ఇంట్లో ఇద్దరు వృద్ధులైన తల్లితండ్రులు. వారి పోషణ చూసుకోవాలి. వెళ్లి

సమిధలు, కట్టెలు తీసుకురావాలి. వీటన్నిటిలోనూ సత్యవంతుడు చాలా ఓర్పు చూపిస్తున్నాడు అని నారదుడు చెప్తున్నాడు.

అంతే కాదు, అతని అందం పూర్ణ చంద్రుడిని చూస్తే ఎలా ఆహ్లాదం కలుగుతుందో అలాంటి ముఖము కలవాడు అని చెప్తున్నాడు. అంటే, రామచంద్రుడంటాము చూశారా, చంద్రుడు అని చెప్పడంలో సౌందర్యం గురించి చెప్తాం. ఆహ్లాదకరమైన ముఖము కలిగిన వాడిని చంద్రుడితో పోలుస్తాము. అలాగే, సౌందర్యము, అశ్వినీ దేవతల సౌందర్యము కలిగి ఉన్నాడని చెప్తారు. ఇప్పుడు అశ్వినీ దేవతల సౌందర్యం అంటే, అశ్వినీ దేవతలు ఎట్లా ఉన్నారో మనకు తెలియాలి కదా? ఎలా తెలుస్తుంది చెప్పండి అశ్వినీ దేవతల సౌందర్యము? చూస్తే కదా తెలుస్తుంది! చూడకుండా తెలియని వాటితో మనం పోల్చలేం. నారదుడు అశ్వినీ దేవతలను చూసిన వాడు కాబట్టి ఆయన చెప్పగలడు. ఇప్పుడు నన్ను చెప్పమంటే, నేను చూడలేదు అశ్వినీ దేవతలని ఇంకా. కాబట్టి మీకు వివరించి చెప్పలేను. మీరు ప్రయత్నం చెయ్యండి పోనీ. అశ్వినీ దేవతలు సృష్టిలో పగలు–రాత్రి, కుడి–ఎడమ. ఈ ప్రజ్ఞలకు అధిదేవతలు.

‘‘తపస్సు, శమము, దమము, దానము, దేవబ్రాహ్మణ భక్తి, మహనీయ ప్రభావం ఆదిగా గల సుగుణాలన్నీ అతని యందే కానీ వేరెచ్చటా కానరావు’’ అని చెప్పాడండి నారదుడు. అప్పుడు సమకాలికంగా ఉన్న కాలంలో అతనితో సరితూగ గల యువకుడు మరొకడు లేడు అని చెప్పి, నారద మహర్షి సావిత్రీదేవి చేసిన ప్రతిపాదనకు బలాన్ని కలిగిస్తాడు.

''అయితే, నేడు మొదలుకొని ఒక సంవత్సరము మాత్రమే సత్యవంతుడికి ఆయుర్దాయము కలదు'' అని చెప్పాడు మహర్షి. మహర్షి కదా! త్రిలోకజ్ఞానం కలిగిన వాడు మహర్షి, అందరూ కాదు. ముందు మహర్షి అని పెట్టేసుకుంటే మహర్షి అయిపోవు. అయిపోతావా? ఒక్క సంవత్సరమే ఇక్కడి నుంచి బ్రతుకుతాడు. ''ఇది అవశ్యం నీకు వెల్లడించవలసినది.'' నేను నీకు చెప్పాలి ఈ విషయం. నీ హితం కోరేవాడిని కాబట్టి వింటానికి కొంచెం చేదుగా ఉన్నా, మీ అమ్మాయి అంత గాఢంగా అతడినే కోరుకుంటున్నా, ఈ విషయం నీకు తెలియాలని చెప్పి చెప్పాడు. ''ఈ విషయం లెస్సగా పరియాలోచించి నిర్ణయించవలసినది'' అని చెప్పాడు. ''అశ్వపతి ఆ ప్రసంగం విని మిక్కిలిగా చింతించి, కుమార్తెని అవలోకించి, అమ్మా! నారద మహాముని దేవ రహస్యవేత్త. ఈతని వచనం అమోఘము. నీకు అట్టి అల్పాయిష్కుడైన వరుడేల? వేరొకరి నెవరి నయినా వరించ వలసినది అని హితం చెప్పాడు.''

అంతేగా, జాతకం చాలా బావుందండి, పిల్లవాడికి ఆయుర్దాయం లేదని చెప్పామనుకోండి, ఏ తండ్రి ఇస్తాడండి పిల్లని, ఇవ్వడు కదా! వధూవరుల పొంతన చూసేటప్పుడు ముందు చూడవలసినది వరుడి ఆయుర్దాయం ఎంత, వధువు ఆయుర్దాయం ఎంత అని. వాళ్ళ కలయిక వల్ల ఆయుర్దాయానికి ప్రమాదం ఏమన్నా ఉందా? అది కూడా చూడాలి. కొన్ని కొన్ని జాతకాలు ఎలా ఉంటాయంటే, ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవడం వల్ల అబ్బాయి ఆయుర్దాయం తగ్గిపోతుంది. కాకపోతే, ఆ అబ్బాయిని పెళ్లి చేసుకోవడం వల్ల ఆ అమ్మాయి ఆయుర్దాయం తగ్గిపోతుంది. ఎందుకంటే, రెండు ప్రజ్ఞలు ఒకటి అయినప్పుడు

వారిది వీరికి, వీరిది వారికి, ఒకరి నుంచి ఒకరికి ప్రవహిస్తూ ఉంటాయి అవి, పాలూ నీళ్ళూ కలిసినట్టుగా. పాల భాగం ఎక్కువ ఉంటే పాలు, నీళ్ళభాగం ఎక్కువగా ఉంటే నీళ్ళయిపోతాయి కదా! అందుచేత, చూసేటప్పుడు ముందు చూడవలసినది ఆయుర్దాయం, వీరిద్దరికి దీర్ఘాయుష్షు ఉన్నదా, ఒకటి. రెండవది, కలయిక వల్ల ఆయుర్దాయానికి ముప్పు ఉన్నదా? అది తెలుస్తుంది. అటుపైన చూడవలసినది సంతాన యోగ్యత ఉన్నదా లేదా? అటుపైన చూడవలసినది అన్యోన్యత. ఎందుకంటే, పోట్లాడుకుంటూ ఉన్నా పిల్లలని కనేస్తారు కదా! అన్యోన్యత ఉన్నదా లేదా? ఈ మూడూ చూస్తాం. ఈ మూడూ చూడడం కన్నా ముఖ్యంగా గుణసంపద ఎలా ఉన్నదో చూడాలి జాతకంలో. గుణముల పొంతన అంటే, ఈ అబ్బాయి సంస్కారాలు ఏమిటి, ఆ అమ్మాయి సంస్కారాలు ఏమిటి? ఓదానికి, ఓదానికి కొంత అనుబంధం ఉన్నదా లేదా? ఇలాంటివి చూసుకోవాలి.

# ౯. సావిత్రి దృఢ సంకల్పం

“తండ్రీ! మనో వాక్ కర్మలలో మనస్సు అత్యంత ముఖ్యము”. మనస్సు, వాక్కు, చేత. ఈ మూడింటిలో మనస్సు అత్యంత ముఖ్యము. అంటే, మనస్సు కన్నా పైన బుద్ధి ఉన్నది. అంటే, బుద్ధి గురించి చెప్పట్లేదు. “కనుక, మనసారా అభిలషించిన భర్తనే కాక, నేను ఇంకొకరిని అభిలషించ దలచుకోలేదు” అని. మనస్సుతో నేను అతనియందు... నా మనస్సు అతనియందు తగులుకొని ఉన్నది కనుక, మనసారా నేను అతనినే భర్తగా భావిస్తున్నాను. కనుక, నేను ఇంకొక రకంగా ఆలోచించే అవకాశం లేదు, ఆలోచించలేను.

పురుషుడికి, స్త్రీకి చాలా తేడా ఉంది ఈ విషయంలో. పురుషుడు చాలా సంస్కారవంతుడయితే తప్ప, భార్య తప్ప ఇతరుల గురించి ఆసక్తి లేనివాళ్ళు చాలా తక్కువమంది ఉంటారు. భారత స్త్రీ ఒక్కసారి భర్తకి మనసిస్తే, ఇంక ఆ భర్త లేకపోతే అతడినే మనసులో పెట్టుకుని శేషజీవితం పరిపూర్తి గావించుకుంటుంది. ఇంకొకరిని వివాహం చేసుకుందామని పురుషుడు అనుకుంటాడేమో గానీ, స్త్రీ అనుకోదు భారతదేశంలో ఇప్పటివరకూ. ఇప్పుడు అవి కూడా మారుతున్నాయి. మన సంప్రదాయంలో ఒక భారత స్త్రీ, ఒక పురుషునికి మనసిస్తే ఇంక అక్కడినుంచి అది వెనక్కిరాదు. అందుచేత, బలవంతగా ఇంకో పెళ్లి చేసినా మనసులో ఇదే

ఉంటుంది. అప్పుడు, ఆ పెళ్లి మన భాషలో చెప్పాలంటే పెటాకులు అయిపోతుంది. పాడయిపోతుంది. ఎందుకని? ఇంకొకరు మనసులో ఉండగా ఈ పురుషుని ఎలా అంగీకరించగలదు? అది మోసం చేసినట్లే! తనలో ఘర్షణ కలుగుతుంది. మనసిచ్చిన తర్వాత ఇంకోటి ఎలా? అందుచేత, ఇచ్చేటప్పుడే జాగ్రత్తగా చూసుకోవాలి. ఇచ్చేసిన తర్వాత అప్పు ఇచ్చేసినట్టే. కొంతమందికి అప్పు ఇస్తే డబ్బులు తిరిగిరావు. ఇచ్చేముందే ఆలోచించుకోవాలి కదా! అలాగ, మనసిస్తే మనస్సు ఓ పట్టాన తిరిగి రాదు. అదే ఆలోచిస్తుంది. ఎందుకని? అక్కడ తగులుకొని ఉంటుంది. అది తెలుసు సావిత్రిదేవికి. అందుచేత, ఒకరికి మనసిచ్చి ఇంకొకరిని మళ్ళీ నేనెలా ఆలోచిస్తాను? ఆలోచించలేదు. అందుచేత, నేను ఇంకోటి ఆలోచించ దలుచుకోలేదు. అదండి! ఆలోచించ దలుచుకోలేదు ''సత్యవంతుడు అల్పాయిష్కుడయినా సరే. అతడే నా ప్రాణపతి అంది.''

అలా ఉంటాయి భార్యాభర్తల సంబంధం హైందవ సంప్రదాయంలో. వివాహ క్రతువులోనే చెప్తారు ఏడుసార్లు, ఏడుమార్లు అగ్ని చుట్టూ తిరిగేటప్పుడు ఏడు వాగ్దానాలు చేయిస్తారు. సంస్కృతంలో చేయిస్తారు కాబట్టి మనకి తెలియదు, తెలుసుకోవాలనుకుంటే తప్ప. మేము కలిసి ఇది చేస్తాం, మేము అది చేస్తాం అని ఎన్నో చెప్పుకుంటాం అంతా అయిపోయిన తర్వాత, ఏడు అడుగులు అగ్ని చుట్టూ నడిచిన తర్వాత మేము ఇద్దరం ఒకటి అయిపోయాము అని, it is one in two bodies అని, ఒకే ప్రజ్ఞ రెండు దేహాల్లో ఉంది అని. అందుచేత, ఒకరు పరదేశం వెళ్ళినా, రెండవ వారికి వారు లేరు అనిపించదు. అందుచేత,

పురుషుడు పరదేశం వెళ్తే స్త్రీ భర్త లేడన్న భావం కలిగి ఉండదు లోపల. అందుచేత, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంకొక పురుషుడిని అంగీకరించదు. అలాగే, పురుషుడు సంస్కారవంతుడైతే తాను ఎక్కడికి వెళ్ళినా తన హృదయమందు తన స్త్రీని తీసుకెళ్తాడు. అందుచేత, అతనికి పరస్త్రీలయందు వ్యామోహం ఉండదు. ఈ రహస్యమే చెప్తుంది రామాయణం. అమ్మవారు లంకకి వెళ్ళినా రాముడు తనతోనే ఉన్నాడన్న భావంతో ఉంటుంది. అయ్యవారు వనవాసం చేస్తూ సీతాదేవిని కోల్పోయినా, సీత తనతో ఉన్నట్టుగానే భావిస్తాడు. అట్లా ఉంటే దానిని అవినావభావ సంబంధం అంటారు. అంటే, విడదీయరాని సంబంధం. దేహములైతే విడిగా ఉండొచ్చుతప్ప మనసులో ఇద్దరూ కలిసిపోయే ఉంటారు. అందుచేత, అలా మానసికమైనటువంటి ఒక ఐక్యత కలిగినప్పుడు దాన్ని మరి విడదీయడానికి వీలుపడదు.

అప్పటికే నీళ్ళు కలిపేశాం పాలల్లో, కాఫీ పెట్టుకుందామని కదా! ఇప్పుడు ఆ పాలు ఆ నీళ్ళ నుంచి వేరు చెయ్యాలంటే ఎట్లా? అవ్వదుగా! అవుతుందా? లేకపోతే, అప్పటికే తోడు వేసేశాం పాలల్లో, అది పెరుగవుతోంది, ఇప్పుడు కాఫీ పెట్టుకుందాం అంటే అవుతుందా? అవదు. అలాంటి రసాయనక చర్య జరుగుతుంది ఒక పురుషుడికి, ఒక స్త్రీకి మధ్య. అంత ఆలోచించుకునే time లేదు ఎవ్వరికీ. మొత్తమంతా రసాయనమే. ఇప్పుడు నిజంగా మీరు వింటున్నప్పుడు మీలో ఒక రసాయనం జరుగుతుంది. ఆ రసాయనం మీ స్వభావాన్ని చక్కగా తీర్చిదిద్దుతుంది.

ఇక్కడ సావిత్రిదేవి ఎంత బాగా చెప్పిందో చూడండి. అందరికీ ఈ విషయములో అవగాహన తక్కువగా ఉంటుంది.

అందుచేత, ఈవిడ చాలా స్పష్టంగా చెప్పింది. ఒక సంవత్సరంలో పోతాడంటే, చూద్దాం అన్నది! ఎవరూ ఒప్పుకోరండి. అసలు మనం ప్రేమించిన తర్వాత అవతల వాళ్ళకి ఏదో ఆపద వచ్చిందనుకోండి, పెళ్లికొడుకు ఉద్యోగం పోయిందనుకోండి. Infosys లో ఉద్యోగం ఉండి, నెలకి లక్ష రూపాయులు అని మనం ఒప్పుకుంటాం. ఏం చేస్తావు? మళ్ళీ ఆలోచిస్తావా? అదేంటండి? మిగతావన్నీ బావుంటే ఇది రాదా మళ్ళీ? నీ మీద నీకు ధైర్యం ఉండాలి. ఆ కుర్రవాడిలో ఉండే గుణములయందు నీకు విశ్వాసం ఉంటే, **గుణములు చూచి పెళ్లి చేసుకోవాలి తప్ప ధనము చూచి పెళ్లి చేసుకోకూడదు.** చాలా ధనం ఉండి, వాడు దుర్గుణవంతుడైతే ఏ సుఖమూ లేదు. చాలా సుగుణములు కలిగి ఉంటే, అతడు ధనవంతుడు కాకపోయినా, వివాహం చేసుకోవడానికి చాలా అర్హుడు. అతడు సుగుణవంతుడైతే? అతడి సుగుణములే అతనికి రక్ష. అతడి సుగుణములే అతడి వృద్ధికి మూలమని తెలిసినవాడు అలాంటి వాడే కావాలనుకుంటాడు. నీ ఉద్యోగంతో నాకు సంబంధం లేదు, నీ ఆస్తితో నాకు సంబంధం లేదు, నీయందు ఉండే సద్గుణములతో నాకు... అలా వివాహం చేశారు ముందు తరాల్లో.

అందుచేత, ఇన్ని గుణములు ఉన్న వరుడు అతడు. అలాంటి గుణములు ఎక్కడా లేవు. ఒక్క సంవత్సరమే బ్రతుకుతాడా, చూద్దాం. ఎందుచేత? ఆమె అతీతమైన శక్తి కలిగినటువంటి కన్య కదా! ఆమెకు ప్రాణముల యొక్క తీరుతెన్నులు తెలుసు. ప్రజ్ఞ యొక్క స్వరూప స్వభావాలు తెలుసు. ప్రజ్ఞ ఎలా ఉంటుంది, ప్రజ్ఞ ఎన్ని పనులు చెయ్యగలదు, ప్రజ్ఞ యొక్క పాటవము, విలాసము తెలిసినది. ప్రాణముల యొక్క రాకపోకలు తెలిసినటువంటిది

ఆవిడ. అందుచేత, ఇతని ప్రాణములు పోతాయట అంటే, ఆమె అంతగా భయపడలేదు. భయపడకుండా, అతనినే చేసుకుంటానని చెప్పింది. "అని స్వాభిప్రాయముగా, నిస్సందేహంగా వెల్లడించి నది. అశ్వపతి ఆపైన కర్తవ్యతా మూఢుడై దేవముని వైపు చూచాడు. నారదుడు ఆ ధోరణి గ్రహించి, మద్రేశ్వరా! నీ ప్రియ తనూజ సుగుణాల కన్నిటికినీ ఆలవాలము." నీ కూతురు అన్ని సుగుణములు కలిగినటువంటిది. "ఈమె దృఢ సంకల్పము మన మెవరమూ మార్చలేము. కనుక మరి అనుమానించక సావిత్రిని సత్యవంతుడికి ఇచ్చి వివాహం జరిపించవలసినది. ఈ పుణ్యశీల సుకృతరాశివల్లనైనా అతనికి చిరాయుర్దాయము లభించవచ్చును".

అంటే, **స్త్రీ పుణ్యం వల్ల పురుషుడి అదృష్టం మారుతూ ఉంటుంది.** అంటే, ఒక్కొక్కళ్ళని పెళ్లి చేసుకోవడం వల్ల అదృష్టం కలిసి వస్తుంది. ఒక్కొక్కరు కాలు పెడితే ఉన్నది కూడా పోతుంది. అందుకని మనకి సామెత ఉంది, "పిల్లొచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళ" అంటూ ఉంటారు. ఇంట్లో కోడలు అడుగు పెట్టగానే, ఆ సంవత్సరంలో ఎలా జరిగినాయి ఇంట్లో కార్యక్రమాలు అనేటటువంటిది ఒకటి పరిశీలిస్తూ ఉంటారు పెద్దవాళ్ళు. అంటే, పిల్ల అదృష్టం తీసుకువచ్చిందా? దురదృష్టం తీసుకువచ్చిందా? అట్లాగే, ఈ పిల్లవాడు ఈ ఇంటికి అల్లుడవుతాడు కదా, అల్లుడొచ్చిన వేళ వాళ్ళకెలా ఉంటుందో కదా! *"జామాతా దశమ గ్రహం"* అంటారు కదా! అంటే, అల్లుడు మామూలుగా నవ గ్రహాలు కాక, వీడొక గ్రహం, ఏడిపించుకు తినడానికి. అందుచేత, అల్లుడు రావడం వల్ల ఆ ఇంట్లో పొంగిందా, కుంగిందా? వాడు పుణ్యవంతుడైతే, వాళ్ళింట్లో కూడా పొంగుతుంది. ఎందుకంటే, పెళ్లి మంత్రాల్లో

ఇవన్నీ చెప్పిస్తారు. పిల్లనందుకుంటూ పెళ్లికొడుకు చెప్తాడు, నువ్వు మా ఇంటికి వస్తున్నందుకు, నాతో సహజీవనం చేస్తున్నందుకు, నీ తల్లితండ్రులు ఆరోగ్యంగా ఉందురు గాక! నీ అన్నదమ్ములు అందరూ సుఖంగా ఉందురు గాక! నీ అప్పచెళ్ళెలందరూ వృద్ధి పొందుదురు గాక! మీ ఇల్లంతా ఐశ్వర్యములతో నిండును గాక! ఇట్లా చెప్తారు. అల్లుడికి అదృష్టం వుంటే పిల్ల పుట్టిల్లు వృద్ధి చెందుతుంది. అలాగే పిల్ల అదృష్టవంతురాలైతే మెట్టినిల్లు వృద్ధి చెందుతుంది. అదృష్టం అంటే కనపడనిది. దానిని చూడగలవాడు తెలిసిన వాడవుతాడు. ఈ రోజుల్లో కనబడుతున్నదే చూడలేరు. ఇక కనపడనిది (అదృష్టం) ఎవరు చూడగలరు?

గుణవంతుడైతే తప్పక అతడికి వృద్ధి ఉంటుంది. కాలక్రమములో వృద్ధి చెందుతాడు. సద్గుణాలు సరైనటువంటి తెలివిని పెంచుతాయి. దుర్గుణాలు పనికిరాని తెలివిని పెంచుతాయి. పనికిరాని తెలివితో తాత్కాలికంగా మనం చాలా పోగేసుకున్నా అది మన దగ్గర నిలబడదు. ఆపదలు వచ్చి, సంపదలు పోగా, మనకి ఆపదలు మిగులుతాయి. అందుచేత, భారతీయ ధర్మంలో, గుణములు చూసుకోమని చెప్తారు. అందుకనే, పిల్లనిచ్చేప్పుడు సంస్కారములు చూసుకోమని చెప్తారు. అలా చూసుకోకుండా పదవులు, ధనము అవన్నీ చూసి చేస్తే విడాకులు వచ్చేస్తాయి. పై దేశాల్లో సులభంగా విడాకులు రావడానికి, మన దేశంలో ఇప్పుడిప్పుడే అవి పెరగడానికి ఒకటే కారణం. మన areas of examination, పరిశీలించదలుచుకున్న విషయములలో మార్పు వచ్చింది. అలా ఉండకూడదు. ఆ పిల్లకి మూడు తరాల వెనక ఆ కుటుంబం ఏమిటి, ఈ పిల్లవాడికి మూడు తరాల

వెనక ఆ కుటుంబం ఏమిటి? జబ్బులు ఉన్నాయా? అవి కూడా చూస్తారు. కొన్ని కొన్ని జబ్బులు ఆస్తుల వలే మనకి తరతరాలు వచ్చేస్తాయి. తర్వాత, ఆ కుటుంబంలో పూర్వంలో ఎవరెవరు సంఘానికి ఎటువంటి మేలు చేశారు? పొట్టకోసమే బ్రతికారా? లేకపోతే, సంఘానికి ఏమయినా చేశారా? ఏం ఉపకారం చెయ్యలేదు, ఊరంతా దోచుకున్నారట అంటే, సంపద ఉండదు. ఏం చూడాలి, ఏం చూడకూడదు అనేది మన గ్రంథాల్లో చాలా సులభంగా ఇచ్చారు.

ఇక్కడ చూడండి, ప్రాణాలు ఉండవు, అల్పాయుష్కుడు అన్నా చేసుకున్నాడండి. నా జీవితంలో రెండు సందర్భాలు ఉన్నాయి. పిల్లకి అద్భుతమైన ఐదోతనం ఉంది. పిల్లవాడు అల్పాయుష్కుడు. చాలా విద్యావంతుడు. అతని తండ్రి కూడా మరణించాడు ముప్పైయేళ్ళకే. ఇతడికి కూడా జాతకం చూస్తే పెద్ద ఆయుర్దాయం ఉన్నట్టుగా లేదు. పిల్ల చూడబోతే ఆమె వల్ల భర్త తప్పకుండా బ్రతికేటటువంటి సందర్భం. ఆ పిల్లకి సంబంధాలు రావడం లేదు అని తల్లితండ్రులు ఇది పట్టుకొస్తే, చూసి ఈ సంబంధం చెయ్యండని చెప్పాను. ఇప్పుడా పిల్లవాడికి అరవైయేళ్ళు వచ్చినాయి. అది ఎంత మంచి విషయం? అలాగే, ఇంకో సంబంధం. ఆ సంబంధంలో పిల్ల ఫొటో చూపించారు. పిల్లవాడి ఫొటో చూపించారు. జాతకం చూశాను. చూస్తే, ఆ పిల్లకి ముఖం ముందు సుడి. సాముద్రిక శాస్త్రం ఏం చెప్తుందో తెలుసా, ఈ పిల్ల పెళ్ళి చేసుకుంటే, ఆ పెళ్ళికొడుకు ఐదేళ్ళ లోపు పోతాడని. నేను పెళ్ళికొడుకుకి చెప్పాను, ఏమని నువ్వు పోతావని చెప్పలేదు, ఈ సంబంధం వద్దమ్మా అని చెప్పాను. కానీ తమాషా, నేను చేసుకుంటా నన్నాడు. రాకరాక ఇది

వచ్చింది. కానీ సంబంధం చేసుకుంటే నీకు ఆయుష్షు ఇబ్బంది. చేసుకుంటా నన్నాడు, చేసుకున్నాడు, పోయాడు. అంటే, ఇవన్నీ లేవనుకోబోకండి, శాస్త్రం తెలుసుకోవడం వల్ల మనకీ పరిజ్ఞానం ఒకటి పెరుగుతుంది. మామూలుగా తెలియని విషయాలు, ఈ శాస్త్రం ద్వారా కొంచెం మనకి focus ఎక్కువ అవుతుంది. తద్వారా తెలుస్తాయి.

ఈమెకి చూడండి, అల్పాయుష్కుడైతే అయ్యాడు, సద్గుణ వంతుడు కదా అంది. దానికి నారద మహర్షి ఏమన్నాడు? ఈమె పుణ్యాలరాశి, కాబట్టి చూద్దాం. మరి మనసు పడ్డది, ఇంకొకడిని చేసుకోనంటోంది కదా! ఇలాంటి dimensions మనకి ఈ కథలో కనిపిస్తూ ఉంటాయి.

"ఆ హితోపదేశం అయిన తర్వాత, దాన్ని అంగీకరించి అశ్వపతి, మునిసత్తమా! నీవు మాకు పరమాచార్యుడవు. భవదాజ్ఞ తప్పక శిరసా వహించెదను" అని విన్నవించాడు. నారద మౌని ఆపై వారిరువురినీ ఆశీర్వదించి, ఆశీస్సులు అనుగ్రహించి, వీడ్కొని, అంతర్హితుడై అమరలోకం వైపు తరలి వెళ్ళాడు.

# 10. సావిత్రి - సత్యవంతుల వివాహం

"అశ్వపతి అటు పిమ్మట ఒక పుణ్యదినాన ప్రాతః కాలమున బంధువులతో, మంత్రులతో, వృద్ధులతో, కుమార్తె సావిత్రితో, వైవాహిక మంగళ ద్రవ్యాలతో ప్రయాణమై, అరణ్య మధ్యంలో నివసిస్తున్న ద్యుమత్సేనుని ప్రశాంతాశ్రమాన్ని ప్రవేశించాడు."

శుభస్య శీఘ్రం అని పెళ్లి చెయ్యడానికే వెళ్ళిపోయా డాయన. పెళ్ళికి కావలసిన సామానంతా తీసుకుని, బంధువులు, మిత్రులు, మంత్రులు, అందరినీ వెంటపెట్టుకుని వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతే, అక్కడ వాళ్ళ పరిస్థితి ఏమిటి? వాళ్ళకి వీళ్ళు వస్తారని కూడా తెలీదు కదా! అందుచేత, వాళ్ళకి గౌరవంగా ఎదురుగా వెళ్లి, అర్ఘ్యపాద్యాదులు యిచ్చి, కుశలప్రశ్నలు వేసుకున్న తర్వాత అశ్వపతి చెప్తాడు, ద్యుమత్సేనుడికి. ద్యుమత్సేనుడంటే గుర్తుపెట్టుకోండి, దివ్య వైభవం, దివ్యమైన స్వభావం కలిగినటువంటి వాడు. తనకి తానుగా శత్రువులను సృష్టించుకోవడం చేత, తనకుండే దివ్య వైభవం అంతా పోయి, కన్నులు కూడా పోయి, ఒక దురదృష్టకరమైన పరిస్థితిలోకి వచ్చినటువంటి వాడు. రాజ్యం లేదు, కన్నులు లేవు, కొడుకు మీద ఆధారం. అలాంటి వాడి దగ్గరకు ఒక మహారాజు వచ్చాడండి. వచ్చి, మహారాజా! అని సంబోధించాడు. రాజ్యం లేదు కదండి, 'మహారాజా!' అంటే? జీవలక్షణం ప్రకారం అతను మహారాజే. కానీ, పోయినాయి అన్నీ. పోవడానికి కారణం తను సృష్టించుకున్న

శత్రువులు. అందుచేత, ఇప్పుడు ఈ విధంగా ఉన్నప్పటికీ, మహారాజా అని సంబోధించాడు. "ఈ కన్య నా కుమార్తె. మా వంశంలో ప్రాదుర్భవించిన మౌక్తికమణి" అన్నాడు. ప్రాదుర్భావం వేరు, పుట్టడం వేరు. ఉద్భవించడం అంటే అంతకుముందు ఉన్నది ఇప్పుడు కనిపించినది అని అర్థం. సంభూత... సమ్యక్ భూత అంటే అంతకు ముందు ఉన్నది, ఇప్పుడు కనిపించింది. ఈవిడ ఎవరు? సావిత్రిదేవి. అంటే, సూర్యమండలానికి అధిదేవత అయిన తత్త్వ మేదయితే ఉందో, ఆ తత్త్వం పుణికి పుచ్చుకుని కన్యారూపం ధరించి, తన ఇంట్లో పుట్టుకొచ్చింది. అంటే, అనన్య సామాన్యమైన ప్రజ్ఞావంతురాలు ఆవిడ. అందుకని, నాకు పుట్టిందని అనకుండా, మా ఇంట్లో వెలసిన ఒక చక్కటి మణి అని చెప్పి తెలియపరిచాడు. మౌక్తిక మణి. "కరుణించి నా పలుకు లాదరించి ఈమెను కోడలుగా స్వీకరించవలసినది. సావిత్రి, సత్యవంతులు ఉభయులూ వయస్సు, సౌందర్య సుగుణాలలో, సద్గుణాలలో, ఒండొరులకు ఎంతో అనురూపులు గనుక వీరి వివాహం సర్వదా మనకి అభిలషణీయము" అని పలికాడండి. పలికితే, ఆయన ఆశ్చర్యపోతాడు. ఎందుచేత? అతడు రాజ్యం కలిగినటువంటి రాజు, ఇతడు రాజ్యం కోల్పోయినటువంటి రాజు. "ద్యుమత్సేనుడా ప్రార్థన ఆకర్ణించి, ఒకింత ఆశ్చర్యపడి, మద్రేశ్వరా! రాజ్యం పోగొట్టుకుని, ఘోరారణ్య మధ్యంలో నెలవేర్పరుచుకుని, నిరంతర తపశ్చర్యతో కాలం వెళ్ళబుచ్చుకుంటున్న మాతో బాటు ఇడుమల ననుభవించుటకా ఈ సుకుమారిని ఈ విధంగా అందిస్తున్నావు? అని అన్నాడు. మాతో పాటు ఈ కష్టాలన్నీ పడగలదా అని అడిగాడు. తను ఉండేది అంతవరకు రాజప్రాసాదంలో, ఆ తర్వాత ఇప్పుడు

అరణ్యంలో ఉండాలి కదా! అంటే, అరణ్యం, రాజప్రాసాదం అనేటటువంటిది దేహాత్మ భావం ఉండేవాళ్ళకి చాలా వ్యత్యాసంగా ఉంటుంది. జీవాత్మ భావం ఉండేవారికి ఆ వ్యత్యాసం ఉండదు.

రాముడు అరణ్యవాసానికి బయలుదేరి వెళ్ళిన రోజున లక్ష్మణుడు చాలా బాధపడతాడు, ఇప్పుడు ఎలా పడుకుంటాడు రాముడు అని. రాజప్రాసాదంలో రాజకుమారుడు ఎలాంటి మెత్తని పరుపుల మీద పడకుంటాడండీ? హంసతూలికా తల్పాలు అంటూ ఉంటాయి కదా! అంటే, తల్పం, గిల్పం మనం చూశాము కదా! అలాంటి వాటి మీద పడుకునే వాళ్ళకి, ఇప్పుడు ఎలా పడుకుంటాడని లక్ష్మణుడికి ప్రశ్న వచ్చి గుహుడితో మాట్లాడుతూ ఉంటాడు, మనం ఏ విధంగా పడక ఏర్పాటు చెయ్యాలి రాముడికి అని. ఎలాంటివాడు రాముడు? అతి సుకుమారుడు కదా! ఇలా మాట్లాడుతుంటే ఆయన అక్కడ ఉండే ఆకుల మీద నిద్ర పోయాడుటండి. అది రాముడు! వీళ్ళు ఇంకా discussion లో ఉన్నారు, ఆయన ఆక్కడ హాయిగా నిద్రపోయాడు. అంటే ఏమిటి? అతడికి దేహాత్మ భావం అంత లేదు. అంతేమిటి, అసలు లేదు. హంస తూలికా తల్పం మీద ఎలా పడుకున్నాడో, అంత బాగానూ ఆకుల మీద పడుకున్నాడండి. అంటే, నీ ప్రజ్ఞ అంత ఉత్తమోత్తమమైన స్థితిలో స్థిరపడి ఉన్నప్పుడు ఐహికమైన భోగములు ఉన్నా, లేకపోయినా ఒకే విధంగా ఉంటావు. ఉంటే కాదనడు, లేకపోతే బాధపడడు. అందుచేత, ఇక్కడ కాబోయే మామగారు అడుగుతున్నారు, మీ అమ్మాయి అంత సుకుమారి కదా! రాజప్రాసాదంలో పెరిగింది కదా! ఇప్పుడెలా ఇక్కడ ఉండగలుగుతుంది. అసలు ఉండడానికి సిద్ధపడే కదా వచ్చింది. తను వరించిన వరుడు అరణ్యంలో

ఉన్నాడంటే, అక్కడ ఏమయినా సౌకర్యాలు అన్నీ ఉంటాయా? ఉండవు కదా. అయినప్పటికీ, అవన్నీ తెలిసే వచ్చింది ఆవిడ.

ఇలాంటి సందర్భంలో మనలను మనం ఓసారి చూసుకోవాలి. మరి అట్లా రైల్వే ప్లాట్ఫారం మీద పడుకోవాల్సి వచ్చిందనుకోండి, పడుకోగలవా? ప్రయత్నం చేసి చూడాలి. మనం ఎంత దేహంలో ఇరుక్కుని ఉన్నాము, దేహమందు ఎంత స్వామిత్వం కలిగి ఉన్నాం అనేది తెలియాలంటే, అప్పుడప్పుడూ నేలమీద పడుకోవాలండి. నేను నేలమీద పడుకోలేనండి అంటే దేహానికి లొంగిపోయావని అర్థం. నేను ఆరుబయట పడుకోలేనండి అంటే లొంగిపోయావని అర్థం. చన్నీళ్ళ స్నానం చెయ్యలేనండి... ఒకప్పుడు చేసిన వాళ్ళమే అందరూ కదా! ఈ కొత్త తరం వాళ్ళకి తెలియకపోవచ్చు గాని, పాత తరం వాళ్ళు అట్లా బావుల్లోంచి చేదలతో నీళ్ళు తోడుకుని పోసుకున్న వాళ్ళమే కదా! ఓ చాప వేసుకుని పడుకోగలవా? పడుకో గలగాలి. కబుర్లు చెప్పడం కాదు. అలా ప్రజ్ఞకి హెచ్చు తగ్గులు కాకుండా ఉండాలంటే, దేహ సౌకర్యాలు అంతంతగా, వాటికి మనం లొంగిపోకుండా ఉండ గలిగే సందేశం ఇటువంటి కథల్లో తెలుస్తుంది.

"రాజ్యం పోగొట్టుకుని ఘోరారణ్య మధ్యంలో నెలవేర్పరుచుకుని, నిరంతర తపశ్చర్యలతో కాలం వెళ్ళబుచ్చుతున్న మాతో పాటు ఇడుమ లనుభవింపగలదా ఈ సుకుమారి?" అనేదాంట్లో మనకో సమాచారం అందుతుంది. ఏమిటంటే, పోయిన దానికి ఏడుస్తూ కూర్చోలేదు కదా ఈయన! రాజ్యం పోయిందిగా! రాజ్యం పోతే, అడవిలో కూర్చుని పన్నాగాలు పన్నాలి, ఎట్లా రాజ్యం

సంపాదించాలని కదా! కానీ ఇతడు సహజంగా అంతకుముందు వెలుగు రుచి చూచినటువంటి వాడు. దానికి తేడా పడడం వల్ల తనకు ఉన్నది పోయిందని తెలుసుకున్నాడు. తెలుసుకుని, మనకి రాజ్యం ఉంటే ఏమిటి, లేకపోతే ఏమిటన్న ఒక స్థితిలోకి వచ్చాడు.

నిజంగా అడవిలో ఉండడం అలవాటు పడితే ఊళ్లోకి రాబుద్ధి కాదు తెలుసా! మనం ఉండం, భయం చేత. ఉంటే అదే అలవాటు అయిపోతుంది. అందుకనే, రాముడికి, సీతకి ''ఈ అయోధ్య కన్నా అక్కడ వనంలోనే బావుంది కదా'' అనుకుంటూ ఉండేవాళ్ళు ఇద్దరూ కూడా. ఇక్కడ బావుండడం కన్నా, అక్కడ ఎక్కువ బావుంటుంది. ఎందుకంటే ప్రకృతిలో ఉంటాం. ఇక్కడ మనం కృత్రిమ ప్రకృతిలో ఉంటాం. సరిగ్గా గాలి రాదు, వెలుతురు రాదు. దుమ్ము నోట్లోకి, ముక్కులోకి పోతూ ఉంటుంది కదా! మన మేర్పరుచుకున్నదే! ఈ కాలుష్యంలో బ్రతుకుతూ ఉంటాం. పై నుంచి చూస్తే తెలిసినవాడికి, అబ్బ ఇంత కుళ్ళుగా బ్రతుకుతున్నారేంటి అనిపిస్తుంది. అది అరణ్యమా, ఇది అరణ్యమా అనిపిస్తుంది. **మనము ఏది అరణ్యం అని భయపడుతున్నామో అది ఊళ్ళో ఉంది ఇప్పుడు. ఈ ఊళ్ళో కన్నా అరణ్యంలోనే ఎక్కువ ప్రశాంతంగా ఉంటుంది.** ఊరి బయటకి వెళ్తే బావుండదూ? గాలి బావుంటుంది, వెలుతురు బావుటుంది. రాత్రి పూట నక్షత్రాలు కనిపిస్తాయి, సూర్యోదయం కనిపిస్తుంది, సూర్యాస్తమయం కనిపిస్తుంది, చంద్రోదయం కనిపిస్తుంది, చంద్రుని అస్తమయం కనిపిస్తుంది కదా! మరి ఇవన్నీ మనకి కనిపిస్తున్నాయా? ఏం లేదు కదా!

అందుకని, ఈయన అరణ్యం చేరాడండి. చేరి, ఏం చేశాడు? పోయినదేదో పోయింది, ఇప్పుడు ఏం చెయ్యాలి నేను? దైవాన్ని ఆరాధన చేసుకుందాం. ఎప్పుడూ కూడా భారతంలో గాని, రామాయణంలో గాని, భక్తుల కథల్లో గానీ చూపించేది ఒక్కటే, కష్టం వచ్చినప్పుడు దైవం కాళ్ళు ఎక్కువ పట్టుకోవాలి. నాకు ఎవరు ఏం చేశారు, ఇన్నిసార్లు ఇన్ని ప్రార్థనలు చేశాను, ఇన్ని గుళ్ళ చుట్టూ తిరిగాను, నాకేం జరిగింది, ఇట్లా మాట్లాడేది అహంకారం. బాగా కష్టం వచ్చినప్పుడు తాను చాలా మంచివాడు అని తను అనుకోవడం వల్ల కదా! నాకు ఎందుకింత కష్టం వచ్చిందని అంటుంటాడు. అసలు నువ్వు మంచివాడివని ఎందు కనుకుంటున్నావు? మంచివాడివైతే ఇలా ఎందుకున్నావు? నీ గురించి నీకు అంచనా ఎక్కువ. ప్రతివాడికి అంతే. నాకయినా, మీకయినా, తన గురించి తనకి అంచనా ఎక్కువ, ఎదుట వాడి గురించి అంచనా తక్కువ. అక్కడే ఉంది మాత్సర్యం కదా!

మన గురించి అంచనా తక్కువ ఉండాలి, ఎదుటి వాడి గురించి అంచనా ఎక్కువ ఉండాలి. అదీ భక్తి. వచ్చినవాడే నారాయణుడు అనుకునేవాడు భక్తుడు. ఆ! వాడికేం తెలుసు అనుకునేవాడు అహంకారి. ఎవడికీ ఏం తెలీదు అనిపిస్తుంది, మనకి తప్ప. అంతా తెలిస్తే ఇట్లా ఉన్నావేం నువ్వు? ఆ ప్రశ్న వేసుకోవద్దూ? నీకు అంతా తెలిసిన వాడివి, ఇట్లా ఉన్నావేంటి, దేభ్యం మొహం వేసుకుని? అందుచేత, తన గురించి మర్చిపోయిన వాడు భక్తుడు. తన గురించి గుర్తు ఉన్నవాడు అహంకారి. భగవత్ భక్తిలో మనకేం చెప్తారంటే, తన గురించి తనకి ఎంత గుర్తు ఉంటుందో, అంత మేర అహంకారం. కొలత అది అహంకారానికి. నేను,

నేను, నేను అంటూ మాట్లాడతారు కదా! ఎన్నిసార్లు తన గురించి మాట్లాడుకుంటే, అంత అహంకారం వీడిలో ఉందని మనం అంచనా వేసుకోవచ్చు. అది ఎదుటివాడు మాట్లాడుతున్నప్పుడు మనం అంచనా వేస్తాం. మనం మాట్లాడుతున్నప్పుడో? అందుకని, ఈ ఆత్మజ్ఞానం విషయంలో మనకి మనం మార్కులు వేసుకోవడమే తప్ప, ఎదుటివాడికి మార్కులు వెయ్యం. ఎన్నిసార్లు నీ గురించి నువ్వు మాట్లాడుకున్నావు ఇవాళ గొప్పగా? మాట్లాడుకున్నావా? పోనీ మాట్లాడలేదు, భావన చేశావా? చేశావు కదా! మరంతలా నిన్ను నువ్వే ప్రేమించుకుంటూ ఉంటే, ఇంక ప్రపంచాన్ని ఏం ప్రేమిస్తావు, దేవుడిని ఏం ప్రేమిస్తావు? ప్రేమించలేవు కదా!

నాకెక్కడ ముచ్చటేసిందంటే, రాజ్యం పోయిన తర్వాత చాలా ప్రతీకార బుద్ధి ఉంటుంది మామూలు వాడికే, ఇంక మరి క్షత్రియుడంటే చెప్పక్కర్లేదు. చాలా ఎక్కువ ప్రతీకార బుద్ధి. అలాంటి క్షత్రియుడు, అంతకుముందు తను రుచి చూసిన వెలుగుని మళ్ళీ పొందే ప్రయత్నంలో ఉన్నాడు తప్ప, రాజ్యం కోసం పన్నాగాలు వేసుకోలేదు. కళ్ళు పోయినాయి. పోతే పోయినాయి అనుకున్నాడు. చెప్పాగా ఇందాక. కనబడడం లేదంటే నానా బాధా పడిపోనక్కర్లేదు. కొంచెమయినా ధర్మం ఆచరిస్తే, సాయం చేసేవాడు ఎవడో ఒకడుంటాడు. ఎప్పుడూ ఏ ధర్మం ఆచరించని వాడికి ఎలాంటి సహాయం రాదు. *"స్వల్పమపి ధర్మస్య"* అంటూ భగవద్గీతలో ఒక శ్లోకం ఉంటుంది. కించిత్ ధర్మం ఆచరిస్తే చాలురా, నేను ఏదో రకంగా నీకు సాయం చేస్తూ ఉంటాను అన్నాడు కృష్ణుడు. అందుచేత, అయ్యో కళ్ళు లేవే, అయ్యో కాలు

లేదే, అయ్యో చెవి లేదే అనుకోవద్దు. ప్రజ్ఞ ఉందిగా! ప్రజ్ఞ చేత దివ్య ప్రజ్ఞతో అనుసంధానం చెందవచ్చు.

ద్యుమత్సేనుడు తపశ్చర్యలోకి వెళ్ళాడన్నది ఎంత బావుందండి! నా రాజ్యం పోయింది, నువ్వు వచ్చావు, ఇప్పుడు మీ అమ్మాయిని మేము చేసుకుంటే, నీ సైన్యం నా సైన్యం కదా, అందుచేత మనం దండెత్తి శత్రువులను ఓడించి నా రాజ్యాన్ని తెచ్చుకోవచ్చు... ఇలాంటివన్నీ అనుకుంటాం కదా! కోడలు తండ్రి బాగా influence ఉన్నవాడుంటే, కొడుకు తండ్రి వాడుకోడండి? అది కదా లోకం! అదేగా లౌక్యం! మన అబ్బాయిని బాగా influence, state level, central level influence ఉండే వాళ్ళ అమ్మాయికి ఇచ్చి పెళ్లి చేసుకున్నామనుకోండి, మాటిమాటికీ 'బావగారూ' అని ఫోన్ చేస్తూ ఉంటాడు. దేనికి బావగారు? ఆ పని చేసిపెట్టు, ఈ పని చేసిపెట్టు, వాడికి చెప్పు, వీడికి చెప్పు, ఇట్లా అడుగుతూ ఉంటాడు కదా! మరీ కాకపోతే, నేను తిరుపతి వెళ్తున్నాను, అక్కడ దర్శనానికి ఏర్పాటు చేసి పెడతావా అనన్నా అడుగుతాడు. ఏదో ఒకటి అడుగుతాడు. అంటే, లోక ప్రయోజనానికే ఎక్కువ వాడుకుంటాడు కదా!

ఈయన ఏమన్నాడు? మీ అమ్మాయి మా ఇంటికి వస్తుందంటున్నావు, ఉండగలదా ఇక్కడ? ఎప్పుడూ కూడా పిల్లనిచ్చే చోట మనకన్నా ఎక్కువ స్థితిగతులున్న ఇంట్లో ఇమ్మంటారు. ఎందుకంటే, పిల్ల సుఖపడుతుంది. తక్కువ ఇంట్లో ఇస్తే కష్టపడుతుంది. పిల్లని తెచ్చుకునే చోట మనకన్నా తక్కువ స్థితిమంతుల ఇంట్లోంచి తెచ్చుకోమంటారు. అప్పుడు ఆ అమ్మాయి

సుఖంగా ఉంటుంది. ఎందుకంటే, ఇక్కడ అంతకన్నా ఎక్కువ బావుంటుంది కాబట్టి. అందుచేత, మనకి పెద్దలేం చెప్పారంటే, పిల్లని తెచ్చుకునేటప్పుడు నీకన్నా స్థితిగతులు తక్కువగా ఉన్న కుటుంబంలో, సంస్కారములు చూసుకుని తెచ్చుకోమన్నారు. సంస్కారాలకు ఉండడం, లేకపోవడంతో సంబంధం లేదుగా! అలాగే, పిల్లనిచ్చే చోట ఎక్కువ స్థితిగతులు ఉండే ఇంట్లో ఇచ్చుకోమన్నారు.

ఇక్కడ reverse అయ్యింది. ఒక ఇల్లు కూడా లేదు. అటువంటి చోట ఇస్తున్నాడు ఇప్పుడు. అందుచేత, ఈ ప్రశ్న వేశాడు. ప్రశ్న వేస్తే, దానికి అశ్వపతి సమాధానం చెప్పాడు, "ధరణీనాథా!"... ఈయన ఎప్పుడూ ఆయనని "ధరణీనాథా!", "మహారాజా!" అని సంబోధిస్తున్నాడండి. అంటే, రాజ్యం లేకపోవచ్చు గానీ, అతడి కుండేటటువంటి సంస్కారపరంగా అతడు రాజే. ఎందుకని? అడుక్కుతినటం లేదుగా! నా రాజ్యం పోయింది, నాకేమయినా ఇస్తావా అని అడగడం లేదు కదా ప్రతిచోటకి వెళ్లి, నాకంతా పోయింది కదా, నువ్వు ఏమయినా సాయం చేసి పెడతావా అని అడగడం లేదు.

ధీరుడు అయి ఉండడం చేత, అరణ్యంలో తపస్సు చేసుకుంటూ అక్కడేం దొరికితే అది తిని బ్రతికేస్తున్నాడండి. ధీర లక్షణం.

*"గ్రాసము లేక స్రుక్కిన జరాకృశమైన విశీర్ణమైన సా*
*యాసమునైన నష్టరుచి యైనను బ్రాణభయార్తమైన ని*

*స్త్రాసమదేభకుంభపిశి తగ్రహలాలసశీలసాగ్రహా*
*గ్రేసరభాసమాన మగు కేసరి జీర్ణతృణంబు మేయునే.''*

అందుకే పద్యం చదువుకున్నాం చిన్నప్పుడు. ఏం దొరకట్లేదు సింహానికి, బాగా చిక్కిపోతోందిట, డొక్కలన్నీ ఎండి పోతున్నాయట, ఎముకలు కనిపిస్తున్నాయటండి. అయినప్పటికీ గడ్డి తినదు సుమా సింహము అని రాశాడు భర్తృహరి. అంటే, రాజంటే సింహమే. క్షత్రియ లక్షణం అది. గడ్డి తింటుందా? తినలేదు కదా! అంటే ఆకులు, అలములు తింటున్నాడు పాపం, ప్రకృతి ఇచ్చినవి పుచ్చుకుని బ్రతికేస్తున్నాడు. ఆనందంగా ఉన్నాడు, రాజ్యంలో ఉండేదానికన్నా ఆనందంగా ఉన్నాడు. కాబట్టి మనకి ఈయన ఆదర్శనీయుడు అవునా, కాదా? అవును ఆదర్శనీయుడే. స్వభావం ఎలా ఉందో చూడండి. ఉండడం, లేకపోవడంతో సంబంధం లేకుండా, ఒకవేళ చేసిన పొరపాటు ఏదన్నా ఉంటే, దాన్ని సర్దుకుని, శుభ్రంగా తపస్సు చేసుకుంటున్నాడంటే, దివ్య స్వభావం ఏర్పరుచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నటువంటి వాడాయన.

దానికి ఈయన అన్నాడు, "ధరణీనాథా! కలిమిలేములు కలకాలం నిలవనేరవు." అంతేకదా! ఒకప్పుడు ఉంటాయి, ఒకప్పుడు ఉండవు. లేనివాడికి వచ్చి తర్వాత పోతే ఎక్కువ బాధ ఉంటుందండి. లేనివాడికి లేనట్టే ఉంటే, వాడికి ఏ బాధ లేదు.

నేనెప్పుడూ చెప్తూ ఉంటా, మనం చేసిన పనుల వల్ల, ఏదో మొత్తానికి ఓ కోటి రూపాయలు వచ్చిందనుకోండి. అంతకుముందు లేవా కోటి రూపాయలు. ఇప్పుడా కోటి రూపాయలు పోయినాయి అనుకోండి. పోతే ఎంత బాధగా ఉంటుందో! అదేంటిరా, అంతకు

ముందు లేవుగా నీ దగ్గర? పదేళ్ళు వెనక్కి వెళ్తే, నీకు అవి లేవు కదా? ఉన్నాయా? పదేళ్ళ క్రితం లేనివి, నీకు వచ్చిన తర్వాత అవి వెళ్ళిపోతే, అంతకుముందు లేనప్పుడు ఎంత సుఖంగా ఉన్నావో, ఇప్పుడు అంత సుఖంగా ఎందుకు ఉండలేవు? మార్పు వచ్చింది నీలో. అసలు బాగా మనం మొదటికెళ్ళిపొతే, *"వస్తా వట్టిదే, పోతా వట్టిదే"*. మధ్యలో చాలా వస్తుంటాయి, పోతూ ఉంటాయి. అవి పోక పోయినా, నువ్వు పోతావు కదా! అదొకటి ఉంటుంది కదా! అమ్మమ్మా, అలా ఎలా వెళ్ళిపోతామండి అంటే, అవి వెళ్ళిపోవు, ఉంటాయి, నువ్వు వెళ్ళిపోతావు. ఒకడేగా వస్తాడు, ఒకడే కదా వెళ్తాడు! ఈ లోపల ఎన్నో వచ్చి చేరతాయండి. కొన్ని చేరుతూ ఉంటాయి, కొన్ని పోతూ ఉంటాయి. ఈ చేరినవి, పోతాయని తెలుసుండాలి.

*"ఆగమా పాయనః"* అంటుంది భగవద్గీత. వచ్చేవన్నీ పోయేవే అని అర్థం. ఎందుకని? అవి వచ్చాయి, కాబట్టి పోతాయి. అసలు రాకపోతే? *"జాతస్య మరణం ధ్రువం"* అంటారు. పుడితే, చచ్చిపోతావు. నువ్వు పుట్టినవాడివి కాదు. నువ్వు చొక్కా వేసుకున్నావు, చొక్కా తీసేస్తావు. ఇప్పుడు ఈ చొక్కా వేసుకున్నానండి పొద్దున్న, ఇది తీయాలా? వేసుకున్నప్పుడు ఇది తీస్తావని తెలుసా? ఏ సాయంత్రానికో ఈ గోతం తీస్తావని తెలుసు కదా! అంటే, బట్ట ఉంటే ఏం పెద్ద ఆనందం అండి? ఇంకో బట్ట ఉంది కదా! ఇలా గోతాలు వేసుక్కూర్చున్నా మనుకోండి వాళ్ళూ వీళ్ళూ ఇచ్చారని, ఇది ఎప్పుడు విప్పేద్దామా అన్నట్టుగా ఉంటుంది. అట్లాగే, దేహం ధరించినటువంటి వాడు, తెలిసినవాడయితే, ఎప్పుడు పని పూర్తి చేసుకుని వెళ్ళిపోదామా అనిపిస్తుంటుంది వాడికి. తేలికైన శరీరం

ఏర్పాటు చేసుకుని, అందులోకి వెళ్లిపోదామనిపిస్తుంది. అదయితే తేలుతుంది, ఎగురుతుంది, ఆకాశ గమనం చేస్తుంది. అలాంటిది, దీనికన్నా సుఖం. అది కూడా వద్దనుకునే వాళ్ళున్నారు తెలుసా! ఇవన్నీ మన ఇళ్ళే.

ఆషాఢ మాసం మన నివాసస్థానం గురించి చెప్తుంది. Fourth house is your house అంటారు, నివాసస్థానము. నీ ఇల్లు ఎట్లా ఉంది? నీ వళ్లు ఎట్లా ఉంటుందో నీ ఇల్లు అట్లా ఉంటుంది. నీ శరీరం నీ నివాసం. ఆ శరీరంలో వెలుగు శరీరం తయారు చేసుకుంటే అది ఇంకా మంచి నివాసం. అందులో బంగారుకాంతి నుంచి వజ్రకాంతికి వెళితే అది ఇంకా పెద్ద నివాసం. అందుకని, జీవుడు బొత్తిగా పల్చగా ఆకాశంలా ఉండే శరీరాన్ని కట్టుకు తిరుగుదాం అనుకుంటాడండి. అది వాడికి highest. *"ఆకాశ శరీరం బ్రహ్మ"* అంటుంది ఉపనిషత్తు. బ్రహ్మదేవుడు ఆకాశమే శరీరంగా ఉన్నాడుటండి. ఎంత హాయో! ఇరుకుగా ఉండదు ఎక్కడా. ఇలాంటి బట్టలేసుకుని, సాక్స్ వేసుకోవాలంటే, ఇక్కడ అడ్డుపడుతుంది, అక్కడ అడ్డుపడుతుంది, రకరకాల బాధలుంటాయి కదా! శరీరం అడ్డమే జీవుడికి ఒక రకంగా. ఎందుకంటే, అంత తేజస్సుని అట్లా ఓ మట్టి కుండలో పెట్టినట్టుగా ఉంటాడు. ఇప్పుడు చూడండి, మట్టి ప్రమిదల్లో దీపం పెట్టం. క్రమక్రమంగా మట్టివి తీసేసి, ఇప్పుడు గాజువి పెట్టుకుంటున్నాం. అంటే ఏమిటంటే, ఈ శరీరం నుంచి ఇంకో శరీరం తయారు చేసుకోవడానికి మానవజాతికి అర్హత వచ్చిందని. మట్టి దీపాల్లోంచి, గాజు దీపాల్లోకి వచ్చారు. అక్కడ నుంచి విద్యుత్ దీపాల్లోకి వచ్చారు కదా! ఇదంతా పురోగతిగానే చూస్తారు పరమ

గురువులు. వాళ్ళు మంచివాళ్ళు. అంటే, బొత్తిగా మనలో ఏ మచ్చా చూడకుండా, మీరు చాలా మంచివాళ్ళని చెప్తుంటారు. మనం నిజమేనని అనుకోకూడదు. ఎందుకంటే, ఉత్సాహ పరచడానికే అలా చెప్తూ ఉంటారు.

అందుచేత, ఈ శరీర నిర్మాణాల్లో, ఏ శరీరం నీకు సుఖము అంటే, ఆకాశ శరీరం. జ్ఞానవాశిష్ఠంలో మొట్టమొదటొచ్చే కథే, ఆకాశజుడి కథ. అంటే, వాడి శరీరం ఆకాశం... వాడు ఆకాశంలోనే పుట్టాడు. మనమంతా కూడా ముందు ఆకాశంలో పుట్టిన వాళ్ళమే. అక్కడి నుంచి ఇంకో దాంట్లోకి, ఇంకో దాంట్లోకి, ఇంకో దాంట్లోకి, అట్లా మట్టిలోకి వచ్చేశాం మనం. అందుచేత, ఆ శరీరం ఉంటే అద్భుతం. అంతకన్నా కొంచెం తక్కువ సూక్ష్మం, అంటే దాన్ని కారణ శరీరం, లింగ శరీరం అంటారు. దానికన్నా కొంచెం ముందుగా ఉండేది బంగారుకాంతి శరీరం, సూక్ష్మ శరీరం అంటారు. దానికన్నా బాగా తక్కువ కాంతి ఉండేది భౌతిక శరీరం. దీన్ని కూడా పల్చగా, చక్కగా కాంతివంతగా ఉంచుకునే మార్గాలు ఉన్నాయి. అట్లా బండబారి పోకుండా, ఓ మొద్దల్లే తయారవకుండా చూసుకోవచ్చు. దేని చేత? సున్నితమైన ఆహారం పెట్టి, బాగా నిద్రపుచ్చి కాదు. వెలుగు నింపి. వెలుగు నింపడం చేత, ఈ శరీర ధాతువుల్లో చక్కని ఒక తేలికతనం వస్తుంది, సాంద్రత తగ్గుతుంది. ఇవన్నీ ఏర్పరుచుకోవడం కోసమే దైవారాధన, సాధన.

ఆ విధమైనటువంటి దైవారాధనలో ఆయన ఉన్నప్పుడు, ఇలా ఉంది కదా అంటే, “ఈ కలిమిలేములు కలకాలం ఉండవు కదా!” అని చెప్పాడు. మన సంగతేంటి? ప్రతీది మనకి

అన్వయించుకోకపోతే ఈ గ్రంథాలు ఉపయోగపడవు కదా! వచ్చినవన్నీ ఎప్పుడూ నీతో ఉంటాయా? సగంలోనే పోవచ్చు కొన్ని వచ్చినవి, లేదా నువ్వే వాటిలోంచి వెళ్లిపోవచ్చు. అయ్యో! అయ్యో! ఇన్ని సంపాదించుకుని ఇప్పుడే వెళ్ళిపోతే ఎట్లా అంటే? ఇప్పుడే కదండి అన్నీ ఏర్పడినాయి, ఇప్పుడే ఎట్లా పట్టుకుపోతారంటే, కుదరదు కదా! అది ఎప్పుడొస్తే అప్పుడు నువ్వు సిద్ధంగా ఉండాలి. అందుచేత, అవి శాశ్వతం కాదు కదా అన్నాడీయన.

పిల్ల తండ్రి, పిల్లవాడి తండ్రితో ఈ కలిమిలేములు కలకాలం ఉండవు కదా, అందుచేత వాటి గురించి మనం ఆలోచించక్కర్లేదు అన్నాడు. ''అవి సంప్రాప్తించినప్పుడు (ఆనంద దుఃఖాలు) ధీరులను ఏమాత్రం అంటవు.'' సుఖము కలిగినప్పుడు అంటకూడదండి, కష్టం కలిగినప్పుడు అంటకూడదు. సుఖం కలగగానే, అంటే మనకి కాస్త సంపద కలగంగానే రకరకాల సౌకర్యాలు మనం ఏర్పరుచుకుంటాం కదా! అలా ఏర్పరుచుకుంటే, ఆ సౌకర్యం లేని చోట నువ్వు ఇబ్బంది పడుతూ ఉంటావు కదా! ఎప్పుడూ AC గదిలోనే పడుకున్నారనుకోండి, ఏ ఊరన్నా వెళ్తే అక్కడ AC ఉందా అనడగాలి. ఇప్పుడు మన పరిస్థితి అది. అలవాటు పడిపోయాము సౌకర్యాలకి. అంతే కదా! అలా అలవాటు పడిపోతే, అవి లేకపోతే ఏమయిపోతావు? చాలా కష్టంగా ఉంటుంది.

ఒకప్పుడు మనకి కరెంటు లేదు కదా! చిన్నప్పుడు ఏం కరెంటు ఉందండి? మొత్తం ఇంటికి ఒక ఫ్యాన్ ఉండేదేమో. నా చిన్నప్పుడు మొత్తం ఇంటికి ఒక ఫ్యాన్, మొత్తం ఇంటికి ఒక bathroom కదా! అంటే, ఇంట్లో ఎంతమంది ఉంటారు?

ఇప్పటిలాగా ముగ్గురు, నలుగురు కాదు కదా! ఓ డజను మందుంటారు. మూడు తరాలుంటాయి ఇంట్లో కదా! మూడు తరాల కొకటే bathroom. వాళ్ళూ బానే పొద్దున్నే లేచి స్నానాలు చేశారు. మరి ఈ సుఖాలు, సౌకర్యాలు ఏర్పడినప్పుడు, వీటికి... ఏర్పడకూడదని నేనడం లేదు. ఏర్పడవచ్చు. అవి లేకపోతే బాధ పడతావా? అది చూసుకోవాలి.

ఈసారి గురుపూజల్లో వాళ్ళు గదిలో మంచాలు వెయ్యలేదుట అంటే, అయితే నేను వెళ్ళను అనుకోకూడదు. ఒకప్పుడు మనం గురుపూజల్లో నేలమీద పడుకున్న రోజులు ఉన్నాయి, ఓ గదిలో పదిమంది పడుకున్న రోజులున్నాయి. నేల మీద కూర్చుని తిన్న రోజులున్నాయి. వేడినీళ్ళు మోసుకొచ్చి తెచ్చుకుని స్నానాలు చేసిన రోజులున్నాయి. ఇప్పుడు మనకి వేడినీళ్ళు తెచ్చి ఇస్తారు, మంచాలు వేస్తారు, ఫ్యాన్లు పెడతారు, ఇలా చేసి పెడుతుంటే నీకు చక్కగా ముఖమంతా కూడా విస్తరల్లే వికసించి ఉందనుకో, అది లేకపోతే కూడా అలా వికసించి ఉంటే అదీ లెక్క. అది మనిషి లొంగిపోయాడా లేదా అనేది తెలుస్తుంది. సుఖాలకి లొంగకూడదు. సుఖాలకి లొంగనివాడు కష్టాలకి కుంగడు. ఎప్పుడయితే నువ్వు సుఖానికి లోబడిపోతావో అప్పుడు కష్టం రాగానే చాలా కుంగిపోతావు. ఎందుకంటే, అన్న వస్త్రాదులకి లోటు ఉండదు. సౌకర్యాలకి లోటు ఉంటుంది.

కారులో వెళ్ళాల్సినవాడివి నడిచి వెళ్ళాల్సి వస్తుంది. ఏముంది? కాళ్ళు మొట్టమొదటి నుంచీ ఉన్నాయి మనకి. కార్లు ఇప్పుడిప్పుడే కదా వచ్చినాయి! కారు వెళ్ళిపోయిందనుకోండి,

నడిచి వెళ్ళు. ఇచ్చాడుగా దేవుడు? అలా చెప్పడం సులభం అని అనొచ్చు మీరు. నేను అట్లా నడిచా. నేను పుట్టేప్పటికే మాకు కారు ఉంది. కొన్నాళ్ళకు మా నాన్నగారు వెళ్ళిపోవడంచేత, ఏ కారు లేకపోతే, ఎక్కడినుంచి ఎక్కడికయినా నడచి వెళ్ళేవాడిని. అందుకనే, ఇప్పుడయినా నడిచి వెళ్ళడానికి నాకు అభ్యంతరం లేదు. అంటే, ఒకటే సాధించాను, మిగతావన్నీ కాదు! అందుచేత, నడిచి వెళ్ళగలగాలి కారు లేకపోతే. వాడి కారు తీసుకుందామా, వీడి కారు తీసుకుందామా, నీ కారు ఇస్తావా, మా ఊరు వెళ్తాం... అది చాలా దరిద్రం. నువ్వు అడక్కుండా వాడు ఒకటికి నాలుగు సార్లు అడిగితే అది వేరే విషయం.

ఎందుకివన్నీ చెప్తున్నానంటే, ధీరత్వం అనేది నిత్య జీవితంలో ఎప్పటికప్పుడు మనం గమనించుకుంటూ ఉండాలి. అంటే, కొన్నిటికి మనం లొంగి పోతున్నామేమో మనం చూసుకోవాలి. సుఖానికి చాలా సులభంగా లొంగిపోతాము. కాబట్టే, కష్టం వస్తే భరించలేక చచ్చిపోతాం భయమేసి. అలాంటి సుఖాలు ఎందుకు నేర్చుకోవాలి? ఉండనియ్యి. జనకుడు అదే చెప్తాడు. జనకుడు హంసతూలికా తల్పం మీద పడుకున్నటువంటి వాడు, అరణ్యంలో బండనేల మీద కూడా పడుకోగలడు. అందుకనే, ఈ జనకుడు మనకు ఉదాహరణ, యోగి. అటువంటి పరిస్థితి ధీరులకుంటుంది కదా, నీవు ధీరుడవు కదా అని చెప్పాడు.

అందుచేత, "నా తనూజ పిన్న అయినా ధైర్యంలో పెద్దలకన్నా మిన్న". మా అమ్మాయి వయసులో చిన్నదే అయినా, ఈ విషయంలో ధైర్యంలో... ఎందుకంటే, తనకన్నా

ధైర్యం చూపించినటువంటిది తన కుమార్తె కదా, అతనిని పెళ్లి చేసుకుంటానని చెప్పి. "పెద్దల కన్నా మిన్న. అదిన్నీ కాక, వియ్యమందవలెనన్న ఆశతో ఎంతో భ్రమపడి నీ సాన్నిధ్యం చేరుకున్నాను. ఇట్టి నా ప్రార్థన తిరస్కార న్యాయమేనా? కరుణించి నా మనోరథం నెరవేర్చవలసింది" అన్నాడు. "సాళ్వపతి ఆ ప్రార్థనకి అంగీకరించి, స్వకీయ ఆశ్రమవాసులైన మునీంద్రులతో కలిసి శుభలగ్న వేళలో సావిత్రి సత్యవంతుల పరిణయం యథావిధిగా నిర్వర్తించాడు. అశ్వపతి కుమార్తెకి, అల్లునకు వేరువేరు ఆభరణాలు సగౌరవంగా బహూకరించి, బంధువులను వీడ్కొని, పరివార సహితుడై స్వకీయ రాజధానికి తరలిపోయాడు." వైభవోపేతంగా పెళ్లి చేసేశాడు. అల్లుడికి, పిల్లకి ఇవ్వాల్సిన ఆభరణాలు ఇచ్చేశాడు. ఎందుకంటే, అన్నీ తీసుకొచ్చాడు అరణ్యంలోకి. ఆ నమ్మకం ఉంది పెళ్లి చెయ్యగలమని, ఒప్పుకుంటాడని. ఏకంగా పెళ్ళి సంబారాలతో వచ్చేశాడండి. చెప్పడం, పెళ్లి చేసెయ్యడం కూడా అయిపోయింది. అనంతరం పరివారంతో కలిసి తన రాజధానికి వెళ్ళిపోయాడు.

# 11. సావిత్రి సంస్కారం

"సావిత్రి మిక్కిలి మనోజ్ఞములైన అలంకారాలు, వసనాలు పరిత్యజించింది." పుట్టింటి వారిచ్చారని ఊరికే పెట్టుకుని తిరుగుతూ ఉంటే బావుండదు కదా! ఒక్కటి తెలుసుకోవాలి ఆడవాళ్ళు, పుట్టింటి గొప్పలు మెట్టింట్లో మాట్లాడకూడదు. గొప్పవాళ్ళు అయి ఉండొచ్చు. మెట్టింటి గొప్పలు పుట్టింట్లో మాట్లాడాలి. అది సంస్కృతి. అంతే గానీ అత్తవారింట్లో సమాచారం అక్కర్లేనిదంతా పుట్టింటికి చేరవేసుకుంటూ, పుట్టింటి గొప్పలు అత్తవారింట్లో చెప్పుకుంటున్నారంటే, కాపురం కొల్లేరయిపోతుంది. స్త్రీ సంస్కారంలో భాగం అది. ఒక ఉపనది ఒక నది చేరినట్టే.

కన్య జీవితం వివాహానంతరం పెనిమిటి కుటుంబంలో మిళిత మవుతుంది. ఆ కుటుంబమే తన కుటుంబం. ఒక ఉపనది, ఒక జీవనదిలో మిళితమైన పిదప తన అస్తిత్వము కోల్పోయినట్లుగా, స్త్రీ జీవితం పురుషుని జీవితంలో మిళితమైపోతుంది. నిజానికి స్త్రీకి వివాహము ఒక Initiation వంటిది. జీవుడు దైవంలో చేరటానికి తన అస్తిత్వము కోల్పోయినట్లు, స్త్రీకి అది ఒక ఘర్షణాత్మకమైన మార్పు. దాని వలన స్త్రీ జీవపరంగా చాల పరిణితి చెందుతుంది. అహంకారమును కరిగింపజేసే ఒక ప్రకియ వివాహంలో స్త్రీకి ఎక్కువ. ఈ సత్యం చాలమంది స్త్రీలకు తెలియక ఘర్షణకు గురి అవుతారు. ఇట్టి పెనుమార్పుకు స్త్రీ గురి అవుతుందని తెలిసిన పురుషుడు, ఆమెను ప్రేమతో, లాలనతో, సున్నితముగ

ఆదరించాలి. ఈ విషయం పురుషులకు అంతగ తెలియదు. జీవితంలో లోతైన ఘట్టములను అవగాహనతో దాటాలి. లేకపోతే దెబ్బలు తగులుతాయి.

పురషుడి గోత్రమే స్త్రీకి అన్వయిస్తుంది. ఆ ఇల్లే నీ ఇల్లు. నువ్వు 'ఆడ' పిల్లవి కదా, అక్కడికి చేరావు అని తెలియాలి. తెలిస్తే, చక్కగా దాన్ని దిద్దుకోవడం జరుగుతుంది. ఇల్లు చక్కదిద్దుకోవాలి. తను వెళ్ళిన వేళావిశేషం చేత ఆ ఇంటికి శోభ రావాలి, ఆ ఇంట్లో ఎక్కువ వృద్ధి రావాలి. దానికి తగ్గ కృషి తను చేస్తూ ఉండాలి. ఆ విధంగా దైవాన్ని ఆరాధన చేస్తూ ఉండాలి. అందరూ బావుండాలి, అత్తవారింట్లో అందరూ బావుండాలి, పుట్టింట్లో అందరూ బావుండాలి. అది స్త్రీ కోరుకోవలసినది.

ప్రత్యేకించి పతికి అన్ని విధములైన అనుకూల్యము కలిగేటట్టుగా సతి ప్రార్థనలు చెయ్యాలి. ఎందుచేత అంటే శక్తి స్వరూపిణి స్త్రీ. అందుచేత, స్త్రీ శక్తి వలనే పురుషుడు పెరుగుతూ ఉంటాడు. స్త్రీ సాన్నిధ్యం లేకపోతే యోగమే జరగదు తెలుసా! అందుకనే, మాస్టర్ CVVగారు నా యోగంలో ప్రవేశించాలంటే తప్పక వివాహిత లేక వివాహితుడు అయ్యుండాలని చెప్పారు. జాతకంలో వివాహం కుదరదని అనే వాళ్ళకి కూడా నేను కుదురుస్తాను అని చెప్పారు. నాకు పెళ్లి కాదని తిరుగుతున్న జ్యోతిష్యుడికి కూడా పెళ్ళయిపోయింది మా ఊళ్ళో. నాకు పెళ్లి కాదని తిరుగుతూ ఉండేవాడు. ఎందుకంటే, నా జాతకం నాకు తెలుసు కదా, నాకు పెళ్లి కాదు అంటుండేవాడు. అలాంటివాడు పెళ్లి చేసుకోవలసి వచ్చింది, చేసేసుకున్నాడు. అందుచేత, యోగానికి స్త్రీ, పురుష శక్తి సమ్మేళనమే కదా! స్త్రీ, పురుష ప్రజ్ఞలు

చక్కగా సమన్వయింపబడినప్పుడు యోగం సిద్ధిస్తుంది. అందుచేత, స్త్రీ, పురుషునికి చాలా సహాయకారి. అందుకని కదా చెప్తుంటాము, ప్రతి పురుషుని విజయానికి వెనకాల ఒక స్త్రీ ఉంటుంది అంటాం. ఎందుచేత, శక్తి అంతా అదే. పురుషుని శక్తికి స్త్రీ శక్తి తోడయితే చాలా మహత్కార్యాలు సాధించవచ్చు. స్త్రీ వ్యతిరేకమయితే వీడు బలహీనుడవుతాడు. ఇప్పుడీ కథలో స్త్రీ శక్తి మహత్తరమైనటువంటి శక్తి. అతడు అల్పాయుష్కుడైనప్పటికి కూడా దాన్ని కూడా జయించగలిగినటువంటి శక్తి ఇక్కడ తోడవుతోంది.

ఈమె రాగానే ఏం చేసింది? పుట్టింటి వారిచ్చినటువంటి ఆభరణాలన్నీ తీసేసింది. పట్టుచీరలన్నీ లోపల పెట్టేసింది. ఎందుకంటే, అత్తవారు అలా నారచీరలు కట్టుకుంటే నువ్వు జరీచీరలు కట్టుకుంటే ఏం బావుంటుంది? అన్నీ తీసేసి పక్కన పెట్టేసింది. ఎందుకు? వాళ్ళెలా ఉన్నారో వాళ్ళతో పాటు నేను అలాగే ఉంటాను. అది కదా integration మార్గం! నువ్వు ఎవరింటికయినా వెళ్తే వాళ్లతో సమానంగా నువ్వు ఉండాలి. వారింటిలో వారు ఉన్న పరిస్థితులకు నువ్వు adjust అయిపోవాలి. అది యోగం.

అందుచేత, ఆవిడ ఆ విధంగా పక్కన పెట్టేసింది. పెట్టేసి, "పరిత్యజించి, కానన వాసయోగ్యములైన వల్కలాజినాలే ధరించి, అత్తమామలతో పాటు, భర్తకి ఎంతో భక్తితో పరిచర్యలు ఆచరించినది." ముగ్గురికీ. She took upon herself serving the three. ఎలా రాశారు ఇక్కడ? అత్తమామలతో పాటు భర్త. ముందు నా మొగుడనుకోకూడదు. నీ మొగుడిని కని, పెంచి, పెద్ద చేసిన వాళ్ళు నీకు ముందు ముఖ్యం. అదీ భారత

ధర్మంలో చెప్పేది. నా మొగుడు పుట్టడానికి ఆధారభూతులైన వాళ్ళు. ఆ విధమైనటువంటి స్థితిగతులు, సంస్కారము ఏర్పాటు చేసుకోవడానికి వెనకాల వెన్నుబలంగా ఉన్నవాళ్ళు, వాళ్ళని గౌరవించి, భర్తని గౌరవించమంటారు.

ఇలాంటివి ఇప్పుడు చెప్తే విసుగ్గా ఉంటుంది చాలామందికి. ఎందుకంటే ఇలా చెయ్యడంలో మన సంస్కారాలు పెరుగుతాయని తెలియదు. ఎందుకు చెయ్యాలండి మేము అనుకోకండి. ఎందుకు చెయ్యాలంటే చెయ్యడం వల్ల మీకు అహంకారం తగ్గుతుంది, సంస్కారం పెరుగుతుంది. ఎంత సేవ ఒకరికొకరు చేసుకుంటూ ఉంటే మనలో అంత అహంకారం తగ్గి, అంత సంస్కారం పెరుగుతుంది. అహంకారం పెరిగినకొద్దీ సంస్కారం తగ్గిపోతూ ఉంటుంది. అత్తగారు, మామగారు వస్తే కాలు మీద కాలు వేసుకుని, కాలు ఆడిస్తూ కూర్చోవచ్చు, కుర్చీలోంచి లేవకుండా. ఓహో మంచి సంస్కారంలో పెరిగింది ఈ పిల్ల అనుకుంటారు కదా! వచ్చిన పిల్ల పుట్టింటి సంస్కారాలను కదా తెచ్చుకుని వస్తుంది. మరి ఆ పుట్టింటి సంస్కారాలు, మంచి సంస్కారాలు అని ప్రశంసించేటట్లుగా తన ప్రవర్తన ఉండాలి.

అందుచేత, ఈమె ఆ విధంగా ముందు అత్తమామలకు సేవలు చేసి, అటుపైన భర్తకి సేవ చేస్తూ, "వారు ఆ రాజకుమారి భక్తి సేవలకు ఆమంద ఆనంద భరితులైనారు. ఆ విధంగా నాలుగు దివసాలు కొరతగా ఒక సంవత్సరం గడిచిపోయింది." ఒక సంవత్సరం పాటు అట్లా సాగిందండి. అంటే, పదహారు రోజుల పండగ లోపలే ఈమె ఆ ఇంట్లో వాళ్ళతో కలిసిపోయింది. అలా

కలిసిపోవాలి. అంటే, జ్ఞానము అక్కడ ఉన్నది. మీరు ఎప్పుడయినా చూశారో లేదో, ఎప్పుడయినా నదిలో ప్రయాణం చేస్తే తెలుస్తుంది. ఒక ఉపనది ఒక నదిలో కలిసినప్పుడు ఆ కలిసిన చోట కొంత అలజడిగా ఉంటుంది నదికి. ఎందుకంటే ఒక ప్రజ్ఞ వచ్చి ఇంకో ప్రజ్ఞలో కలుస్తోంది. ఒక చైతన్య స్రవంతి వచ్చి, ఉన్న చైతన్య స్రవంతిలో కలుస్తూ ఉంటుంది. కలిసినప్పుడు కొంత అలజడి వస్తుంది. అట్లాగే, ఇంట్లో ఒక పిల్లవాడో, పిల్లో పుట్టినప్పుడు ఇంకొక స్రవంతి వచ్చి అక్కడ చేరుతుంది. కొంత అలజడి ఉంటుంది, మళ్ళీ సర్దుబాటు అవుతుంది. కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత సర్దుబాటు అవుతుంది. మనం వ్యాపారాలు చేసుకుంటున్నా అంతే. ఓ పార్టనర్ వస్తే కొంత అలజడి, మళ్ళీ సర్దుబాటు. ఇంకో పార్టనర్ వస్తే కొంత అలజడి, సర్దుబాటు. అట్లాగే group living. బృందాలు బృందాలుగా ఇరవైమంది ఒక చోట కలిసుంటున్నారుట అంటే ఎన్ని adjustments చేసుకోకపోతే ఉండగలరు? ఒంటిలింగ రామలింగంగా ఉండేవారు నలుగురితో కలిసి ఉండలేరు. ఎందుకంటే ego problems కదా! నలుగురితో కలిసి ఉండడం కదా ఇప్పుడు గురుపూజలు. నలుగురితో కలిసి తినడం, కలిసి ఉండడం.

అందుచేత, ఇలా ఇమిడి పోవాలి. ఎక్కడ ఇమిడి పోవడం వస్తుందో అక్కడ అహంకారం తగ్గుతుంది. వేరువేరుగా ఉండడంలో అహంకారం పెరిగే అవకాశం ఉంటుంది. గుర్తు పెట్టుకోండి. ఎంతసేపటికీ వేర్పాటు ధోరణి ఇప్పుడు ఎక్కువ కదా! పెళ్ళి అవంగానే మొగుడుతో మనం వేరుగా వెళ్ళిపోదామా అని అమ్మాయికి అనిపించొచ్చు, అబ్బాయికి అనిపించొచ్చు

కదా! అంటే, పెద్దవాళ్ళకే nuisanse అనిపించొచ్చు. అదొకటి తమాషా. కొంతమంది పెద్దవాళ్ళు, కోడలు రాగానే మేము ఇంకో ఇంట్లో ఉంటాంరా అంటుంది అత్తగారు. అదేంటమ్మా అంటే, లేదులే మాకూ బావుంటుంది, మీకూ బావుంటుంది. అదేంటది? అట్లా ఎట్లా బావుంటుంది? కలిసుంటే బావుంటుంది. కలిసి ఉంటే కలదు సుఖం. కాని ఆ సుఖం తెలియాలి. తెలియకపోతే అన్నీ కష్టాలే. అందుచేత, విడిపోతే తీరని దుఃఖం. ప్రజ్ఞలు కలిస్తే ఎంత ఆనందమో, అంత విడివిడిగా ఏడుస్తూ ఉంటే దరిద్రపుగొట్టు జీవితాల్లా ఉంటాయి ఎంత ఉన్నా.

నీ ఇంటికి ఎవరూ రారు, నువ్వు ఎవరి ఇంటికి వెళ్ళవు. ఏమిటి నీ ఆనందం? పదిమంది వస్తూ ఉండాలి మన ఇంటికి. పదిమంది ఇళ్ళకి మనం వెళ్తూ ఉండాలి. అప్పుడు కదా ఆనందం! ఆ ఆనందం తెలియనివాడు అట్లా కట్టేసుకుంటాడు పిచ్చుక గూడు తయారు చేసుకుని. అందులోనే బితుకు బితుకుమని బ్రతుకుతూ ఉంటారు. అలా జరగకూడదు. వీలున్నంత మందిని కలుపుకోవాలి. మన ఇల్లు అందరి ఇల్లు అవ్వాలి. అప్పుడు అందరి ఇళ్ళు మన ఇళ్ళు అవుతాయి. అందరి ఇళ్ళు మన ఇళ్ళు అవ్వాలని అనుకోకూడదు. ముందు మన ఇల్లు అందరి ఇల్లు అయితే, అందరి ఇళ్ళు మన ఇళ్ళు అవుతాయి. అట్లా ఎన్ని ఇళ్ళు ఉంటాయో నీకు అప్పుడు. నీకు ఎక్కడికి పోయినా ఇళ్ళు ఉంటాయి, ఎందుకూ? అక్కడ నీకు, నీ ఇంట్లోలానే ఆప్యాయత ఉంటుంది. మరి మనం అందరి ఇళ్ళకి వెళ్ళి, మన ఇంటికి ఎవరూ రాకుండా చూసుకున్నామనుకోండి. అదో తెలివి! ప్రతివారి ఇంటికి వెళ్ళి వాళ్ళిళ్ళల్లో ఉండడం, వాళ్ళిళ్ళలో తినడం, వాళ్ళ కార్లు వాడుకోవడం. మన ఇంటికి వాళ్ళని

పిలుస్తున్నామా, మన ఇంటిలో వాళ్ళకి భోజనం పెడుతున్నామా, మన ఇంటికి వస్తే మన కారు ఇస్తున్నామా? ముందు నీతో మొదలు పెట్టాలి. పిలిచిన ప్రతిచోటికి తగుదునమ్మా అని పోయి వాళ్ళిళ్ళలో మనం ఉండకూడదు. ఎందుకుండ కూడదు? వాళ్ళని మన ఇంటికి పిలిచి మన ఇంట్లో ఉంచుకున్నామా ఆలోచించాలి. ఆలోచించు. అందుచేత, ఆ విధంగా కలిసిపోవడం... సహజీవనం, సహజీవనం అని ఊరికే అది concept గా ఎక్కడో పుస్తకాల్లో ఉండకూడదు. జీవితంలో ఉండాలి. కలవాలి. కలిసుండాలి. ఏమి, శరీరానికే కదా కొంత అసౌకర్యం? ఉంటే ఉంటుంది. ఎదుటి మనిషి ముఖ్యమా, నీ శరీర సౌఖ్యము ముఖ్యమా? ఇష్టమైతే కష్టం ఉండదు. ఇష్టం లేకపోతే అన్నీ కష్టాలే. మరి ఇలాంటివి చెప్పుకోవాలి. ఎందుకంటే, ఊరికే పుస్తకం చదివేసుకుంటే ఏముంది అయిపోతుంది!

అదలా ఉండగా, సంవత్సరం పాటు ఆవిడకి పుట్టింటి భావనే లేదు. వాళ్ళూ మాటిమాటికి రాలేదు కదా! మధ్యమధ్యలో వచ్చి చూడొద్దండి అమ్మాయి ఎట్లా ఉందో? ఇచ్చేసిన తర్వాత కొన్నాళ్ళు బావుంటుందని. అదీ పట్టువిడుపులని చెప్పానే మొదటి రోజు, అలా ఉండాలి. అక్కడి నుంచి అత్తగారు మాటిమాటికి ఫోను చేస్తోందనుకోండి, ఇక్కడ ఈ అమ్మాయిని distrub చేస్తున్నట్టే కదా! చెయ్యకూడదు. మీరు చెయ్యవలసిన పనులు మర్చిపోతారు. ఏం సందేహం లేదు. ఎక్కువ మాట్లాడేవాడు అసలు పనులు మరచిపోతాడనేది ఒక శాస్త్ర ధర్మం. "కూసే గాడిద మేసే గాడిదని చెరుస్తుంది" అని సామెత ఉంది కదా! ఊరికే మాటలు చెప్పేవాడు పని చేసేవాడిని పాడు చేస్తాడు. వాడిని ఏ పని చేసుకోనీయడు కదా!

## 12. ఉపవాస దీక్ష

ఇంక నాలుగు రోజులుందండి కథ. నాలుగు రోజుల ముందు. అది ఎప్పుడట అంటే ఇందులో చెప్తారు. జ్యేష్ఠ మాసం చివరి రోజుల్లో, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, అమావాస్య. సావిత్రిదేవి ఇంకో నాలుగు రోజుల్లో అమావాస్య అవుతుందన్న సందర్భంలో ఆమె ఇంట్లో అత్తమామలకి చెప్పింది నేను ఒక మూడు రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉంటాను అని. దేనికమ్మా? అని అడిగితే ఉంటాను, నాకలా చెయ్యాలని అనిపిస్తోంది. ఎందుకో తనకి తెలుసు. వీళ్ళకి తెలియదు పిల్లవాడు వెళ్లిపోతాడని. ఈవిడకెలా తెలిసింది? నారద మహర్షి వలన తెలిసింది. సంవత్సరంలో సత్యవంతుడు వెళ్లిపోతాడని. మనందరం సినిమా చూడడం వల్ల తెలిసింది. ఎందుకంటే భారతం చదువుకున్న వాళ్ళం కాదు కదా! అక్కడ ఎవరికి తెలుసు? సంవత్సరంలో అల్లుడు వెళ్లిపోతాడని ఆమె తల్లితండ్రులకి తెలుసు. సంవత్సరంలో తన భర్త మరణిస్తాడు అన్న విషయం సావిత్రిదేవికి తెలుసు. ఎందుకని? చెప్పింది దేవర్షి. ఋషివాక్యం అమోఘం. జరిగి తీరుతుంది.

ఆ విధంగా తెలిసి ఉండటం చేత ఉపవసించడానికి సిద్ధ పడ్డది. "నాలుగవ నాడు భర్త మృతి దినమని గుర్తెరిగిన సావిత్రి అత్యంత కఠోర నిష్ఠతో త్రిరాత్రోపవాసం ప్రారంభించినది". త్రిరాత్రోపవాసం అంటే పగలు, రాత్రి నిద్ర పోలేదు. ఉపవాసం

అంటే ఏమిటంటే సావిత్రిదేవితో తాను అనుసంధానం చెంది మూడు రోజులు వుంటుందండి. సావిత్రిదేవి అంటే మన సూర్యుడికే మూలము ఆ వెలుగు. ఏ వెలుగునయితే మనం గాయత్రి ద్వారా ఆరాధన చేస్తున్నామో ఆ వెలుగుతో అనుసంధానం చెంది మూడు పగళ్ళు, మూడు రాత్రులు ఉంది. ఎంత పరిపూర్ణంగా అనుసంధానం చెందిందంటే ఆహారం వంటివన్నీ కూడా అవసరం లేనంత అనుసంధానం చెందింది. భక్తి తన్మయత్వము కనుక ఉంటే ఆహారం మీదకి మనసు వెళ్ళదు. అది ఒక సత్యము.

నీకు భక్తిలో ఒక విధమైనటువంటి తన్మయత్వము ఏర్పడితే నీ శరీరం నీకు సహకరించడం మొదలు పెడుతుంది. అటువంటి వాడు ఏదయినా ఒక దీక్షలో ఉంటే అతని శరీరం ఇంకా సహకరిస్తుంది. ఎంత సహకరిస్తుందంటే అసలు ఆకలి అనిపించదు. దాహం అనిపించదు. ఎందుచేత? ప్రజ్ఞ దైవమునందు లగ్నమై ఉండడం చేత. పాట ఉంది కదా, "ఆకలుండదు, దాహముండదు నిన్ను చూస్తుంటే" అని! నిన్ను చూస్తుంటే నాకు ఆకలి వెయ్యడం లేదు, నాకు దాహం వెయ్యట్లేదు, నీతోనే ఉండాలనిపిస్తోంది అనేది ప్రేమభక్తి, దివ్యభక్తి. అమితమైన భక్తి ఉన్నచోట, ప్రేమ ఉన్నచోట, దీక్ష ఉన్నచోట అట్లా ఉంటుంది. మహత్తర కార్యాలు సాధించేవాళ్ళు మాటిమాటికి breakfast ఎక్కడ దొరుకుతుందో చూసుకోరు.

హనుమంతుడు నూరు యోజనాలు సముద్రంపై ఎగరాలి అని బాగా గాలి పీల్చి, మూడుసార్లు వదిలితే మహేంద్ర పర్వతమే గడగడలాడి పోయింది. అంత స్ఫూర్తితో బయలుదేరగానే ఒకడు

breakfast చేస్తావా అని అడిగాడు. అది చూడండి! మైనాకుడనే పర్వతం, కాస్త దిగి breakfast... పెద్ద పని మీద వెళ్తుంటే ఓ దోశ తిని వెళ్తావా? మనసంతా చెయ్యవలసిన పని మీదన్నప్పుడు అసలు దోశలు, పూరీలు, అప్పడాలు అంటూ కూర్చుంటే, ఇహ వీడేం చేస్తాడండి పని? చేస్తాడా? అందుచేత, నువ్వు సాధించవలసినది మహత్కార్యమైనప్పుడు నీ మనసేంద్రియ శరీరములు మూడూ కూడ దానికి ఉన్ముఖమై ఉండడం చేత దేహము తన అవసరాలను కోరదు. అంటే, దైవానికి దగ్గరగా కూర్చోడం చేత వారి మనస్సు, ఇంద్రియములు, శరీరము పూర్తిగా సహకరించి ఉంటాయి. అనుసంధానం చెంది ఉంటాయి. బుద్ధిలోకంలో ఉండి దైవలోకంతో అనుసంధానం చెంది ఉంటారు.

అందుచేత, సావిత్రి ఆ విధంగా మూడు రాత్రులు మంచినీళ్ళు కూడా తాగలేదండి. నిర్జలం. నిద్ర పోలేదండి. జాగరణ. అలా చేసింది. "ద్యుమత్సేను డది గమనించి ఎంతో ఆశ్చర్యపడి, కోడలిని తన సన్నిధికి ఆహ్వానించి, అమ్మా! ఇంతటి దుష్కర వ్రత నిష్ఠను అవలింబిస్తున్నావే దీనికి ఏమి కారణము'' అని అడిగాడు. మామగారు అడిగాడు. మరి నిద్రపోవడం లేదు, అన్నం తినడం లేదు, మంచినీళ్ళు తాగడం లేదు, అలా అని పనులు మానెయ్యలేదు. Daily routine అంతా చేస్తోంది. "మద్రరాజ తనయ ఆ ప్రశ్నపై అత్యంత వినయంతో కనుదోయి అల్లన వాల్చి..." పెద్దవాళ్ళ ముందు చిన్నవాళ్ళు, అందులోనూ ఆడవారు, కన్నుల్లోకి చూచి మాట్లాడరు. లక్ష్మణుడు ఎప్పుడూ సీతాదేవి కన్నుల్లోకి చూడలేదుట. ఎప్పుడూ పాదాలను చూసే మాట్లాడేవాడట. అందుకనే ఆవిడ కంఠాభరణాలు అక్కడ ఋష్యమూక పర్వతం మీద పడిపోతే, అవి

వాళ్ళు తెచ్చి చూపిస్తే రాముడు గుర్తించి, చూశావా లక్ష్మణా! ఇవి మీ వదినవే కదా అంటే, నాకేం తెలుసంటాడు. నాకేం తెలుసు అన్నయ్యా, నాకు వదినగారి పాదాలకుండే ఆభరణాలు తప్ప ఇక పై ఆభరణాలు నాకు తెలియవు అంటాడు. పెద్దవారి కన్నుల్లోకి చూడడం అనేది స్త్రీలు చెయ్యరు. అదో సంస్కారం. పురుషులు కూడా పెద్దవాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు కొంచెం తల దించే మాట్లాడుతారు. తల ఎత్తి మాట్లాడరు. ఇలాంటి సంస్కారాలు మనలో వినయం పెంచుతాయి. అవతల వాళ్ళకి అవి అవసరం కాదు. ఇప్పుడు ఈమె కళ్ళలోకి చూసి మాట్లాడితే మామగారు ఏం అనుకోడు, కాని తన సంస్కారానికి అది మంచిది. ఎప్పటికప్పుడు అహంకారం పెరుగుతూ ఉంటుంది. అది తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యడంలోనే సాధనంతా ఉంది. అహంకారంతో సాధన జరగదు.

"నేను ఇంతటి దుష్కర వ్రత భారం స్వీకరించానన్న ఆందోళన మీకు అనావశ్యకము". ఆందోళన పడవలసిన దేమీ లేదని చెప్పింది. ఏమిటి అనావశ్యకము? విషయము అనావశ్యకము కాదు, ఆందోళన చెందాల్సిన అవసరం ఏం లేదు. "కేవలం మహనీయ శుభ అభిలాషతోనే నేను ఆ నిష్ఠని అవలంబిస్తున్నాను". మహనీయమైనటువంటి శుభము మనందరికి కలగాలనే ఉద్దేశ్యంతో నేను దీన్ని ఆచరిస్తున్నాను. అందుచేత, మీరు ఆందోళన చెందవలసిన అవసరం ఏమాత్రం లేదని చెప్పిందండి. "దీనికి హేతువేమో త్వరలోనే అవగతం కాగలదు" అంది. ఎందుకు చేస్తున్నావంటే... ఒక దీక్ష మన మవలంబిస్తున్నప్పుడు చాలామంది అడుగుతారు. ఎందుకు సార్,

అలా గడ్డం పెంచారని, కదా? లేకపోతే, ఒక స్త్రీని అడగొచ్చు, ఇందుకిలా నిష్ఠతో ఈ కార్యం చేస్తున్నావని, అడుగుతారు కదా! అప్పుడు చెప్పకూడదు. అయిపోయిన తర్వాత మీకే తెలుస్తుంది. మీకే తెలిసేంత బాగా చెయ్యకపోవచ్చు కదా! మీకే తెలియగలదు అని చెప్పిందావిడ. మామ ఆ ప్రత్యుత్తరము విని మిక్కిలి ఆనందించి, ''శుభమగు గాక!'' అన్నాడు. అందరి శుభంకోసం చేస్తున్నానని అన్నప్పుడు నీకు శుభం కలగాలని ఆశీర్వదించాడు ఆయన.

"సావిత్రి ఆపైన నాలుగవనాటి ప్రభాత వేళ మేల్కొని, భర్తకి ఆనాడు మరణ దివసమని లోలోపల మిక్కిలి చింతించినా"... ఇవ్వాళ మా ఆయన పోతాడని తెలిసి, ఏ స్త్రీ స్థిరంగా ఉండ గలదండి? అందుకనే మనకి చెప్పరు లెండి. మనకెవరికీ కూడా తెలిసి మృత్యువు రాదు. ఎందుకంటే మృత్యువు వస్తుందంటే అప్పుడే పోతాం. అప్పటికే మృత్యువు తెచ్చుకుంటాం కదా! అంత భయం భయంగా ఏం బ్రతుకుతారు? చెప్పకుండా తీసుకుపోతే సరిపోతుంది. అందుకని 99.9% చెప్పకుండానే పట్టుకుపోతారు. ముందు చెప్పి తీసుకెళ్ళరు. Appointment లు ఏమీ ఉండవు కదా. Appointment లేకుండా వచ్చేవాడాయనే. అందుకని ఆ రోజు ఆవిడకి తెలుసు, ఈ రోజు... this is the day, it is the D-day, death-day కదా భర్తకి.

"చింతించినా, దరహసిత వికసిత వదనంతో పరిచర్య లాచరించి, అత్తమామల కినుమడించిన భక్తి తాత్పర్యాలతో ప్రణమిల్లి, సౌభాగ్య సంవర్ధకములైన ఆశీర్వచనము లందుకుని... ఆనాడు జాము పొద్దెక్కిన పిదప మామ కోడలిని తన సన్నిధికి

ఆహ్వానించి ప్రగాఢ ఆత్మీయతతో, తల్లీ! మహోగ్రమైన వ్రతనిష్ఠ స్వీకరించి నీవెంతో అలసి ఉన్నావు. కనుక ఇంక ఆలసించక ఆహారం స్వీకరించవలసినది అని ప్రోత్సహించాడు. సావిత్రి దానిపై, నేను ఈనాటి సాయం సమయం వరకు భుజింపరాదని మొట్టమొదటే నిర్ణయం చేసుకున్నాను" అని చెప్పింది. ఆ రోజు సాయంత్రం వరకూ భోజనం చెయ్యనని చెప్పింది.

"సత్యవంతుడు సమిధలు, కుశలు, ఫలాలు, పుష్పాలు ఆదిగా గల వాని కోసము కారడవికి ప్రయాణమైనాడు. సావిత్రి అది గమనించి, పతిని సమీపించి, నేను ఈనాడు మీతోబాటు అరణ్యానికి రావాలని ఉవ్విళ్ళూరుతున్నాను". నేను చాలా ఉత్సాహ పడుతున్నాను ఇవాళ రావాలని. అంతకుముందు ఎప్పుడూ వెళ్ళలేదు. ఉవ్విళ్ళు ఊరుతోందట. "కాదనక వెంట పెట్టుకుపోవలసినది'' అని వేడుకున్నది. సత్యవంతుడు దానికి అంగీకరించక, ''త్రిరాత్రోపవాసంతో నువ్వు ఎంతో చిక్కి ఉన్నావు. అరణ్య గమనం నీకు అసాధ్యమని'' తిరస్కరించాడు. అయినా సావిత్రి నిరాశ చెందక, ''నాకిప్పుడు ఒకించుకైన ఉపవాస ఆయాసం లేదు". మీరు చెప్తే తప్ప నాకు గుర్తు లేదు నేను తినలేదు అని చెప్పింది. ఆయాసం లేదు. "అరణ్య మధ్యభాగం మహోజ్వల పుష్పాలతో విలసిల్లుతోందని విన్నాను. అంతేకాని నేనెప్పుడూ అది సందర్శించలేదు. ఈనాడది పరిశీలించవలెనని ఎంతో కుతూహల పడుతున్నాను". అరణ్యంలో చాలా అద్భుతమైన పుష్ప వృక్షాలు ఉన్నాయి, ఆ వృక్షాలు, ఆ పువ్వులు చూడాలి, ఆ ఫలములు చూడాలని ఎందుకనో చాలా ఉత్సాహ పడుతున్నాను నేను. "కాదు కూడదనక నా చనువు చెల్లించవలసినది" అని కోరింది.

సత్యవంతుడు చాలా సౌమ్యుడు, ఏదీ కాదనడు. సత్యవంతుడు మనం ఊహించుకుంటే, మంచి model మనకి. ఆ గుణములన్నిటితో పాటు సౌజన్యమూర్తి గూడ. పరిపూర్ణంగా సద్గుణములను ఆశ్రయించి, మౌనం వహించి, తన కర్తవ్యాలను నిర్వర్తిస్తూ, ఎప్పుడు ఎక్కడా ఏ మాటా లేకుండా, దేన్నీ ఆశించకుండా బ్రతుకుతున్నాడు. ఈవిడొచ్చి పెళ్లి చేసుకుంటానంటే ఏం మాట్లాడలేదు కదా! చేసేసుకున్నాడు. ఒక రకమైన మౌనదీక్ష కనిపిస్తుంది సత్యవంతుడిలో. మొత్తం కథలో సత్యవంతుడు మాట్లాడింది కనబడదు! ఎప్పుడూ దీక్షతో ఉన్నట్టుగా ఉంటాడతను. అందుచేత, సరే కాదనటం ఎందుకు, కోరుకుంటోంది కదా అని తీసుకెళ్తాడు.

“అనుమతించిన పిమ్మట సావిత్రి అత్తమామల దగ్గరికి పోయి, ప్రణమిల్లి, మీ కుమారుడు సమిత్ కృశాదులకై విపిన భూమికి ప్రయాణమైనారు. నేనాయనతో పోయి అరణ్య సౌందర్యం తిలకించవలెనని ఉవ్విళ్ళూరుతున్నాను. కరుణించి నాకీ వరం ప్రసాదించ వలసినది.” అని ప్రార్థించింది. ద్యుమత్సేనుడది విని, ‘‘ఈ రాజకుమారి ఎన్నడూ ఏదీ అర్థించలేదు. ఈనాడు అరణ్యం పరిశీలించవలెనని అభిలషిస్తున్నది కాబోలు, ఈ చిన్న కోర్కె కాదనడమేల’’ అని భావించి అంగీకరించాడు. సావిత్రి వారిరువురి పాదాలపై వాలి ఎంతో భక్తితో నమస్కరించి, వీడ్కొని, లోలోపలి అందోళన పైకి ఏ మాత్రము వ్యక్తీకరించక, ‘‘అలతి నగవుతో ప్రియునికి అమంద ఆనంద సంధాయినియై అల్లనల్లన అనుసరించినది’’. చాలా కష్టమైన విషయం కదా! ఇంకెవరికీ చెప్పకూడనటువంటి దుఃఖం. అందుకని, తను వెళ్తోంది. వెళ్తోంది

కాబట్టి ఆశీర్వచనం తీసుకుంది. ఆశీర్వచనం తీసుకుంటూ దుఃఖ పడొచ్చుగా? కళ్ళవెంట నీళ్ళు వస్తే తెలిసిపోతుంది ఏదో ఉందని. అది లోపలే అణుచుకుని, పైకి ఒక నవ్వు తెచ్చిపెట్టుకుని, లేని ఉత్సాహం తెచ్చి పెట్టుకుని, వాళ్ళ ఆశీర్వచనం తీసుకుని, భర్తతో బయలుదేరి వెళ్ళిందండి. ఎంతటి స్థిరమతియో! బాగా ధ్యానించ వలసిన విషయం.

"మరి కొంతసేపటికా దంపతులు మందమంద గమనాలతో అరణ్య మధ్యంలో ప్రవేశించారు". వెళ్ళారు అరణ్యంలోకి. "ఆ సమయంలో ఆ అటవి అతిలోక మనోహరమై పొడగట్టినది. కమలాకరాలలో రాయంచల జంట అల్లనల్లన తూగాడినది". అంటే, లోపల హంసలు, పద్మాలతో కూడిన సరస్సులో... ఆ వర్ణన అంతా ఎక్కువ సేపు చెప్పుకుంటే మనం ముందుకెళ్ళలేం గాని కొంత చెప్పుకోవాలి కదా! మనం మాములుగా హంసలను చూడలేము. మనం ఉండేచోట అవి ఉండవు. కొంచెం మనం distrubance వాటికి. అందుకనే రాజ హంసలు చాలా పవిత్రమైన జలాల్లో, పవిత్రమైన ప్రాంతాల్లో ఉండే కోనేరులలో ఉంటాయి. అందులో కూడా, ఆ కోనేరులో పద్మాలు ఉండాలి. పద్మాలు లేని కోనేరులో ఉండవు అవి. వాటిని చూసిందండి. పద్మాలే కనబడవు మనకి కదా పల్లెటూళ్ళ కెళ్తే తప్ప!

"ఎటువైపు అవలోకించినా లలితాంగితములైన తరువులు బహువిధ ఫల పుష్పాలతో, పల్లవాలతో కనుదోయి కెడతెగని విందొనర్చినవి". ఎటు చూసినా ఫల వృక్షాలు, ఫలములు, పుష్పములు, లతలు. వీటితో బాగా అందంగా ఉందిటండి. అవన్నీ

చూస్తోంది గాని వాటియందు మనసు పడుతుందా? వాటియందు మనసు పడదు. తనకి కర్తవ్యం ఉంది, ఆయనని అంటి పెట్టుకుని ఉండాలి. అందుచేత, "తీయ తీయని తేనెలారగించి మత్తిల్లిన గండు తుమ్మెదల ధ్వని సావిత్రి సత్యవంతుల వీనులలో మాటిమాటికి మారు మ్రోగినది". తుమ్మెదలని చూడాలంటే, మంచి పుష్పాలు ఉన్నచోట గాని కనబడవు అవి. తేనె ఉన్నచోటే అవి ఉంటాయి కదా! అందుచేత, పుష్పం బాగా వికసించి, తేనె బాగా పుడుతూ ఉంటే అందులోంచి, వాటికోసం తుమ్మెదలు వస్తాయి. అలాంటివి అరణ్యంలో కోకొల్లలుగా కనిపించి, ఝుంకార ధ్వని వినిపిస్తాయి భ్రమర గీతంలాగ. అంతలా తుమ్మెదలు కనిపిస్తున్నాయి. "మిగలముగ్గిన పండ్ల రసాలారగించి విజృంభించిన రాచిలకల పలుకుల కలకలం నలువైపులా చెలరేగింది. ద్యుమత్సేనుని కుమారుడు అరణ్యంలో గోచరించిన ఆయా విశేషాల అంగుళితో తన ప్రియపత్నీ అడుగగా నిర్దేశించి అపూర్వ ఉల్లాసంతో చూపించాడు. రాజకుమారి నిర్వికార ముఖ వైఖరితో అదే విధంగా పతి ననుసరించి కాననంలో యథేచ్ఛగా విహరించినది." ఆయన చాల ఉత్సాహంగా చూపిస్తున్నాడు భార్యకి. అక్కడుండే సౌందర్యమంతా ఉత్సాహంగా ఇటు చూడు, అటు చూడు అని చూపిస్తున్నప్పటికీ ఈవిడ నిర్వికారంగా చూస్తోంది, ఎందుకంటే ఈమె అందుకోసం రాలేదు కాబట్టి.

"సత్యవంతు డంతట విపినంలో నాలుగువైపులా పరిభ్రమించి, ఫలపుష్పాదులతో తన చేతనున్న పెనుసజ్జ నిండించాడు. ఆపైన గండ్ర గొడ్డలి చేపట్టి, కట్టెలు కొన్ని కొట్టి, మిక్కిలి అలసి, ఆ పరశుని ధరణిపై పడవేచి, ఎడతెగని

నిట్టూర్పులతో వివర్ణ వదనుడై సావిత్రి వైపు చూచి, ఎందువలనో మేను అవశం అగుచున్నది'' అన్నాడు. పూలన్నీ సేకరించాడు, పళ్లన్నీ సేకరించాడు, అవన్నీ ఓ బుట్టలో వేశాడు. ఇహ కట్టెలు కొడదాం అని గొడ్డలి తీసుకున్నాడు. నాలుగు దెబ్బలు కొట్టంగానే దేహంలో ఒకరకమైనటువంటి తేడా కనిపించింది. కనిపించి, విపరీతమైన బాధ రావడం మొదలుపెట్టింది. అంతే కాదు, తన వశం తప్పుతోంది శరీరం. అందుచేత, "ఎందువలనో మేను అవశం అయినది. మానసం పరిపరి విధాలుగా పరిభ్రమిస్తున్నది.'' ఎప్పుడూ ఏ కలతా లేకుండా స్థిరంగా ఉండేటటువంటి మనసు అలజడి చెందుతోందని చెప్పాడు సావిత్రిదేవికి. ఒళ్లంతా కంపిస్తోంది, దేహం వశం తప్పుతోంది. మనసులో రకరకాలుగా కలతలు కలుగుతున్నాయి అని బాగా చెప్పుకుంటూ వచ్చాడు.

"పరిపరి విధాల పరిభ్రమించుచున్నది. బహు శూలాలతో శిరస్సుపై అనుక్షణం ప్రహరిస్తున్నట్లున్నది.'' తల శూలాలతో గుచ్చుతున్నట్టుగా నొప్పి వస్తోందిట. ఆ విధంగా అకస్మాత్తుగా వచ్చింది. "ఇక క్షణమైనా నిలవలేను. ఇచట నిమేష కాలం విశ్రమించగలను అని అస్పష్ట స్వరంతో వక్కాణించాడు. ఆ సాధ్వి ఆ పలుకు లాలకించి, తన ఒడి తలగడగా సమర్పించి, ఎంతో ఆప్యాయతతో ఆదుకొన్నది. సత్యవంతుడామె అంకతలంలో వాలి అవశుడై, కేవలం నిశ్చేతనుడైనట్టు గోచరించాడు.'' ఇక నేను నిలబడలేను, పడుకోవాలి కాసేపు అన్నాడు. పడుకోవాలనగానే ఆవిడ వెంటనే కూర్చుని తన ఒళ్లో ఆయన తల పెట్టుకుని పడుకునేటట్టుగా ఏర్పాటు చేసింది. అలా ఏర్పాటు చేసి పడుకోగానే, ఇక ఆ తర్వాత నిశ్చేష్టుడైపోయాడు, చేష్టలు ఉడిగినాయి. "మరి

కొంత సేపటికి"... ఎలా అయిపోయిందో మన సభ? కలకలా నవ్వుతుండే సభ చూడండి ఎలా గంభీరం అయిపోయిందో? అయిపోతుంది కదా! ఎంత అకస్మాత్తుగా సీను మారిపోయింది కదా! ఒక frame తీసేసి ఇంకో frame పెట్టేశాడు విధి. అంత వరకూ ఒక frame, ఇప్పుడు ఇంకో frame వచ్చేసింది కదా!

# 13. యముని సాక్షాత్కారం

"మరి కొంత సేపటికి అత్యంత భయంకరుడైన పురుషు డొకడు సావిత్రికి అనతి దూరంలో సాక్షాత్కరించాడు." వచ్చాడట ఒకాయన, అంత దూరంగా కనిపించాడట. ఆమెకెందుకు కనిపించాడు, మనకెందుకు కనిపించడు? అది కదా ముఖ్యం! ఆవిడకు చూడగలిగిన సామర్థ్యం ఉన్నది. సూక్ష్మ దర్శనం అనే సిద్ధి కలిగినటువంటిది ఆమె. ఎందుచేత? అలాంటి శరీరం కలిగి ఉండడం చేత కనిపించాడు.

"అతడు కాలమేఘ వినీలాకారుడు." నల్లటి మేఘంలాగా ఉన్నాడటండి. యముడు చాలా భయంకరమైన ఆకారుడని ఒకటి, అత్యంత సుందరమైన ఆకారుడని ఒకటి, రెండూ ఉన్నాయి. యముడు కనబడడానికి ముందు చాలా భయంకరంగా కనబడి, అటుపైన సజ్జనులకు సుందరాకారుడుగా గోచరిస్తాడుట. అంటే, అందరికీ యముడు రాడు. గుర్తు పెట్టుకోండి. VIPs కే యముడొస్తాడు. మిగతా వాళ్ళకి మృత్యుదేవతని పంపిస్తాడు. చాలామంది దగ్గరకు యమకింకరులే వెళ్లి తీసుకొచ్చేస్తారు. ఏదో అక్కడక్కడా కొన్ని కథల్లో మృత్యుదేవతకి వశం కాక వెళ్లి చెప్తాడు, సార్! మావల్ల అవ్వట్లేదు, కొంచెం మీరే చూడాలని. అంటే, ఏదో అది విశిష్టమైన సన్నివేశం అయితే తానే వెళ్తాడు. తనకే తెలుసనుకోండి, అప్పుడు వాళ్ళనీ వీళ్ళనీ పంపించడు,

తానే వెళ్ళిపోతాడు. అందుచేత, "ఎర్రని వదనంపై తెల్లతెల్లని వాడి కోరలతో చూచినంతలోనే ప్రాణిలోక భయంకరుడు. బంగారు రంగు విరజిమ్ముతున్న వసనాలతో కాలానల జ్వాలవలె ప్రజ్వలిస్తూ ఆ పురుషుని హస్తంలో సుదీర్ఘమైన పాశ మొకటి పొడగట్టినది." మొహమేమో నల్లగా ఉందండి. కళ్ళేమో ఎర్రగా ఉన్నాయట. పెదవులు ఎర్రగా ఉన్నాయట. రెండు తెల్లటి కోరలు ఇరు పక్కలనుంచి బయటకొచ్చి ఉన్నాయటండి. పచ్చబంగారం రంగు వస్త్రములు ధరించి ఉన్నాడు. చేతిలో పాశం ఉందట. పాశం అలా వేసి, ఇలా జీవుడిని చాలా సులభంగా తీసేస్తాడు.

శరీరంలో కూరుకుపోయిన జీవుడిని పాశం వేసి అనాయసంగా వెలికి తీసే యముని నైపుణ్యం అనుపమానం! జీవుడు శరీరంలో స్థిరంగా ఉండటానికి దేహనిర్మాణ దేవతలు కొన్ని చోట్ల ముడివేసి ఉంచుతారు. బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి అని మూడు గ్రంథులతో శరీరమందు జీవుడు బంధింపబడి ఉంటాడు. సాధనచేత, సంస్కారంచేత ఈ ముడులను విడదీసికొని యోగులు ముక్తజీవులుగా వసిస్తూ వుంటారు. కాని సామాన్యులు వున్న ముడులతో పాటు వేసుకొనే ముడులుకూడ కలిసి తడిసి మోపెడంత బంధం ఏర్పడుతుంది. అందుకనే మృత్యుబాధ లక్ష నల్లతేళ్ళు కుట్టినంతగా ఉంటుందని మన గ్రంథాలు భయపెడుతూ వుంటాయి. సత్యవంతుని విషయం వేరు.

"హస్తంలో సుదీర్ఘమైన పాశ మొకటి పొడకట్టినది. ఆ భీషణాకారుడంత సత్యవంతుడిని సమీపించాడు. సావిత్రి ఆ వింత మనిషిని చూసి, మిక్కిలి ఆశ్చర్యపడి..." అదే first time

ఆవిడ చూడడం! అంతకుముందు చూడలేదు! ఆశ్చర్యపడ్డదట, భయపడలేదు. ఈ భయం, గియం ఈ దేహంలో ఉన్నవాళ్లకే. పై దేహాల్లోకి వెళ్తే అంత భయం ఉండదు. అందుచేత, "ఆశ్చర్యపడి, పతి శీర్షం మెల్లన దిగువ ఉంచి, మిక్కిలి భయభక్తులతో"... సత్యవంతుడి శిరస్సుని తీసి నేలమీద వుంచి తాను నిలబడ్డదటండి. నిలబడి, "మిక్కిలి భయభక్తులతో అంజలి ఘటించి, ఆర్యా! తామెవ్వరు? అని అడిగింది." మీరెవరు స్వామీ అని అడిగింది. "ఇచ్చటికి విజయం చేసిన హేతువేమి అని ప్రశ్నించినది." ఎందుకిలా వచ్చారు? మీరెవరు, ఎందుకొచ్చారని అడిగిందండి. అంటే, చూడంగానే దణ్ణం పెట్టవలసినటువంటి వ్యక్తిలాగా కనిపించాడు!

"ఆ పురుషుడంత, సాధ్వీమణీ! నేను అంతకుడను". అంటే, ప్రతి దానికి the end అని వేస్తాం కదా, అన్నిటికి ఒక ఒక అంతం, ఒక మితి ఉంటుంది. ఒక ring pass not అంటారు. ప్రతి వాళ్ళకి ఇహ ఇంతకన్నా దాటి వెళ్ళలేని స్థితులు ఉంటాయి కదా! మన సూర్యుడికి కూడా ఆయన వెలుగుకి మితి ఉంది. అందరికీ పరిధులు ఉన్నాయి. సృష్టిలో దేవతలకు కూడా పరిధులు ఉన్నాయి. అందరికి మితి ఏర్పరిచే తత్త్వాన్ని 'యముడు' అంటారు. అది దాటి పోలేడు వాడు. ఎవరు దాటి పోగలరు అంటే, అపరిమితత్త్వంతో సంబంధం కలిగినవాళ్ళే ఈ మితత్త్వంలోంచి బయటకు రాగలరు. దేవతలు కూడ అందరూ అంతర్యామితో అనుసంధానం చెంది ఉండరు. మానవులు ఎలాగూ ఉండరు. సరే, జంతువులకి వీలే లేదు. ఋషుల్లో అపరిమితత్త్వంతో అనుస్యూతం కలిసి ఉండే వాళ్ళని బ్రహ్మర్షులంటారు. అంటే, వాళ్ళెప్పుడూ అందులోనే

ఉంటారు. అంటే, అగస్త్యుడు, వశిష్ఠుడు, గౌతముడు, వీళ్ళని బ్రహ్మర్షులంటారు. వాళ్ళని ఈయని ముట్టుకోడు. ఎందుకని? వారు వారి వారి సాధనల చేత మితత్త్వం తగ్గించుకుంటూ అపరిమితత్త్వంలోకి పెరిగారు. మనం కూడా చెయ్యవలసింది అదే. ఈ జ్ఞాన సముపార్జన దేనికంటే జ్ఞానం అనంతం కాబట్టి, జ్ఞానం ఆధారంగా మన ప్రజ్ఞ అట్లా విస్తృతి చెందాలి. కేవలం మన దేహానికే పరిమితమై పోకూడదు. అయిపోతే, ఈ దేహం పోతుంటే ఇబ్బంది పడతాము. అట్లా ఒక్కొక్కరి ప్రజ్ఞ కొన్ని కొన్ని ప్రాంతాలవరకూ వ్యాప్తి చెందుతుంది.

ఒకళ్ళు వాళ్ళింట్లో వాళ్ళకే తెలిసుంటారు. కొంతమంది ఆ వీధిలో వాళ్ళకి కూడా తెలిసుంటారు కదా! కొంతమంది కాస్త ఆ వూళ్ళో. అట్లాగే, హైదరాబాద్ అంతా తెలిసిన వాడొకడు ఉండొచ్చు. మొత్తం హైదరాబాదుకి వాడు తెలుసు. అంటే పరిధి పెద్దది కదా! అలాగే ఈ దేశం అంతా, ఖండం అంతా, భూగోళం అంతా పరిధి. అంటే ఏమిటి? నీ ప్రజ్ఞ అలా పరిధి పెంచుకుంటూ పోతుంది. అట్లా పరిధి పెంచుకుని, పెంచుకుని పోతే, భూగోళానికి ఒక పరిధి ఉంది. ఇతర గోళాలకి పరిధులు ఉన్నాయి. సూర్యుడికి పరిధి ఉంది. అందరికీ పరిధులు ఉన్నాయి. అట్లా ప్రతివాడికి మితి కూర్చేదేదుంటే దాన్ని ring pass not అంటారు. He marks the end.

ప్రతి దానికి ఒక అంతు ఉంటుంది. అంతులేని తత్త్వం ఒకటుంది, దాన్ని అనంతం అంటాం. అనంతంతో అనుసంధానం ఉండేవాళ్ళని మాత్రం ఈ అంతులేర్పరిచే తత్త్వం ముట్టుకోదు.

మిగతా వాళ్ళందరినీ ముట్టుకుంటుంది. అందుకనే ప్రతిదానికి ఒక ఆయుర్దాయం ఉంటుంది. సూర్య మండలానికి ఒక ఆయుర్దాయం ఉంది. సృష్టికి ఆయుర్దాయం లెక్కలు కట్టారుగా ఇన్నేళ్ళని! కాబట్టి, ఈ ఆయుర్దాయం లెక్కల్లో ప్రతివాడికి ఒక అంతం ఉంది. ప్రతి పనికి ఒక అంతం ఉంది. చిన్నచిన్న పనులనుంచి, పెద్దపెద్ద పనుల వరకూ ఒక అంతం ఉంది. అంతం లేనిది ఒకటి ఉంది. దాని నుంచి ఈ అంతం చెందేటటువంటివన్నీ ఏర్పడుతూ ఉంటాయి. అన్ని లోకాలకి అంతం ఉన్నది. అందుకని, అంతం అయిపోకుండా ఉండడం కోసం అనంతుడిని ఆరాధన చెయ్యడం వచ్చింది. అనంతుడంటే అంతం లేనివాడని అర్థం కదా! సత్యం అనంతం, జ్ఞానం అనంతం, బ్రహ్మము అనంతం. అందుచేత, సత్యాన్ని ఆచరిస్తూ, జ్ఞానాన్ని సముపార్జన చేస్తూ, బ్రహ్మముతో అనుసంధానం చెందినవాడికి అంతము ఉండదు. అంతం ఉండదంటే ఈ శరీరంలో ఎప్పుడూ అట్లాగే ఉండిపోతాడని కాదు. తాను ఉంటాడు, శరీరం మరణిస్తుంటే తాను చూస్తూ ఉంటాడు!

మీకు తెలియదేమో, భారతంలో ధృతరాష్ట్రుడు కూడా అలా తెలిసి మరణించినవాడే. మమకారం చేత బంధింపబడ్డా చివరికి అది పోయింది. పోవడం చేత, తానే స్వయంగా తన శరీరం చక్కగా అపాన ప్రాణానికి అందించి, తాను బయటకి వచ్చాడు. జీవితం అంతా మమకారంతో బాధపడతాడు, మహా జ్ఞాని. చిట్టచివరిలో ఆ కాస్త మమకారం విదురుడు కారణంగా పోతుంది. విదురుడి బోధ జీవితం అంతా వినలేదు, చిట్టచివరిలో last మాట విన్నాడు. ‘‘ఇంకా ఎందుకు అన్నయ్యా, భీముడు

పెట్టే అన్నం తింటూ, బొత్తిగా చీమూ నెత్తురూ లేకుండా ఇలా తయారయిపోయావే'' అని కోప్పడతాడు. దాంతో మమకారం పోతుంది. పోయి, తను స్వచ్ఛందంగా దేహానికి మరణం అప్పచెప్పి తను బయటకొస్తాడండి. ఎలాంటి వాడు ధృతరాష్ట్రుడు! అంటే, నీ శరీరం అంతం అవుతుంటే నువ్వు అంతం అవ్వక్కర్లేదు. మనకి శరీరం ఏమిటి, బయట చెప్పుల జోడు పోతుందేమో అన్న భయంతో పాత చెప్పులు వేసుకొచ్చే type కదా మనం! ఇప్పుడు గురుపూజలు ఇలాంటి చోట్లకి, గుళ్ళకి వెళ్ళేటప్పుడు పాత చెప్పులేసుకెళ్తారు. ఎందుకంటే, కొత్త చెప్పులు బయట పెడితే, మనసంతా చెప్పుల మీదే! అవి పోతే, ఈ దేవుడిని చూసిన ఫలం ఏం ఉండదు. ఎందుకంటే, ఈ ఆనందం కన్నా ఆ దుఃఖం ఎక్కువ. ఇట్లా చిన్నచిన్న అంతాల దగ్గర నుంచి, పెద్దపెద్ద అంతాల వరకూ, సృష్టి అంతం వరకూ అంతకుడు యమధర్మరాజు. అతడు ఎవడికి లొంగుతాడంటే, ధర్మము ఆచరించే వారి యెడల సుముఖుడై ఉంటాడు. ధర్మము నాచరించని వారి యెడల భయంకరుడై ఉంటాడు.

అందుకని, ఈమె ఎవరు స్వామీ మీరు అని అడిగితే, "సాధ్వీమణీ! నేను అంతకుడను. మహనీయమైన పాతివ్రత్య ప్రభావం వల్లనే నీకు నా సాక్షాత్కార భాగ్యం చేకూరినది." పుట్టిన దగ్గర నుంచి ఆవిడ ఆచరించినది అంతా ధర్మమే. ఎక్కడా ఏ తేడా లేదు. ధర్మరాజుకి కూడా చిట్టచివరికి యమధర్మరాజు కనిపించి ఆశీర్వదిస్తాడు. కొంతమందికి ముందు కనిపిస్తాడు. కనిపించి నీ పాతివ్రత్య మహిమ వల్ల నువ్వు నన్ను చూడగలిగావు, లేకపోతే ''నన్ను అందరూ చూడలేరు'' అని చెప్పాడు.

“నీ భర్త ఆయుర్దాయం ముగిసినది. అయితే, ఇతడు మహా పుణ్యాత్ముడు. అందువలనే ఇతరులెవరినీ ఆజ్ఞాపించక స్వయంగా నేనే ఇతడిని కొనిపోవలెనని సంకల్పించుకున్నాను.” అంటే, యమధర్మరాజు తానే స్వయంగా వచ్చి జీవుడిని తీసుకెళ్ళేంత విశిష్టమైన జీవి సత్యవంతుడు. ఆయనే చెప్పాడు ఈ మాట. ఇతడు మహా పుణ్యాత్ముడు. అందువలనే ఇతరులెవరికీ ఆజ్ఞాపించక స్వయంగా నేనే ఇతడిని కొనిపోవలెనని సంకల్పించుకున్నానని పలికి, “సత్యవంతుడి శరీరంలో ప్రాదేశికా మాత్రాకారుడై ప్రజ్వలిస్తున్న జీవుని పాశంతో వెలువరించి దక్షిణ దిశాభిముఖుడై తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు. మద్రరాజ తనయ అది గమనించి, లోలోపల మిక్కిలి దుఃఖించి, పతి మేనును ఒకచోట మిక్కిలి జాగ్రత్తతో భద్రపరిచి, సత్వరమే వెన్నంటి సాగిపోయినది.” నేనే వచ్చాను స్వయంగా, నువ్వు చాలా సంతోషించవలసిన విషయం అని చెప్పాడు. అంటే, మీ ఆయనని నేను సగౌరవంగా తీసుకెళ్తున్నానని గుర్తుపెట్టుకో. ఎందుకంటే, ఇతను చాలా మంచివాడు అని చెప్పాడు. ఇంక అంతకన్నా ఏం మాట్లాడలేదు. అలా వేశాడు, ఇలా లోపలినుంచి వేలెడు అంత ఉండేవాడిని ఒకడిని బయటకు తీశాడు. మనమంతా అంతే ఉంటాం లోపల.

ప్రాదేశికా మాత్రాకారుడిని ఆ దేహంలోంచి బయటకు తీశాడు. తీసి, దక్షిణాభిముఖుడై, దక్షిణ ముఖంగా... దక్షిణం యముడి స్థానం కదా. **దాక్షిణ్యము కలిగినటువంటి వారికి యముడు విష్ణుమూర్తివలె దర్శనం ఇస్తాడు. కఠిన హృదయులకి భయంకరుడిగా కనిపిస్తాడు.** నీ హృదయంలో దయ ఉంటే, తోటి జీవులయందు ఆ దయ నువ్వు చూపిస్తూ ఉంటే, నీకు యముడు సుందరాకారుడిగా

దర్శనం ఇస్తాడు. తోటి జీవులయందు నీకేమాత్రం కారుణ్యం లేకపోతే, ఎంత భయం వేస్తుందంటే, తట్టుకోలేనంత భయం వేస్తుంది. అందుచేత, ఆయన వచ్చాడు, తీసుకెళ్తున్నాడు, చూస్తుండగానే క్షణ మాత్రంలో అంతా జరిగిపోయింది. జరిగిపోతే, ఆవిడకి చాలా దుఃఖం వచ్చింది. దుఃఖం వచ్చి, పతి శరీరం పక్కన జాగ్రత్త పరిచింది. ఎక్కడన్నా జాగ్రత్త పెట్టాలి, ఎందుకంటే తను మళ్ళీ పతి ప్రాణాలు తీసుకురావాలి. తీసుకొచ్చిన తర్వాత శరీరం లేకపోతే? ఈ లోపల ఏ పులో, నక్కో మింగేసిందనుకోండి, ఏదయినా అవ్వొచ్చుగా? అందుకని ఏం చెయ్యాలి? ముందు శరీరాన్ని కాపాడాలి. మీరందరూ చూశారుగా సినిమా. మూడు రోజుల తర్వాత తిరిగొస్తానురా, అందాకా ఈ శరీరాన్ని జాగ్రత్తగా చూడండి అని చెప్పి వెళ్ళాడు షిరిడి సాయి కదా! అందుకని, దాన్ని జాగ్రత్త పెట్టింది.

అంతే కాదండి, ఇంకో విషయం ఉంది. ఆమె యముడి వెంట వెళ్ళింది కదా! ఆమె ఎలా వెళ్ళింది? అక్కడే తన శరీరం కూడా జాగ్రత్త పెట్టేసింది. సశరీరంతో వెళ్ళలేరు. చెప్పానుగా అశ్వపతి కుమార్తె సిద్ధురాలు, ప్రాణాపానములను సమానం చేసి, సమాన వాయువులోంచి ఉదాన వాయువులోకి ప్రవేశించి, ఉదానంలోంచి వ్యానంలోకి ప్రవేశిస్తే, నిన్ను ఆజ్ఞ దగ్గరకి తీసుకొస్తుంది. ఇక్కడినుంచి నువ్వు బయటకు రావొచ్చు. ఆజ్ఞ ముఖద్వారం జీవుడు బయటకు రావడానికి. అందులోంచి బయటకు వస్తూ, ముందు ఓ పక్కన శరీరం ఏర్పాటు చేసి రావాలి. బయటకొచ్చిన తర్వాత ఏర్పాటు చెయ్యలేరు. అందుకని, పతి శరీరం అక్కడ ఉంచి, తాను యోగ ప్రక్రియలో ప్రవేశించి, తన

శరీరాన్ని కూడా ఆ పక్కనే భద్రపరిచింది. భద్రపరిచి, తను సూక్ష్మ శరీరంతో యముని వెంట వెళ్తుంది.

యోగం చేసుకోవడం అందుకే. CVVగారి యోగం ముఖ్య ఉద్దేశ్యం అది. నువ్వు అలా బయటకి రాగలిగి ఉండాలి. ఊరికే మనం ఒకటికి పది ఆయన ఫొటోలు పెట్టేసుకుని, మనం ఆయన వాళ్ళమని తిరుగుతుంటే కుదరదు కదా! ఆయన అనుకోవాలి వీడు మనవాడని. *"నీ వాడయి చనువారిలో నేనొకడినయి"* అంటుంది భాగవతం. మాస్టరుగారు 'మా మాస్టరుగారు' అనుకోకూడదు. మాస్టరుగారు 'వీడు నావాడు' అనుకోవాలి. మనదంతా 50% love కదా, one-way! అటునుంచి ఆయన అనుకోవాలి వీడు నావాడు అని. అందుచేత, ఈ యోగము యొక్క ముఖ్య ఉద్దేశ్యం అది. అందుకనే ఈ ఉపాఖ్యానం మనకి.

యోగవిద్య నీవు దేహంలోంచి తరించేటటువంటి విద్య, తారణ విద్య. ఆ విద్య తెలుసావిడకి. ఎందుకని? తండ్రికే తెలుసు. తండ్రి ఎలాంటివాడు? అలాంటి తండ్రికి పుట్టిందావిడ. తండ్రి మహాయోగి కదా! ఆయన పంచ ప్రాణాలను స్వాధీనం చేసుకున్నటువంటి వాడు. మరి అలాంటి వాడికి తాను అమ్మవారి అనుగ్రహం చేత పుట్టింది. తనకీ విద్య ఉండడం చేత, తను కూడా పతి శరీరం పక్కన తన శరీరాన్ని ఏర్పాటు చేసుకుని, అక్కడినుంచి బయటకు వచ్చేసింది. బయటకొచ్చేసి, యముడి వెంట బయలుదేరుతుంది.

# 14. యమునితో యానము

"పతి మేను ఒక చోట మిక్కలి జాగ్రత్తతో భద్రపరచి సత్వరమే యముని వెంట సాగిపోయినది. దండధరుడది గమనించి..." ఎవరొస్తారండి? ఇలా వెంటబడి వచ్చేవాళ్లుండరు మామూలుగా. ఉంటారా? పోనీ వెళ్దామనుకున్నా వెళ్ళగలరా? అసలు వెళ్దా మనుకుని, వెళ్ళే వాళ్ళెవరయినా ఉన్నారా? ఎంత సన్నిహితులు పోయినా ఎంతవరకూ వెళ్తామండి? శివస్థానం (స్మశానం) వరకూ వెళ్తాం. అంతేగా? అదంతా మరి నీకు ఉండే ప్రేమ, ఆప్యాయత, భక్తి, గౌరవం ఏదయినా కానీయండి. వాడితో నీకున్న అనుబంధం కొద్ది అదంతా కాలిపోయే వరకూ ఉండగలవు. అంతేగా? ఏది కాలిపోతుంది? శరీరం. వాడెప్పుడో వెళ్ళిపోయాడు. వాడితో వెళ్ళలేవు కదా! అందుకనే, ఒకసారి మాస్టరుగారు తన అనుయాయుడొకడు అతని స్నేహితుడు, పెద్దవాడు ఒకతను వెళ్ళిపోతే బాగా ఏడుస్తూ, ఆ శవాన్ని మోసి, స్మశానం వరకూ వెళ్ళిన తర్వాత, ఇంకా అక్కడే కూర్చుని ఉంటే, అతనికి చెప్పారు మాస్టారు, "ఇంతకన్నా వెళ్ళలేవోయ్ నువ్వు, ఇక వచ్చేయ్" అని చెప్పారు. అక్కడ ఎంత సేపు కూర్చుంటావు? ముందుకు వెళ్ళలేనప్పుడు వెనక్కి వచ్చి పనులు చేసుకోవచ్చుగా, అక్కడేం చేస్తావు నువ్వు అని చెప్పారు.

ఎంత దూరం వెళ్తావు నువ్వు? ఎవరు వెళ్ళారు? ఏకైక ఉదంతం. సావిత్రి ఆ విధంగా వెళ్ళింది. ఎలా? తనకుండే యోగశక్తి

చేత, ప్రాణంతో అనుసంధానం పెట్టుకుని వెళ్ళింది. తెలుసా? అది కూడా తెలియద్దూ? నువ్వు స్వచ్ఛందగా బయటకి వెళ్ళినప్పుడు నీ ప్రజ్ఞ బయటకు వెళ్తుంటే, నీ ప్రాణ సూత్రం దేహంతో ముడి వేసుకుని ఉంటుంది. ఎందుకంటే, you have an intention to come back. ఇక మరి రావక్కర్లేదు అంటే అది కూడా ఊడదీసుకుంటాడు. లేదూ మళ్ళీ తిరిగి వస్తామంటే, ప్రాణ సూత్రంతో ముడి ఉంటుంది. Thread of life and thread of consciousness అని ఆత్మకి రెండు సూత్రములు ఉన్నాయి. అవి ఏమున్నాయో మనకేం తెలుసు? ఏమయినా తెలుసుకుంటే కదా! ప్రాణ సూత్రం ద్వారా దేహం పోషింపబడుతూ ఉంటుంది. ప్రజ్ఞా సూత్రం ద్వారా జీవుడు కార్యక్రమాలు చేసుకుంటూ ఉంటాడు. ప్రజ్ఞ, ప్రాణము రెండూ ఆత్మకి రెండు పాయలు, రెండు స్రవంతులు. ప్రాణ స్రవంతిని దేహంతో ముడి వేసుకుని, ప్రజ్ఞా స్రవంతితో నువ్వు బయటకు వెళ్ళొచ్చు.

నిజానికి మనకి స్వప్నం కలిగినప్పుడు జరిగేదదే. ప్రతి వాడూ నిద్రలోకి వెళ్ళినప్పుడు స్వప్నం వస్తుందా? రోజూ రాకపోవచ్చు. అసలు స్వప్నం రాకుండా ఎవడూ ఉండడు కదా! స్వప్నం వచ్చినప్పుడు నువ్వు దేహంలో లేవు కదా! మరి ఆ దేహంలో లేకపోతే, మళ్ళీ దేహంలోకి మరల ఎలా వచ్చావు? ఎట్లా మేల్కొయించావు? ఎప్పుడన్నా ఆలోచించారా? మనం స్వప్నంలో ఆ ఊరెళ్తాం, ఈ ఊరెళ్తాం, పుణ్యక్షేత్రాలు వెళ్తాం, ఎక్కడికో పోతూ ఉంటాం కదా! పొద్దున్నే లేవగానే గొప్పగా చెప్పుకుంటాం మంచి కలైతే, చెడ్డ కలైతే ఎవరికీ చెప్పుకోము కదా! మనలో మనమే

దాచేసుకుంటాం. మనకి తెలియదా ఏది చెప్పుకోవాలో, ఏది చెప్పుకోకూడదో?

అందుచేత, అలా ఏదయినా స్వప్నం కలిగింది కదా! స్వప్నంలో నువ్వు శరీరంలో లేవు! శరీరంలో లేకుండా బయటకు ఎట్లా వెళ్తావు? నీకు స్వప్న అనుభూతి ఉందంటే, నీ ప్రజ్ఞ వాటినన్నిటినీ అనుభవించింది కదా, ఆ ప్రాంతాన్ని, అక్కడుండే మనుషులని. అంటే, నీ ప్రజ్ఞ బయటికెళ్ళింది. ఎట్లా బయటికెళ్ళింది? ప్రాణ సూత్రం దేహంతో ముడి వేసుకుంటే, ప్రజ్ఞా సూత్రం బయటికెళ్ళి తిరిగొస్తుంది. అది స్వప్నంలో జరిగేది. నీ వశంలో జరగదు స్వప్నం. ఇవాళ నేను పడుకుని స్వప్నంలో అలా ఓ సారి మానస సరోవరం వెళ్ళొస్తానని అనుకుని వెళ్ళగలవా? స్వప్నం నీ అధీనంలో ఉండదు. మామూలుగ నీ జీవితమే నీ ఆధీనంలో ఉండదు, అంతకన్నా ఘోరం స్వప్నంలో. You cannot choose your dream కదా! జీవితమే మనం కోరుకుంటునట్లుగా జరగదు కదండి. ఇది కూడా ఒక స్వప్నమని తెలియాలి. ఇందులోంచి కూడా మేల్కొంచడం ఉంటుంది. మాములుగా వచ్చే స్వప్నాలలోంచి ఎలా మేల్కొంచబడుతున్నావో, ఈ స్వప్నంలోంచి కూడా మేల్కొంచాలి. ఇదే కదా అంతా అనుకోకూడదు. ఎంత నువ్వు బాగా చెప్పేసుకుంటూ అందరి చుట్టూ తిరుగుతున్నా, ఇది కూడా స్వప్నమే. నీవు ఇలా ప్రవచనాలు ఇవ్వడం కూడా స్వప్నమే. అందరూ నిన్ను ఆదరించడం కూడా స్వప్నమే. అంతా స్వప్నమే.

స్వప్నంలో నీవు దేహం వదలటం ప్రకృతి నిర్వర్తిస్తుంది. నీకు నిద్ర కల్పించినా, మెలకువ కల్పించినా, స్వప్నం కల్పించినా,

ప్రకృతే నిర్వర్తిస్తూ వున్నది. నీవు ప్రకృతిని మన్నిస్తూ, ఆరాధిస్తూ, అనుసరిస్తూ, ధర్మపరంగా జీవితం సాగిస్తూ వుంటే, ప్రకృతే తల్లిలాగ సమస్త రహస్యాలు వివరిస్తుంది. తెర తొలగింపు చేస్తుంది. నిద్ర, స్వప్నము, మెలకువ స్థితులను దర్శింప చేస్తుంది. నిన్ను తురీయ స్థితిలో స్థిరపరుస్తుంది. అందుకే గాయత్రి మాతను ఆశ్రయించటం. సావిత్రీదేవి– గాయత్రి, సావిత్రి, సరస్వతి, ఛందర్షి, శ్రీ అను పిలువబడు మూలప్రకృతి, లేక శుద్ధ చైతన్యం నుంచి, అశ్వపతి ద్వారా దిగివచ్చిన దివ్యప్రజ్ఞ. కనుక యముని అనుసరించగల్గింది.

కనుకనే **భరత ఋషులు మానవులకు గాయత్రి ఆరాధన నిచ్చారు. గాయత్రి ఆరాధన ద్వారా దివ్యత్వమును పొంది, దివ్యలోక సంచారము గూడ చేయవచ్చు. దివ్య దేహ నిర్మాణము గావించుకొనవచ్చు. దేహమందుండగానే, దివ్యదేహమును సాధించుకోవాలి. ఆ దేహముతో దివ్యలోక సంచారం గావించవచ్చు. మరణము దేహమునకే కాని, తనకు కాదని తెలియవచ్చు. మరియు జీవన ప్రయోజనము సిద్ధించువరకు, దైవకృపతో దేహమందుండవచ్చు.** మహాత్ముల జీవితములలో గోచరించే సూక్ష్మమగు ఘట్టము లివి.

సావిత్రిదేవి యముడితో వెళ్తున్నప్పుడు, ఆమె ప్రజ్ఞ ఆయనతో వెళ్తూ ఉంటుంది. ప్రాణములు హరింపబడవు. శరీరంతో ముడిపడి ప్రాణసూత్రం సాగి వెంట వస్తుంది. మరల ఆ మార్గం గుండా తిరిగి దేహాన్ని ప్రజ్ఞ చేరుతుంది. ఆదిశంకరులు ఈ విధంగా కొన్నిమార్లు దివ్య కార్యములు నిర్వర్తించి చూపించారు.

అందుచేత, ఆమె ఆ విధంగా వెళ్ళిందండి. ఎంత ధీమంతురాలు! శంకరాచార్యుల వారు కూడా పరకాయ ప్రవేశ విద్య అనేది నిర్వర్తించి చూపించారు తన అనుయాయులకి. ఏమిటది? ఆ శరీరంలోంచి బయటకొచ్చేసి ఇంకో శరీరంలోకి కూడా ప్రవేశించవచ్చు. అప్పుడే fresh గా మరణించిన ఒక శరీరంలో ప్రవేశించవచ్చు, ఓ జంతువులోకి ప్రవేశించవచ్చు, నీ ఇష్టం. మీకివన్నీ విఠలాచారి సినిమాలు చూస్తే బాగా తెలుస్తాయి. పరకాయ ప్రవేశ విద్య బాగా చూపించాడాయన. ఆయన ఎప్పుడో ముప్పైఏళ్ళ క్రితం చూపించినవే ఇప్పుడు హాలీవుడ్లో చూపిస్తున్నారండి. ఆయన ఎంత ద్రష్ట? మనకేదో నవ్వులాటగా ఉండేది. మహాద్రష్ట ఆయన. నాకనిపిస్తుంది ఆ సినిమాలు చూస్తుంటే, ఆయనకి ఎంత దృష్టి అని. ఆయనకి అంత దృష్టి ఉండబట్టి అలాంటివి చూపించగలిగాడు. తీసే విధానం అప్పుడుండే technology ప్రకారం అంత బావుండేది కాదు గాని theme ఇప్పుడు హాలీవుడ్ వారిని మించిపోయి ఉండేది.

సావిత్రిదేవి వెంటబడి వెళ్ళింది. అంటే, వెంటబడి వెళ్లిందంటే, ఎట్లా వెళ్ళిందన్న ప్రశ్న రావొద్దండి? సినిమా తీసేవాళ్ళు కూడా సరిగ్గా తీస్తే అందులోంచి అదే రూపం, ఆ heroine ని, ఓ వెలుగు రూపంతో కదిలి వెళ్తున్నట్టుగా చూపిస్తారు, తెలిస్తే. తెలియకపోతే, ఈ రక్తమాంసాదులతో, ఇంత లావుగా ఉన్న heroine వెళ్తున్నట్టుగా చూపిస్తారు కదా! మనకి కూడా ఏం తెలీదు. మీరు లవకుశ సినిమా చూస్తే అందులో వాల్మీకి మహర్షి అమ్మవారు సీతాదేవికి బొట్టు పెట్టి, కళ్ళు మూసుకొని, చూడు తల్లీ అంటే, ఆవిడ సూక్ష్మ శరీరం కదా వెళ్లి చూస్తుంది, రాముడు

యజ్ఞం చెయ్యడానికి ఎవరిని తన భార్యగా ఏర్పాటు చేసుకున్నాడో, వెళ్లి చూసి వచ్చేస్తుంది. అంతే కాదు, అక్కడికెళ్ళి బొట్టుకూడా పెట్టి వస్తుంది కదా! అది సినిమాలోనే కాదు గ్రంథంలో కూడా ఉంది. అందుచేత, ఇలా సూక్ష్మ శరీరంతో వెళ్ళడం అనేది యోగ విద్యలో ఒక భాగం. అలాంటి యోగ విద్యలో ఉన్నాం మనం. చాలా busy గా ఏవేవో పనులు చేసుకుంటూ ఉంటాం ఇందులో (శరీరంలో) కూర్చుని. ఏది చెయ్యాలని గురువు చెప్పాడో అదొక్కటీ తప్ప అన్నీ చేస్తుంటామండి మనం. వాడిలా చేశాడు కాబట్టి నేనిలా చేస్తాను, వాడి కన్నా బాగా చేస్తాను. ఏం చేస్తావు బాగా? ప్రార్థన బాగా చెయ్యి. కొంచెం ప్రార్థన తగ్గించండి సార్! సమయం ఎక్కువైపోతోంది అంటున్నారీ మధ్య. అదేంటండి? ప్రార్థన తగ్గించడమేమిటి? ప్రార్థన తగ్గించకూడదు, ప్రవచనం తగ్గించాలి. ప్రార్థన తగ్గిస్తే ఎట్లా? ప్రార్థన పెంచుకోవాలి. అదొక్కటే మార్గం. *'నాన్యః పంథా'* ఇంకో మార్గం లేదు. ప్రార్థన ఒక్కటే మార్గం. ఇవన్నీ తెలియడానికి, ఈ మార్గాలు తెలియడానికి ప్రవచనం. సిద్ధించేది ప్రార్థన ద్వారానే.

అందుచేత, "దండధరు డది గమనించి, లతాంగీ! నన్నేల అనుసరించుచున్నావు?" అంతకుముందు, సాధ్వీమణీ అన్నాడు, ఇప్పుడు లతాంగి అన్నాడు. అంటే, సూక్ష్మము. చెట్టుకి, తీగకి తేడా లేదండీ? సాధ్వీమణీ అన్నదానికి, లతాంగి అన్నదానికి, ఎందుకిలా వాడాడు అని మనం ఆలోచించాలి. **మహర్షులు అడ్డగోలుగా పదాలు వాడరు.** రాసినది వేదవ్యాసుడు కదా! అనువదించినది తెలిసినాయన. ప్రస్తుతం తెలుగు వారికి తెలుగులో వాచకమైన అనువాదం పిలకా గణపతి శాస్త్రి గారే చేశారు. అక్కడ పద్య రూపంలో ఉండేది యథాతథంగా ఆ భావం

ఇక్కడ తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. లతాంగి అనకుండా, ఇంకో రకంగా మాట్లాడడు. ఎందుచేత? సూక్ష్మ శరీర ధారిణి అయిపోయింది ఆవిడ అప్పటికి. అంటే, తను ఒక మెఱపు తీగలా ఉంది. "లతాంగీ! నన్నేల అనుసరిస్తున్నావు? వలదు, వలదు. నిలిచిపోవలసినది. ఇక ఈ మార్గము నీకు అగమ్యము" అన్నాడు. అంటే, నువ్వు రాలేవు ఈ మార్గంలో అన్నాడు. మార్గంలో నువ్వు రాగలిగిన దానివి కాదు. అగమ్యమంటే? గమనము అంటే కదలడము, గమ్యము అంటే కదిలే మార్గం. అగమ్యము అంటే నీకు దారి తెలియదమ్మా, రాలేవు అని చెప్పాడు. "అయినా సావిత్రి తన ధోరణి విరమించక, ప్రగాఢ వినయంతో ఇట్లని నివేదించినది."

దండధరుడు అని యమునికి ఒక నామము. దండము ధరించి అధర్మమును ఆచరించే వారికి, సృష్టి నియమాలను ఉల్లంఘించే వారికి దండన విధించేవాడు కాబట్టి అతడిని దండధరుడు అని పిలుస్తారు. *గదాధరాయనమః* అని కూడా పిలుస్తారు. విష్ణుమూర్తి యమస్వరూపం గదాధర స్వరూపం. అందుకని, గదాధరుడని ఎవరూ ఎక్కువగా పేరు పెట్టుకోరు. గదాధరుడంటే తప్పనిసరి శిక్ష. అంటే, వేలు దీపం దగ్గర పెడితే కాలడం అనేది ఎంత తప్పనిసరో, అలా సృష్టిలో సృష్టి ధర్మాలను అతిక్రమిస్తే తప్పనిసరిగా దానికి తగిన శిక్ష ఒకటి ఏర్పాటు చెయ్యబడింది. సృష్టి నిర్మాణం అప్పుడే అందులో ఒక ధర్మచక్రాన్ని ఇమిడ్చి ఉంచారు. అందుచేత, ఆ ధర్మచక్రమే కాల రూపంలో ప్రతివారికి శిక్షణ ఇచ్చి, జీవులను సరైన దారిలో పెడుతూ ఉంటుంది.

ఒక అన్యాయం జరుగుతుంటే, ఏమిటి ఇంత అన్యాయం జరుగుతోంది, దీనికేం మార్గం లేదా, దీనికేం శిక్ష లేదా అని మనం అనుకుంటూ ఉంటాం కదా! కాని మనకి తెలిసేటట్లుగా కాకుండా తెలియకుండా కూడా చాలా రకాలుగా శిక్షలు పడుతూ ఉంటాయి. ఒక్కొక్కరికి చేసినటువంటి భావనలనుబట్టి, భావనయందు ఒక దుర్భావన కలిగినా, అది వాక్కునందు, చేష్టనందు ప్రకటింపబడకపోతే దానికి శిక్ష తక్కువగా ఉంటుంది. అంటే, మథనం అంతా కూడా భావనలోనే ఉంటుంది. చాలామంది మనసు బాలేదు, మనసు బాలేదు అంటూ ఉంటారు కదా! మనసు బాలేదు అంటే మనసుతో చేసినటువంటి అపచారానికి మనసు బావుండదు. అలాగే, వాక్కు బాగా లేకపోతే, దానివల్ల ఇంకొకరికి అది బాధ కలిగిస్తే దానికి శిక్ష ఉంటుంది. అలా బాగా బాధ పెట్టేస్తే మరుజన్మలో మూగవాడిగా పుట్టొచ్చు. అలా మనకి పుట్టు గుడ్డి, మూగ, చెవుడు, కాలు లేకపోవడం, చెయ్యి లేకపోవడం, ఇటువంటివన్నీ చూస్తూ ఉంటాం కదా! అంతేకాదు, కొంత దూరం వెళ్ళిన తర్వాత అలాంటివి జరగొచ్చు కూడా! ఇలా సృష్టిలో చేసిన పనికి ఏదో ఒక శిక్ష. అంటే, చేసిన పొరపాటు పనికి తద్వారా జీవుడు తదనుగుణమైనటువంటి శిక్షణ పొందుతూ ఉంటాడు.

అందుచేత, ఇక్కడ ముందు నీవెవరని అడిగితే, నేను **అంతకుడిని** అని చెప్పాడు. ఇప్పుడు వేదవ్యాస మహర్షి **దండధరుడు** అని ఒక పదాన్ని వాడాడు. అంటే, దండన విధించేవాడు. ధర్మాతిక్రమణం జరిగినప్పుడల్లా, చిన్నదయినా, పెద్దదయినా, దండన ఉంటుంది. అలా చాలా నిష్కర్షగా నిర్వర్తిస్తాడు. అందుకని **యముడు** అంటారు. యమము పాటించనివారిని

యమము అవలంబించేటట్టుగా శిక్షణ ఇస్తాడు. ఇంకో మార్గం లేకుండా బంధిస్తాడు. అందుచేత, అతనికి దండధరుడు అని పేరు. కించిత్ తప్పుకి కూడా శిక్ష ఉంటుంది. అతడు చేసిన ప్రవర్తన వలన ఎవరయినా బాధపడి మన్నించినా, చేసినవాడికి శిక్ష ఉంటుంది. అట్లా ఉంటుంది సృష్టి. అందుచేత, మనకొక నానుడు ఉంది, "వాడి పాపాన వాడే పోతాడు మన కెందుకులే" అని. ఎందుకంటే, శిక్ష తప్పదు. కాకపోతే, మనకి తెలిసేటట్టుగా జరక్కపోవచ్చు అన్నీ. ఏమిటోనండి, ఎందుకింత కష్టం వచ్చిందో ఫలానా వారికి అనుకుంటూ ఉంటాం కదా! ఎవరికి ఎప్పుడు ఏ కష్టం వచ్చినా దానికి పూర్వకథ ఒకటుంటుంది. పూర్వాపరములు ఎరిగినటువంటివారు మాత్రమే వీటికి సమాధానం చెప్పగలరు. పూర్వాపరములు తెలియనివారు, ఏమో ఏం చేశామో, అందుకనే అనుభవిస్తున్నాం అని తెలిసి సర్దుకుపోయే వాళ్ళుంటారు. సర్దుకుపోలేక దానితో పోరాడేవాళ్ళూ ఉంటారు. అది పోరాడడం ఎట్లా ఉంటుందంటే గోడతో గుద్దుకోవడమే! ఎంత గుద్దుకున్నా నీ చేతికి అంత నొప్పి తప్ప, అది అనుభవమై, తదనుగుణమైన మార్పు నీలో వచ్చేంతవరకూ దండన ఆ విధంగా విధింపబడుతూ ఉంటుంది.

నేను మాస్టరుగారితో తిరుగుతున్న రోజుల్లో మాస్టరుగారు ప్రతివారం ఒక భార్యాభర్తల ఇంటికి వెళ్తూ ఉండేవారు. భర్త చాలా నిరంకుశుడు, భార్య చాలా సాధు స్వభావం. ఈయన వెళ్తూ ఉండేవారు వారంవారం. నాకెంత అవకాశం ఉంటే అంత మాస్టరుగారితో తిరుగుతూ ఉండేవాడిని. ఆయనని ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే నాకు సరదాగా ఉండేది. కారు తీసుకుని వెళ్లి,

ఆయనని తీసుకుని వెళ్తే, ఆయన వాళ్లకి చెప్పినవి, చేస్తున్నవి, ఇటువంటివన్నీ కొన్ని మనకి తెలుస్తూ ఉండేవి. ఈ భార్యాభర్తల విషయంలో నేను ఆయనని అడిగాను, ఇంత బండ మనిషిని, ఇంత నిరంకుశంగా ఉండేవాడిని ఎలా ఆ స్త్రీకి భర్తగా ఏర్పాటు చేశాడో భగవంతుడు చాలా ఆశ్చర్యంగా ఉంది మాస్టారు అంటే, అప్పుడు నవ్వారాయన. "మనం ఇది చూసి ఇది ఇలా ఉందనడమే తప్పు, ఎందుకిలా ఉంది అని తెలియాలంటే పూర్వాపరాలు తెలియాలోయ్!" అన్నారు. ఆ భార్యకి ఎందుకిలాంటి భర్త కలిగాడు అని తెలియాలంటే ఆమె పూర్వకథ తెలియాలి అన్నారు. ఇంతకుముందు జన్మలో ఆమె జీవిత భాగస్వామిని ఏ విధంగా దుఃఖ పెట్టిందో? ఆ జన్మలో స్త్రీ అయితే క్రిందటి జన్మలో స్త్రీ అయి ఉండక్కర్లేదు. భాగవతం ఆరోస్కంధం ఏం చెప్తుందంటే జీవుడు పరిణామ కథలో ఒక జన్మలో స్త్రీ, మరొక జన్మలో పురుషుడు, మరొక జన్మలో మళ్ళీ స్త్రీ, ఇట్లా సాగుతూ ఉంటుంది కథ అని చెప్తారు. ఎందుకంటే, మనిషి పరిపూర్ణుడు కావాలంటే అతనియందు స్త్రీ, పురుష ప్రజ్ఞలు చక్కగా సమన్వయింపబడాలి.

ఇప్పుడీ జన్మలో పురుషుడిగా పుట్టిన వాళ్ళం, చాలా చేయించుకుంటూ ఉంటాం స్త్రీలచేత కదా! అంటే, బాగా చేయించుకోవడంచేత మనం బాగా receive చేసుకుంటాము కదా! ఎంత మనం ఆ విధంగా సేవ చేయించుకుంటూ ఉంటే వారి నుంచి ప్రసరింపబడుతూ ఉంటుంది చైతన్యం మనకు. మనం అందుకుంటూ ఉంటాం వారు చేస్తున్నవన్నీనూ. అది కారణంగా క్రమంగా వారిలో పురుష ప్రజ్ఞ పెరుగుతుంది. మనం అందుకోవడం అలవాటు చేసుకోవడంతో మనలో స్త్రీ ప్రజ్ఞ

పెరుగుతుంది. అందుచేత, పై జన్మలో స్త్రీగా పుడతాం. స్త్రీగా పుట్టి ఇదివరకు బాగా కూర్చుని చేయించుకోవడం అలవాటు పడ్డవాళ్ళం, ఇప్పుడు అన్నీ చేసి పెట్టేటటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. అది మామూలుగా రూపాలు ఎట్లా ఉన్నా... కొంతమంది పురుషులు, స్త్రీలకు చాలా చేస్తూ ఉంటారు, స్త్రీ చేయించుకుంటూ ఉంటుంది కదా! ఏమిటి అర్థం? ఇదివరకు అతడు అంత పొంది ఉండడం వల్ల ఇప్పుడు చెయ్యాల్సివస్తోంది. పురుషుడిగా ఉన్నా, స్త్రీగా ఉన్నా, ఈ ఇచ్చిపుచ్చుకోవడాలన్నీ కూడా ఋణసంబంధాలే, కార్యకారణ సంబంధాలే. అందుచేత, ఈమె ఎంత నిరంకుశంగా ఉందో జీవిత భాగస్వామితో, లేకపోతే ఎందుకిలా ఉందో మనకి తెలియదు. అందుకని నువ్వు పూర్వజన్మ కథలు తెలుసుకుంటే తప్ప మనకు చాలా విషయాలకు సమాధానం దొరకదు అని చెప్పారు.

ఇప్పుడు ద్రౌపదీదేవి ఐదుగురిని వరిస్తుంది, మత్స్యయంత్రం అర్జునుడే ఛేదించినా. ద్రుపదుడు తన కుమార్తెకి అర్జునుడు భర్త కావాలని కోరుకుని ఆ మత్స్యయంత్రం ఏర్పాటు చేస్తాడు. ఎందుకంటే, విలువిద్యలో మేటి అయినవాడే దానిని ఛేదించగలడు కాబట్టి. అర్జునుడు ఎక్కడో అజ్ఞాతంగా ఉన్నప్పటికీ (వాళ్ళు బ్రాహ్మణ కుమారులుగా ఏకచక్రపురంలో ఉంటూ ఉంటారు.) స్వయంవరం చాటిస్తాడు దేశం అంతా. చాటిస్తే తప్పక వస్తాడని. ఎందుకంటే, అది పోటీ కదా, పరాక్రమం చూపించాలి. అందుకని, అర్జునుడు తప్పకుండా వస్తాడని ఆ విధమైన పన్నాగం ఒకటి పన్నితే, అర్జునుడు వస్తాడు కదా! ఛేదిస్తాడు. కాబట్టి అర్జునుడికి ఇచ్చి పెళ్లి చెయ్యాలనుకుంటాడు. కానీ పాండవులు ఐదుగురూ పెళ్లి చేసుకోడానికి సిద్ధపడతారు. కథంతా చెప్పడంలేదు, ఎందుకంటే

విషయం చెప్తామని. ఐదుగురు పెళ్లికుమారులు పీటలమీద కూర్చుంటే ఒక పెళ్ళికుమార్తె కోసం, పెళ్లికుమార్తె తండ్రికెలా ఉంటుంది? ద్రుపదుడు ఆశ్చర్యపోతాడు. ఇదేంటి ఐదుగురు పెళ్లికుమారులేంటి అని. అంటే, మా సంగతి వదిలెయ్యి, మీ అమ్మాయికి ఇష్టమేమో కనుక్కో, ఇలా ఐదుగురు కూర్చున్నారని అడగమంటారు. వెళ్లి అడిగితే ఇష్టమేనని చెప్తుంది! అట్లా ఎట్లా ఇష్టంగా ఉంటుంది? ధర్మరాజుని అడుగుతారు, ''ధర్మం తెలిసినవాడివి కదా, నువ్వు ధర్మం చెప్పు'' అని. ఇది ధర్మమేగాని ఎలా ధర్మమో తెలియదు అని చెప్తాడు. ఇది ధర్మమే అని లోపల అనిపిస్తోంది, కానీ నేనేం చెప్పలేను నీకు. ధర్మం కాకపోతే మా అమ్మ అలా చెప్పదు మాకు అన్నాడు ఆయన. మా అమ్మ సత్యవాక్కు కలది, ఆమె నోటి నుంచి వచ్చింది మీరు ఐదుగురు అనుభవించండని. అందుచేత, మేము ఐదుగురం కూర్చున్నాం అని చెప్తాడు. అప్పుడు చాలా సందిగ్ధం వస్తుంది. వచ్చినప్పుడు వ్యాసమహర్షి వస్తాడు. వచ్చి, ఈ ద్రౌపదీదేవి, ఈ పాండవులు, వాళ్ళ పూర్వజన్మ కథలన్నీ తెలియపరుస్తాడు. అప్పుడు ద్రుపదుడు సమాధానపడతాడు. నేను సమాధానపడొచ్చు, సంఘానికి ఎలా చెప్పను అంటే, నా కుమార్తె ఈ విధంగా ఇష్టపడుతోంది కాబట్టి చేస్తున్నానని చెప్పు అన్నాడు. కుమార్తె ఒప్పుకుంది కదా!

అలా చాలా కథల్లో మనకి పూర్వాపరములు ఉంటాయి. ఈ పూర్వాపరములు తెలియడం, **దుఃఖాలు అనుభవించినా, సుఖాలు అనుభవించినా పూర్వకర్మ వలననే.** ఏ తెలివితేటలు ఉండవండి, అద్భుతంగా ఐశ్వర్యం వరిస్తూ ఉంటుంది వాడిని. వాడిని చూస్తే వీడికేం తెలివుందని ఇంత ఐశ్వర్యం అబ్బింది అనిపిస్తుంది.

అమోఘమైన తెలివితేటలు ఉంటాయి, ఏం ముట్టుకున్నా మసే! చాలా తెలివైనవాడు. మనం ఊహించలేనంత తెలివితేటలు, కానీ ఏదీ కలిసిరాదు. అదేంటి చెప్పండి? మామూలుగా మన equations ఎట్లా ఉంటాయి? తెలివి ఉంటే దాని ప్రకారం వాడు చాలా ఉన్నతమైన స్థితుల్లోకి వెళ్ళవచ్చు. తెలివితేటలు లేనివాడు అలా వెళ్ళలేడు కదా! మరి ప్రపంచం చూస్తే అలా ఉండదు. **మేధావులంతా ఉత్తమోత్తమమైన పదవుల్లో ఉన్నారా? లేదు కదా! ఒక్కొక్కసారి మూర్ఖుడు కూడా అక్కడ కూర్చుంటాడు కదా! ఎందుకు కూర్చుంటాడు? అది పూర్వ పుణ్యం.**

'గురుచరిత్ర' చదువుకున్న వాళ్ళకి తెలుస్తుంది. చాకలి వాడు ఒకడు వాడి పుణ్యంకొద్దీ వాడికి నృసింహ సరస్వతి తారసిల్లాడు. తారసిల్లితే, ఆ నృసింహ సరస్వతి కలిసిన సందర్భంలో అప్పుడే ఒక రాజలా వెళ్తుంటాడు తన పరివారంతో. ఎంతో వైభవంగా ఉంటుంది. చూసి గురువుగారికి దణ్ణం పెట్టి, నాకిలా చెయ్యరా ఎప్పుడైనా అని అడుగుతాడు. నేను కూడా అలా రాజులా ఉండాలనుంది అంటే, పై జన్మలో అలాగే పుడతావురా అని ఆయన ఆశీర్వదిస్తాడు. అంటే, నిజమా స్వామీ అంటే, అవును నువ్వు ఒక తురకరాజుగా పుడతావని చెప్తాడు. అప్పుడే కొత్తగా వస్తున్నారు తురకలు మనకి. అట్లా ఏదో ఒక తుగ్లక్ వస్తాడు ఏముంది? అంటే, వాడికి తెలివి ఉండక్కర్లేదు కదా పరిపాలించడానికి, చుట్టూ చాలామంది ఉంటారు. మనకలా ఎంతమంది రాలేదు? తెలివి లేక, అట్లా పదికాలాలపాటు ఐశ్వర్యాలు అనుభవిస్తూ వున్న పాలకులు! గట్టిగా పొట్ట పొడిస్తే అక్షరం ఉండదు కదా! వీటిని ఎలా లెక్క వేస్తారు? చాలా ఆరోగ్యసూత్రాలు పాటించేవారికి అనారోగ్యం

కలుగుతుంది కదా! ఏమీ పెద్దగా అంత ఆరోగ్యసూత్రాలు పాటించకపోయినప్పటికీ ఆరోగ్యంగా ఉండేవాళ్ళు ఉంటారు.

అంటే, సృష్టిలో జరిగేవాటికి మనకి సమాధానాలు (చాలా వాటికి) తెలియదు కదా! ఎందుకు తెలియవంటే, సృష్టి చక్రాన్ని ఆ విధంగా దండధరుడు నిర్వర్తిస్తూ ఉంటాడు. ఎవ్వడూ తప్పించుకోడానికి వీలు ఉండదు. ఇవాళ్టికి తప్పించుకున్నావని సంతోషపడవచ్చు, కాని కాలచక్రం అది, రేపోమాపో, పై జన్మో, ఎప్పుడో అప్పుడు తప్పదు. అందుకని, అతడికి ఈ పేరు ఏర్పడింది దండధరుడని. **ఎవరి చేతిలోనైనా తప్పించుకోవచ్చు కాని యముని చేతిలో తప్పించుకోలేరు.** అతనికి అనుయాయిగా, చిత్రగుప్తుడుంటాడు. చిత్రగుప్తుడంటే akashic records అని చెప్తూ ఉంటారు. మనం చేసే ప్రతి పని, ప్రతి మాట, ప్రతి ఆలోచన, మన చుట్టూ ఉండే ఆకాశంలో continuos గా record అయిపోతూ ఉంటుంది. దాన్నే akashic record అంటారు. అందుకని మనం ఒక జన్మ ఇలా జీవించామనుకోండి, ఓ పుస్తకం తయారవుతుంది. మన biography మనం రాసుకుంటే మంచి మంచి విషయాలన్నీ అలా రాసుకుని, మిగతావన్నీ అలా పక్కన పెట్టేస్తాం కదా! అసలు కొంత గుర్తే ఉండదు. మంచి విషయాలన్నీ గుర్తు తెచ్చుకుని రాస్తాం, మంచివి కాని విషయాలు గుర్తు వచ్చినా రాయం. ఆకాశంలో records ఎలా వుంటాయంటే మనసా, వాచా, కర్మణా మనం చేసే మంచి, చెడు అంతా **చిత్రంగా, గుప్తంగా రికార్డు అవుతూ వుంటుంది.** ఈ కార్యక్రమాన్ని అధిష్ఠించి వున్న దివ్య ప్రజ్ఞను '**చిత్రగుప్తుడు**' అని పిలుస్తారు. అందుచేత, తప్పించుకోలేని

దండన నిర్వర్తించే ఒక ప్రజ్ఞ సృష్టిలో ఉన్నది అని మన ఋషులు దర్శించారు, దానికి దండధరుడని పేరు పెట్టారు.

అందుచేత, ఆ దండధరుడు అడిగాడు, "నన్నేల అనుసరించు చున్నావు? వలదు వలదు. నిలిచిపోవలసినది. నీకు ఇక ఈ మార్గం అగమ్యము." ఎప్పుడూ రాలేదు నువ్వు ఈ మార్గంలో. అసలు బొత్తిగా ఎవరూ ఆ మార్గంలో వెళ్ళలేరు, తీసుకెళ్తే తప్ప. ఎవరూ కావాలని రారక్కడికి. లాక్కెళ్తూ ఉంటారు ఆ దారిలో! అందుకని, ఎవరూ వెళ్ళరు ఆ దారిలో, కాబట్టి తెలియదు ఆ దారి. "పుణ్యపురుషా!, పతులెచ్చటికి పోయినా సతులు వారి ననుసరించ వలసినదే కదా! నీ అనుగ్రహం వల్ల, భర్తృభక్తి ప్రభావం వల్ల నాకు అగమ్యమైన నెలవున్నదా" అన్నది. నీ అనుగ్రహం నామీద ఉన్నది. అందుచేతే నన్ను సాధ్వీమణి అన్నావు. నీ పాతివ్రత్య మహత్యం వలన నువ్వు నన్ను చూడగలిగావు అని అన్నాడు కదా! అందరూ చూడలేరు అని చెప్పాడు, అంటే ప్రశంసించాడు సావిత్రిదేవిని. కాబట్టి నీ అనుగ్రహం ఉన్నది. అంతేకాదు, నాకు ప్రాణములుండగా నా పతి ప్రాణములు పోవడానికి వీలు లేకుండా ఉండేటట్టుగా నేను ఒక ఏర్పాటు చేసుకున్నాను. కాబట్టి ఆయనెక్కడికి వెళ్తే నే నక్కడికి వెళ్ళవలసిందే అన్నది.

"సకల మార్గాలలో ధర్మపద్ధతి మిక్కిలి ప్రశస్తమైనది. సత్పురుషులే అట్టి ధర్మానికి ఆధారభూతులు. సజ్జన దర్శన మెన్నడూ వ్యర్థము కానేరదు" అన్నది. చూడండి! అంటే, అలాంటి భాషణ విశేష ప్రజ్ఞలో ఉంటే వస్తాయి తప్ప, అప్పటికప్పుడు అల్లుకుందామన్నా రావు కదా! ఏం చెప్పింది? ఆయన వెంట

నేను రావాలి, ఒకటి. నీ అనుగ్రహం నాకు ఉంది, రెండు. నేను నా ప్రాణములుండగా ఆయన ప్రాణాలు కోల్పోడానికి వీలులేని విధంగా ఒక వ్రతంలో ఉన్నాను. అంటే, ఉపవాసంలోనే ఉంది కదండి. ఇవన్నీ ఇలా ఉండగా, నీ దర్శనం నాకు అయ్యింది కదా, ఒక సత్పురుషుడిని దర్శనం చేస్తే దాని ఫలం తప్పక ఉంటుంది, సత్ఫలం ఉంటుంది, అది వ్యర్థము అవ్వదు కదా! "సత్పురుషులే అట్టి ధర్మానికి ఆధారభూతులు. సజ్జన దర్శన మెన్నడూ వ్యర్థము కానేరదు." అది గుర్తు పెట్టుకోవాలి.

ఎవరయినా ఊళ్ళో ఒక మహాత్ముడు ఉన్నాట్ట అంటే వెళ్లి దర్శనం చేసుకోవడం అనేది ఆచారం. ఎందుచేతంటే, దూరం నుంచయినా ఒక దర్శనం చేసుకుంటే దాని ఫలం ఉంటుంది. ఎందుకంటే, **ఒక సత్పురుషుడు అతడు ఉన్న ప్రదేశమంతా కూడా ప్రభావితం చేసి ఉంచుతాడు.** అందులో కాసేపు కూర్చుని వచ్చేసినా చాలు. అందుకే, ఇవ్వాళ్టికి కూడా ఓ షిరిడి సాయి మందిరానికో, లేకపోతే ఒక రమణ మహర్షి సమాధి దగ్గరకో వెళ్లి, అక్కడ మౌనంగా కాసేపు కూర్చుని వచ్చేస్తారు. మనకి స్థూలంగా అనిపించకపోవచ్చు అంటిందా, అంట లేదా అని. సూక్ష్మంగా జరగవలసినది జరుగుతుంది. మంచి పుణ్య ప్రదేశాలకి వెళ్ళినప్పుడు, పుణ్యక్షేత్రాలకి వెళ్ళినప్పుడు, సత్పురుషుల ఆశ్రమాలకి వెళ్ళినపుడు, సత్పురుషుల సన్నిధిలో ఉన్నప్పుడు, మనకు తెలియకుండానే మనలో ఒక శుభ ప్రక్రియ ప్రారంభమవుతుంది. మనం అశుభమైనటువంటి ప్రదేశాలు వెళ్ళినప్పుడు, నాకేం కాలేదు కదా, బానే ఉన్నాను కదా, ఏం అక్కడికెళ్తే ఏమయింది అంటాడు కదా! నీకు తెలియదు. ఎందుచేత? నీకు స్థూలమైన విషయాలే అంత

బాగా తెలియదు, సూక్ష్మంగా జరిగే ప్రక్రియ నీకేం తెలుస్తుంది? ఒక buchery పక్కనే ఉన్నామనుకోండి, రోజూ అక్కడ గొర్రెలు, మిగతా జంతువులు నరుకుతూ ఉంటారు. ఆ పక్కనే మన ఇల్లు ఉంది. చాలా అపాయకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకనే, పూర్వకాలంలో ఇలాంటివన్నీ ఊరికి దూరంగా ఉంచేవారు.

వాతావరణం ఎప్పటికప్పుడు పునీతం చేసుకుంటూ ఉండాలి. ఒక్కసారి ఓంకారం చేస్తే వాతావరణం అంతా పవిత్రీకరణమై పోతుంది. ఇంతమంది కలిసి ఓంకారం చేస్తే తప్పకుండా చాలా పవిత్రీకరణం అవుతుంది. అందుచేత, సామూహికంగా చేసే ప్రార్థనల వలన చాలా ఉపయోగం మనకి ఉన్నది. దర్శనం చేశాం, దర్శనమే కాదు సంభాషణ కూడా చేశాం. అందుకనే మనకి ఒక వాక్యం ఉన్నది, "సత్పురుష దర్శనము, స్పర్శనము, సంభాషణము". దర్శన, స్పర్శన, సంభాషణములు సత్పురుషులతో జరిగినప్పుడు నీమీద వారియొక్క ప్రభావం ఉంటుంది. వారి ప్రభావం అంటే? వారు ప్రత్యేకమైన, వ్యక్తిగతమైన ప్రభావం ఉంచుకోరు. వారు దైవ సాన్నిధ్యంలో ఉండడం చేత దైవము వారి నుండి ప్రసరిస్తూ ఉంటాడు. ఏ వ్యక్తి అయితే తనను తాను ఒక తటస్థ స్థితిలో ఉంచుకుంటాడో, సర్వకాల సర్వావస్థలయందు, దైవ ఆరాధన చేస్తూ... ఆ తటస్థ స్థితినే సత్వగుణమని అంటారు. It is neither active nor passive. అంటే, తమోగుణం కాదు, రజోగుణం కాదు. అలాంటి స్థితిలో తటస్థంగా ఉండి, అంతటా వ్యాపించిన దైవంతో అనుసంధానం చెంది ఉన్నాడనుకోండి. ఉంటే ఏం జరుగుతుందంటే, అతడు వాహికగా సర్వవ్యాపకమైన

తత్త్వము అతని నుంచి ప్రసరించి ఆ చుట్టుపక్కల అందరికీ కూడా మేలు కలిగిస్తుంది.

మరి అటువంటి జ్ఞానం సావిత్రిదేవికి ఉన్నది. అందుచేత, నీ దర్శనం లభించడమే కాకుండా, నీవు భాషణం కూడ నాతో చేశావు కదా! అందుచేత, ఆ ఫలం ఉండదా అని అడిగింది. "సత్పురుష దర్శన మెన్నడూ వ్యర్థము కానేరదు. సాధుశేఖరుడవైన నీ సాక్షాత్కారము లభించినప్పుడు..." సాధుశేఖరుడు. శేఖరు అనే పదానికి అర్థం తెలుసా? శిఖరమువంటి వాడని అర్థం. శిఖరమంటే ఆ చుట్టుపక్కలుండే కొండలకన్నా ఎత్తైనది అని అర్థం. మన దేహానికి శిరస్సు శిఖరము. అందుచేత, సృష్టిలో ఉండే సాధువులను తీసుకుంటే, ఆ సాధుసమూహాల్లో ఈయన అందరికన్నా గొప్పవాడు. ఎంత సాధువో అంత దండధరుడు కూడా. అది చాలా two extremities in one person. అతడు యముడు. అంతకన్నా సాధువులు లేరు. సజ్జనులకు సాధువు, దుర్జనులకు దండధరుడు.

అందుచేత, ''శుభప్రాప్తి లేక నేను వట్టిచేతులతో మరలి పోగలనా'' అంది. నీవెంటబడి రాగలను కాబట్టి వస్తున్నాను! సూక్ష్మ శరీరధారి అయి వెంట వెళ్తోంది. మాట్లాడుతున్నాడు మళ్ళీ రెండోసారి. మొదటిసారి మాట్లాడాడు భౌతికంగా శరీరంలో ఉన్నప్పుడు. రెండోసారి మాట్లాడాడు ఈవిడ సూక్ష్మ శరీరధారణ చేసినప్పుడు. మాట్లాడితే, ఎలాగూ పట్టుకెళ్తున్నావు కదా, నీవెంట నేనొస్తుంటే, నువ్వు మాట్లాడుతుంటే నీ భాషణ వల్ల నాకు తప్పక ఏదో ఒక విధమైన శుభప్రాప్తి కలుగుతుంది. అందుచేత,

అలాంటిది ఉంటుంది కదా తప్పకుండా, ఇది సృష్టి ధర్మమే కదా! అందుకని నేను వస్తున్నాను, నేను రాగలను కాబట్టి వస్తున్నానంది. "సమవర్తి" ఇంకో పదం యముడికి. ఒకటి **అంతకుడు**, రెండోది **దండధరుడు**, మూడవది **సాధుమూర్తి**. నాల్గవది **సమవర్తి**. సమవర్తనం ఉన్నటువంటి వారిని ఆదరిస్తాడు. అతడు సమవర్తనం కలవాడు. ఎన్నడూ పొరపాటులు జరగవు ఏ పనిలోనయినా. సజ్జనులకు ఆశీర్వచనము, దుర్జనులకు శిక్షణము, రెండూ చాలా తూకం వేసినట్టు చేస్తాడు.

"సమవర్తి ఆ ప్రగల్భ మధుర ప్రసంగం విని మిక్కిలి ఆనందించి, పతివ్రతా తిలకమా! అన్నాడు". మళ్ళీ చూడండి, "పతివ్రతా తిలకమా!" అన్నాడు. అంటే, పతిని అనుసరిస్తోంది కదా! అది ఒక వ్రతం. పతి ఎక్కడికెళ్తే నేనక్కడికి రావాలి కదా అంది. అదో వ్రతం పెట్టుకుంది. అందుకనే కదా వచ్చింది. మూడు రోజులు ఉపవాసం చేసి, పగలూరాత్రీ సావిత్రిదేవి ఆరాధన చేస్తూ, ఉపవాసం ఉపసంహరించుకోకుండా వెంటపడి అడవికి వచ్చింది కదా! ఇప్పుడు దేహం కూడా పక్కన పదిలం చేసి, సూక్ష్మ ప్రజ్ఞతో అనుసరిస్తోంది కదా! ఎవ్వరూ అలా అనుసరించలేదు యముడిని. ఆశ్చర్యపోయి, మరొక ప్రశంస వేశాడు. "పతివ్రతా తిలకమా! నీ ఉదార వాగ్ధోరణి నాకు అమందానందం కలిగించింది." చాలా ఆనందం కలిగించింది. నిజమే కదా! ఆవిడ మాట్లాడిన మాట కేవలం ప్రశంస కాదు, అది సత్యం. సత్యం లేకుండా ప్రశంస చేస్తే అలా పొంగిపోయేవాడు కాదు యముడు. అసత్యాన్ని అసలు బొత్తిగా అంగీకరించనటువంటి ప్రజ్ఞ అది. ఆయనకి నచ్చింది ఆవిడ మాట్లాడిన మాట.

"పతి జీవితం తప్ప వేరొకటేదయినా కోరుకోవలసినది." అది తప్ప నువ్వు ఏదయినా శుభమైన విషయం కోరుకో అని చెప్పాడు. శుభప్రాప్తి కలుగుతుంది కదా నీవెంట నేను వస్తున్నందుకు అన్నదానికి ఆ మాట చెప్తాడు. అంటే, "తప్పక ప్రసాదించగలను'' అని అనుగ్రహించాడు. 'మద్ర రాజకుమారి.' పదాలు చూడండి ఎలా వేస్తారో? ఇప్పుడీ మద్ర రాజకుమారి relevence ఏమిటి? అంటే ఏమిటంటే చెప్పాను మద్ర అనే పదానికి అర్థం, మద్రము అంటే ఆనందము అని, మంద్రము అంటే చైతన్యము అని. మద్ర రాజుకి పుట్టింది కదా! అందుచేత, యముడు మాట్లాడుతుంటే ఈమెకి లోపల విచారం పోయింది. అంతకుముందు ఎంత చింతతో అరణ్యంలో ప్రవేశించిందావిడ? ఈ రోజు పతి మరణిస్తాడన్న చింత కలిగి, వెంటపడి వచ్చింది. Event జరిగేవరకూ చింతండి, event జరగంగానే ఇప్పుడు చింత లేదు. ఎందుకంటే, ఇప్పుడు పనుంది కదా! మాములుగా మనకి కూడా మీరు బాగా తరిచి చూసుకుంటే, ఏదయినా ఒక విషయం అది జరగవలసినది జరగట్లేదేమో అన్నప్పుడు చింత ఉంటుంది. Event అయ్యిందనుకోండి అప్పుడు చింత ఉండదు. అప్పుడేం చెయ్యాలో next step చూసుకుంటాం. అందుకనే, ఒక contingent event మీద ఎక్కువ engage అయి ఉంటుంది మనసు. Contingent event అంటే happening or non-happening అన్న contingency ఉన్నచోట అలా engage అయ్యి, తపన చెందుతూ ఉంటుంది.

అది అశుభం అనుకోండి, ఎవరయినా పోతారనే పరిస్థితి వచ్చి హాస్పిటల్లో చేర్చారనుకోండి. చింతగా ఉంటుంది. చాలా

ఆదుర్దాగా ఉంటుంది. డాక్టర్ని అడుగుతూ ఉంటాం, వాళ్ళు చూద్దామండి అంటూ ఉంటారు కదా! అలా ఒక నెల రోజులు అవుతుంది. మనకి కాళ్ళు పీకుతుంటాయి ఈ లోపల కదా! ఆయనేమో కొంచెం అంత సులభమైన విషయం కాదంటాడు. ఆ తర్వాత కొన్నాళ్ళవుతుంది, కష్టం అంటాడు. బాధ పడతావు. ఈ process అంతా క్రమంగా మనలో మానసికమైనటువంటి ఆ ఒత్తిడి, ఆ చింత అయిపోయి, ఇంక రెండు, మూడు నెలలయిన తర్వాత వెళ్ళిపోతే మంచిదే, ఆవిడకి మంచిదే, నాకూ మంచిదే అనుకోడూ? అనుకుంటాడా? ఇప్పుడు అక్కడున్నట్టు రోజూ చూస్తే బాధేస్తుంది. రోగీ బాధ పడుతోంది, వెళ్ళలేక, వెనక్కి రాలేక. నువ్వూ బాధ పడుతున్నావు. అంటే, పంపించెయ్యాలన్న ఉద్దేశ్యంతో కాదు, లేకపోతే హాస్పిటల్లో ఎందుకు పెడతావు. ఇలా ఇలా జరిగి, చివరికి event, ఇహ అయిపోయింది, ఇహ మీవాళ్ళని పిల్చుకోవచ్చు అన్నప్పుడు వచ్చిన వాళ్ళు ఏడుస్తారు తప్ప వీడు ఏడవడు. ఎందుకంటే, వీడికప్పుడే అయిపోయింది process కదా! He went through the process slowly. Sudden గా విన్నప్పుడు అంత వెంటనే మనసు అంగీకరించలేదు కదా! అందుచేత, slow death ఎవరికి ఉపయోగం అంటే, మిగిలి ఉన్నవాళ్ళకి ఉపయోగం, పోయినవాడికి కాదు. వెళ్ళిపోయే వాడికి slow death is not such a happy situation. ఉన్నవాడికి, it slowly prepares.

ఏది ఏమయినప్పటికీ, ఆవిడ అంతవరకూ చింతగా ఉంది, యముడిని చూచినప్పటి నుంచి ఎంతో అప్రమత్తంగా వచ్చేస్తుంది. అప్రమత్తంగా వచ్చిన తర్వాత, ఆయన ఇప్పటికే రెండుసార్లు

మాట్లాడాడు కదా! ఇప్పుడు మూడోసారి కూడా మాట్లాడాడు. మనం ఎవరి దగ్గరికో, చాలా పెద్దవాళ్ళ దగ్గరకెళ్ళినప్పుడు, వాళ్ళు మనతో చాలా సున్నితంగాను, ఉన్ముఖంగాను మాట్లాడుతుంటే మనకి ఉత్సాహం వచ్చేయదూ? వచ్చేస్తుంది. ఎవరు యముడు కదా! అందుచేత, ఇప్పుడు మద్ర రాజకుమారి అంటే, ఆవిడ ఒకరకమైన ఆనందకక్ష్యలో అనుసరిస్తోంది. యముడంటే భయం లేదు. పతిని వేలెడంతవాడిని చేసి తీసుకెళ్తున్నాడు. సరే, వెంటపడి వెళ్తున్నాము, ఆయన మాట్లాడుతున్నాడు, మనం మాట్లాడుతున్నాం, వరం కూడా ఇస్తానన్నాడు. ఎంత గొప్ప విషయం అండి అది. అంటే, ఋషులు గ్రంథాలు రాసినప్పుడు ఒక్కొక్కచోట ఒక్కొక్క పదం ఎందుకిలా వాడారు అని చూసుకుంటే మనకి చాలా లోతైన అవగాహనలు వస్తాయి. అక్కడున్నటువంటి మానసిక స్థితి కూడా తెలుస్తూ ఉంటుంది. సావిత్రిదేవి మానసిక స్థితి.

అందుచేత, "మద్ర రాజకుమారి ఆ ప్రసంగం విని, ఇనుమడించిన అణకువతో, తిరిగి కనుదోయి ముకుళించి, **ధర్మమూర్తీ!** అంది." అందుకే చదివి చెప్పుకోవడం. అంటే, అతడు ధర్మమూర్తే కదా! ఎందుకనీ? అంతకుముందు ఆమె ఒక ధర్మం చెప్పింది, నువ్వు పతి ప్రాణాలు తీసుకెళ్తున్నప్పటికీ నీ దర్శనం నాకు కలిగినందుకు నాకేమైనా శుభం కలగాలి కదా అంది. అంతేకాదు, సత్పురుషుల దర్శనం వల్ల శుభం కలుగుతుంది కదా అంది. అందుచేత, ఏదో ఒక శుభప్రాస నాకు ఏర్పడాలి కదా అంది. అది ధర్మమే. కాబట్టి, నీకు శుభం కలిగేటట్టుగా నేనేదయినా చేస్తాను, నీ పతి ప్రాణాలు తప్ప, నువ్వు కోరుకోవచ్చు

అంటే సంతోషం వెయ్యదా? పరిస్థితి అనుకూలంగా ఉంటే మన మేథస్సు ఇంకొంచెం చురుగ్గా పనిచెయ్యడం మొదలు పెడుతుంది.

అప్పుడావిడ చెప్పింది, "ధర్మమూర్తీ! రాజ్యం శత్రువులు అపహరించిన పిమ్మట అంధుడైన సాళ్వభూనాథుడు ఈనాడు నిష్ఠుర నియమా లవలంబించి అరణ్య మధ్యంలో నివసిస్తున్నాడు. కరుణించి ఆ పూజ్యునికి తిరిగి పరిపూర్ణ దృష్టి అనుగ్రహించవలసినది" అంది. చూడండి ఎలా అడిగిందో! ముందు మెట్టినిల్లు సుఖం. అది కూడా ఎలా అడిగింది? ఆయనకి దృష్టి పోయిందని చెప్పుకోవడం కాదు, ఒకప్పుడు చాలా దివ్యమైన స్వభావంలో ఉన్నవాడు. పోగొట్టుకున్నాడు. ఎంత పోగొట్టుకున్నాడంటే, దృష్టి కూడా పోయింది. అంటే, దేవతానుకూల్యం నుండి దేవతా ప్రాతికూల్యంలోకి వచ్చేశాడు. ఇప్పుడు చాలా కఠోరమైన తపస్సు ఆచరిస్తున్నాడు. అతడు ధర్మాత్ముడే. కేవలం ఒక పొరపాటు వల్ల ఆ విధంగా జరిగింది కదా! అందుచేత, ఏం చెప్పిందంటే, అతనికి దృష్టి ఇమ్మంది. మామూలుగా మనం కథలు వింటుంటే, దృష్టి అడిగింది, దృష్టి ఇచ్చేశాడు అనుకుంటాం. ఆవిడ ఏం అడిగింది? పరిపూర్ణ దృష్టి. మీకు చెప్పాను పరిపూర్ణ దృష్టి ఉండడంచేతే అతడు ద్యుమత్సేనుడు అయ్యాడని చెప్పి. ద్యుమత్సేనుడంటే నీ దేహమందలి దేవతలందరూ నీకు పరిపూర్ణంగా సేనలుగా సహకరిస్తుంటే, నీవు చక్కని జ్ఞానం కలిగి, దూరదృష్టి కలిగి, జీవించే ఒక విశిష్టమైన ప్రజ్ఞ అది. ఆయన పేరులోనే ఉందది. అది పోయింది. అందుచేత, పరిపూర్ణ దృష్టి ఇమ్మంది. అంటే, కేవలం కన్ను ఇవ్వడమే కాకుండా, జ్ఞాన నేత్రం కూడా ఇమ్మని చెప్పింది. ఇదివరకు ఏ జ్ఞానమైతే అతడు

పొంది ఉన్నాడో, ఏది కోల్పోయాడో తర్వాత, అది మొత్తం అతనికి అందేటట్టుగా చూడమని కోరింది.

ఆ తర్వాత, "యమదైవతం సావిత్రికి ఆ వరం ప్రసాదించి, మరి నన్ను అనుసరించవలదు అని ఆదేశించి, స్వకీయ లోకంవైపు తరలిపోయినాడు. అయినా మద్ర తనూజ తన సంకల్పం విరమించక, మరికొంత దూరం సాగిపోయి, ఉట్టిపడుతున్న వినయంతో తిరిగి విన్నవించినది." ఇంక మరి వెంటపడకు అని చెప్పాడు. వెంటపడకు అన్నా ఉత్సాహంగా వెంట వెళ్ళింది. "దేవోత్తమా! మనస్సుతోగాని, వాక్కుతోగాని, కర్మతోగాని, ఆర్యు లెన్నడూ ఇతరులకు హింస సంకల్పించరు." నిజంగా ఆర్యుడంటే ఇది అర్థం. Aryan అంటే **మనసుతోగాని, భాషతోగాని, చేతతోగాని ఎవరినీ హింసించనటువంటి వాడే ఆర్యుడు.** అటువంటి వాడే 'ఆర్య' అని తగిలించుకోవాలి. శంకరాచార్య, రామానుజాచార్య, అట్లా ఆర్యునికి ఆచార్య అనేది నామం. ఎవరు ఆర్యుడు? తాను ధర్మాన్ని నేర్చి, తను అనుసరిస్తూ, తన అనుసరణ వల్ల ఇతరులు ప్రేరణ చెంది తన దగ్గర ధర్మాన్ని నేర్చుకోడానికి సంసిద్ధులైతే, వారికి కూడ ధర్మం నేర్పితే అప్పుడు పరిపూర్ణ ఆర్యుడు అని చెప్తుంది మన శాస్త్రం. ముందు ధర్మం తెలియాలి. రెండు, ఆ ధర్మం ప్రకారం తాను జీవిస్తూ ఉండాలి. మూడు, తాను జీవిస్తున్నటువంటి ధర్మ జీవనానికి స్ఫూర్తి చెంది అతనికి అనుయాయులుగా కొంతమంది చేరతారు. ఎందుకంటే, అదే ధర్మపథంలో నడవాలనే ఆసక్తి ఉండేవాళ్ళు. చేరితే, వారందరికీ ధర్మం నేర్పి, వారు కూడా ధర్మాన్ని ఆచరించే వారిగా తయారుచేస్తే– ఇవీ నాలుగు మెట్లు. ఇది ఎవరియందు సిద్ధిస్తుందో వాడు ఆర్యుడు అని పెద్దలు చెప్పారు.

దేవతలకి రాజైన ఇంద్రుడికి కూడ మితి ఉన్నది కదా! అందరికీ ఒక పరిధి ఉన్నది. ఒక అపరిమితమైన చైతన్యము ఏదైతే ఉన్నదో అది కాలానికి లోబడి ఈ లోకాలను తయారుచేసినప్పుడు, ఆ కాలము పైనున్నటువంటిదంతా అపరిమితము. దాన్నే మనం దైవము అంటూ ఉంటాం. ఈ అపరిమితానికి, పరిమితానికి మధ్య ఈ ఒరలు ఏర్పరిచే వాడు యముడు. దాన్నే ప్లూటో అని అంటారు ఇంగ్లీషులో. He marks limitation. అట్లా ప్రతిదానికి– పిల్లికో పరిధి ఉంటుంది, కుక్కకో పరిధి ఉంటుంది. మృగరాజు సింహానికో పరిధి ఉంటుంది. దాటి వస్తే అపాయం కదా! అట్లాగే, మానవులకీ పరిధి ఉన్నది. దేవతలకీ పరిధులు ఉన్నాయి. కేవలం బ్రహ్మము, అంటే తత్త్వమునెరిగి, సతతము తత్త్వమునందే జీవిస్తున్న వాడికొక్కడికే పరిధి ఉండదు. సావిత్రిదేవి అలాంటిది. ఆమె అపరిమిత తత్త్వంతో అనుసంధానం చెంది ఉంది. అందుచేత, ఈ పరిమితులు కలిపించే యమధర్మరాజు ఆంక్షలు పెట్టగా, అవన్నీ దాటుకుంటూ వచ్చేస్తోంది. లేకపోతే దాటలేరు. ఎవరైతే అపరిమితంతో సంబంధం పెట్టుకుంటారో వారికి అపరిమితత్త్వం, ఈ పరిమితత్త్వం నుంచి ప్రసరిస్తూ ఉంటుంది. అందుచేత, అలా ఎంత ప్రవహిస్తున్నా ఇంకా వస్తూనే ఉంటుంది. అంటే, he has set himself beyond limitation. దాన్నే liberation అంటారు.

Liberation అంటే నీకుగా నువ్వు ఒక మితి ఏర్పరుచుకోకుండా, ఆ మొత్తానికి సమర్పణ చేసుకుని, దేనికయినా

సిద్ధం అని జీవించే వాళ్ళుంటారు. వాళ్ళ కథలు, భక్తుల కథలు చాలా అలా కనిపిస్తాయి. అలాంటి వాళ్ళమీద ఆంక్షలు పెట్టలేడు యముడు. మిగతా వాళ్ళందరికీ ఆంక్షలు పెడతాడు. యజ్ఞ దేవతలకి, గ్రహ దేవతలకి, అంతరిక్ష దేవతలకి, అందరికీ limitations ఉన్నాయి. ప్రకృతికి కూడ limitation ఉంది. అన్నిటికీ ఉన్నాయి limitations. ఎందుచేత? మొదటి సంకల్పం దిగి వచ్చినప్పటినుంచి, ఈయన మితులు పెట్టుకుంటూ వస్తాడు. జలచరాలకి limits ఉన్నాయి, దాటి బయటకొస్తే మరణిస్తాయి. అట్లా మనం ఈ భూవలయం దాటితే మరణిస్తాము. అందుకునే కదా, machine లో కూర్చుని అన్నీ ఏర్పాటు చేసుకుని వెళ్తుంటాం పై గోళాలకి, మామూలుగా వెళ్ళలేం కదా! మితులు ఉన్నాయి. ఇలా దేవతలకే మితులు ఏర్పరిచేవాడంటే, ఇక ఈయన కన్నా ఎవరున్నారండి? ఈయన పైన ఎవరుంటారు? అసలు తత్త్వమే ఉంటుంది. And he does not suffer limitation. And he does not let people beyond their limitation. అట్లా పెడతాడు హద్దులు. అందుచేత, దేవతలకి కూడా పరిమితులు పెట్టగలవు కదా, అందుచేత నువ్వు దేవోత్తముడివి.

"దేవోత్తమా! మనస్సుతోగాని, వాక్కుతోగాని, కర్మతో గాని ఆర్యులెన్నడూ ఇతరులకి హింస సంకల్పించరు. దీనుల నెప్పుడూ పరమ కారుణ్య దృష్టితో సంరక్షిస్తూ ఉంటారు. వరాలు అనుగ్రహించినప్పుడు మరేవీ అర్థించవలసిన అక్కర కలుగకమునుపే అభిలషించినవన్నీ ప్రసాదిస్తూ ఉంటారు." అది చూడండి! అంటే, గోదావరిలో నీళ్ళు తాగినట్టుగా మాట్లాడుతోంది సావిత్రిదేవి! అంతేగా! ఎంత బాగా చెప్పింది. మొదట ఏం

చెప్పింది? కారుణ్యమును గూర్చి ప్రస్తావించింది. సత్యాన్ని అనుసరించే వాడికెవడికైనా దయ అనేది సహజంగా ఉంటుంది. *"దయను సత్యంబు లోనుగా తలపడేమి"... "కలుగనేటికి తల్లుల కడుపుచేటు"* అని. అందుచేత, కాస్తోకూస్తో సత్యం, ధర్మం అని ఉన్న ప్రతివాడికి కొంచెం కారుణ్యం ఉంటుంది. అలాంటిది నీబోటి వాడికెంత కారుణ్యం ఉండాలి.

అందుచేత, దీనులనెప్పుడూ అంటే, less fortunate people, అన్నం లేనివాళ్ళు, బట్ట లేనివాళ్ళు, పైకప్పు లేనివాళ్ళు, ఎంతోమంది ఉండగా, మనకు ఏమీ చెయ్యబుద్ధి కాలేదంటే మనలో ఏ కారుణ్య బుద్ధి లేదు. కారుణ్య దృష్టి ఉంటే, యథోచితంగా మన మానవ కుటుంబంలోనే లేనివారికి ఉన్నవారు సహాయం చెయ్యకపోతే, అలాంటి వారికి ఎలా ఉంటుంది దేహం వదిలిన తర్వాత? నీలో ఏ కారుణ్యం ఉందని నేను దయగా చూడాలి? తోటి జీవులయెడల ఏమాత్రం కారుణ్యం లేక, వారి తెలివితక్కువతనాన్ని మనం బాగా దుర్వినియోగం చేసుకుంటూ, వారిని బాగా వాడుకుంటూ, ఉపయోగించుకుంటూ, అట్లా బ్రతికామనుకోండి. మన తెలివితేటల ఆధారంగా తెలివితక్కువ వాళ్ళ మీద అజమాయిషీ చేసుకుంటూ ఉంటాం. మనకన్నా తెలివైనవాడు మన దగ్గర ఉండడు కదా! మనకన్నా తెలివితక్కువ వాళ్ళే మనతో ఉంటారు. వాడిని మోసం చేస్తే? సరే, మోసం చెయ్యలేదు. అసలు ఏమీ లేకుండా వాడక్కడ ఉంటే పక్కన, నువ్వు ఇక్కడ మంచి feast తింటూ ఉంటే ఎట్లా ఉంటుంది? అక్కడేమో వాడు 'అన్నమో రామచంద్రా' అని ఆకలితో ఏడుస్తూ ఉంటే, నువ్వు ఇక్కడ పంచభక్ష్య పరమాన్నాలు పెట్టుకుని ఎలా

తినగలవు? తినగలవా? వాళ్ళు గుర్తులేరా నీకు? అలాంటి వాళ్ళని కారుణ్యమూర్తి అని ఎలా అంటాం, అనలేము కదా!

దీనుల దుఃఖాన్ని గుర్తించలేనివాడు కారుణ్యమూర్తి కాలేడు. ఈయనేమో పరమ కారుణ్యమూర్తి. అందుచేత, దీనులను పరమ కారుణ్య బుద్ధితో సంరక్షిస్తూ ఉంటారు కదా! మీబోటివాళ్ళు వరాలు అనుగ్రహించినప్పుడు ఇంక మళ్ళీ ఏం కోరకుండా ఉండేటట్లుగా అంత సమృద్ధిగా అనుగ్రహిస్తారుగా! అంటే, ఎవరికయినా అన్నం పెట్టినా అట్లాగే పెట్టాలి, ఇంక చాలమ్మా అన్నట్టుగా పెట్టాలి. అరకొరగా పెట్టకూడదు. ఏం పెట్టీ మనిషిని సంతోష పెట్టలేమండి, కానీ అన్నం పెట్టి మనిషిని సంతోషింప చేయొచ్చు తెలుసా? ఈ ఒక విషయంలో 'చాలు' అనిపించవచ్చు. జీవుడు చాలు అంటాడు. జంతువైనా ఇంక చాలు అంటుంది. ఇక మిగతావాటికి ఏం చాలడానికి అంతేమీ లేదు. ఎన్ని బట్టలిస్తే సరిపోతుంది? వెంటనే చాలు అనడు కదా! అందుచేత, ఏదయినా చేస్తే పెద్దవాళ్ళు, ఇంక మళ్ళీ అడగాల్సినవి, శేషించినవి ఏం ఉండకూడదు కదా! అలా ప్రసాదిస్తారు. "ఆశ్రితులకు అడుగడుగునా అమందానందం కలిగిస్తున్నారు. ఇవి ఆర్యజనం పరమ ధర్మాలు." ఆర్యులనే వారికి ఇవి ధర్మాలు. అందుకనే మనకి కథలు ఉంటాయి, ఇంటికొచ్చి తింటూ ఉంటే, అలా పెడుతూ ఉంటే, ఇంట్లోదంతా కూడా అయిపోతుంది కదా! అయినప్పటికీ పెట్టేస్తూ ఉంటారు. అలా పెడుతూ ఉంటే నువ్వు దరిద్రుడివైపోతావు అని చెప్తూ ఉంటారు ఇరుగుపొరుగు. అయినా చివరికి వాడు మహత్తరమైన ప్రసాదాన్ని పొంది, గట్టెక్కి, ఎంతోమందికి ఉపయోగపడ్డట్టుగా మనకి జరిగిన కథలు ఉన్నాయి.

"అందువలననే నీకు ధర్మదేవతని సార్థక నామధేయ మేర్పడి ఉన్నది. పక్షపాత రహితమైన సమాన దృష్టితో ప్రాణులకు శుభాశుభ కర్మ ఫలితాలేర్పరిచి నందువల్ల నీకు లోకాలన్నిటిలోనూ 'సమవర్తి' అని సుప్రసిద్ధ నామ మేర్పడినది." అది కూడా చెప్పింది. నువ్వు కారుణ్యమూర్తివి, దేవోత్తముడివి. అంతేకాదు, సర్వ సమాన దృష్టితో ప్రాణులకు ఆయా శుభాశుభ ఫలితా లేర్పరిచి నందువల్ల నీకు లోకాలన్నిటిలోనూ 'సమవర్తి' అన్న సుప్రసిద్ధ నామధేయ మేర్పడింది. ఏ లోకంలో కూడా యముడు తప్పు చేశాడు అని ఉండదు. ఇంద్రుడు తప్పుచేసిన కథలున్నాయి, అగ్ని తప్పుచేసిన కథలున్నాయి, వాయువు తప్పుచేసిన కథలున్నాయి. ఎంతోమంది అంతరిక్ష దేవతలు తప్పుచేసిన కథలున్నాయి. గ్రహ అధిదేవతలు కూడా తప్పులు చేసిన కథలున్నాయి. యముడు తప్పులు చేసిన కథలుండవు. అంత సమవర్తనం ఉన్నది. అందుచేత, కల్మష నాశకుడైనందు వల్ల "**శమనుడు**" అన్న సార్థక నామధేయం కూడా ఏర్పడినది. ఏమాత్రం కల్మషం లేకుండా ఎప్పుడూ చాలా శాంతంగా ఉంటాడటండి శమనుడు. శమన మార్గం ఉంటుంది. వాళ్ళు బాగా పవిత్రీకరణం చేసుకుంటూ కూర్చుంటారు అరణ్యంలో. మన దేశంలో కూడా ఉన్నారు, వింధ్యారణ్య ప్రాతంలోనూ, శ్రీశైలం ప్రాంతాల్లోనూ. మనకి కనిపించేటట్టుగా వాళ్ళు తిరగరు. వారి పని ఒకటే, దేహ కోశములన్నీ వీలున్నంత పరిశుద్ధి గావించుకుని, తపస్సు చేసుకుంటూ ఉంటారు. నిర్మలమైన నీరు, రాలిన ఆకులు, పండ్లు తింటూ బ్రతుకుతూ ఉంటారు.

"కల్మష నాశకుడైనందు వల్ల నీకు శమనుడన్న నామధేయ మేర్పడినది. ప్రత్యేకించి విన్నవించవలసిన దేమున్నది?" అన్నది.

శమనుడది విని దరహసిత వికసిత వదనుడై “రాజపుత్రీ! కల్మష రహితమైన నీ ప్రసంగం దాహార్తునికి శీతల ఉదకధార వలె నాకెంతో ఉల్లాసం కలిగిస్తోంది.” అంటే, ధర్మాలు మాట్లాడుతోంది ఈవిడ. నువ్వు నాకు వరం ఇచ్చావు, నేను కోరుకున్నాను, అంతటితో నాకన్నీ తీరిపోయాయా అంటోంది. పెద్దవాళ్ళు వరమిస్తే ఇంక మళ్ళీ ఏం కోరడానికి మిగలకుండా ఉండేటట్లుగా వరం ఇవ్వాలి కదా అంది. అవునా కాదా అని అడిగింది. అవును. కాదనడానికి వీలులేదు. కాదనడానికి వీలులేని విషయాలన్నీ అడుగుతోందండి, అదొకటి. రెండోది, యముడితో ఇంతవరకూ మాట్లాడిన వాళ్ళెవరున్నారు? సంభాషణ ఏముంది? ఏ సంభాషణ ఉండదు కదా! చాలా అరుదుగా మనతో మాట్లాడేవాడు దొరికాడనుకోండి, మనం మాత్రం వదులుకుంటామా? మళ్ళీ ఎప్పుడు దొరుకుతాడో? కోటానుకోట్ల జీవుల్లో ఎవడు యమధర్మరాజుతో మాట్లాడతాడండి? చూడంగానే గుండె పగిలి చచ్చిపోతాడు కదా! అందుచేత, ఆయనకి ఆనందం కలిగింది చక్కగా మాట్లాడుతోందని. చాలా దాహం వేసినవాడికి చల్లటి మంచినీళ్ళు త్రాగితే ఎలా ఉంటుందో అట్లా ఉందమ్మా నీ మాటలు వింటుంటే, అంటే అర్థం ఏంటండి? అంత ఆయనకి దాహంగా ఉంది జీవులతో మాట్లాడానికి. చూడంగానే చచ్చిపోతుంటారు, ఇంక ఏం మాట్లాడుతాడు? యముడంటే శనికి ముప్పై రెట్లు. నీకు ఏలినాటి శని అంటాడు జ్యోతిష్కుడు. అనీ అనంగానే వీడికొాక బీట్ తగ్గుతుంది. ప్రతి ఏడేళ్ళకి వస్తుంటాడండి. ఎక్కడ చస్తాం! ఏడేళ్ళకి opposition లో ఉంటాడు, మళ్ళీ ఏడేళ్ళకి square లో ఉంటాడు, మళ్ళీ ఏడేళ్ళకి conjunctionలో ఉంటాడు. ప్రతి

ఏడేళ్ళకీ ఏడిపించేవాడితో ఎక్కడ చస్తామండి? అందుకే అంతగా చూసుకోబోకండి శని గురించి. యముడి గురించి చూసుకోండి. ఈయన ఇరవై ఎనిమిది సంవత్సరాలు ఒక రాశిలో ఉంటాడు. 336 సంవత్సరాలలో మొత్తం రాశిచ్రకం తిరుగుతాడు. ఎంత పెద్దవాడు యముడు? అలాంటి వాడితో ఎవరు మాట్లాడతారు? ఎవరు దొరుకుతారు మాట్లాడుకోవడానికి? దేవుడితోనే మాట్లాడుకోవాలి.

అందుచేత, ఆయనకి ఆనందంగా ఉందని చెప్పడానికి చెప్తున్నాడు. బాగా దాహంగా ఉండే వాడికి చల్లని నీళ్ళు ఇస్తే వాడెంత ఉల్లాస పడతాడో అట్లా ఉన్నాయి తల్లీ నీ మాటలు అని చెప్పి, "సత్యవంతుని ప్రాణాలు తప్ప వేరొక అభిలషితమేదయినా కోరుకోవలసినది. సత్వరమే నీకది ప్రసాదింపగలను" అన్నాడు. కొంచెం దారికి తెచ్చుకుంది కదా! "మద్రరాజ పుత్రిక ఆ పరమాదర దృష్టికెంతో ఆనందించి, కరుణామూర్తీ! వైరులపహరించిన రాజ్యం సాళ్వభూనాథునికి తిరిగి అనుగ్రహించ వలసినది." అంటే, తన మామగారికి ఇప్పుడు రాజ్యం అడిగింది.

ఇంటికి కోడలొస్తే అలాంటి కోడలు రావాలండి. కోడలొచ్చిన వేళ... అందుకనే, కుడికాలు లోపల పెట్టి రమ్మంటారు కదా! ఈ మధ్య football తన్నినట్టు ఆ బియ్యం కుండని తన్నడం ఒకటి మనవాళ్ళు కొత్తగా నేర్చుకుంటున్నారు. పూర్వకాలం ఇట్లా football లా తన్నడం ఉండేది కాదు. ధాన్యం పట్టుకుని వచ్చేది ఇంటికి ధాన్యలక్ష్మిగా. దాన్ని తన్నడం ఎందుకు? ఏమిటో? ఒకళ్ళని చూసి ఒకళ్ళు. అక్కడెక్కడో తన్నుతున్నారట అందుకని మనం తందామని... సింహద్వారం దగ్గిర తంతే అదెక్కడో వెనకాల

పెరట్లో ఉండే తులసి కోట దగ్గరకు వెళ్లి పడేటట్లు తన్నడం... అంత తన్నడం లేదు కానీండి, అసలు తన్నడం ఎందుకు ధాన్యాన్ని? అక్కడ వాళ్ళు తంతుంటారు ఉత్తరాదిలో అందుకని మేము కూడ. వాడు తంతే? వాడికీ చెప్పు తన్నకూడదని. అంతేగానీ, వాడు తన్నేడు కాబట్టి నేను కూడా తన్నాలని– వెఱ్ఱి వేయి రకాలు.

ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, సంతానలక్ష్మి... లక్ష్మీగా కోడలు ఇంటికి వస్తే? కోడలు ఇంటికొస్తే, అమ్మో ఇప్పటినుంచి ఎట్లా ఉంటుందో మనకి అనుకోకూడదు. కోడలు ఇంటికొస్తే లక్ష్మి ఇంటికి వచ్చింది. అందుకని, మన పిల్లని ఇంకో ఇంటికి లక్ష్మిగా పంపించి, మన ఇంటికి లక్ష్మిని తెచ్చుకోవడం అని అవగాహన ఉండాలి. అంటే, వదిలించుకునేటట్టుగా చెయ్యకూడదు ఆడపిల్లల పెళ్ళిళ్ళు. కన్యాదానం కోటి గోదానాల కన్నా గొప్పది. మరివన్నీ మనకెవరూ చెప్పలేదు కదా! అందుకనే, మనం దానం చేసే లోపలే ఆవిడే వెళ్ళిపోతోంది. అది కూడా ఉంది మనకి ఈ రోజుల్లో! నువ్వు దానం చేసేదేముందిలే నాన్నా! నేనే వెళ్ళిపోతానని చెప్తుంది. ఇదిగో వీణ్ణి పట్టుకొచ్చుకున్నాను, నీకు వీలుంటే ఆశీర్వదించు అని అడుగుతారు కదా! పోయాయి! అంటే, మంచి మంచి సంస్కారాలు ఇవన్నీ. అంటే, ఇది తెలిస్తే ఇందులో ఎంత value ఉందో తెలిస్తే సంస్కారాలు నిలబడతాయి.

అందుచేత, ఈ కోడలు ఏం చేసింది? మొదట మామగారికి, ఆయన జ్ఞానం అంతా తిరిగి రావాలని కోరుకుంది. అంటే, ఒకటి గుర్తుపెట్టుకోండి, వీడికి జ్ఞానం కలగాలని కోరితే అలా ఇవ్వరు. శివుడే ఇవ్వలేదు. ఉపమన్యువని ఒక కథ ఉంది. ఉపమన్యువు

శివుడి గురించి తపస్సు చేసిన తర్వాత ఏం కావాలి నీకు అని అడిగితే, జ్ఞానం కావాలంటే, జ్ఞానం అలా ఇచ్చేది కాదని చెప్తాడు. అంటే, జ్ఞానం ఇవ్వడానికి వీలు పడదమ్మా, కానీ జ్ఞానం పొందడానికి మార్గం చూపిస్తానంటాడు. ఎందుకంటే, వాడూ వీడూ ఇచ్చే జ్ఞానమైతే పోతుంది. జ్ఞానం నువ్వు నీకుగా సాధన చేసి, నీలో తదనుగుణమైన మార్పు తెచ్చుకుంటే అది నీలో నిలబడుతుంది. జ్ఞానం ఎవరి దగ్గర నుంచైనా తెచ్చుకునేది కాదు. నీ లోపల నుంచి ఏర్పడేది జ్ఞానం. తెలుసుకోండి. ఇలా యివ్వగానే అలా మనలో అతుక్కుపోతుందా? అతుక్కుపోదు. ఇప్పుడు చెప్పాను, పంచప్రాణాలు, ఏ విధంగా శరీరంలోంచి బయటకు రావొచ్చు... అంటే, అట్లా వచ్చేస్తామా? వచ్చేయగలమా? అలా రాదు కదా! కానీ ఆ విధానాన్ని అనుసరింప చెయ్యడానికి ఒక సద్గురువుని ఆశ్రయిస్తే, అతను నీకు వలసిన సహాయ సహకారాలు అందిస్తుంటే, అప్పుడు కూడా నువ్వే చేసుకోవాలి.

అర్జునుడితో ఏం చెప్పాడు కృష్ణుడు, నువ్వు చెయ్యి యుద్ధం, నేను నీతో ఉంటాను అన్నాడు. నీకు అవసరమైనప్పుడల్లా సహాయం చేస్తాను, యుద్ధం నువ్వే చెయ్యాలి. నేను చేస్తే నీకు పేరెలా వస్తుంది? రాదు కదా! నిజానికి ఆయనే చేసేశాడు పాపం, ఎందుకంటే candidate weak! చాలా అవార్డులు వచ్చాయి అర్జునుడికి. మనకి కూడా ప్రతిచోటా అవార్డులు ఇస్తుంటారు కదా! అవన్నీ వీడికి నిజంగా సరుకుండొద్దూ? సరుకు లేకుండా చాలా అవార్డులు. సరే పద పోదాం, నీ ప్రతాపం అంతా చూపించు, ఇన్ని అవార్డులు నీకు ఉన్నాయి కదా! అర్జున, ఫల్గుణ, పార్థ, కిరీటి అని చాలా బిరుదులు ఉన్నాయి కదా! మరేది? పద మొదలుపెడదాం అంటే

బేర్ మని ఏడ్చేశాడు. ముందు ఏడుపుతో మొదలు. ఇదేంటయ్యా ఈ అవార్డులు అన్నీ ఏంటి? నిలబెట్టాడు, చేయించాడు, చేశాడు. మొత్తానికేదో పని అయ్యింది కదా!

ఎందుకు చెప్తున్నానంటే, అలా భగవద్గీత మొత్తం అంతా ఉపదేశించాడు అర్జునుడికి. అంతేకాదు, మళ్ళీ విశ్వరూప దర్శనం. ఇదెక్కడ గోలండి? విశ్వరూప దర్శనం అయిన తర్వాత కూడా ప్రశ్న లడిగాడంటే, ఏం చెప్పాలండి అర్జునుడి గురించి? ఏ chapter విశ్వరూప సందర్శనం? పదకొండో అధ్యాయం. పదకొండో అధ్యాయంలో విశ్వరూప సందర్శనం కూడా అయిన తర్వాత ఇంకా అర్జునుడికి మళ్ళీ ప్రశ్నలు రావడం వల్ల కదా మిగతా అధ్యాయాలు వచ్చినాయి! అంటే ఏమిటి? ఎంత చూపించినా, అట్లా రాదది. గురువు తనకుండే ప్రేమచేత, కారుణ్యంచేత, ఎంత విస్తరింపచేస్తూ వెలుగు నందించినా, పుచ్చుకునే వాడినిబట్టే వాడు పుచ్చుకుంటాడు. అంతే, అంతకన్నా ఉండదు. ఇవన్నీ చెప్తాడు శివుడు ఉపమన్యుడికి. అర్థమయ్యేటట్టు చెప్పి, ఒక గురువుని చూపిస్తాను, ఆయన దగ్గర నువ్వు క్రమంగా శిక్షణ పొంది, క్రమంగా నువ్వు నన్ను జ్ఞానంతో పాటు చేరవచ్చు అని చెప్తాడు. ఆ ఉపమన్యుడు నెమ్మదిగా ఎంతటి వాడవుతాడంటే, అభిమన్యుడితోబాటూ ఉండగలిగే డంతటి వాడవుతాడు. అది కథ.

అందుచేత, జ్ఞానం అలా దానంగా ఇచ్చెయ్యడానికి వీలులేదు. ఇప్పుడీవిడ ఏమడిగింది మొదట? మామగారికి పోయిన జ్ఞానం ఇమ్మంది. అంటే, ఆయనకి ఇంతకుముందు ఉన్నది, కొంతవరకూ సంపాదించుకున్నాడు, మరుగున పడ్డాడు.

అది ఇవ్వచ్చు. అంతకన్నా ఎక్కువ ఇవ్వడానికి వీలు పడదు. ఇప్పుడేమడిగింది? రాజ్యం ఇమ్మంది. ఆయన రాజ్యం ఆయనకి ఇప్పించేసెయ్యి అని చెప్పింది.

“కరుణామూర్తీ! వైరులపహరించిన రాజ్యం సాళ్వ భూనాథునికి తిరిగి లభించునట్లు అనుగ్రహించ వలసినది'' అని అభ్యర్థించినది. వైవస్వత దేవుడా ప్రార్థనపై, ‘‘మద్రరాజ పుత్రీ! నీవు కోరిన వరం సత్వరమే అనుగ్రహిస్తున్నాను. మరి నన్ను అనుసరించక మరలి పోవలసినది. ఇది మహా దుర్గమమైన మార్గము'' అన్నాడు. ఇంక ఇక్కడినుంచి మరీ కష్టం అన్నాడు. మరీ కష్టం అంటే ఏంలేదు, మార్గం స్థూలం నుంచి సూక్ష్మం, సూక్ష్మం నుంచి సూక్ష్మతరం, సూక్ష్మతరం నుంచి సూక్ష్మతమము అయిపోతుంటుంది ముందుకెళ్తున్నకొద్దీ. ఈవిడ దానికి తగ్గట్టుగా అన్ని శరీరాలు ఏర్పరుచుకున్నది సావిత్రీదేవి ఉపాసన వలన. సావిత్రీదేవి అనుగ్రహం నుంచి వచ్చిన పుత్రిక కదా! అందుకని, ఆవిడకి సూక్ష్మ శరీరం ఉంది, కారణ శరీరం ఉంది. దాన్నే లింగ శరీరం అంటారు. అది దేంట్లోకయినా, ఏ లోకంలోకయినా ప్రవేశించగలిగిన శరీరం. ఇంక నువ్వు రాలేవు, కాబట్టి ఈ వరం తీసుకుని ఇంక వెళ్లిపొమ్మని చెప్పాడాయన.

“అని నిషేధించాడు. అయినా సావిత్రి తన ప్రాణేశ్వరుడి అనుగమనం విసర్జించలేదు. తిరిగి రెట్టించిన భక్తి భావంతో పరిపూర్ణాంజలి ఘటించి, ప్రప్రథమంగా ‘ధర్మాధిపతీ’ అంది.” The foremost among those who execute the law అన్నమాట. He is the authority. “ప్రప్రథమ ధర్మాధిపతీ!

ఎంత కష్ట దశలోనైనా ధర్మాత్ము లేమాత్రం తమ న్యాయ మార్గం పరిత్యజించరు. ధార్మికుల ఎదదలలో మోహతాపాదు లొకించుకైనా ప్రాదుర్భవించవు కనుక నిశ్చల చిత్తంతో నా కుచితమైన మార్గం నేను అనుసరించవలదా?" అన్నది. ఎంత కష్టమయినా సరే, నేను అనుసరించవలసిన మార్గం అనుసరించాలా వద్దా అనడిగింది. "ఎంత కష్ట దశలోనైనా ధర్మాత్ము లేమాత్రం తమ న్యాయ మార్గం పరిత్యజించరు." అవేగా కథలన్నీ. అంటే, మనకి కొంచెం ఇబ్బందిగా ఉంది కాబట్టి మడతలేసేసి పనులు కానిచ్చుకోవడం అలవాటు చేసుకున్నాం. వాళ్ళంతా మానవులు, మనో ప్రజ్ఞలో బ్రతికేవారు. మనో ప్రజ్ఞ దాటి, బుద్ధి ప్రజ్ఞ దాటి, ఆనందమయకోశంలో ఉంటే తప్ప, ఇట్లా "మద్రరాజ పుత్రి" అని పిలవడానికి వీలులేదు. వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్నే అనుసరిస్తారు, ఇంక దేన్నీ అనుసరించరు. అందుచేత, ఇప్పుడు నా ధర్మాన్ని నేను అనుసరించాలి కదా, నువ్వు రావొద్దన్నా నేను వస్తున్నాని కోపం పెట్టుకోబోక, నీ ధర్మం ప్రకారం నువ్వు తీసుకెళ్తున్నావు, నా ధర్మం ప్రకారం నేను వస్తున్నాను అని చెప్పింది. నా ధర్మం ప్రకారం నేను రావాలి తప్పదు అంటే ఏం చెప్తాడు యముడు? రావాలి బాగుంది, రాగలుగుతోంది అది చూడండి! ఇప్పుడు మనకీ రావాలనుంటుంది. ఇప్పుడు మనకి ఇష్టమైన వాళ్ళు వెళ్ళిపోతే, మనం కూడా వెళ్లి తెచ్చుకుందాం అనుకుంటాం కదా! ఏం వెళ్తాం, ఎక్కడివరకూ వెళ్తాం? వేరే శరీరాలు తయారుచేసుకోలేదు కదా! యోగవిద్య ద్వారా తయారు చేసుకుంది కాబట్టి ఆవిడ వెళ్తోంది, అడుగుతోంది. ఇది ఇందులో రహస్యం.

అందుచేత, “ధార్మికుల ఎడదలలో మోహ తాపాదు లొకించుకైనా ప్రాదుర్భవించవు కనుక నిశ్చల చిత్తంతో నా కుచితమైన మార్గం నేను అనుసరించవలదా? పతి అనుగమనం విడువగలనా? నాకింతకన్నా ముఖ్యమైన కర్తవ్యమేమున్నది'' అని తన ధోరణి లెస్సగా సమర్థించుకున్నది. సమవర్తి మారాడలేక... ఏం మాట్లాడుతాడు? సూటిగా ధర్మంతో ప్రశ్న వేస్తే మాట్లాడడానికి ఏం ఉండదు. బుద్ధుడు మాటిమాటికీ నేనెళ్ళిపోతా, నేనెళ్ళిపోతా, నేనెళ్ళిపోతా అంటూ ఉండేవాడు భార్యతో. దేనికని అడిగిందావిడ. అంటే, దైవదర్శనం చెయ్యాలి. దైవం ఇక్కడ లేడా? ఇక్కడే దొరుకుతాడు, వెళ్ళక్కర్లేదు అని చెప్తుంది. ఎన్నో రకాలుగా చెప్తాడు బుద్ధుడు. అన్నిటికీ ఆవిడ, యశోధర, ధర్మపరంగా సమాధానం చెప్తుంది, నువ్వు ఏది పొందుదా మనుకుంటున్నావో అది ఇక్కడే ఉంది, ఎక్కడికో పోయి తెచ్చుకోనక్కర్లేదు. పైగా నీకు తల్లితండ్రులున్నారు, బాధ్యత ఉన్నది, ఎక్కడికో వెళ్ళిపోతానంటావేంటి అని అడిగింది. సమాధానం చెప్పలేక, చెప్పకుండా వెళ్ళిపోయాడు. సిద్ధి పొందిన తర్వాత తెలిసింది వెళ్ళక్కర్లేదని, ఇక్కడే దొరికేదని. అందుకని, మొట్టమొదట ఆవిడకి క్షమాపణ చెప్దామని వస్తాడు. ఎక్కడ సూటిగా ధర్మపరమైన విషయాలు అడిగితే అక్కడ సమాధానం చెప్పడం కష్టం. అందుకని, నా పతి ననుసరించి నేను వస్తున్నాను, అది నా ధర్మము, కాదనగలవా అని అడిగింది. ఇది ధర్మం కాదని చెప్పగలవా పోనీ చెప్పు. అందుకని, నేను రావడం మీద నువ్వు కోపగించుకోవడానికి వీలులేదు. నా ధర్మం ప్రకారం నేను వస్తున్నాను, నీ ధర్మం ప్రకారం నువ్వు తీసుకెళ్తున్నావు ఆయుర్దాయం అయిపోయిందని.

అప్పుడు ఆయనన్నాడు, "రాకుమారీ! నీవు అత్యంత ధర్మతత్పరురాలవు. ఇందువల్ల తిరిగి నీకు ఇంకొక వరం ప్రసాదించవలెనని నేను నిశ్చయించుకున్నాను. అర్థించవలసినది'' అని అజ్ఞాపించాడు. అజ్ఞాపించాడు ఈసారి. కోరుకోమన్నాడు. కోరుకోమంటే, సావిత్రి దానికేంతో ఆనందించి, తిరిగి దోసిలి కట్టి, ''మా తండ్రికి పురుష సంతానం కలుగలేదు.'' అది కదా కథ మొదటి భాగం. మొట్టమొదట అశ్వపతి చాలా తపస్సు చేస్తాడు. పద్ధెనిమిదేళ్ళ పాటు రోజూ పదివేల గాయత్రి మంత్రం చేసిన వాడాయన. ప్రాణముల మీద ఆధిపత్యంతో బాటు, ప్రజ్ఞ మీద కూడా ఆధిపత్యం సంపాదించుకున్నాడు. సూర్యుడికి మూలమైన సావిత్రిదేవి, సవితృమూర్తి ఆయనకి దర్శనం ఇస్తుంది. ఇచ్చినప్పుడు పురుష సంతానం కావాలని కోరతాడు. కోరితే, స్త్రీ సంతానం నీకు ప్రస్తుతం రాసిపెట్టి ఉన్నది, అది పుచ్చుకో అని చెప్తుంది. ఆ పుట్టిన కన్య వలన నీకు పురుష సంతానం లభిస్తుంది తర్వాత అని కూడా చెప్తుంది. అది అడిగింది. అంటే, ముందు మెట్టినింటికి శుభాలు కోరి, అటుపైన పుట్టినింటికి శుభాలు కోరిందండి. అలా కోరేసరికి...

"కృతాంతుడు ఆ వరం ప్రసాదించి, సుదూరం నన్నునుసరించి మిక్కిలి అలిసినావు. మరి మరలి పోవలసినది'' అని తిరిగి హితోపదేశం చేశాడు. సావిత్రి తనపై సవినయ స్వరంతో విన్నవించినది. **శమనదేవా!...**'' అంటే, ఇంత చేసినా ఆయనకి కోపం రావట్లేదు కాబట్టి. "శమనదేవా" అన్నది. ఒకటికి మూడుసార్లు అడిగితే మనకి మొహంలోనే చిరాకు వచ్చేస్తుంది కదా! అవతలి వాడు మళ్ళీ అడిగితే, అమ్మో ఇంక అడిగితే

తిడతాడేమో అన్నట్టుగా పెడతాం. పెట్టడమేంటిలెండి అది అట్లా వచ్చేస్తుంది. ఓర్పు ఉంటే తప్ప అంతలా భరించడం కష్టం. మనుషులను భరించాలంటే చాలా ఓర్పు ఉండాలి కదా! దానికి highest ఎవరయ్యా అంటే యముడు. ఇలా చూడండి, ఒద్దు, ఒద్దు అంటే వెంటబడి వస్తోంది, ఒకటి. వెంటబడి వచ్చి చక్కగా మాట్లాడుతోంది, రెండు. ఆనందం కలిగిస్తోంది, అయినప్పటికీ వద్దన్న పని చేస్తోంది. ఇప్పటికి మూడుసార్లు చేసింది. మూడుసార్లు అయిపోయింది వద్దనడం. అయినా వస్తూనే ఉంది కదా!

అందుచేత, "శమనదేవా! నా హృదయం భర్త యెడల సంపూర్ణ భక్తి భావంతో తొణికిసలాడుతున్నది. ఇట్టి నాకు అలసటెట్లు సంఘటిల్లగలదు?" అంది. ఇప్పుడు చాలా అలసి పోయావు, ఇంక చాల్లే, వెళ్ళిపో అన్నాడు. అంటే, అలసటేమిటి, నాకు భర్తే ముఖ్యం. అత్యంత ఇష్టమైన పని చేస్తున్నప్పుడు అలసటెట్లా ఉంటుందండి? రాత్రి రెండుంపావుకి పెడతారు ముహూర్తాలు. ఆడపిల్ల తండ్రికి, తల్లికినూ ఆ రోజు పొద్దున్నుంచి ఆ మర్నాడు కూడా నిద్రలుండవు. ఏమిటోనండి, అలసిపోతారు, కాసేపు పడుకోండి అంటే ముహూర్తం time కి పడుకుంటాడా? ఎందుకనీ? ఇష్టమైన పని కాబట్టి నిద్ర రాదు. అంతా అయిపోయిన తర్వాత వస్తుంది నిద్ర. అలాగే మనకి అత్యంత ఇష్టమైన దానికి మనసు తగులుకుని ఉన్నప్పుడు నిద్రతో సంబంధం ఉండదు.

ఎలా వెనక్కి వెళ్ళిపొమ్మంటావు, నాకు అసలు అలసటే లేదు కదా, నాకు కావలసిన పని మీద కదా నేను వెంట వస్తున్నానని చెప్పింది. "సతుల కన్నివిధాలా ప్రాణేశ్వరానుసరణ

గాక నాకు వేరొక పవిత్ర ధర్మమేమున్నది? మరి ఇంకొక విన్నపం. కృపార్ద్ర హృదయుడవై ఆకర్ణించవలసినది.” ఇంకొక్క మాట చెప్తాను విను అంది. ఈవిడ మాట చెప్పిందంటే అవతలి వాళ్ళు కరిగిపోవలసినదేనండి. యముడే కరిగిపోయాడంటే ఇంక మిగతా వాళ్ళ మాటేం చెప్పాలి? “ఆత్మ ధర్మ నిరతులైన పుణ్యాత్ములు ఈ భువనంలో మిక్కిలి దుర్లభులు. వారి సాంగత్యము వలన సమస్త దురితాలు నిశ్శేషంగా నశిస్తున్నవి. అట్టివా రందరూ పుడమిలో కేవలం పవిత్ర తీర్థ స్వరూపులు. వారి ప్రభావం చేతనే సూర్యచంద్రాదులు ఆకాశంలో సదా సక్రమ పద్ధతిలో చరిస్తారు.  సాగరాలు అణు మాత్రమేనా అవధులు అతిక్రమించడం లేదు. కుల పర్వతాలన్నీ నిశ్చలమై విలసిల్లుతూ ఉన్నవి. భూత ధాత్రి ప్రాణికోటుల నన్నిటినీ భరిస్తున్నది. ఇంకొక్క విషయం చిత్తగించవలసినది. ఏడు మాట లాడినంతనే ఎట్టివారయినా అన్యులు ఆర్యులకు బంధువు లవుతున్నారని విజ్ఞులు ఉపదేశిస్తున్నారు.” ఏడు మాటలు మాట్లాడితే ఒక మహాత్ముడితో... అంటే వాడు మాట్లాడనిచ్చాడు కాబట్టి కదా ఈవిడ మాట్లాడుతోంది. అలా మాట్లాడటంలో ఏమవుతుందంటే ఈ విధంగా ఇప్పుడు నువ్వూ నేనూ సంభాషణ చేసుకుంటూ సాగుతున్నాం కదా, కాబట్టి నేను నీకు బంధువైపోయాను అంటోంది. అంటే సన్నిహితం పెరిగింది మనకి అని, నేను నీ బంధువుని. “అవుతున్నారని విజ్ఞులు ఉపదేశిస్తున్నారు. చిరకాల సంభాషణం వల్ల నేను ఇప్పుడు నీకు ఆప్తురాలైనానని వేరుగా విన్నవించనక్కర్లేదు కదా.” ఎక్కడికక్కడ fix చేసేస్తోంది కదా! మరి నేనంటే మీకు చాలా ఇష్టమని తెలిసిపోయిందని చెప్పేసింది.

నామీద మీకు చాలా ప్రేమ ఉంది, చాలా వాత్సల్యం ఉంది, చాలా కరుణ చూపిస్తున్నారు, నేనడిగినవన్నీ మీరు చేసిపెడుతున్నారు, నాకర్థమయిపోయింది అని చెప్పింది. అవునా కాదా అంది. కాకపోతే, ఎందుకు చేస్తాడు? అవును కాబట్టే చేస్తున్నాడు.

“కనుక నా కోరిక అవశ్యం నెరవేర్చ తగినదని భావింతువు గాక!” నేను ధర్మమైన మార్గంలోనే నీ వెంటబడి వస్తున్నాను. నేను ఎట్లాగూ వెనుకకు వెళ్ళను. పైగా ఇప్పుడు నేనంటే నీకు ఇష్టం కదా అంది. చిన్న పిల్లలు అడుగుతూ ఉంటారు, నేనంటే నీకు ఇష్టం కదా, నువ్వు నాకది కొనిపెట్టవా అంటారు. నువ్వు నాకు ఇష్టం లేదని చెప్పలేవు కదా! నేనంటే నీకిష్టం కదా మమ్మీ, నాకు ice cream కొనిపెట్టవా అంటే, ఏం చేస్తుంది అమ్మ? ఇప్పుడు తేల్చుకోవాలి. ice cream కొని ఇవ్వకపోతే ఇష్టం లేనట్టే కదా! Ice cream కొంటే ఇష్టం ఉన్నట్టు కదా! అలా చెప్పింది. ఎందుచేత? ఇంత కాలం సంభాషించాడు, మెచ్చుకుంటున్నాడాయన.

“సమవర్తి ఆ ప్రసంగం విని, మిక్కిలి ప్రసన్నుడై, మద్ర రాజకుమారీ! నీ కింకొక్క వరమీయవలెనని నిశ్చయించుకున్నాను, కోరుకోవలసినది” అన్నాడు. ఈసారి ఆ conditions లేవు. ఇంకొక్క వరం ప్రసాదించాడు. “సావిత్రి ఆ సమాధానం విని, అమందానందభరితురాలై, కృపాంభోనిధీ! పతి జీవితం తప్ప వేరొక్కటి అర్థించవలసినదని నీ వింతకుముందు ఉపదేశించావు. కానీ ఇప్పుడట్టి నియమం విధించలేదు.” తెలిసే చేశాడు. ఇంకెందుకులే అనుకున్నాడు. ఇంక మరి జారిపోయాడాయన. అదీ సావిత్రిదేవి! “నీ పతి ప్రాణం తప్ప” అన్న పదం లేదుగా! అదే

చెప్పింది. నీవలా అనలేదు కదా, కాబట్టి నేనడుగుతాను అంది. "కానీ ఇప్పుడా నియమం విధించలేదు. అందువలన, ఆనంద తరంగిత హృదయంతో నిన్ను అర్థిస్తున్నాను. భర్తృ వియోగం పరమ దుస్సహము. పతి లేని భామినిని అందరూ శుభకార్యాలలో నిరాకరిస్తారు. కనుక నా హృదయేశ్వరుడు పునర్జీవితుడై, సుగుణ సంపత్తితో, అతులిత కీర్తితో విలసిల్లునట్టు అనుగ్రహించవలసినది" అంది.

అంటే, ఊరికే మా ఆయన్ని నాకిచ్చేయ్ అనలేదండి. అంటే, తపస్సు చేసేవాళ్ళకి అలా ఉంటుంది మేధస్సు. కార్యసాధకుల మేధస్సు అలా ఉంటుంది. "నా హృదయేశ్వరుడు పునర్జీవితుడై, సుగుణ సంపత్తితో..." మళ్ళీ తిరిగొచ్చినా... కొంతమంది తిరిగొస్తుంటారు కోమాలోకెళ్ళి, వాడికన్నీ గుర్తుండవు, అంతకుముందు తెలిసినవేవీ ఇప్పుడు తెలియవు, అట్లా వెర్రిమొహం వేసుకుని చూస్తూ ఉంటాడు. పునర్జీవితుడే కానీ ఉపయోగం లేదు, కొన్ని missing. ఓసారి కోమాలోకి వెళ్లి వచ్చిన తర్వాత పూర్తిగా తిరిగిరావడం అనేది అదృష్టం.

అందుచేత, ఇప్పుడు అసలు ప్రాణాలే ఎత్తుకుపోయారు కదా, అయిపోయింది కదా! భూమిపై వుంది అతడి శరీరం. ఈవిడదీ అక్కడే ఉంది. ఇప్పుడు తిరిగొచినప్పుడు పునర్జీవితుడైతే మాత్రం చాలదు. "అతులిత కీర్తితో విలసిల్లునట్టు అనుగ్రహించవలసినది". చాలా కీర్తి కలిగి ఉండాలి. అతడి గుణములకు సంబంధించినటువంటి కీర్తి కూడా ఏర్పడేటట్టుగా అతడిని పునర్జీవుడిని చేసి నాకిమ్మని చెప్పింది. "మరి ఇంతకన్న

నేను అభ్యర్థించ వలసినదేమీ లేదు.” ఇది ఇచ్చావనుకో నేను ఇంక కోరుకోవాల్సినవేవీ లేవు. అప్పుడు నువ్వు perfect Aryan అని చెప్పింది. నువ్వు ఎప్పుడు ఆర్యుడవంటే నాకు ఏ కోరికా మిగలకుండా అన్నీ తీర్చినవాడివైతే అని చెప్పింది. అత్తమామలకి సమృద్ధి, తండ్రికి సమృద్ధి, తనకీ సమృద్ధి. అన్నీ అయిపోయాయి కదా దానితో! అందుకని, నువ్వు అడిగినా కోరుకోవడానికేం లేవు అని చెప్పింది.

“వైవశ్వతుడా ప్రార్థన కంగీకరించి అదే క్షణంలో సత్యవంతుడికి మృతుపాశ విముక్తి కలిగించి, సావిత్రి వైపు ఆదర దృష్టి ప్రసరింపచేసి, రాజపుత్రీ! ఇదిగో నీ ప్రాణేశ్వరుని స్వీకరించవలసినది. ఇతడు ఈ పిమ్మట నాలుగు నూరుల సంవత్సరముల పర్యంతము జీవించి, శత పుత్రులతో...” ఆయన ఇంక ఆగలేదు. అంతలా ఆయనకి కారుణ్యం పెరిగిపోయింది, వాత్సల్యం పెరిగిపోయింది. ఇప్పుడు కూతురు అడిగిందనుకోండి, కూతురు అడిగిన దానికన్నా ఎక్కువ ఇస్తాడు కదా తండ్రి! ఎందుకంటే, ఆయనకి అనందం. అట్లా ఆవిడకి పతి ప్రాణంతో పాటు, అతనికి నాలుగు వందల సంవత్సరాల ఆయర్దాయం. కృతయుగంలో పూర్ణజీవనం నాలుగు వందల సంవత్సరాలు. ఇది కృతయుగం కథ. అందుకే, కృతలో సావిత్రిదేవి, త్రేతలో సీతాదేవి, ద్వాపరలో ద్రౌపదీదేవి, కలిలో చూద్దాం... ఎందుకనీ? భారతం కలి ప్రారంభంలో రాశారు కాబట్టి ఆ మూడు మనకి తెలిశాయి. ఆ మూడు కథలు ఇక్కడే చెప్పేశారు. మార్కండేయుడు సీత కథ, సావిత్రి కథ చెప్పాడు ద్రౌపదీదేవికి. కృతయుగం కథ అంటే నాలుగు వందల సంవత్సరాలు ఆయుః పరిమాణం.

అలాగే, త్రేతలో మూడు వందల సంవత్సరాలు, ద్వాపరలో రెండు వందల సంవత్సరాలు, కలిలో వంద సంవత్సరాలు. మనం మన ఆయుర్దాయాన్ని తగ్గించుకుంటూ వస్తాం మన ప్రవర్తన వలన.

అందుచేత, అతడు నాలుగు వందల సంవత్సరాలు బ్రతుకుతాడు. అంతేకాదు, శత పుత్రులతో, మీ నాన్నకే వంద కుమారులు కాదు, నీకు కూడా వంద కుమారులు. "శత పుత్రులతో నిరంతర యాగ నిర్వహణలతో వంశ శ్రేష్ఠుడై, లోకంలో సర్వత్ర శాశ్వత కీర్తి సంపాదించుకోగలడు." అంటే, ఈ సృష్టి ఉన్నంత కాలం ఈ కథ చదువుకోవడం జరుగుతూనే ఉంటుంది. మనం కాకపోతే ఇంకొకరు చదువుకుంటారు. మనం ఇప్పుడు చదువుకున్నాం. "అని పలికి, వీడ్కొని అంతర్హితుడై స్వీయలోకం చేరుకున్నాడు." ఇక మరి మాట్లాడడానికి కూడా ఏం లేవు, ఆవిడ అడిగిన దానికన్నా ఎక్కువ ఇచ్చేశాడు. ఆవిడ ఒకటే అడిగింది. ఆ ఒకటే చాలంది. అన్నీ ఇచ్చేశాడు. అదృశ్యమయ్యాడు.

మళ్ళీ చూద్దాం అంటే కుదరదు అలాంటి వాళ్ళని. అలాంటి వాడాయన. ఎవరికోగాని కనబడనటువంటి వాడు, సంభాషించ నటువంటివాడు. అలా అడిగినవన్నీ చేకూర్చి పంపించాడంటే యముడెంత మంచివాడండి? చాలామంది దక్షిణ దిక్కు అంటే భయపడతారు. యోగులు దక్షిణ దిక్కుకు చూస్తూ తపస్సు చేస్తారు. ఎందుకంటే, మెప్పించాలంటే యముని మెప్పించాలి. దాక్షిణ్యమూర్తి. దక్షిణమందు ఉండడం చేత అతడు పరమ దాక్షిణ్యమైన మూర్తి. సద్గురువు కూడా భూమికి దక్షిణంలోనే ఉంటాడట, సిరియస్ అనే మండలంలో. యముడూ దక్షిణంలోనే

ఉంటాడు. నువ్వు యముడిని మెప్పించగలిగితే ఇంక నీకు మరణం అనేది చాలా చిల్లర విషయమైపోతుంది. యముని మెప్పించాలంటే యమ నియమములు బాగా పాటించాలి. యమ నియమములు అంటే అహింస, సత్యము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, ఆస్తేయము, శుచి, శౌచము, సంతోషము, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అని పది నియమాలు చెప్తారు యోగంలో. వాటిని తు.చ. తప్పకుండా ఎవరు ఆచరిస్తారో వారందరికీ యముడు ఉన్ముఖుడై ఉంటాడు, సుముఖుడై ఉంటాడు. అంటే, మనం ఆచరించకపోవడం వల్ల మనకి ఆ ఉన్ముఖత్వం, సుముఖత్వం కలగకుండా ఉంటుంది.

# 15. మరణం నుండి జీవనంలోకి...

"మరి కొంతసేపటికి సత్యవంతుడు అల్లన తిరిగి తెలివి తెచ్చుకుని..." తెలివి వచ్చింది. "తెచ్చుకుని, ఎంతోసేపు నిద్రించినట్టున్నాను. అయ్యో! రవ్వంత నన్ను మేల్కొల్పలేకపోతివా అన్నాడు." మళ్ళీ ఇంటికి వెళ్ళాలి కదా, చీకటి పడిపోతోంది కదా, అని ఆయనకి ఆలోచనలు అన్నీ వచ్చేసినాయి. "బలవంతుడెవ్వడో నన్ను పాశంతో బంధించి, నన్ను తనవైపు ఆకర్షించి పోతునట్టు గోచరించినది. అతడెవ్వడూ అని అడిగాడు." ఈయనకి ఇది కల, అది సత్యం అక్కడ. అట్లా అనిపించిందట. ఆ వచ్చిన వాడెవడూ అని అడిగాడు. "నాకది కలగా భాసించలేదు, యథార్థమన్నట్టుగా గోచరిస్తున్నది." అంటే, మనకి కొన్ని కలలు అట్లా ఉంటాయి కదా! అది కలగా అనిపించదు, నిజంగా జరిగినట్లు అనిపిస్తుంది. "నాకేదో విచిత్రమైన భ్రాంతి కలిగినట్లున్నది." అట్లా నన్ను పట్టుకుపోతే, ఇక్కడెట్లా ఉంటాను, ఉండను కదా, కానీ అది నిజం అనిపిస్తోంది. ఏదో కొంచెం distrubanace వచ్చింది mind లో అంటున్నాడు. "అని ప్రసంగించాడు. మద్రరాజ తనూజ అతడి పునర్జీవనానికి ఎంతో ఆనందించి, ఆ విషయం పైకి ఏమాత్రం వ్యక్తీకరించక, నాథా! ఆ విషయం సమగ్రంగా రేపు వివరించగలను. కటిక చీకటి నలువైపులా వ్యాపిస్తున్నది. మరి ఇచట నిమిషమైనా ఆలసించరాదు. అల్లదిగో మహోగ్రాకారులైన రాత్రించరులు అచ్చటచ్చటా సంచరిస్తున్నారు. జంబూకాల

ఘోర ఆక్రందనలు ఎల్లెడల వినిపిస్తున్నవి. భయంకర మృగ సమూహాలు, ఘోర ధ్వనులను అనుక్షణము సంగమిస్తున్నవి. నాకెంతో భయోత్కంపం కలుగుతోంది" అన్నది. ఏది, ఈవిడికి భయం ఏమిటండి? ఈవిడకి భయమా? తొందరగా ఇంటికి వెళ్ళిపోదాం, ఇప్పుడీ చర్చ ఎందుకని. ఇక్కడ discussion పెట్టుకోకూడదు కదా! ముందు ఇంటికి వెళ్ళిపోదామని. బ్రతికాడు కదా, అదే చాలు. కనుక తొందరగా ఇంటికి వెళ్ళిపోడానికి ఇవన్నీ చెప్పిందావిడ.

"నీవు ఆలసించినందువల్ల అత్తమామలెంతో ఆందోళనపడి దుఃఖించ గలరు. శీఘ్రమే మరలిపోయి వారి నానందింప చెయ్యవలసినది" అంది. మనం త్వరగా వెళ్ళకపోతే ఇంట్లో వాళ్ళకి భయం వేస్తుంది. ఏమిటి ఎప్పుడో రావలసినవాడు, పైగా కోడలిని కూడా తీసుకెళ్ళాడు, ఏమైపోయారో వీళ్ళు అని. అట్లాగే పాపం ఆ గుడ్డిరాజుగారు వెతుక్కుంటూ వచ్చేస్తూ ఉంటాడు ఆలస్యం అయ్యిందని. ఇప్పుడు చూడండి పిల్లలు ఇంటికి రాకపోతే అట్లా రోడ్డు మీదకెళ్ళి పోతాం, main door నుంచి బయటకొచ్చి, gate దగ్గరకొచ్చి, ఇంకా ఆలస్యం అయితే వీధి చివరికెళ్ళి, ఇట్లా చేస్తాం కదా!

అందుకని ''అటు పిమ్మట అతని వదనంపై అలసట మేళవించిన విషణ్ణ వైఖరి పరికించి... ఒకవేళ చీకటి దట్టమైనదని, మన ఆశ్రమ భూమి మిక్కిలి దూరమని మనం వెళ్ళలేకపోతాం అనుకుంటే, పోనీ ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోదాం, పొద్దున్నే వెళ్దాం నీకు అలసటగా ఉంటే అంది.'' ముందు ప్రయాస పడకూడదు కదా!

అంటే, అప్పుడాయన, "రాకుమారీ! శిరోవేదన తొలగిపోయినది. మేనుకి తగినంత బలిమి కలిగినది. నెమ్మదిగా నడిచి పోగలము. అయ్యో! నా కన్న తల్లితండ్రులను అవలోకించనిదే నేను ఈ కానన భూమిలో నిమిషమైనా నిలవలేను." కాబట్టి వెళ్ళిపోదాం అని చెప్పాడు. వెళ్ళిపోతారు.

వెళ్ళిపోతే, అక్కడినుంచి వాళ్ళని వెతుక్కుంటూ ఆయన వస్తూ ఉంటాడు. కన్నులు లేని రోజుల్లో నువ్వే నాకు కన్నుగా నడిపించావు, ఇప్పుడు నువ్వు లేకపోతే నాకు కన్ను ఏదిరా? అని మాట్లాడుకుంటూ, వెతుక్కుంటూ వస్తుంటాడు. వస్తే, ఈయన కనిపిస్తాడు. అంతా చదవక్కర్లేదు లెండి, ఎందుకంటే మనకి కూడా యముడు కాలపరిమితి ఒకటి పెడతాడు కదా! అందుచేత, వాళ్ళలా బాధ పడుతున్నారు. కుమారుడు కూడా తండ్రి గురించి బాధ పడుతుంటాడు. నాన్న ఎంత బాధ పడుతున్నాడో, అమ్మ ఎంత బాధ పడుతోందో అని అనుకుంటూ గబగబా ఏం చేస్తారంటే, అంతకుముందు ఒక సజ్జ నిండా పూలు, పళ్ళు అవన్నీ ఏరుకున్నారు కదా, అవన్నీ అక్కడే వదిలేశారు. ఈ పూటకి వద్దులే, రేపు మళ్ళీ తెచ్చుకుందామని. వదిలేసి గబగబా నడిచి వచ్చేస్తారు. ఇంటికొచ్చే సరికి, "ఇక్కడ ఆశ్రమంలో అంతకుమునుపే కన్నులు వచ్చిన ద్యుమత్సేనుడు ఎల్లెడలా పరికించి, స్వకీయ నేత్రమంటి కుమారుడు అడవిలో అంత పర్యంతం రాకపోవుటలో హేతువేమో తెలియక, కేవలం కనులు లేనివానివలె కుమిలి కుమిలి పలవరించాడు." సరే, అవన్నీ మాములుగా జరిగేవే! ద్యుమత్సేనుడు చూశాడు. కొడుకు, కోడలూ వచ్చారు. "నాయనా అరణ్యంలో ఇంత ఆలస్యానికి ఏమి హేతువు అని ప్రశ్నించాడు. సత్యవంతుడు తాను పళ్ళు కోసిన

పిమ్మట, కట్టెలు కొడుతున్న సమయంలో, విపరీత శీర్ష వేదన వల్ల క్షణమైనా నిలువలేక విశ్రమించిన విషయము, స్వప్నంలో తన్నొక పురుషుడు నిగ్రహించిన వృత్తాంతము సవిస్తరంగా చెప్పాడు." తనకి కలిగిన బాధ, తనకి కలిగిన కల రెండూ చెప్పేశాడు తండ్రికి.

"ఇంతలోనే సావిత్రి అందుకుని జరిగిన వృత్తాంతము యావత్తూ సంగ్రహంగా అత్తమామ లిరువురికీ నివేదించినది." చెప్పేసింది ఇదీ జరిగిన విషయం. "నారద మహాముని ఈ రాజకుమారునకు ఈ దినమే మృత్యువని వక్కాణించాడు." ఈ రోజు వెళ్ళిపోతాడని చెప్పి పెళ్లి చేసుకోడానికి ముందే నాకు నారద మహర్షి చెప్పాడు. "ముని మాట అమోఘమన్న ఆశయంతో నే నీనాడు పతిని అనుసరించి అరణ్యానికి పయనమైనాను. అచట ఈ రాజకుమారుడెంతో అలిసి నిద్రించిన సమయంలో అంతకు డచ్చటికి విచ్చేసి, ఇతని జీవుని పాశంతో బంధించి, స్వకీయ లోకానికి పయనమైనాడు. నేనాతనిని అనుసరించి, సత్యమైన ధర్మ మార్గంలో అనేక విధాల ప్రస్తుతించాను. దానికతడు ఎంతో సంతోషించి నాకు నాలుగు వరాలు అనుగ్రహించాడు. వాటిలో ఒక వరం వల్ల తిరిగి నా భర్త పునర్జీవితుడైనాడు. వేరొక వరం వల్ల మీకు దృష్టి కలిగింది. మూడవ వరం వల్ల శాత్రవ హస్తగతమైన మీ రాజ్యం తిరిగి సంక్రమిస్తుంది. నాలుగవ వరం వల్ల నా జనకునికి పుత్ర సంతానం సంప్రాప్తించగలదు అని చెప్పింది." ఇదీ జరిగిన విషయం అని ఆ రాత్రే చెప్పేసింది. మర్నాడు చెప్తానంది కదా! వాళ్ళు కూడా అడుగుతున్నారు ఏం జరిగిందో అని, ఇంక నిద్రపోరు. అందుకని ఉన్న విషయం అంతా ఆ విధంగా చెప్పింది.

ఇలా సావిత్రిదేవి తన భర్తని తిరిగి పొందింది. ఇది ఉపాఖ్యానం. ఈ ఉపాఖ్యానంలో ఏమిటి విషయం అంటే సావిత్రి లోకాలోకముల యందు సంచరించ గలిగినటువంటి ప్రజ్ఞ కలిగినది. సత్యవంతుడు ధర్మాత్ముడైన మానవుడు. అతడు ఆమె వలన మరణంలోంచి జీవనంలోకి రావడం జరిగింది. అటుపైన సత్కీర్తి సంపాదించుకుంటాడు. అతడు కూడ ఇలా లోకాలోకములలోకి ప్రవేశించ గలిగే ప్రజ్ఞని పొందాడా లేదా అనేది ఇంక భారతంలో ఉండదు. కాకపోతే, పరాకాష్ఠ ఎవరయ్యా అంటే, సావిత్రి, ఆమె తండ్రి, వారిద్దరూ. తండ్రి తన ప్రాణములను అధిగమించి, దైవ దర్శనం చేసుకుని, అతీతమైన తత్త్వంలోకి ప్రవేశిస్తాడు. అందువల్ల ఈమె జన్మించడం జరుగుతుంది. ఈమె అలాంటి విశేషమైన ప్రజ్ఞ పొంది, దాన్ని పెంపొందించుకుని, అది ఆధారంగా పతిని వెనక్కి తెచ్చుకుంది.

ఈ కథలో చాలా ధర్మాలు ఉన్నాయి. ఈ ధర్మంలో ముఖ్యమైన ధర్మం ఏమిటంటే, ఏ ఇంట్లో అయినా భార్య, చాలా పవిత్రమైన ధర్మ మార్గంలో నడుస్తూ ఉంటే ఆ పతికి చాలా రక్ష ఉంటుంది. The only single way for a man to be protected is through his lady. అంతే! మీరు వినే ఉంటారు తులసి కథ. తులసి ఆమె పతివ్రతా ధర్మం వలన ఆమె భర్త అయిన జలంధరుడిని త్రిమూర్తులు కూడా జయించలేకపోతారు. అంత శక్తివంతమైన విషయం స్త్రీలయందు నిక్షిప్తమై ఉన్నది. అది ఒకటి. రెండో విషయం, మృత్యువుని దాటడం అనేది ఉన్నది. మూడవ విషయం, మృత్యుదేవత అంత భీకరుడు కాదు అన్న విషయం.

వేదంలో ఇదే ఒక చిన్న ఉపాఖ్యానంగా ఉంటుంది. ఇది కృతయుగంలో జరిగిన కథ. వేదంలో సావిత్రి ప్రసంగం వస్తుంది, సంకేతపరంగా. ఈ విషయాన్ని మనకి అరవింద మహర్షి 'సావిత్రి' అనే గ్రంథంలో ఇచ్చారు. సత్యవంతుడంటే సూర్యుడు. సూర్యుడు ప్రతి సాయంత్రం అస్తమిస్తాడు కదా మనకి! In relation to earth, సూర్యుడస్తమిస్తాడు. అస్తమిస్తే చీకటే కదా! అస్తమించిన తర్వాత కూడా ఒక వెలుగుంటుంది పశ్చిమ ఆకాశంలో. ఆ వెలుగుని 'సావిత్రి' అని పిలుస్తారు వేదంలో. సాయంత్రం సూర్యుడస్తమించిన తర్వాత కూడా కొంతసేపు ఉండే వెలుగుని సావిత్రి అంటారు. ఆ సావిత్రేం చెప్తుందంటే, సూర్యుడస్తమించాడని బాధపడక, రేపు ఉదయం మళ్ళీ పట్టుకొస్తాను అని చెప్తుంది సందేశం. అందుకని, మర్నాడు ఉదయానికి ముందు కాంతి వస్తుంది, తర్వాత సూర్యుడు వస్తాడు కదా! అందుకని, సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు ఉండే కాంతిని, సూర్యుడు ఉదయించడానికి మునుపు ఉండే కాంతిని సావిత్రిదేవిగా ఆరాధన అనేది వేద సంప్రదాయంలో ఉన్నది. అందుచేత, అస్తమించినవాడు మళ్ళీ తిరిగి వస్తాడు అనే ఒక రహస్యం ఆ విధంగా వివరింపబడుతుంది. మనం కూడా సత్యవంతులమే. ఎందుకంటే, మనం సూర్యుని యొక్క అంశలుగా దిగి వచ్చిన వాళ్ళం. అందుచేత, మనం కూడా అస్తమించినా తిరిగి వస్తాము. అది ఒకటి.

మూడవది ఏమిటంటే, ఉత్తరాయణ దక్షిణాయనములలో... ఇప్పుడు మనకి దక్షిణాయన పుణ్యకాలంలో ప్రవేశించాము కదా! దక్షిణాయనమునందు సూర్యుడు దక్షిణ దిశగా ప్రయాణం చెయ్యడం మొదలుపెడతాడు, ఉత్తర దిశ నుంచి. ఈ దక్షిణ

దిశగా ప్రయాణం చేస్తూ ఉంటే పదార్థము ఎక్కువవుతుంది, ప్రజ్ఞ మరుగునపడుతుంది. కాబట్టి అది క్రమంగా వృశ్చిక రాశి చేరేసరికి, దాదాపు ప్రజ్ఞ పదార్థం చేత పూర్తిగా కప్పబడి ఒక చీకటి వంటి పరిస్థితి ఏర్పడుతుంది. డిసెంబర్ 22 వరకూ అలా జరుగుతూ వస్తుంది. అందుచేత, అప్పటికేమవుతుందంటే, పదార్థం పరిపూర్ణంగా ప్రజ్ఞని కప్పేసుంటుంది. అసలు ప్రజ్ఞ లేదేమో అన్నట్టుగా ఉంటుంది.

ఇప్పుడు మనం జీవుడు. జీవుడు అంటే, ఎక్కడున్నాడు జీవుడు అని అడుగుతూ ఉంటాం కదా! ఎక్కడున్నాడు జీవుడు? ఈ పని చేస్తే వెళ్ళిపోయిన జీవుడు సంతోషిస్తాడంటే, ఈ కథలన్నీ చెప్పకండి, ఎక్కడున్నాడు జీవుడు అంటారు. ఎందుకిలా అంటారంటే, బాగా కూరుకుపోయి ఉన్నాడు పదార్థంలో. ఆ అడిగిన వాడు కూడా జీవుడే! ఈ మాట్లాడేవాడూ జీవుడే! ఎక్కడున్నాడంటాడు. అలాంటి అంధకారం ఏర్పడుతుంది. ఆ అంధకారం నుంచి మళ్ళీ ఉత్తరాయణం వచ్చేసరికి సూర్యుడు మళ్ళీ పైకి వస్తాడు కదా! పదార్థము, ప్రజ్ఞ, ఈ రెండిటికి మధ్య జరిగే నాటకం అది ప్రతి మాసం ఉంటుంది చంద్రపరంగా. ప్రతి సంవత్సరం ఉంటుంది సూర్యునిపరంగా. వెలుగు నీడల యొక్క క్రీడగా శాశ్వత కథ ఒకటి భూమి మీద జరుతుంది. దాన్నే భగవద్గీతలో కృష్ణ పక్షము, శుక్ల పక్షము అని సృష్టి గురించి చెప్తాడు కృష్ణుడు. ఈ చక్రంలో తిరుగుతూ ఉంటారు. పదార్థంలో ఇరుక్కుపోతూ ఉంటారు. మళ్ళీ బయటకి వచ్చి ప్రజ్ఞా లోకాల్లోకి వెళ్తారు. మళ్ళీ పదార్థంలోకి దిగి వస్తూ ఉంటారు. పుణ్యంచేత ఊర్ధ్వ లోకాల్లోకి వెళ్లి ఆ పుణ్యం క్షీణించగానే మళ్ళీ అధో లోకాల్లోకి వచ్చేస్తూ ఉంటారు. ఇట్లా

ఎన్నాళ్ళు తిరుగుతూ ఉంటారు అని అడుగుతాడు అక్షర పరబ్రహ్మ యోగం అనే ఎనిమిదో అధ్యాయంలో. ఎనిమిది అంకె మృత్యువుకి సంబంధించినది.

అందుకనే, *"క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి"*. పుణ్యం క్షీణిస్తే ఎంత పెద్దవాడయినా మళ్ళీ భూమి మీదకి, చావును అనుభవించే లోకంలోకి రావాలి. మర్త్య లోకం అంటే మరణం అనుభవించే లోకం అని, మృతి. అందుచేత, పుణ్యం క్షీణించగానే మళ్ళీ ఇక్కడికి వచ్చేస్తావు. మళ్ళీ ఎప్పుడు చేసుకుంటావో పుణ్యం! చేసుకున్న పుణ్యంతో ఊర్ధ్వలోకాలకెళ్ళి, మళ్ళీ అదంతా అనుభవించేస్తావు ఊర్ధ్వలోకాల్లో. నీ పుణ్యానికి సంబంధించినది ఈ భూమి మీద మనుషులు ఎంతకాలం గుర్తుపెట్టుకుంటే అంతకాలం నువ్వు అక్కడుంటావు అని శాస్త్రం చెప్తుంది. ఇప్పుడు అశోకుడు రహదారులు వేయించెను. ఇరుపక్కలా చెట్లు నాటించెను. తటాకములు తవ్వించెను అని ఇంక ఎక్కువ రోజులు చదువుకోలేము. అసలు చెప్పట్లేదు కూడా ఈ రోజుల్లో. వేరే కథలు చెప్తున్నారు కదా! అంటే ఏమిటి? ఇంతకాలం ఆయన గుర్తున్నాట్ట అంటే, అంతకాలం ఆయన ఊర్ధ్వలోకాల్లో ఉంటాడు. భూలోకంలో నీవు చేసిన సత్కార్యములు ఎంతకాలం కీర్తింపబడితే అంతకాలం నువ్వు ఊర్ధ్వలోకంలో ఉంటావు. ఇక అది మర్చిపోయారనుకోండి, మర్చిపోతే మళ్ళీ మర్త్యలోకానికి రాక తప్పదు. అదీ కథ.

# 16. మరణ రహస్యం

ఇంతకూ, ఈ సతీ సావిత్రిదేవి ఉపాఖ్యాన వివరణ ప్రయోజనం మరణాన్ని దాటే ఉపాయాన్ని తెలపటానికే. ఉపాఖ్యానం శ్రద్ధగా చదువుకుంటే ఆ రహస్యం తేటతెల్లమవుతుంది. మన నుండి సద్గురువులు ఆశించేదదే. సత్యాన్ని ధర్మాన్ని ఆశ్రయించి ప్రజ్ఞాపరంగా జీవిస్తూ పదార్థమునందు వసించవచ్చు. ప్రకృతి మూడు గుణములుగను, ఐదు భూతములుగను ఎనిమిది పొరలుగ సృష్టి నేర్పఱచి అందు జీవుని ప్రవేశ పెడుతుంది. ఈ ఎనిమిది పొరలు జీవులకు రంగ స్థలము లాంటిది. అందు ప్రవేశించే జీవులు తమను తాము మరవటము సహజము. దానికి కారణము ప్రకృతి యొక్క అందము, ఆకర్షణము. జీవుడు శుద్ధ చైతన్య స్వరూపుడే. కాని సృష్టి రంగమున ప్రవేశించినపుడు తన సహజ స్థితిని కోల్పోవుట సర్వసామాన్యము. కోల్పొనక తానుగనే వుండుట అసామాన్యము.

తానుగ సృష్టి రంగమునందు వసించాలన్నచో తనకి మూలమైన ప్రకృతి, పురుష తత్త్వమును ఆశ్రయించి వుండవలెను. ఆ తత్త్వమే తానని గుర్తుండవలెను. ఆ తత్త్వముతో విడిపడని స్థితిని పొంది యుండవలెను. అపుడు సృష్టి పొరలందు ఏ పని యందున్నను మరపు కలగదు. **మరపు కలిగినచో మృత్యువు ఆవేశించును. నిజమునకు మరపే మృత్యువు. సావిత్రీదేవి మరపు చెందని ప్రజ్ఞ. సత్యవంతుడు మరపు చెందిన ప్రజ్ఞ.**

సత్యవంతుడు ధర్మాత్ముడు, సత్యపరాక్రముడు. బుద్ధులకు బృహస్పతి, తేజస్సు నందు సూర్యుడు, శౌర్యములో ఇంద్రుడు, ఓర్పులో భూమి, కాంతిలో చంద్రబింబము, అందములో అశ్వినులతో పోల్చబడినాడు కదా! **కాని తత్త్వమే తానని తెలిసి వసించలేదు. తానను సాత్త్వికఅహంకారమందున్నాడు.** సహజముగ గుణశ్రేష్ఠుడైననూ తత్త్వమే తానుగ, లేక దైవమే తానుగ నున్నాడని జ్ఞప్తియందు లేదు కనుక మరణము సంప్రాప్తించినది. జ్ఞప్తి యందున్నవానికి మరణ ముండదు. ఇట్టి నరశ్రేష్ఠుడు మరణము దాటుట సులభము. మరణము కూడ యాతనను కలిగించదు. కనుకనే అతనిని మన్నించుటకై యమదేవుడు తానుగనే వచ్చెను.

సావిత్రీదేవి స్థితి సత్యవంతుని కన్న మిన్నయైన స్థితి. ఆమెయు సాత్త్విక అహంకారముననే యున్నది. కాని సర్వ వ్యాపకము, సర్వజ్ఞము, సర్వశక్తివంతము అగు అపరిమిత తత్త్వముతో నిత్యానుసంధానము కలిగి యున్నది. కనుక మరపు వుండదు. మృత్యువు కూడ నుండదు.

అంతేకాక నిత్యము పరతత్త్వముతో కూడియుండి పరమునే సమస్తము నందు దర్శించుచూ, ధ్యానించుచూ, పూజించుచూ, సేవించుచూ యుండుట వలన, క్రమముగ ఆమెకు సూక్ష్మలోక దర్శనములు, కారణలోక దర్శనములు, తదనుగుణమగు శరీరములు కూడ యేర్పడినవి. కనుకనే ఆమె స్థూల సూక్ష్మ కారణ లోకములందు ధర్మదేవత ననుసరించ కలిగినది. ప్రకృతి పరిమితులను దాటి ప్రకృతి యందు వసించుచున్న మరియు దైవముతో కూడియున్న జీవప్రజ్ఞ. ఇట్టి ప్రజ్ఞకు ఉదయాస్తమానములు లేవు. ఉత్తర దక్షిణాయనములు లేవు. జనన మరణములు లేవు.

పరతత్త్వముతో కూడియుండుట వలన సృష్టి చక్రమున శుక్ల, కృష్ణ పక్షములు అంటవు. కారణము అనన్య చింతన, పర్యుపాసన, నిత్య అభియుక్తత.

సావిత్రీ దేవి ఆరాధన అంతయూ అపరిమితమగు పర తత్త్వము. పరదేవతయే ఆమె ఆరాధ్య దైవము. దానియందే స్థితి గొని నామ రూపాత్మకమగు జగత్తున చరించుచున్నది. ఇది ఋషి మార్గము. ఋషులందరు కూడా నామ రూపములకు అతీతమైన తత్త్వముతో ఎల్లప్పుడునూ ముడిపడి యుందురు. నామము, రూపము, కాలము, దేశము అను పరిమితులను దర్శించుచునే వాని కతీతమైన తత్త్వమున దీర్ఘకాలముగ వసించి యున్నారు.

అట్టి వసనము వలన వారికి సూక్ష్మ, కారణ శరీరములు కూడ యేర్పడి యుండును. స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను కూడ అధిగమించి యుండుట బ్రహ్మర్షుల లక్షణము. అట్లుండుట నిర్వాణస్థితి యందురు. దైవ సంకల్పము ననుసరించి, అవసర మగుచో వారు క్షణములలో అణువులనుండి దేహమును కట్టుకొన గలరు. **కనుకనే వారిని నిర్మాణ కాయులందురు.**

పై తెలిపిన పదమును చేరుటకు చూపబడిన పథమే (మార్గమే) పరతత్త్వ చింతనము. అట్టి చింతన సర్వకాల సర్వావస్థల యందుండవలెను. దేనిని చూచినను, విన్నను, స్పృశించినను, రుచి చూచినను, ఘ్రాణము చేసిననూ పరమును మరువని స్థితి కలుగవలెను. అదియే అనన్య చింతనము, భావన సహజముగ పరమును గూర్చి యుండవలెను. భావన యందు

బాహ్యము నందు తత్త్వము దర్శించబడుచుండ వలెను. *"జ్ఞానినః తత్త్వదర్శనః"* తత్త్వమును ఎల్లప్పుడునూ దర్శించువారే జ్ఞానులు.

కేవలము పూజా సమయమున, ధ్యాన సమయమున మాత్రమే దైవము గుర్తుండుట వలన జ్ఞాని స్థితి సిద్ధించదు. పూజలు చేసితిమని, అభిషేకములు, హోమములు చేసితిమని, తీర్థయాత్రలు చేసితిమని భావించువారు దైవభక్తులుగ ప్రచారము పొందుదురేమోగాని, మరణము దాటిన స్థితిని పొందలేరు. **మరణ సమయమున కూడ నన్ను స్మరించువారు నన్ను చేరగలరు అని కృష్ణ పరమాత్మ భగవద్గీత యందు తెలిపిన సత్యమునకు ఈ సావిత్రీ ఉపాఖ్యానము చక్కని నిదర్శనము.** ఆమెకు మరణమే లేదు. మరణించిన భర్తను కూడ యముని మెప్పించి కొనిరాగలిగినది.

**సాధకుడు అనుస్మరణము చేయుటయే మార్గము** కాని క్రతువులందు యిమిడి పోవుటవలన ప్రయోజనము లేదు. అనుస్మరణ మబ్బినచో పూజాదికముల సమయముననే కాక, అన్ని సమయములందు, అన్ని ప్రదేశముల యందు, అన్ని నామముల యందు, అన్ని రూపములందు తత్త్వదర్శనము చేయుచు నుందురు. అట్టి వారికి దైవమునందే యున్నామని, దైవమునందే తిరుగాడుచున్నామని, దైవమే తాముగ యున్నామని అనిపించుచు నుండును. వారే పరమ భాగవతోత్తములు. *"సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత"* అన్నాడు పరమాత్మ భగవద్గీత – పురుషోత్తమ ప్రాప్తి యోగంలో. సర్వభావములందు పరమాత్మనే దర్శించువారు సర్వము తెలిసినవారు.

పరదేవతయైన గాయత్రిని– సావిత్రిగను, సరస్వతిగను, శ్రీ గను పూజించుచూ, పరమును చేరే ప్రయత్నము చేయండి. చిత్రపటములకు, విగ్రహములకు, యంత్రములకు, మంత్రములకు పరిమితము చేసి పరిమితులుగ మిగిలిపోకండి. అదియే సద్గురువు ఆశించే నిజమగు గురుదక్షిణ!

*స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం*
*న్యాయేణ మార్గేణ మహీం మహీశాః,*
*గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం*
*లోకా సమస్తా స్సుఖినో భవంతు.*

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.*

**DHANISHTA PUBLICATIONS**
D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Ashram Regulation for Entry | E/G/S |
| 13. | An insight into the WTT | E |
| 14. | Atmasadhana Sutramulu | T |
| 15. | Avathara of Synthesis | E |
| 16. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 17. | Bharatiya Sampradayamu | T/K/Hi |

*The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.*

| | |
|---|---|
| 18. Book of Prayers | E |
| 19. Cow | K/T/E/Hi |
| 20. Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 21. Dharmavigrahudu – Sri Ramudu | T |
| 22. Dhanakamuni Katha | T |
| 23. Doctrine of Eternal Presence | E |
| 24. Gayatri Mantra Avagahana | T |
| 25. Geetopanishad - Gnana Yogamu | T |
| 26. Geetopanishad - Dhyana Yogamu | T |
| 27. Geetopanishad - Karma Yogamu | T |
| 28. Geetopanishad - Sankya Yogamu | T |
| 29. Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 30. Geetopanishad - Vijnana Yogamu | T |
| 31. Good Friday | E/S |
| 32. Healers Handbook | E |
| 33. Health & Harmony | E/G |
| 34. Hercules - The Man and the Symbol | E/G/S |
| 35. Himalaya Guruparampara | T/Hi/K |
| 36. Jupiter - The Path of Expansion | E/G/S |
| 37. Just Adjust | E |
| 38. Jyotirlinga Yatra | T |
| 39. Kapila and Kardama | E/G/S |
| 40. Katha Deepika | T |
| 41. Lectures on Secret Doctrine - I | S/E |
| 42. Lectures on Secret Doctrine - II | E |
| 43. Lectures on Secret Doctrine - III | E |

| | | |
|---|---|---|
| 44. | Listening to the Invisible Master | E/S/K |
| 45. | Lord Maitreya – The World Teacher | E/S |
| 46. | Life and Teachings of Master Jupiter | E |
| 47. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 48. | Mana Master garu | T |
| 49. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 50. | Mars - The Kumara | E/G/S |
| 51. | Mercury - The Alchemist | E/G/S |
| 52. | Maria Magdalena | E/S |
| 53. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 54. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 55. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 56. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 57. | MASTER C.V.V. - Yogamu | T |
| 58. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 59. | Master K. Parvathi Kumar - Short Biography | E |
| 60. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 61. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 62. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 63. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 64. | Marana Rahasyam (Markandeya) | T |
| 65. | Master CSG | E |
| 66. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 67. | Moon - The Key | E |
| 68. | New Age Hospital Management | E |

| | |
|---|---|
| 69. Nutrients For Discipleship | E |
| 70. OM | T/K/E |
| 71. Occult Meditations | E/G/S |
| 72. Om Namo Narayanaya | E/G/S |
| 73. On Change | E/S |
| 74. On Healing | E |
| 75. On Love | E/G/S |
| 76. On Service | E/G/S |
| 77. On Silence | E/G/S |
| 78. PARIKSHIT-The World Disciple | E |
| 79. Pranayamam | T |
| 80. Prayers | E/G/S |
| 81. RUDRA | E |
| 82. Rukmini Kalyanam | T |
| 83. Sai Sukthulu | T/K |
| 84. Sai Ki Amruthavani | Hi |
| 85. Sanghaneethi | T |
| 86. Saraswathi-The Word | E/G/S |
| 87. SANKHYA - The Sacred Doctrine | E/S |
| 88. Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 89. Shodosopachara Pooja - Avagahana | T |
| 90. SOUND-The Key and its Application | E/G/S |
| 91. Spiritualism-Business and Management | E/G |
| 92. Spiritual Healing | S/G |
| 93. Sri Dattatreya | E/G/S/T |
| 94. Srimadramayana Dharmakusumalu | T |

95. Sri Guru Paadukastavamu T
96. SRI LALITHA (Set 10 Books) T
(Comentary on Sri Lalitha Sahasranamam)
97. SRI SASTRY GARU T/K/E/S
98. Sri Krishna Namamrutham T
99. Sri Shirdi Sai Sayings E/G/S
100. Sri Suktam E
101. Steps of Silence E
102. Sun that lam E/G/S
103. Temple and the Work E
104. The Aquarian Cross E/G/S
105. The Aquarian Master E/G/S
106. The Doctrine of Eternal Presence E
107. The Doctrine of Ethics E/S
108. The Etheric Body E/G/K
109. The Golden Stairs E/S
110. The Path of Synthesis E
111. The Splendor of Seven Hills E
112. Thus Spoke-Master Dhwhal Khul E
113. THE TEACHER-Meaning and Significance E
114. Teachings of Master Koot Hoomi 1 & 2 E
115. The Teachings of Lord Kapila E/G
116. The Teachings of Master Mourya 1 & 2 E
117. The Teachings of Sanath Kumara E/G/S
118. The Theosophical Movement E/G/S
119. The White Lotus E/S/K

| | |
|---|---|
| 120. The World Teacher | E |
| 121. The Mysteries of Sagittarius | E |
| 122. Time - The Key | E/G |
| 123. Uranus- The Alchemist of the Age | E/G/S |
| 124. Varuna Graha Prabhavamu | T/K |
| 125. VENUS-The Path to Immortality | E/S |
| 126. Violet Flame Invocations | E |
| 127. Vrutrasura Rahasyam | T |
| 128. Wisdom Buds | E/S |
| 129. Wisdom Teachings of Vidura | E/G/S |

**ONLY IN SPANISH LANGUAGE**

130. The Path of Meditation
131. The Sublimity of Work
132. The Teachings of Master Tibetan
133. Death and Re-incarnation
134. Importance of Moon Nodes
135. Spiritual Practices for Disciples I & II
136. The Science of Health and Cure
137. Om Namo Narayanaya
138. Hanuman and Ramayana
139. Significance of Ganesha

**ONLY IN RUSSIAN LANGUAGE**

140. Sun
141. Mars
142. Mercury
143. Jupiter

144. Venus
145. Saturn
146. Uranus

**OTHER BOOKS BY DHANISHTA**

| | | |
|---|---|---|
| 1. | Purana Purushuni Pooja Vidhanamu | T |
| 2. | Sri Anjaneya Pooja Vidhanamu | T |
| 3. | Sri Dattatreya Sodachopachara Pooja Vidhanamu | T |
| 4. | Sri Hanuman Chalisa | T |
| 5. | Srimad Bhagawad Geetha | T |
| 6. | Sri Mahalakshmi Pooja Vidhanamu | T |
| 7. | Sri Rama Pooja Vidhanamu | T |
| 8. | Sri Shiva Hrudayamu | T |
| 9. | Sri Shiva Pooja | T |
| 10. | Sri Soukumarya Satakamu | T |
| 11. | Sri Subrahmanya Swamy Pooja Vidhanamu | T |
| 12. | Sri Surya Pooja Vidhanamu | T |
| 13. | Sri Venkateswara Pooja Vidhanamu | T |
| 14. | Sri Saraswathi Pooja Vidhanamu | T |
| 15. | Sri Vinayaka Vratha Kalpamu | T |
| 16. | Sri Narayana kavachamu | T |
| 17. | Sri Vishnu Sahasra Namamu | T |
| 18. | Sri Sathguru Pooja Vidhanam | T |

**Please visit our website (www.dhanishta.org / info@dhanishta.org) for prices**

భరత ఋషులు మానవులకు గాయత్రి ఆరాధన నిచ్చారు. గాయత్రి ఆరాధన ద్వారా దివ్యత్వమును పొంది, దివ్యలోక సంచారము గూడ చేయవచ్చు. దివ్య దేహ నిర్మాణము గావించుకొనవచ్చు. దేహమందుండగానే, దివ్య దేహమును సాధించుకోవాలి. ఆ దేహముతో దివ్యలోక సంచారం గావించవచ్చు. మరణము దేహమునకే కాని, తనకు కాదని తెలియవచ్చు. మరియు జీవన ప్రయోజనము సిద్ధించువరకు, దైవకృపతో దేహమందుండవచ్చు. మహాత్ముల జీవితములలో గోచరించే సూక్ష్మమగు ఘట్టము లివి.

**మరణ రహస్యం-1**
(మార్కండేయుడు)

**మరణ రహస్యం-2**
(సతీ సావిత్రీదేవి)

ధనిష్ఠ

ISBN 978-81-89467-74-6